ఆ. కృష్ణుఁ జూడు మనుచుఁ గికురించి పరు ప్రోల మేలి భక్ష్యరాశి మెసఁగు నొకఁడు
నవ్వు నొకడుఁ సఖుల నవ్వించు నొక్కఁడు ముచ్చటాడు నొకఁడు మురియు నొకఁడు. 496

వారిలో ఒకడు ఊఱుగాయముక్కలను వ్రేళ్లసందున ఇరికించుకొని, ప్రక్కవారిని ఊరించుచు తాను తినుచుండెను. మఱియొకడు ప్రక్కవాని కంచములోనున్న పదార్థములను ఒడుపుగా తీసికొని, మ్రింగి నోఱు తెఱచి 'నా నోటిలో ఏమియులేదే!' అని అతనికి చూపును. వేఱొకడు పందెము వేసికొని ఆఱుమంది చల్దులను తానొక్కడే నోటిలో కూరుకొని, కూరుకొని తినుచుండెను. ఇంకొకడు 'ఎవరిచల్దివారే తినుట యుక్తముగాదు. ప్రక్కవారికి పంచుచు తినుటమేలు' అని బంతెన గుండులాడుచు తాను తినుచుండెను. ఇంకొకడు 'కృష్ణుని చూడుము' అని ప్రక్కవానికి చెప్పుచు వంచించి, అతని భక్ష్యములను తినివేయుచుండెను. ఒకడు హాస్యమునకై తాను నవ్వుచుండెను, వేఱొకడు తోడివారిని నవ్వించుచుండెను. ఒకడు ముచ్చట్లు చెప్పుచుండెను. మఱియొకడు వీటిని అన్నింటిని చూచుచు తనలోతానే మురిసిపోవుచుండెను.

వ. అ య్యవసరంబున. 497

సీ. కడుపున దిండుగాఁ గట్టిన వలువలో లాలిత వంశనాళంబుఁ జొనిపి
విమల శృంగంబును వేత్రదండంబును జాఱిరానీక డాచంక నిఱికి
మీఁగడ పెరుఁగుతో మేళవించిన చల్దిముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేఁగి కొసరి తెచ్చిన యూరుఁగాయలు వ్రేళ్ళసందుల యందు వెలయ నిఱికి.
ఆ. సంగడీల నడుమఁ జక్కఁగఁ గూర్చుండి నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుఁ డమరులు వెఱఁగంద శైశవంబు మెఱసి చల్ది గుడిచె. 498

ఆ సమయమున శ్రీకృష్ణుడు తన నడుముచుట్టును ధరించిన దట్టీలో తనపిల్లనగ్రోవిని దోపుకొనెను. నిర్మలమైన కొమ్ముబూరను, దూడలను అదలించుటకై ఉపయుక్తమగు చేతికఱ్ఱను ఎడమచంకలో ఇరికించుకొనెను. మీగడపెఱుగుతో కలిపిన చల్దిముద్దను ఎడమచేతిలో పెట్టుకొనెను. అమ్మదగ్గఱ మారాముచేసి, కొసరికొసరి తీసికొనివచ్చిన ఊఱుగాయముక్కలను కుడిచేతివ్రేళ్ల సందున ఉంచుకొనెను. తోడిబాలురమధ్య కూర్చొని, సరసోక్తులాడుచు నవ్వుచుండెను. యజ్ఞములఆహుతులను స్వీకరించెడి (యజ్ఞభోక్తయైన) ఆ శ్రీహరి (కృష్ణుడు) పిల్లచేష్టలు చేయుచు చల్దిని ఆరగించెను. ఆయన లీలలను జూచి దేవతలు ఆశ్చర్యపడసాగిరి.

వ. ఇట్లు కృష్ణసహితులయిన గోపకుమారులు చల్దులు గుడుచునెడఁ, గ్రేపులు మేపులకుం జొచ్చి, పచ్చని గఱికిజొంపంబుల గుంపుల కుఱికి, లంపులు మేయుచు, ఘోరం బగు నరణ్యంబునడుమఁ దోరం బగు దూరంబు సనిన, వానిం గానక, వెఱచుచున్న గోపడింభకులకు నంభోజనయనుం డిట్లనియె. 499

గోపబాలకులు కృష్ణునితో గూడి ఈవిధముగా చల్దులను ఆరగించుచుండిరి. ఆ సమయమున ఆవుదూడలు మేయుచు మేయుచు, గుబురుగానున్న మెత్తని పచ్చికల కొఱకై ఉరుకుచుండెను. అక్కడ ఎవ్వరికిని కనబడకుండ అవి మేయుచు దట్టమైన ఆ అడవిలో చాలదూరము పోయెను. అవి కనబడకపోవుటచే గోపబాలురు భీతిల్లుచుండగా వారితో శ్రీకృష్ణుడు ఇట్లనెను.

మ. వినుఁడో బాలకులార! క్రేపులటవీవీథిన్ మహాదూరముం
జనియెం గోమల ఘాసఖాదన రతోత్సాహంబుతో నెందుఁబో
యెనొ యేమయ్యెనొ క్రూరజంతువులచే నే యాపదం బొందెనో
కని తెత్తుం గుడుపుండు చల్దిఁ గొఱఁతల్ గాకుండ మీరందఱున్. 500

"మిత్రులారా! నా మాటలను ఆలకింపుడు. మెత్తని గడ్డిని తినుటకై ఉబలాటపడుచు అడవిదారులలో దూరముగా మనదూడలు ఎటుపోయినవో? ఏమయ్యెనో? ఏ క్రూరమృగముల నోటబడెనో? నేను వాటిని వెదకి తీసికొనివచ్చెదను. ఈ లోపల మీరు అందఱును హాయిగా కడుపునిండ చల్దులను ఆరగింపుడు".

## బ్రహ్మ గోవత్సములను గోపబాలకులను అంతర్ధానము సేయుట

వ. అని చెప్పి, 501

శా. కర్ణాలంబిత కాకపక్షములతో గ్రైవేయ హారాళితో
స్వర్ణాభాసిత వేత్ర దండకముతో సత్పింఛ దామంబుతోఁ
బూర్ణోత్సాహముతో ధృతాన్న కబళోత్ఫుల్లాబ్జ హస్తంబుతోఁ
దూర్ణత్వంబున నేఁగె లేఁగలకునై దూరాటవీవీథికిన్. 502

ఇట్లు పలికిన పిదప శ్రీకృష్ణుడు నిండు ఉత్సాహముతో దూడలకొఱకై త్వరత్వరగా ఆ అడవిదారులలో చాలాదూరము వెళ్లెను. అప్పుడు అతడు చెవులవఱకును వ్రేలాడుచున్న జులపాలజుట్టుతో శోభిల్లుచుండెను. ఆయన ధరించిన కంఠహారములు మిలమిలమెఱయుచుండెను. బంగారమువలె తళుకులీనుచున్న చేతికఱ్ఱను ధరించియుండెను. తలపై నెమలిపింఛమును దాల్చియుండెను. బాగుగా వికసించిన పద్మమువంటి ఆయన చేతిలోని అన్నపుముద్ద అట్లేయుండెను.

వ. ఇట్లేఁగుచు. 503

క. ఇచ్చోఁ బచ్చిక మేసిన, విచ్చోఁ ద్రావినవి తోయమేఁగిన విచ్చో
నిచ్చోట మంద గొన్నవి, యిచ్చోఁ బాసినవి జాడ యిదె యిదె యనుచున్. 504

శ్రీకృష్ణుడు క్రమముగా వెళ్లుచు, 'దూడలు ఇచట పచ్చికలను మేసినవి, ఇచట నీరు త్రాగినవి, ఇచట ముందునకు సాగినవి. ఇచట గుంపుగా చేరి సేదదీర్చుకొనినవి. ఈ ప్రదేశమును వీడివెళ్లినవి' అని అనుకొనుచు ఆయా గుర్తులనుబట్టి దూడలు వెళ్లిన జాడలను గమనించుచు ముందునకు సాగిపోవుచుండెను.

క. కంజదళాక్షుఁడు వెదకెను, గొంజక లేఁగల నపార గురుతృణవనికా
పుంజంబుల భీకర మృగ, కుంజంబులఁ దరుల గిరులఁ గొలఁకుల నదులన్. 505

పద్మములవలె మనోహరమైన నేత్రములుగల బాలకృష్ణుడు, ఏ మాత్రము జంకులేక ఆవుదూడలకొఱకై విశాలమై గుబురుగా పెఱిగియున్న పచ్చికలుగల వనములయందును, భయంకరమైన మృగములుగల పొదరిండ్లలోను, దట్టముగానున్న చెట్లమధ్యను, కొండలపైనను, సరస్సులదరులయందును, నదీతీరముల యందును గాలించెను.

వ. అంత. 506

శా. బాలుండయ్యునితండఘాసురుఁడు ద్రుంపన్ బాలురం గ్రేపులన్
ఏలీలన్ బ్రతికించెనొక్కొ భువి నూహింపం గడుం జోద్యమం
చాలో నంబుజసంభవుండు పని మాయాబాలు శుంభద్బలం
బాలోకింపఁ దలంచి డాఁచె నొకచో నా లేఁగలన్ బాలురన్. 507

అంతట బ్రహ్మదేవుడు "చూచుటకు శ్రీకృష్ణుడు మిక్కిలి చిన్నివయస్సుగల బాలుడు; ఐనను అఘాసురుడు చంపబోవుచున్న బాలురను, దూడలను ఇతడు ఎట్లు రక్షింపగల్గెను? ఇది ఊహకే అందుటలేదు. ఎంతయు ఆశ్చర్యకరముగా

ఉన్నది" అని తనలో అనుకొనెను. పిమ్మట అతడు శ్రీకృష్ణుని బలపరాక్రమములను పరీక్షింపదలచి, వెంటనే దూడలను, బాలురను ఒక ప్రదేశమునందు దాచివేసెను.

వ. ఆ సమయంబున, దూడలు వోయిన జాడ యెఱుంగక తప్పి, యప్పద్మలోచనుండెప్పటి కొలంకుకడకు వచ్చి, యచ్చోట నెచ్చెలులం గానక, వారిం జీరి లేకుండుట నిశ్చయించి, గోవిందుండు విశ్వవిదుండు గావున, నిది విరించి మొఱంగని యెఱింగి, తిరిగిపోవుచు, 508

అంతట శ్రీకృష్ణుడు తమదూడలు ఎక్కడను కనబడకపోవుటచే ఇటునటు తిరిగి, కడకు చల్దులను ఆరగించిన కొలనుదగ్గఱకే చేరెను. అక్కడ తన మిత్రులైన గోపబాలకులు కనబడకపోవుటచే అతడు వారికై కేకలు పెట్టెను. వారు ఆ సమీపమునందులేరని నిశ్చయించుకొనెను. అప్పుడు సర్వజ్ఞుడైన శ్రీహరి (కృష్ణుడు) 'ఇది అంతయు బ్రహ్మయొక్క పన్నాగమే' అని తలంచి, తిరిగిపోవుచు ఇట్లు అనుకొనెను.

శా. వంచింపం బనిలేదు బ్రహ్మకిచటన్ వత్సంబులన్ బాలురన్
వంచించెన్ గనుఁ బ్రామి తన్ను మరలన్ వంచించు టాశ్చర్యమే!
వంచింపన్ మన కేల తెచ్చుటకునై వల్గంచు బ్రహ్మాండముల్
వంచింపన్ మరలింప నేర్చు హరి లీలన్ మందహాసాస్యుఁడై. 509

'వాస్తవముగా ఇప్పుడు బ్రహ్మదేవుడు ఇట్లు మోసము చేయవలసిన పనిలేదు. నా కన్నుగప్పి దూడలను, బాలురను అపహరించెను. అతనిని వంచించుట నాకు ఒక పెద్ద పనిగాదు. ఐనను ఇప్పుడు దూడలను, బాలురను తీసికొని వచ్చుటకై మనకు అతనిని వంచింపవలసిన పనియేలేదు' అని అనుకొనుచు సమస్త లోకములను తన మాయచే క్రిందుమీదు చేయగల శ్రీహరి (కృష్ణుడు) విలాసముగా ఒక చిఱునవ్వును చిందించెను.

క. గోపాలసుతులు లేరని, గోపికలకుఁ జెప్ప నేల గోపాలకులున్
గోపికలు నలర బాలుర, క్రేపుల రూపముల నేఁ జరించెద ననుచున్. 510

'గోపబాలురు తప్పిపోయినారు' అని నేను గోపికలకు చెప్పుట యుక్తముగాదు. గోపాలకులు, గోపికలు గూడ సంతోషపడునట్లు నేను ఇప్పుడు బాలురరూపములను, దూడలఆకారములను ధరించి మసలుదును అని ఆ చిన్నికృష్ణుడు నిశ్చయించుకొనెను.

మ. కరముల్ పాదములున్ శిరంబులవలగ్నంబుల్ ముఖంబుల్ భుజాం
తరముల్ ముక్కులుఁ గన్నులున్ శ్రవణముల్ దంతాదులున్ దండకాం
బర ప్రగ్వేణు విషాణ భూషణ వయో భాషా గుణాఖ్యాన త
త్పరతల్ వీడ్వడకుండఁ దాల్చె విభుఁడావత్సార్భకాకారముల్. 511

వెంటనే ఆ లీలాబాలుడు (కన్నయ్య) ఆ లేగదూడల, గోపబాలురయొక్క ఆకారములను తానే దాల్చెను. అప్పుడు చేతులు, కాళ్లు, శిరస్సులు, నడుములు, ముఖములు, వక్షఃస్థలములు, ముక్కులు, కన్నులు, చెవులు, పలువరుసలు మున్నగు అవయవములన్నియును సహజమైన రీతిలో ఆ బాలురకు, దూడలకువలె అచ్చుగ్రుద్దినట్లుండెను. అంతేగాదు అతడు ఆ బాలురకువలె, చేతికఱ్ఱలు, వస్త్రములు, దండలు, పిల్లనగ్రోవులు, కొమ్ముబూరలు, ఆభరణములు, వయస్సులు, మాటలతీరుతెన్నులు, స్వభావములు కలిగి ఏమాత్రమూ భేదము లేకుండ విలసిల్లెను. దూడల రూపురేఖలలోగూడ కొంచెమైనను తేడా కన్పట్టకుండెను.

క. రూపంబులెల్లనగు బహురూపకుఁడిటు బాల వత్స రూపంబులతో
నేపారుటేమి చోద్యము, రూపింపఁగ నతనికితరరూపము గలదే. 512

విరాట్స్వరూపుడైన ఆ శ్రీహరి (కృష్ణుడు) సమస్త ప్రాణులరూపములును తానేయైనవాడు. అట్టి దివ్యప్రభువు ఇట్లు బాలుర, దూడల ఆకారములను దాల్చుటలో ఆశ్చర్యమేమున్నది? ఆ లీలారూపునకు ఇతర (ఆయనదికాని) రూపము ఏముండును?

క. మరలుపు మనియెడు కర్తయు, మరలించు కుమారకులును మరలెడి క్రేపుల్
పరికింపఁ దాన యై హరి, మరలం జనె లీలతోడ మందకు నధిపా! 513

వ. ఇట్లు బాల వత్స రూపంబులతో విహరించుచు, మందకు వచ్చి, వారి వారి దొడ్ల నయ్యై వత్సంబుల ముందటి కందువల నిలిపి, తత్తద్బాలరూపంబుల నందటి గృహంబులం బ్రవేశించి, వేణునాదంబులు సేసెన.514

'దూడలను ఇండ్లకు మఱలింపుడు' అని ఆజ్ఞాపించెడి నాయకుడును, మఱలించెడి గోపబాలురును, మఱలెడి ఆవుదూడలును తానే అయి, ఆ శ్రీకృష్ణుడు తన లీలలను ప్రసరింపజేయుచు బృందావనమునకు చేరెను. ఈ విధముగా శ్రీకృష్ణుడు బాలుర, దూడల రూపములలో మసలుచు గోపవాటికలో ప్రవేశించి, వారివారి దొడ్లలో ఆయా దూడలను యథాస్థానములకు చేర్చెను. గోపబాలుర రూపములలో వాళ్లయిండ్లలో ప్రవేశించి వేణునాదములను గావించెను.

చ. కొడుకులవేణునాదములు గొబ్బున వీనులకుం బ్రియంబులై
ముడివడ లేచి యెత్తుకొని మూర్కొని తల్లులు కౌఁగిలించుచుం
జడిగొనఁ జేఁపు వచ్చి తమ చన్నులయందు సుధాసమంబులై
వెడలెడి పాలు నిండుకొను వేడుక నిచ్చిరి తత్సుతాళికిన్. 515

తమ కుమారులయొక్క వేణుగానములు ఆ గోపికలకు వీనులవిందు గావించుచుండెను. ఆ ఆనందముతో తల్లులు వెంటనే లేచి, తమ చిన్నారులను ఎత్తుకొని శిరములను మూర్కొని, అక్కున జేర్చుకొనిరి. ఇంతలో అమృతతుల్యములైన స్తన్యములు పొంగారగా వారు ఎంతయు మురిసిపోవుచు తమ ముద్దుబిడ్డలకు పాలిచ్చిరి.

వ. మఱియుఁ దల్లు లుల్లంబులఁ బెల్లుగ వెల్లిగొను వేడుకలం దమనందనులకు నలుంగులిడి, మజ్జనంబులు గావించి, గంధంబులలంది, తొడవులు దొడిగి, నిటలతటంబుల రక్షా తిలకంబులు వెట్టి, సకల పదార్థ సంపన్నంబులయిన యన్నంబు లొసంగి, సన్నములు గాని మన్ననలు సేసిరి. 516

పిమ్మట ఆ తల్లులమనస్సులు సంతోషముతో నిండారుచుండగా వారు తమ అనుంగు సుతులకు నలుగులుపెట్టి స్నానములు చేయించిరి. సువాసనలను గుప్పించెడి గంధములను అలదిరి, ఆభరణములను తొడిగి, నుదుట రక్షాతిలకములను దిద్దిరి. పిదప వారికి కమ్మని పదార్థములతో భోజనములను పెట్టిరి. అప్పటి ఆ గోపికలముద్దుమురిపెములు అపూర్వములు.

క. ఏ తల్లులకే బాలకు, లే తెఱఁగునఁ దిరిగి ప్రీతి నెసఁగింతురు ము
న్నా తల్లుల కా బాలకు, లా తెఱఁగునఁ బ్రీతి (జేసిరవనీనాథా! 517

మహారాజా! ఇంతకు ముందు ఆ గోపబాలురు తమ చిలిపిచేష్టలతో తమతమ తల్లులను ఆనందింపజేసిన విధముగనే, ఈ లీలాబాలకులుగూడ తమ తల్లులను పరవశింపజేయుచుండిరి.

వ. ఆ సమయంబున. 518

ఉ. పాయని వేడ్కతో నునికి పట్టులకుం జని గోవులెల్ల నం
బే యని చీరి హుమ్మనుచుఁ బేరిచి మూర్కొని పంచితిల్లి పె
ల్లై యతిరేకమై పొదుగులం దెడలేక స్రవించుచున్న పా
లా యెడ నాకుచున్ సుముఖలై యొసఁగెన్ నిజవత్సకోటికిన్. 519

ఆ సమయమున ఆవులన్నియును అంతులేని సంతోషముతో ఆరాటపడుచు 'అంబా!' అని అఱచుచు తమ దూడలను జేరి, హుమ్మనుచు వాటిని వాసనచూచినవి. పంచితమును విడిచినవి. అంతట అవి పాలతో పొదుగులు నిండునట్లుగా చేపినవి. వెంటనే అవి తమ దూడలను నాకుచు వేడుకపడుచు వాటికి ఎడతెఱిపిలేకుండ తనివిదీర పాలిచ్చినవి.

క. వ్రేతలకును గోవులకును, మాతృత్వము సాలఁ గలిగె మఱి మాధవుపై
మాతలని హరియు నిర్మల, కౌతూహల మొప్పఁ దిరిగెఁగడు బాల్యమునన్. 520

గోపికలకును, ఆవులకును తమ లీలాసుతులపై (కృష్ణునిపై) మాతృప్రేమ పొంగిపొఱలినది. అప్పుడు శ్రీహరియు (కృష్ణుడును) వారిని తన తల్లులనుగా భావించుచు వేడుకమీఱ బాల్యలీలలతో మురిపింపజేయుచుండెను.

ఆ. ఘోషజనులకెల్లఁ గుఱ్ఱలపై వేడ్క పూఁట పూఁట కెలమిఁ బొటకరించె
నిచ్చ క్రొత్తయగుచు నీరజాక్షుని మీఁద వేడ్కదమకుఁ దొల్లి వెలసినట్లు. 521

ఇంతవఱకును గోకులమునందలి జనులందఱును శ్రీకృష్ణునియెడ దినదినాభివృద్ధిగా నిరంతరము తమ ప్రేమానురాగములను ప్రసరింపజేయుచు వచ్చినట్లు ప్రస్తుతము వారు తమ పిల్లలపైనను అపూర్వముగా మమకారములను కనబఱచుచుండిరి. (ఇప్పుడు వారి బాలురుగానున్నది ఆ చిట్టికృష్ణుడే గదా!)

వ. ఇట్లు కృష్ణుండు బాలవత్సరూపంబులు దాల్చి తన్నుఁ దాన రక్షించుకొనుచు మందను వనంబున నమంద మహిమంబున నొక్కయేఁడు క్రీడించె నా యేటికి నైదాఱు దినంబులు కడమ పడియుండ, నం దొక్కనాఁడు బలభద్రుండునుదానును వనంబునకుం జని, మందచేరువ లేగల మేప, నతిదూరంబునం గోవర్ధన శైల శిఖరంబున ఘాసంబులు గ్రాసంబులు గొనుచున్న గోవులాలేఁగలం గని. 522

ఈ విధముగా శ్రీకృష్ణుడు బాలురరూపములను, దూడల ఆకారములను దాల్చి (ఆ బాలురను, ఆ దూడలను కాపాడుచుండుటయేగాక) తనను తాను రక్షించుకొనుచు తన అద్భుతమైన మహిమచే, బృందావనమునందును, అడవియందును దాదాపు ఒక్కసంవత్సరకాలము విహరించెను. సంవత్సరమునకు ఐదాఱుదినములకు ముందుగా ఒకనాడు బలరాముడును, తానును గోకులమునకు సమీపమున బాలురతోగూడి దూడలను మేపుచుండిరి. అక్కడికి చాలదూరమున గోవర్ధనగిరి శిఖరమున గడ్డిమేయుచున్న ఆవులు ఆ లేగలను చూచెను.

చ. ముదమున హుంకరించుచును మూఁపులపై మెడలెత్తి చాఁచుచుం
బదములు నాల్గు రెండయిన బాగుగఁ గూడఁగఁ బెట్టి దాఁటుచున్
వదనములన్ విశాలతర వాలములన్ వడి నెత్తి పాఱి యా
మొదవులు చన్నులం గుడిపె మూతుల బ్రింగెడిభంగి నాకుచున్. 523

వ. అంత గోపకులు గోవుల వారింప నలవి గాక, దిగ్గన నలుకతోడి సిగ్గులగ్గలంబుగ దుర్గమమార్గంబున వాని వెంటనంటి వచ్చి, లేఁగల మేపుచున్న కొడుకులం గని 524

పిమ్మట ఆ గోవులు సంతోషముతో 'అంబా' అనుచు, మూపులదాక మెడలెత్తి అతివేగముగా నాలుగు పాదములను రెండుగా కనబడునట్లు (ముందటి రెండు కాళ్ల ఒకటిగను, వెనుక రెండుకాళ్ల ఒకటిగను కనబడునట్లు) పఱుగెత్తెను. పిమ్మట ఆ గోవులు మోర(ముఖము)లను, పొడవైన తోకలను పైకెత్తి, పఱుగుపఱుగున వాటిని సమీపించి, తహతహపడుచు తమ మూతులతో ఆ దూడలను నాకుచు వాటికి పాలియ్యసాగెను. ఆ గోవులవెంటనున్న గోపాలురు అవి తమమాట వినకుండ పఱుగులు దీయుచున్నందులకు కుపితులగుచు, వాటిని అదుపు చేయలేనందులకు సిగ్గుపడసాగిరి. అంతట వారు ఆ ఆవేశములో పొదలను, ఊళ్లురప్పలను దాటుచు అడ్డదారులలో వాటిని వెంబడించి వచ్చిరి. పిమ్మట అచట దూడలను మేపుచున్న తమ బాలురను జూచిరి.

ఉ. అయ్యలఁగంటిమంచుఁ బులకాంకురముల్ వెలయంగ గుఱ్ఱలం
జయ్యన డాసి యెత్తుకొని సంతసమందుచుఁ గౌఁగిలించి తా
రయ్యెడ నౌదలల్ మనములారఁగ మూర్కొని ముద్దుసేయుచున్
దయ్యె మెఱుంగు గోపకులు దద్దయు నుబ్బిరి నిబ్బరంబుగన్. 525

అంతట ఆ గోపాలురు 'అమ్మయ్య మన చిన్నారులను చూడగల్గితిమి' అనుచు, వెంటనే వారికడకు చేరి తనువులు పులకరించుచుండగా వారిని ఎత్తుకొని మురిసిపోయిరి. పిమ్మట వారు పిల్లలను అక్కునజేర్చుకొని, శిరస్సులను మూర్కొనుచు తనివిదీఱ ముద్దులాడుచు ఉబ్బితబ్బిబ్బైరి. వారి ఆనందములను ఆదైవమే ఎఱుగును.

వ. ఇట్లు బాలకాలింగనంబుల నానందబాష్ప పూరితనయనులై, గోపకులు గోవుల మరలించుకొని, తలంగి చన, వారలం జూచి, బలభద్రుండు తనలో నిట్లని తలంచె. 526

ఈవిధముగా గోపాలురు తమ బాలకులను ఆలింగనము చేసికొని ఆనందబాష్పములను రాల్చుచు గోవులను మఱలించుకొని వెళ్లిపోయిరి. ఆ దృశ్యమునుగాంచి, బలరాముడు తనలో ఇట్లు అనుకొనెను.

సీ. చన్ను మానిన యట్టి శాబక శ్రేణిపై గోగణంబులకును గోపకులకు
నిబ్బంగి వాత్సల్య మెబ్బంగి నుదయించె హరిఁ దొల్లి మన్నించునట్లు వీరు
మన్నించుచున్నారు మమతఁ జేయుచుఁ బ్రీతి నంబుజాక్షునిఁ గన్న యట్లు నాకుఁ
బ్రేమమయ్యెడి డింభబృందంబుఁగనుఁగొన్న నిది మహాద్భుత మెందునెఱుఁగరాదు
తే. మనుజ దైవత దానవ మాయయొక్కొ కాక నా భర్త యగుచున్న కమలనయను
మాయయో కాక యితరుల మాయ నన్నుఁ గలపనోపదు విభుమాయ కాఁగ నోపు. 527

తల్లిపాలను మఱచిన దూడలపై గోవులకును, బాలురపై గోపాలురకును ఇట్టి వాత్సల్యము ఎట్లు ఏర్పడెనోగదా! ఇంతవఱకును శ్రీకృష్ణునిపై జూపినట్లుగా వారు తమ పిల్లలపై గూడ అంతులేని మమకారములను క్రుమ్మరించుచున్నారు. ఈ బాలురను చూచినప్పుడు నాకు శ్రీహరిని (చిన్నికృష్ణుని, చూచినంతగా ప్రేమాదరములు కలుగుచున్నవి. ఈ మహాద్భుత స్థితికి కారణమేమో తెలియదు. ఈ మాయకు కారణము మానవులా? దేవతలా? దానవులా? లేక నా ప్రభువైన ఆ శ్రీహరిమాయయా? ఒక్క శ్రీహరిమాయదప్ప, ఇతరుల మాయ నన్ను మోహములో ముంచివేయజాలదు. కాబట్టి ఇది వైష్ణవమాయయే ఐయుండవచ్చును.

క. అని మున్ను ముగ్ధుఁడయ్యును, దనయందుల దివ్యదృష్టిఁదప్పక బుద్ధిం
దన చెలికాండ్రను గ్రేపుల, వనజాక్షుం డనుచుఁజూచె వసుధాధీశా! 528

మహారాజా! ఇట్లు ఆలోచించి, ముగ్ధుడైన బలరాముడు తనలోగల (తనకు సహజమైన) దివ్యదృష్టితో, బుద్ధిబలముతో జూచి, తన మిత్రులైన ఈ గోపాలురను, దూడలను ఆ శ్రీహరియే (ఆ శ్రీహరియే ఈ బాలుర రూపములను, దూడల ఆకారములను దాల్చియున్నాడు) ఇదియంతయును ఆ వైష్ణవమాయయే' అని నిశ్చయించుకొనెను.

వ. ఇట్లు విజ్ఞానదృష్టిం జూచి, యెఱింగియు నమ్మక బలదేవుండు కొందలంపడుచు గృష్ణుం జూచి మహాత్మా! తొల్లియెల్ల క్రేపులును ఋషులయంశం బనియును, గోపాలకులు వేల్పులయంశం బనియును దోఁచుచుండు. నిపుడు వత్స బాలక సందోహంబు సందేహంబులేక నీవ యని తోఁచుచున్నదిది యేమి? యని యడిగిన, నన్నకు నున్న రూపు వెన్నుండు మన్నన సేసి, క్రన్నన యెఱింగించె. అతండు నెఱింగె. ఇవ్విధంబున హరి బాలవత్సంబులు దానయై సంచరించిన యేఁడు విరించికిఁ దనమానంబున నొక్క త్రుటి మాత్రంబయిన, విరించి చనుదెంచి, వత్స పాలకాకారుండైన కృష్ణ బాలకుం జూచి, వెఱంగుపడి, యిట్లని వితర్కించె.529

ఇట్లు బలరాముడు తన దివ్యదృష్టిచే అంతయు ఎఱిగియు, దానిని నమ్మలేక తత్తఱపడుచు కృష్ణునితో ఇట్లనెను. "మహాత్మా! నేను ఇంతవఱకును దూడలన్నియును ఋషులఅంశలనియు, గోపబాలురు అందఱును దేవతలఅంశలు అనియు భావించుచు వచ్చితిని. కాని ఈ దూడలును, బాలురును నీవేయని ఇప్పుడు అనిపించుచున్నది. 'ఇది ఎట్లు సంభవము?'. అంతట శ్రీకృష్ణుడు తన అన్నయగు బలరామునకు వాస్తవవిషయములను సాదరముగా వెంటనే వెల్లడించెను. బలరాముడు ఆ పరమరహస్యమును గ్రహించెను. శ్రీకృష్ణుడు బాలురుగా, దూడలుగా తానే అయి సంచరించిన ఆ సంవత్సరకాలము బ్రహ్మయొక్క కాలమానప్రకారము త్రుటి (క్షణ) కాలమే అయ్యెను. పిమ్మట బ్రహ్మదేవుడు అచటికి వచ్చెను. పిదప దూడల రూపములలోను, బాలుర ఆకారములలోను ఉన్న బాలకృష్ణుని చూచి, ఆశ్చర్యపడుచు తనలో ఇట్లు తర్కించుకొనెను.

శా. మందం గల్గిన వత్స బాలకులు నా మాయా గుహా సుప్తులై
యెందుం బోవరు లేవరిప్పుడును వేరే చేయ నా కన్యు లొం
డెందున్ లేరు విధాతలుం బరులు వీరెవ్వారలెట్లైరొకో
యెందేతెంచిరొ కృష్ణుతో మెలఁగు వారేఁడయ్యెడిన్ నేఁటికిన్. 530

"గోకులమునకు చెందిన దూడలు, గోపబాలురు ఇప్పటికిని నా మాయాగుహలోనే నిద్రించుచు ఉన్నారు. వారు ఎక్కడికిని పోజాలరు, ఇప్పట్లో లేవరు. వేఱుగా సృష్టిచేయుటకు నేను దప్ప ఇతర బ్రహ్మలు ఎవ్వరును లేరు. ఈ బాలురు, దూడలు ఎవరు? వీరు ఎట్లు ఏర్పడిరో? శ్రీకృష్ణునితోగూడి మసలుచున్న వీరు ఎక్కడినుండి వచ్చిరో? నేను ఈ మాయను పన్ని నేటికి ఏడాది గడచినది.

మత్తకోకిలము. బ్రహ్మపంపునఁ గాని పుట్టదు ప్రాణిసంతతి యెప్పుడున్
బ్రహ్మ నొక్కఁడఁ గాని వేఱొక బ్రహ్మ లేఁడు సృజింపఁగా
బ్రహ్మ నేను సృజింప నొండొక బాల వత్స కదంబ మే
బ్రహ్మమందు జనించె నొక్కట బ్రహ్మమౌనది చూడఁగాన్. 531

సకలప్రాణులును, సర్వకాలములయందును బ్రహ్మవలననే ఉద్భవించును. సృష్టించుటకు నేను దప్ప మఱియొక బ్రహ్మ లేనేలేడు. నేను సృజించిన బాలురు, దూడలు ఆ గుహలోనే ఉండగా, ఈ బాలురను, దూడలను ఏ బ్రహ్మ సృష్టించెను? పరబ్రహ్మమే (ఆ సర్వేశ్వరుడే) ఈ రూపములలో ఉన్నాడా! ఏమి?".

వ. అని యిట్లు సకలంబును సుకరంబున నెఱింగెడి నెఱవాది ముదుక యెఱుక గల ప్రోడ వెఱంగుపడి, గ్రద్దనం బెద్దప్రొద్దు దద్దయుం దలపోసి,కర్జంబు ముందల యెఱుంగక, కొందలంపడుచు నాందోళనంబున.532

సకలవిషయములను సులభముగా తెలిసికొనుటలో నేర్పరియైన జ్ఞానవృద్ధుడగు బ్రహ్మ ఆశ్చర్యమునకు లోనయ్యెను. చాలసేపు ఆలోచించినపిమ్మట ఇకముందు ఏమి చేయవలెనో తోచక కలతచెందుచు కలవరపడసాగెను.

క. మోహములేక జగంబుల, మోహింపఁగఁ జేయ నేర్చి మొనసిన విష్ణున్
మోహింపించెద ననియెడు, మోహమున విధాత దాన మోహితుఁడయ్యెన్. 533

తే. పగలు ఖద్యోతరుచి చెడుపగిది రాత్రి మంచు చీఁకటి లీన మై మాయమాడ్కి
విష్ణుపై నన్యమాయలు విశద మగునె చెడి నిజేశుల గరిమంబుఁ జెఱచుఁగాక 534

"శ్రీమహావిష్ణువు సకలలోకములను తన మాయలో ముంచివేయుచుండును. కాని తాను మాత్రము మాయకు లోనుగాడు. అట్టి శ్రీహరిని మోహమున బడవేయుటకు యత్నించిన విధాత తానే మోహితుడయ్యెను. పగటిపూట మిణుగురుపురుగు కాంతి తేలిపోవును, రాత్రివేళ మంచుచీకటిలో కలిసిపోయి అదృశ్యమగును. అట్లే శ్రీమహావిష్ణువుపై ఎట్టి మాయలను ప్రయోగించినను అవి నిర్వీర్యములే యగును. అంతేగాక ప్రయోగించినవారి ఔన్నత్యమును గూడ దిగజార్చును.

వ. మఱియును. 535

క. పుట్టితి బుద్ధి యెఱింగితిఁ, బుట్టించితి జగము సగము వోయెను బ్రాయం
బిట్టివి నూతన సృష్టులు, పుట్టుట లేవౌర యిట్టి బూమెలు భూమిన్. 536

ఇంకను బ్రహ్మ ఇట్లనుకొనెను. నేను పుట్టి ఎంతో కాలమైనది. జ్ఞానమును పొందితిని. ఈ జగత్తునే సృష్టించితిని. ఈ సృష్టికార్యమును చేయుటలోనే నా వయస్సు సగమైపోయినది. ఇంతవఱకును ఇట్టి విచిత్ర సృష్టులను నేను కనివిని యెఱుగను. నాకు అంతుపట్టని ఈ మాయలు భూమండలమున సంభవమా?

వ. అని యిట్లు తలవాకిట వాణిగల పోఁడిమిచే వాఁడిమి కెక్కిన నలుమొగంబుల తక్కరిగొంటు పెనుదంట పలు వెంటలఁదనమనంబున వితర్కించి, విచారించునెడ, నతండు కనుంగొనుచుండ, నబ్బాలకులు మేఘశ్యాములును, హారకుండల కిరీట వనమాలికాభిరాములును, శ్రీవత్స మంగళాంగద నూపుర కనక కటక కంకణ కటిఘటిత కాంచీగుణోద్దాములును, నాపాదమస్తక తులసీ దళదాములును, విలసదంగుళీయక స్తోములును, శంఖచక్రగదా కమలహస్తులును, జతుర్భుజ ప్రశస్తులును, బీత కౌశేయవాసులును, జంద్రికా ధవళ హాసులును, గరుణా కటాక్షవీక్షణ విలాసులును, రవికోటిభాసులును, ననంత సచ్చిదానందరూపమహితులును, నణిమాదిగుణోపేతులును విజాతీయ భేదరహితులు శ్రీమన్నారాయణ ప్రతిమాన విగ్రహస్వరూపులును నయి తమకుఁబరతంత్రులగుచు నృత్తగీతాది సేవా విశేషంబులకుం జొచ్చి మెలంగుచు మూర్తిమంతంబులయిన బ్రహ్మాదిచరా చరంబులును, నణిమాది సిద్ధులును, మాయా ప్రముఖంబు లైన శక్తులును, మహదాది చతుర్వింశతి తత్త్వంబులును, గుణక్షోభ కాలపరిణామ హేతుసంస్కార కామ

కర్మ గుణంబులు సేవింప, వేదాంతవిదులకైన నెఱుంగరాని తెఱంగున మెఱయుచుఁ, గానంబడిన వారలం
గనుంగొని. 537

తననోటియందు వాణిని నిలుపుకొని విఱ్ఱవీగుచున్నవాడు ఆ చతుర్ముఖబ్రహ్మ. అతడు మాయావులలో దిట్ట. సర్వసమర్థుడైన అతడు పెక్కువిధములుగా మనస్సున తర్కించుకొనుచు, ఆలోచనలలో మునిగెను. పిమ్మట అతడు ఆ అద్భుతబాలురను చూచెను. వారు మేఘములవలె శ్యామవర్ణముతో శోభిల్లుచుండిరి. హారములను, కుండలములను, కిరీటములను, వనమాలలను ధరించి మనోహరముగా నుండిరి. వారు వక్షఃస్థలములయందు శ్రీవత్స చిహ్నములతో విరాజిల్లుచుండిరి. వారు శోభావహమైన భుజకీర్తులతో అందెలతో, బంగారు కడియములతో, కంకణములతో అలరారుచుండిరి. వారు తమ నడుములకు బంగారు మొలత్రాడులను తాల్చియుండిరి. అన్ని అవయవములయందును తులసీదళమాలలను ధరించి చూడముచ్చటగా ఉండిరి. వారి వ్రేళ్లయందు బంగారపు ఉంగరములు కాంతులీనుచుండెను. ప్రశస్తములైన వారిచతుర్భుజములయందలి శంఖచక్ర గదాపద్మములు తళతళలాడుచుండెను. వారిపట్టుపీతాంబరములు ధగధగలాడుచుండెను. వారి చిఱునవ్వులు వెన్నెలవలె ఆహ్లాదకరముగా నుండెను. మనోజ్ఞములైన వారిచూపులనుండి కరుణ ప్రసరించుచుండెను. వారు కోటిసూర్యకాంతులతో తేజరిల్లుచుండిరి. వారు అనంతములైన సచ్చిదానందస్వరూపములతో మహితాత్ములై శోభిల్లుచుండిరి. అణిమాది అష్టసిద్ధులతో విలసిల్లుచున్న ఆ బాలురు సద్గుణసంపన్నులు. ఆ బాలురందఱియొక్క ఆకారములు ఎట్టి భేదమునులేక శ్రీమహావిష్ణువుయొక్క ఆకృతిని కలిగియుండెను.

పరాత్పరునిఅధీనములో ఉండెడి బ్రహ్మాదిచరాచర ప్రాణులును, అణిమామహిమాది అష్టసిద్ధులును[1] ప్రముఖములైన మాయాదిశక్తులును[2] మహదాది చతుర్వింశతితత్త్వములును[3], గుణక్షోభ, కాలపరిణామ, హేతుసంస్కార, కర్మగుణంబులును, ఆకారములను దాల్చి, నృత్యములను ఒనర్చుట, గీతములను ఆలపించుట మొదలగు రీతులలో వినమ్రతతో ఆ బాలురను (శ్రీమన్నారాయణస్వరూపులను) సేవించుచుండిరి. ఆ దివ్యస్వరూపుల పరతత్త్వములను వేదాంత విదులును ఎఱుంగజాలరు. అట్లు దివ్యస్వరూపములతో తేజరిల్లుచున్న వారిని జూచి బ్రహ్మదేవుడు ఇట్లనుకొనెను.

ఉ. బాలురఁ గంటి నా చెయిదిఁబాసిన వారిని మున్ను వారి నేఁ
బోలఁగఁ జూచునంతటన భూరి నిరర్గళ దుర్గమ ప్రభా
జాలముతోడఁ జూపులకుఁ జాలమిఁ దెచ్చుచు నున్నవార లే
మూలమొ మార్గ మెయ్యదియొ మోసము వచ్చెఁ గదే విధాతకున్. 538

నాకు కనబడుచున్న (నేను చూచుచున్న) ఈ బాలురు నా మాయాప్రభావమునకు లొంగిన వారు కారు. (మాయతో నేను అపహరించుకొనిపోయిన బాలురు కారు.) నేను పరికించి చూచుచున్నంతలోనే వారి అనంతతేజస్సులు సమీపించుటకు వీలులేనిదై నిరాటంకముగా విరాజిల్లుచున్నవి, ఆ కాంతిపుంజమును నేను చూడజాలకున్నాను. ఇందులకు కారణము నాకు బోధపడుటలేదు. ఇప్పుడు నాకు ఏది దారి? (నేనేమి చేయవలెను?) సృష్టికర్తనైన నాకే ప్రమాదము వచ్చిపడినదిగదా!

1. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వము, వశిత్వము - అని అష్టసిద్ధులు ఎనిమిది.
2. ఆదిశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి అనునవి మాయాశక్తులు.
3. అవ్యక్తము మొదలగునవి. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అను పంచమహాభూతములు, అహంకారము, బుద్ధి, మనస్సు, చిత్తము అను అంతరింద్రియములు నాలుగు, చర్మము, నేత్రములు, చెవులు, నాలుక, ఘ్రాణము (ముక్కు) అను జ్ఞానేంద్రియములు ఐదు, వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ - అను కర్మేంద్రియములు ఐదు, శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము - అను ఇంద్రియార్థములు (విషయములు) ఐదు - వెరసి మహదాదితత్త్వములు ఇరువది నాలుగు.

వ. అని సకలేంద్రియంబులకు వెక్కసంబయిన స్రుక్కి. 539

ఉ. ఏ పరమేశు తేజమున నీ సచరాచర మైన లోకము
ద్దీపితమయ్యెనట్టి విభుతేజముఁ గన్నులఁ జక్కఁ జూడఁగా
నోపక పారవశ్యమును నొందుచు సంస్తిమితాఖిలేంద్రియుం
డై పరమేష్ఠి మైమఱచె నప్పుడు చిత్రపు రూపు కైవడిన్ 540

ఈ బాలుర దివ్యతేజస్సులముందు బ్రహ్మయొక్క ఇంద్రియములు ఎవ్వియును పనిచేయకుండుటచే ఆయన నిశ్చేష్టుడై విచారపడసాగెను. ఆ పరాత్పరుని తేజఃప్రభావముననే ఈ చరాచరజగత్తు వెలుగొందుచున్నది. బ్రహ్మ ఆ పరమాత్ముని అద్భుత తేజస్సును తన కన్నులతో సమగ్రముగా చూడజాలక పారవశ్యమును పొందుచుండెను. ఇంద్రియములు అన్నియును చేష్టలుడిగియుండుటచే ఆ పరమేష్ఠి ఒక చిత్తరువు మాదిరిగా చైతన్యములేనివాడయ్యెను.

వ. ఇట్లు మాయాతీతుండును, వేదాంత విజ్ఞాన దుర్లభుండును, స్వప్రకాశానందుండును నైన తన బాహుళ్యంబుఁ జూచి నివ్వెఱపడిన బ్రహ్మం గని, యీశ్వరుండు. 541

శా. బాలుండై చతురాననుండు తన యీ బ్రహ్మాభిమానంబునన్
లోలుండై మతిదప్పి నా మహిమ యాలోకింప నేతెంచె దా
నాలోకింపఁగ నెంతవాఁడనుచు మాయాజాలమున్ విప్పి త
ల్లీలారూపము లెల్ల దాఁచె నటఁ గేళీచాతురీధుర్యుఁడై. 542

ఆ సర్వేశ్వరుడు (శ్రీకృష్ణుడు) మాయాతీతుడు, వేదాంతవిజ్ఞానమునకును అగోచరుడు, స్వయముగా ప్రకాశించువాడు, ఆనందస్వరూపుడు అట్టి ఆ ప్రభువు దివ్యములైన తన తేజోరూపములకు నివ్వెఱపడియున్న బ్రహ్మను జూచి ఇట్లనుకొనెను. 'నాలుగు తలలు ఉన్నను ఈ బ్రహ్మ నా ప్రభావమును ఎఱుంగుటలో మూఢుడే. తాను సృష్టికర్తనను అహంకారములో మునిగి, బుద్ధిహీనుడై నా మహిమను జూచుటకై వచ్చెను. నా యథార్థతత్త్వమును తెలిసికొనుట ఇతనికి అసాధ్యము. ఇట్లు భావించి లీలావిలాసచతురుడైన శ్రీకృష్ణప్రభువు తన మాయలను ఉపసంహరించుకొనెను, తన లీలారూపములను (తాను ధరించిన గోపాలుర, దూడలరూపములను) అదృశ్యమొనర్చెను.

వ. అంతలోనన జీవుండు సజీవుం డైన తెఱంగున, నెనిమిది కన్నులు గల వేలుపు గమికాఁడు తేఱి, తెప్పిరి, కాలుఁగేలుఁ గదలించి, చెచ్చెరం గన్నులు విచ్చిచూడ సమర్థుండై, ముందటఁ గని, వెనుకఁ జూచి, దివి విలోకించి, దిక్కులను వీక్షించి, యెల్లయెడలం గలయ దర్శించి, తన పురోభాగంబున హరి సంచరించుటం జేసి జాతివైరంబులేని నరపక్షిమృగాదులకు నాటపట్టయి, సిరి గలిగి, కామక్రోధాదిరహితులకు జీవనంబైన బృందావనంబుం బొడగాంచి యందు. 543

అంతట ఎనిమిది కన్నులుగలవాడు, ఇంద్రాదిదేవతలలో పెద్దవాడు అగు బ్రహ్మ చచ్చినవాడు బ్రతికినట్లుగా తేఱుకొని, కాళ్లు, చేతులు ఆడించెను. పిదప కన్నులు తెఱచి, చూడగలిగెను. అప్పుడు నలుదిక్కులను ఊర్ధ్వభాగమును కలయజూచెను. పిదప అతడు తన యెదుటనున్న బృందావనమును గాంచెను. కృష్ణప్రభువు మహిమచేత ఆ బృందావనము సిరులకు నిలయమైయుండెను, కామక్రోధాది అరిషడ్వర్గములను జయించిన మహాత్ములకు ఆశ్రయభూమి అయ్యెను; అందలి మానవులును, పక్షులు, మృగములు అన్నియును జాతివైరములుమాని సంచరించుట సహజమయ్యెను.

సీ. తనకన్యములులేక తనరారి ముమ్మూల విభుఁడయ్యుఁ గ్రేపుల వెదకు వాని
నఖిలజ్ఞుఁడై యొక్కఁ డయ్యు నజ్ఞాకృతిఁ జెలికాండ్రఁ బెక్కండ్రఁ జీరువాని
బహి రంత రాద్యంత భావశూన్యుం డయ్యు నంతంత నడుగుచొ ప్పరయువాని
గురు గభీరుండయ్యు గురువులు వాఱుచు నట్టిట్టుఁ బాతరలాడువాని
ఆ. జాతిరహితుఁడయ్యుఁ జతుర గోపార్భక భావ మెల్ల నచ్చుపడిన మేని
చెలువువాని హస్త శీతాన్న కబళంబు వానిఁ గాంచె నపుడు వాణిమగఁడు. 544

బృందావనమును గాంచిన పిదప బ్రహ్మ బాలకృష్ణుని వీక్షించెను. లీలావతారుడైన ఆ శ్రీకృష్ణప్రభువు త్రిగుణాత్మకమైన విశ్వమునకు ఆధారమైనవాడు, సకలప్రాణులకు అంతరాత్మయైనవాడు, (ఆయనకు అన్యులులేరు). అట్టి ప్రభువు అప్పుడు గోపాలుడై దూడలకొఱకు వెదకుచుండెను. సర్వజ్ఞుడైన ఆ స్వామి ఏమియు ఎఱుంగని వానివలె తోడిబాలురను పిలుచుచుండెను. ఆ మహాత్మునిదృష్టిలో బాహ్యాభ్యంతరములు, ఆద్యంతములు లేనేలేవు. ఐనను ఇప్పుడు అతడు ఆవుదూడలఅడుగుజాడలను అరయుచుండెను. అతడు మిగుల గంభీరుడయ్యెను. (ఏమాత్రం తొణకని వాడయ్యెను) దూడలకొఱకు అటునిటు పరుగులు దీయుచున్నట్లు నటించుచుండెను. ఆ ప్రభువునకు జన్మయేలేదు. ఐనను అతడు అచ్చమైన గోపబాలునిరూపమున ఒప్పుచుండెను. అతడు తన చేతిలో చల్దిముద్దను పట్టుకొనియేయుండెను.

వ. కని, సంభ్రమించి విరించి, రాయంచ డిగ్గనుఱికి, కనకదండ సుకుమారంబైన శరీరంబుతోడ నేలం జాఁగిలం బడి, మణిగణ సుప్రకాశంబులైన తన కిరీట శిఖరప్రదేశంబులాకుమారునిపాదపద్మంబులు మోవ మ్రొక్కి, తోరంబులగు నానందబాష్ప జలపూరంబులనతనియడుగులు గడిగి, మఱియును. 545

చిన్నికృష్ణుని చూచినంతనే బ్రహ్మ తొట్రుపడుచు, తన వాహనమైన రాజహంసపైనుండి దిగి, ఆ కన్నయ్యకడకు పఱుగులు దీసెను. బంగారుదండమువలె కాంతులీనుచు సుకుమార శరీరుడైన అతడు సాగిలపడి ఆ ప్రభువునకు మ్రొక్కెను. అంతట ఆ బ్రహ్మ మణులతో చెక్కబడి శోభిల్లుచు శిఖరాకృతిలో ఉన్న తన కిరీటములు ఆ ప్రభువుయొక్క పాదపద్మములకు తాకునట్లుగా ప్రణమిల్లెను. అతడు సంతతధారగా ప్రవహించుచున్న తన ఆనందబాష్పములతో ఆ స్వామిఅడుగులకు అభిషేకమొనర్చెను.

క. అడుగులపైఁబడు లేచుం, బడుఁ గ్రమ్మఱ లేచు నిట్లు భక్తిన్ మును తాఁ
బొడగనిన పెంపుఁ దలఁచుచు, దుడుకని మహిమాబ్ధి నజుఁడు దుడుకడిచె నృపా! 546

వ. అంత నల్లనల్లన లేచి, నిలుచుండి, నయనారవిందంబులు దెఱచి, గోవిందుని సందర్శించి, చతుర్ముఖుండు ముఖంబులు వంచి, కృతాంజలియై, దిగ్గన డగ్గుత్తిక యిడుచు, నేకచిత్తంబునఁ జతుర్ముఖంబుల నిట్లని స్తుతియించె. 547

రాజా! అతడు కృష్ణునియొక్క పాదములపై పడుచు, లేచుచు పదేపదే ప్రణమిల్లెను. ఈ విధముగా బ్రహ్మ భక్తిపరవశుడై ఆ ప్రభువుయొక్క మహిమాసముద్రమునందు తనగర్వమును అణచుకొనెను. అనంతరము బ్రహ్మదేవుడు తిన్నతిన్నగా లేచి నిలబడి, కన్నులార ఆ గోవిందుని దర్శించెను. పిమ్మట అతడు తలలు వంచుకొని, అంజలిఘటించి, డగ్గుత్తికతో ఏకాగ్రచిత్తుడై, ఆ స్వామిని తన నాలుగు ముఖములతో ఇట్లు ప్రస్తుతించెను.

## బ్రహ్మ శ్రీకృష్ణుని స్తోత్రము చేయుట

సీ. శంపాలతికతోడి జలదంబుకైవడి మెఱుఁగు టొల్లియతోడి మేనివానిఁ
గమనీయ మృదులాన్న కబళ వేత్ర విషాణ వేణు చిహ్నంబులు వెలయువానిఁ
గుంజావినిర్మిత కుండలంబులవాని శిఖిపింఛ వేష్టిత శిరమువాని
వనపుష్పమాలికా వ్రాత కంఠమువాని నళినకోమల చరణములవానిఁ
ఆ. గరుణ గడలు కొనిన కడగంటివాని గోపాలబాలు భంగిఁ బరఁగువాని
నగుమొగంబువాని ననుఁ గన్న తండ్రిని నిను భజింతు మ్రొక్కి నీరజాక్ష! 548

"కమలనేత్రా! కాంతులీనెడి ఉత్తరీయముతో విలసిల్లుచున్న నీమేను మెఱపుతీగలతో మిఱుమిట్లు గొలుపుచున్న మేఘమును తలపింపజేయుచున్నది. నీ చేతిలోని చలిదిముద్ద, బెత్తము, కొమ్ముబూర, మురళి దర్శనీయములు. గురివెందగింజలతో ఒప్పాఱుచున్న నీ కుండలములు, నెమలిపింఛముతో అలంకృతమైన నీ శిరస్సు మనోజ్ఞములు. నీ కంఠము వనపుష్పమాలలతో విరాజిల్లుచున్నది. నీ చరణములు కమలములవలె మిగుల కోమలములు. నీ క్రీగంటి చూపులలో కరుణ తొణికిసలాడుచున్నది. గోపాలబాలునివలె మెలగుచు నీవు చిందించుచున్న చిఱునవ్వు మధురమైనది. నా కన్నతండ్రివైన శ్రీమన్నారాయణా! నీకు భక్తితో మ్రొక్కెదను.

మ. నను మన్నించి భవజ్జనంబులకు నానందంబు నిండించు నీ
తను రూపం బిదె నా మనంబునకచింత్యం బయ్యె నీ యుల్ల స
ద్ఘన విశ్వాకృతి నెవ్వఁ డోపు నెఱుఁగం గైవల్యమై యొప్పు నా
త్మ నివేద్యం బగు నీదు వైభవము చందం బెట్టిదో యీశ్వరా! 549

సర్వేశ్వరా! నన్ను మన్నింపుము. నీ భక్తకోటికి ఆనందదాయకమైన నీ సుందరరూపము నా ఊహలకు అందనిది. అద్భుతమైన నీ విశ్వరూపమును ఎవడు తెలిసికొనగలడు? నీ వైభవము మోక్షదాయకము, పరమాత్మవైన నీవు మాత్రమే దానిని ఎఱుంగుదువు, దానిని తెలిసికొనుటకు నేను అశక్తుడను.

క. విజ్ఞాన విధము లెఱుఁగక, తద్‌జ్ఞులు నీ వార్తఁజెప్పఁ దను వాఙ్మనముల్
యజ్ఞేశ! నీకు నచ్చిన, యజ్ఞులు నినుఁ బట్టి గెలుతురజితుఁడ వైనన్ 550

యజ్ఞేశ్వరా! యథార్థముగా నీవు ఎవ్వరికిని అందనివాడవు. కాని శాస్త్రములను ఎఱుగని అజ్ఞానులు తత్త్వవేత్తలవలన నీ స్వరూపలక్షణములను ఎఱింగి, మనోవాక్కాయములను నీకు సమర్పించి, (శరీరముచే నిన్ను సేవించుచు, వాక్కులచే నిన్ను స్తుతించుచు, మనస్సులో నిన్ను ధ్యానించుచు) నిన్ను తెలిసికొని బ్రహ్మానందమును పొందుదురు.

క. శ్రేయములు గురియు భక్తినిఁ, జేయక కేవలము బోధసిద్ధికిఁ దపముం
జేయుట విఫలము పొల్లున, నాయము సేకుఱునె తలఁప నధికం బైనన్. 551

స్వామీ! అనన్యభక్తితో నిన్ను సేవించినవారికి శుభములు కొల్లలుగా అబ్బును. అట్లుగాక కేవలము జ్ఞానప్రాప్తికై తపస్సులు చేయుట నిష్ఫలము. ఏలనన గింజపట్టని ధాన్యమును రాసులు రాసులు దంచినను ప్రయోజనము ఉండదుగదా! అట్లే భక్తిలేని జ్ఞానము వ్యర్థము.

క. నిజముగ నిన్నెఱుఁగఁగ మును,నిజవాంఛలు నిన్నుఁజేర్చి నీకథ వినుచున్
నిజకర్మలబ్ధ భక్తిన్, సుజనులు నీ మొదలిటెంకిఁ జొచ్చిరధీశా! 552

జగన్నాథా! సజ్జనులు నిన్ను తెలిసికొనుటకై, తమ కోరికలను అన్నింటిని నీ మీదికే మఱల్చి, నీ కథలను వినుచుందురు. పూర్వజన్మలలో చేసికొనిన పుణ్యకర్మలవలన లభించిన గాఢమైన భక్తితో నిన్ను సేవించి, నీ నివాసస్థానమైన పరంధామమును చేరుచుందురు.

సీ. విక్రియా శూన్యమై విషయిత్వమును లేనిదగుచు నాత్మాకార మై తనర్చు
నంతఃకరణ మొక్క యధిక సాక్షాత్కార విజ్ఞానమునఁ బట్టి వేఱొరులకు
నెఱుఁగంగ రానిదై యేపారి యుండుటఁ జేసి నీ నిర్గుణ శ్రీ విభూతి
బహిరంగ వీథులఁ బాఱక దిరములై యమలంబులగు నింద్రియములచేత
ఆ. నెట్టకేలకైన నెఱుఁగంగ నగుఁ గాని గుణవిలాసి వగుచుఁ గొమరుమిగులు
నీగుణప్రజంబు నేరరాదెఱుఁగంగ నొక్క మితములేక యుంటనీశ! 553

అంతఃకరణము నిశ్చలమై, శబ్దస్పర్శరూపరసగంధముల జోలిలేనిదై, పరబ్రహ్మయొక్క ఆకారముతో నిండినదై ఉన్నప్పుడు అట్టి వారు తమ అపరోక్షానుభూతిచే త్రిగుణాతీతమైన నీ వైభవమును ఎఱుంగుదురు. తదితరులు ఏమాత్రము ఎఱుంగజాలరు. బాహ్యవిషయములఆకర్షణలకు లోనుగాక, నిర్మలముగానుండెడి ఇంద్రియములుగలవారు (జితేంద్రియులు) ఎట్టకేలకు నీ నిర్గుణ వైభవమును తెలిసికొనగలరు. కాని నీవు సత్త్వరజస్తమోగుణాత్మకమైన చరాచరరూపములను ధరించువాడవు[1]. సర్వేశ్వరుడవు, సర్వజ్ఞుడవు, సమస్తవిశ్వమును సృష్టించువాడవు, పాలించువాడవు, దానినిలయమొనర్చువాడవు. (సృష్టి, స్థితి, లయకారకుడవు) సర్వభోక్తవు. అట్టి శక్తిమంతుడవైన నీ యొక్క గుణములు అపరిమితములు. అట్టి నీ గుణములను ఎఱుంగుట ఎంతటివారికిని సాధ్యముకాదు.

క. తారాతుషార శీకర, భూరజముల కైన లెక్క బుధులిడుదురు భూ
భారావతీర్ణకరుఁడగు నీ రమ్య గుణాలి నెన్న నేరరగణ్యా! 554

ప్రభూ! పండితులైనను చుక్కలను, మంచుబిందువులను, దుమ్ములరేణువులను లెక్కపెట్టగలరేమోగాని, భూభారమును తొలగించుటకై అవతరించిన నీ యొక్క మహిమాన్వితములైన (రమ్యములైన) గుణములను మాత్రము లెక్కింపజాలరు. ఏలనన అద్భుతములైన నీ గుణములు అనంతములుగదా!

శా. ఏవేళం గృపఁ జూచు నెన్నఁడు హరిన్ వీక్షింతునంచాత్ముఁడై
నీ వెంటం బడి తొంటి కర్మచయమున్ నిర్మూలముం జేయుచున్
నీవాఁడై తనువాఙ్మనోగతుల నిన్ సేవించు విజ్ఞాని వో
కైవల్యాధిప లక్ష్మి నుద్దవడిఁ దాఁ గైకొన్న వాఁడీశ్వరా! 555

సర్వేశ్వరా! నీయందు ఆసక్తిగలవాడు (అనన్యభక్తుడు) శ్రీహరి అనుగ్రహము నాపై ఎప్పుడు ప్రసరించునో? నేను ఆ స్వామిని ఎప్పుడు దర్శింతునో?' అని తపనపడుచుండును. అతడు తన సర్వేంద్రియములతో సర్వదా నిన్నే సేవించుచుండుటచే అతని కర్మలన్నియును పూర్తిగా నిర్మూలములగును. అట్టి విజ్ఞాని నీ కృపకు పాత్రుడై త్రికరణశుద్ధిగా నిరంతరమునిన్నే ఆరాధించుచు, మోక్షలక్ష్మిని పొందుటకు శీఘ్రముగా అర్హుడగును.

1. నీవు సత్త్వగుణాత్మకములైన దేవతల రూపములను, రజోగుణాత్మకములైన మనుష్యపశుపక్ష్యాదుల ఆకారములను, తమోగుణాత్మకములైన భూ, పర్వత, వృక్షాది స్థావరరూపములను ధరించువాడవు. ఇవి బ్రహ్మదేవుడు స్వానుభవముతో నుడివిన మాటలు - శ్రీకృష్ణభగవానుడు గోపబాలుర రూపములను, గోవులయొక్క, దూడలయొక్క ఆకారములను ధరించియుండుట బ్రహ్మదేవుడు స్వయముగా దర్శించెను.

ఉ. మాయలు గల్గువారలను మాయలఁ బెట్టెడి ప్రోడ! నిన్ను నా
మాయఁ గలంచి నీ మహిమమానముఁ జూచెద నంచు నేరమిం
జేయఁగఁ బూనితిం గరుణ సేయుము కావుము యోగిరాజ వా
గ్గేయ! దవాగ్నిఁ దజ్జనితకీలము గెల్చి వెలుంగ నేర్చునే. 556

మహాయోగులచే కీర్తింపబడుచుండెడి స్వామీ! నీవు మాయలను నేర్చినవారిని సైతము నీ మాయలలో ముంచి, భ్రమింపజేయు మహిమాన్వితుడవు. అట్టి నిన్ను నా మాయచే తికమకపఱచి, నీ మహిమలు ఎట్టివో (ఎంతటివో) తెలిసికొనుటకై అజ్ఞానముచే ప్రయత్నించితిని. కనికరించి నన్ను మన్నింపుము. కాఱుచిచ్చులో పుట్టినజ్వాలలు దానినే (ఆ దావాగ్నినే) కాదని వెలుగగలవా?

సీ. సర్వేశ! నే రజోజనితుండ మూఢుండఁ బ్రభుఁడ నేనని వెఱ్ఱిప్రల్లదమున
గర్వించినాఁడను గర్వాంధకారాంధ నయనుండఁ గృపఁజూడు నను బ్రధాన
మహదహంకృతి నభో మరు దగ్ని జల భూమి పరివేష్టితాండకుంభంబులోన
నేడు జేనలమేన నెనయు నే నెక్కడ నీ దృగ్విధాండంబులేరికైన
తే. సంఖ్య సేయంగరానివి సంతతంబు నోలిఁబరమాణువులభంగి నొడలి రోమ
వివరములయందె వర్తించు విపులభాతి నెనయుచున్న నీవెక్కడ నెంతకెంత. 557

సర్వేశ్వరా! నేను రజోగుణమునుండి పుట్టినవాడను. అజ్ఞానిని. 'నేనే సర్వసమర్థుడను' అని పిచ్చి (అంతులేని) అహంకారముతో విఱ్ఱవీగితిని. గర్వాంధకారముచే నా కనులు మూసికొనిపోయినవి. (గర్వముచే నేను కన్నుమిన్నుగానకుంటిని) నన్ను కనికరింపుము. ప్రకృతి మహత్తు, అహంకారము, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి అను అష్టావరణములతో కూడియుండునది బ్రహ్మాండము. అట్టి బ్రహ్మాండమనుకుంభములో నేను ఏడుజేనల శరీరముగలవాడను. ఇట్టి బ్రహ్మాండములు ఎవ్వరును లెక్కపెట్టలేనన్ని నీరోమకూపములలో పరమాణురూపములలో నిరంతరము ప్రవర్తిల్లుచుండును. అట్టి విరాట్స్వరూపుడవు నీవు. కనుక నేను ఎక్కడ? నీవెక్కడ? మనమధ్యగల అంతరము ఊహలకు అందనిది. నీవు అమేయ మహిమాన్వితుడవు, నేను మిగుల అల్పుడను.

తరలము. కడుపులోపల నున్న పాపఁడు కాలఁదన్నినఁ గిన్కతో
నడువఁ బోలునె క్రాఁగి తల్లికి నాథ! సన్నము దొడ్డునై
యడఁగి కారణకార్య రూపమునైన యీ సకలంబు నీ
కడుపులోనిది గాదె పాపఁడఁ గాక నే మఱి యెవ్వఁడన్ 558

జగన్నాథా! తల్లి తనకడుపులోనున్న బిడ్డడు (గర్భస్థశిశువు) తన్నినను ఆమె కోప(బాధ)పడదు, ఆ శిశువును దండింపదు. సూక్ష్మమై, స్థూలమై కారణకార్యరూపములతో[1] ఒప్పెడి ఈ విశ్వము అంతయు నీ కడుపులోనే యుండునుగదా! కనుక నేను నీ కడుపులోని పాపడనే. అందువలన నీవు నన్ను దండింపక కన్నతల్లివలె నాపై కృపజూపుము.

క. భూరిలయజలధి నిద్రిత, నారాయణ నాభికమల నాళమున నజుం
డారయఁ బుట్టె ననుట నిజ, మో రాజీవాక్ష! పుట్టె నోటు తలంపన్ 559

1. కారణము = ఉత్పత్తిస్థానము (అవ్యక్తము). కార్యము = ఉత్పన్నమగు వస్తువు (వ్యక్తప్రపంచము).

కమలాక్షా! 'మహాప్రళయకాలమున సముద్రజలములలో వటపత్రశాయియై యోగనిద్రలో నుండెడి శ్రీమన్నారాయణుని యొక్క నాభికమలములనుండి బ్రహ్మ పుట్టెను' అని పురాణేతిహాసములు పేర్కొనినమాట యెంతయు నిజము. వాస్తవముగా 'ఓటమి' నాకు జన్మతో వచ్చినది.

సీ. నళినాక్ష! నీ వాదినారాయణుండవు జలము నారము జీవచయము నార
మందు నీ వుంట నీయందవి యుంటను నారాయణుండను నామమయ్యె
సకలభూతములకు సాక్షి వధీశుండ వబ్ధి నిద్రించు నారాయణుఁడవు
నీమూర్తి యది నీకు నిజమూర్తి యనరాదు నళిననాళము ద్రోవ నడచి మున్ను
తే. కఁడగి నూఱేండ్లు వెదకి నేఁ గాన నయితి నేకదేశస్థుఁడవు గా వనేక రుచివి
జగములో నుందు నీలోన జగము లుండు నరుఁదు నీమాయ నెట్టైన నగుచు నుండు. 560

కమలనేత్రా! నీవు ఆదిదేవుడైన శ్రీమహావిష్ణుడవు. నారము అనగా జలము, ప్రాణికోటి, ఆ నారమునందు నీవు ఉండుటవలనను నారములు నీయందు ఉండుటవలనను 'నారాయణుడు' అను పేరు నీకు సార్థకమయ్యెను. నీవు సకల చరాచర ప్రాణులకును సాక్షివి. వాటికి అధిపతివి. ప్రళయకాల జలములయందు నీవు వటపత్రశాయివై నిద్రించుచుండెడి నారాయణుడవు. ఇప్పటి నీ గోపాలరూపమును నీ నిజమైన రూపమని తలంపవీలులేదు. మునుపు నేను పద్మనాళమున ప్రవేశించి, నిన్ను కనుగొనుటకై నూఱేండ్లు ప్రయత్నించితిని. కాని నీ నిజరూపమును దర్శింపలేక పోయితిని. నీవు సర్వవ్యాపకుడవు (అన్ని ప్రదేశములందును నీవే ఉందువు. నీవులేని చోటేలేదు.) నీ కాంతులు దశదిశలయందును ప్రసరించుచుండును. సకలలోకములయందును నీవు ఉందువు. నీలో సమస్త లోకములును ఉండును. ఇది మిగుల ఆశ్చర్యకరము. నీ మాయా ప్రభావము తిరుగులేనిది.

మ. వినుమో యీశ్వర! వెల్పలన్ వెలుఁగు నీవిశ్వంబు నీ మాయ గా
క నిజంబైన యశోద యెట్లు కనియెన్ గన్నార నీ కుక్షిలోఁ
గనెఁబో క్రమ్మఱఁగాంచెనే భవదపాంగ శ్రీఁ బ్రపంచంబు చ
క్కన లోనా వెలియౌను లోను వెలియుం గాదేఁ దదన్యం బగున్. 561

పరమేశ్వరా! నా మనవిని ఆలకింపుము. బయట కనబడుచున్న ఈ విశ్వమంతయు నీ మాయయే సుమా! అట్లు గానిచో యశోదాదేవి నీ కడుపులో ఈ ప్రపంచమును కనులార (తనివిదీఱ) ఎట్లు చూడగలిగెను. చూచినదే అనుకొనుము. మఱల ఆ విశ్వమును (బ్రహ్మాండాది సకలలోకములను) బయట చూడగలిగినదా? ఈ ప్రపంచమంతయు నీ కనుసన్నలలో, లోపల-బయట విలసిల్లుచుండును. అట్లు కానరానిచో తదన్యమేయగును. అనగా నీ స్వరూపముగనే యుండును.

మ. ఒకఁడై యుంటివి బాలవత్సములలో నొప్పారితీవంతటన్
సకలోపాసితులౌ చతుర్భుజులునై సంప్రీతి నేఁ గొల్వఁగాఁ
బ్రకట శ్రీ గలవాఁడవైతివటుపై బ్రహ్మాండముల్ సూపి యొ
ల్లక యిట్లొక్కఁడవైతి నీ వివిధ లీలత్వంబుఁ గంటింగదే. 562

ప్రభూ! నీవు మొట్టమొదట గోపబాలురలో, ఆవుదూడలలో ఒకడవై విలసిల్లితివి. పిమ్మట నిన్ను ఉపాసించెడి వారియందఱిలో చతుర్భుజ రూపములలో గోచరించితివి. (నిన్ను సేవించెడివారు అందఱును నాకు చతుర్భుజరూపములతో కన్పట్టిరి.) నేను ఎంతయు ప్రీతితో నిన్ను భజింపగా నీ వైభవములను అన్నింటిని ప్రకటించితివి. అనంతరము బ్రహ్మాండములను జూపి ఇట్లు శ్రీకృష్ణుని రూపములో (ఒక్కడుగా) దర్శనమిచ్చితివి. ఈ విధముగా నీ లీలలను అన్నింటిని ప్రకటించితివి.

క. ఎఱిఁగిన వారికిఁ దోఁతువు, నెఱిఁ బ్రకృతిన్ జేరి జగము నిర్మింపఁగఁనా
తెఱఁగున రక్షింపఁగ నీ, తెఱఁగునఁ బ్రహరింప రుద్రు తెఱఁగున నీశా! 563

సర్వేశా! నీవు ప్రకృతిద్వారా జగత్తును సృష్టించెడి బ్రహ్మదేవునిగను, జగములను రక్షించెడి శ్రీమహావిష్ణువుగను, లయకారకుడైన శివునిగను, జ్ఞానులకు (బ్రహ్మజ్ఞానులకు) గోచరింతువు. (అనగా జ్ఞానులు 'సృష్టి, స్థితి, లయకారకుడవు నీవే' అని ఎఱుగుదురు.)

క. జలచర మృగ భూసుర వర, కులముల జన్మించి తీవు కుజనులఁ జెఱుపం
జెలిమిని సుజనుల మనుపను, దలపోయఁగ రాదు నీ విధంబులనంతా! 564

అనంతా! దుర్జనులను శిక్షించుటకై, కృపతో సజ్జనులను రక్షించుటకై ఇంతకుముందు నీవు మత్స్యముగా, కూర్మముగా (జలచరములుగా) వరాహముగా, నృసింహముగా (మృగములుగా) వామనుడవుగా, పరశురాముడవుగా, శ్రీరాముడవుగా (భూసురవంశములయందు, రాజవంశమునందును) అవతరించితివి. నీ లీలలు అనంతములు, అనూహ్యములు.

ఆ. ప్రబ్బు గొలిపి యోగమాయ నిద్రించిన యో పరాత్మ! భూత!యోగిరాజ!
యేతెఱంగులెన్ని యెప్పు డెచ్చోట నీ హేలలెవ్వఁ డెఱుఁగు నీశ్వరేశ! 565

సర్వేశ్వరా! నీవు పరమాత్ముడవు, యోగీశ్వరుడవు. నీవు ప్రాణులను మోహమున ముంచి, యోగనిద్రలో ఉందువు. నీ లీలలు పలువిధములు, అసంఖ్యాకములు, వాటిని ఎంతటివారును ఎఱుగజాలరు.

సీ. అది గాక నిజరూప మనరాదు కలవంటిదై బహువిధదుఃఖమై విహీన
సంజ్ఞానమై యున్న జగము సత్సుఖ బోధ తనుఁడవై తుది లేక తనరుదీవు
మాయచేఁ బుట్టుచు మనుచు లేకుండుచు నున్న చందంబున నుండుచుందు
వాకఁడవాత్మఁడవితరోపాధి శూన్యుండ వాద్యుండ వమృతుండ వక్షరుండ
ఆ. వద్వయుండవును స్వయంజ్యోతి వాపూర్ణుఁ డవు పురాణపురుషుఁడవు నితాంత
సౌఖ్యనిధివి నిత్యసత్యమూర్తివి నిరంజనుఁడవీవు దలఁపఁ జనునె నిన్ను. 566

ప్రభూ! ఈ జగత్తు అంతయు నీ నిజరూపమని భావింపరాదు. ఇది కలవంటిది, పెక్కు దుఃఖములకు మూలము, జ్ఞానశూన్యము. నీ తనువు శాశ్వతమైనది అది సుఖప్రదము, జ్ఞానానందదాయకము. నీవు ఆద్యంతరహితుడవు (జననమరణములు లేనివాడవు) నీ మాయచే నీవు ఈ జగత్తున పుట్టుచు, పెఱుగుచు, గిట్టుచున్నట్లు తోచుచుందువు. కాని నీవు దివ్యశరీరుడవు; స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు లేనివాడవు. జగత్తుయొక్క సృష్టి, స్థితి లయములకు కారకుడవు. వృద్ధి, క్షయము మున్నగు వికారములు లేనివాడవు, శాశ్వతుడవు, రెండవ వస్తువు లేనివాడవు, స్వయంప్రకాశకుడవు, సర్వవ్యాపకుడవు, (అంతటను నిండియుండువాడవు), సనాతనుడవు, పరమసుఖములకు పెన్నిధివి. నిత్యసత్య స్వరూపుడవు, త్రిగుణాతీతుడవు; కనుక 'నీవు ఇట్టివాడవు' అని నిర్ణయించుట ఎవరితరము.

వ. దేవా! యిట్టి నీవు జీవాత్మ స్వరూపుండవును, సకలాత్మలకు నాత్మయైన పరమాత్మ స్వరూపకుండవునునని యెవ్వ రెఱుంగుదురు, వారు గదా గురువనియెడి దినకరునివలనఁ బ్రాప్తంబైన యుపనిషదర్థజ్ఞానం బను సునేత్రంబునం జేసి సంసార మిథ్యాసాగరంబుఁ దరించిన చందంబున నుండుదురు. రజ్జువందు రజ్జు వని యెఱింగెడి యెఱుక లేకుండ న య్యెఱుంగమి నది సర్పరూపం బయి తోఁచిన పిదప నెఱింగినవారి వలవ రజ్జువురజ్జువని యెఱుంగుచుండ, సర్పరూపంబు లేకుండుకైవడి, నాత్మ యప్పరమాత్మ యని యెవ్వ రెఱుంగరు, వారికయ్యెఱుంగమివలన సకల బ్రపంచంబు గలిగి తోచు నాత్మయప్పరమాత్మయని యెవ్వరెఱుంగుదురు

వారికయ్యెఱుకవలన బ్రపంచంబు లేకుండు నజ్ఞాన సంభావిత నామకంబులైన సంసార బంధమోక్షంబులు, జ్ఞానవిజ్ఞానంబులలోనివి గావు. కావునఁ గమలమిత్రునకహోరాత్రంబులు లేని తెఱంగునఁ, బరిపూర్ణ జ్ఞానమూర్తి యగు నాత్మయందు నజ్ఞానంబు లేమిని బంధంబును, సుజ్ఞానంబు లేమిని మోక్షంబును, లేవాత్మవైన నిన్నుఁ దేహాదికంబని తలంచియు, దేహాదికంబు నిన్నుఁగాఁ దలంచియు, నాత్మ వెలి నుండు నంచు మూఢులు మూఢత్వంబున వెదుకుచుందురు. వారి మూఢత్వంబుఁ జెప్పనేల బుద్ధిమంతులై పరతత్త్వంబుగాని జడంబును నిషేధించుచున్న సత్పురుషులు తమశరీరంబులయంద నిన్నరయుచుందు. రది గావున. 567

దేవా! 'నిత్యసత్యమూర్తివైన నీవు జీవాత్మస్వరూపుడవు, మఱియు ఆత్మలన్నింటికిని కారణమైన పరమాత్మ స్వరూపుడవు' అని పెక్కుమంది ఎఱుగరు. కావున గురువనెడి సూర్యునివలన లభించిన ఉపనిషత్తులలోని మహావాక్యముల[1]యొక్క అర్థమనెడి జ్ఞాననేత్రముద్వారా వారిఅజ్ఞానాంధకారము తొలగిపోవును. అంతటవారు మిథ్యయైన ఈ సంసారసాగరమునుండి బయటపడెదరు. అజ్ఞానులు త్రాడును జూచి అది సర్పమని భ్రమింతురు. కాని (తత్త్వ) జ్ఞానులవలన యథార్థమును ఎఱిగిన పిదప వారికి సర్పభ్రాంతి తొలగిపోగా, వారు 'నిజముగా అది త్రాడు మాత్రమే' అని గ్రహింతురు. ఆవిధముగనే 'ఆత్మ పరమాత్మయే'యని ఎఱుగనివారికి సకల ప్రపంచము సత్యము అని తోచును. అప్పుడు తత్త్వజ్ఞానులద్వారా యథార్థము (ఆత్మపరమాత్మయేయని) తెలిసిన పిమ్మట వారికి ప్రపంచము 'మిథ్య' అని స్పష్టమగును. సంసారసంబంధములైన బంధమోక్షములు అజ్ఞానజనితములు. అవి జ్ఞానవిజ్ఞానములకు[2] సంబంధించినవికావు. సూర్యునకు అహోరాత్రములు లేనట్లుగా, పరిపూర్ణ జ్ఞానస్వరూపమగు ఆత్మయందు అజ్ఞానము లేకపోవుటచే బంధము ఉండదు, సుజ్ఞానములేనందున మోక్షము ఉండదు. మూఢులైనవారు ఆత్మవైన నిన్ను దేహాదికంబని తలంచుచు, శరీరేంద్రియాదులను నిన్నుగా తలంతురు. క్షేత్రక్షేత్రజ్ఞ విభాగజ్ఞానములేని ఆ మూఢులు తమ దేహములకు వెలుపల నిన్ను వెదకుచుందురు. అట్టివారియొక్క అజ్ఞానమును గూర్చి చెప్పవలసిన పనియేలేదు. ఆత్మానాత్మవివేకము గలవారు పరతత్త్వంబుగానట్టి జడశరీరములను నిషేధింతురు. (పంచకోశాత్మకమైన జడశరీరమునకు ప్రాధాన్యమును ఇయ్యరు.) అట్టి సత్పురుషులు తమ శరీరములయందు నిన్నే దర్శింతురు.

శా. దేవా! నీ చరణప్రసాద కణలబ్ధిం గాక లేకున్న నొం
డే వెంటం జను నీ మహామహిమ నూహింపంగ నెవ్వారికిన్
నీవారై చనువారిలో నొకఁడనై నిన్ గొల్చు భాగ్యంబు నా
కీవే యిప్పటి జన్మ మందయిన నొండెందైననోయీశ్వరా! 568

సర్వేశ్వరా! అందువలన ఎవ్వరైనను నీపాదసేవ చేయుటద్వారా లేశమాత్రమైనను నీ అనుగ్రహమును పొందినప్పుడే, ఊహలకు అతీతమైన నీ మహత్త్వమును తెలిసికొనగలుగుదురు. కాబట్టి ఈ జన్మయందుగాని, మఱియొక జన్మయందుగాని నన్ను నీ భక్తులలో ఒకడనై, నిన్ను సేవించుభాగ్యమును నాకు అనుగ్రహింపుము.

తరలము. క్రతుశతంబులఁ బూర్ణకుక్షివి కాని నీ విటు క్రేపులున్
సుతులు నై చనుఁబాలు ద్రావుచుఁ జొక్కి యాడుచుఁ గౌతుక
స్థితిఁ జరింపఁగఁ దల్లు లై విలసిల్లు గోవుల గోపికా
సతుల ధన్యత లెట్లు సెప్పఁగఁ జాలువాఁడఁ గృపానిధీ! 569

1. ప్రజ్ఞానంబ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, తత్త్వమసి, అహం బ్రహ్మోస్మి - అనునవి ఉపనిషత్తులలోని మహావాక్యములు.
2. 'జ్ఞానము = వేదాంతశాస్త్రజ్ఞానము, విజ్ఞానము = బ్రహ్మానుభూతివలన కలిగిన జ్ఞానము.

దయానిధీ! వందలకొలది యజ్ఞములయందలి హవిస్సులను ఆరగించినను నీ కడుపు నిండదు. (నీవు తృప్తిని పొందవు). కాని నీవు ఆవుదూడలరూపములను, గోపబాలురరూపములను ధరించి, ఆవులపాలను, గోపికల స్తన్యములను గ్రోలి పారవశ్యమును పొందుచు మిగుల కుతూహలముతో చరించితివి. అట్లు నీకు తల్లులై పాలిచ్చిన గోవులును, గోపికలును పొందిన భాగ్యమే భాగ్యము. వారి అదృష్టమును (ధన్యతను) నేను ఎంతని వర్ణింపగలను?

క. పరిపూర్ణంబుఁ బురాణముఁ, బరమానందంబునైన బ్రహ్మమె చెలికాఁ
డరుదరుదు నందఘోష, స్థిర జనములభాగ్యరేఖ చింతింపంగన్. 570

పరమాత్మ-పరిపూర్ణుడు (అంతటను నిండియుండువాడు) సనాతనుడు, ఆనందస్వరూపుడు. అట్టి పరమేశ్వరుడు నందునిపల్లెయందలి జనులకు చెలికాడై మసలుట పూర్వజన్మలలో వారు చేసికొనిన సుకృతఫలము. ఇది మిగుల ఆశ్చర్యకరము. సృష్టికర్తనైన నేనును వీరి అదృష్టములను వర్ణింపజాలను.

సీ. ఏకాదశేంద్రియాధీశులు చంద్రాదు లేను ఫాలాక్షుండు నిట్టు సూడఁ
బదుమువ్వురము నెడపడక నింద్రియపాత్రముల నీ పదాంభోజముల మరంద
మమృతంబుగాఁ ద్రావి యమర నేకైకేంద్రియాభిమానులమయ్యు నతికృతార్థ
భావుల మైతిమి పరఁగ సర్వేంద్రియ వ్యాప్తులు నీ మీఁదవ్రాల్చి తిరుగు
తే. గోప గోపికా జనముల గురు విశిష్ట భాగ్యసంపదఁ దలపోసి ప్రస్తుతింప
నలవిగాదెవ్వరికినైన నంబుజాక్ష! భక్తవత్సల! సర్వేశ! పరమపురుష! 571

సర్వేశ్వరా! పురుషోత్తమా! భక్తవత్సలా! కమలనేత్రా! అంతరింద్రియములైన మనస్సు, బుద్ధి, అహంకారములకును, ఐదు జ్ఞానేంద్రియములకును, ఐదు కర్మేంద్రియములకును అధిపతులమైన చంద్రాదులు, విధాతనైన నేను, త్రినేత్రుడైన శంకరుడు (మేము పదముగ్గురము) మా ఇంద్రియములనెడి పాత్రలద్వారా (ఒక్కొక్కరము ఒక్కొక్క ఇంద్రియముద్వారా) నీ పాదపద్మముల యందలి మకరందము అనెడి అమృతమును త్రావి, కృతార్థతను భజించుచున్నాము (కృతార్థులమై పరవశించిపోవుచున్నాము) ఏకైకేంద్రియాభిమానులమైన మేమే ఇట్టి పరమానందమును పొందుచుండగా, సర్వేంద్రియములతో నిన్నే సేవించుచు, ఆనందామృతమును గ్రోలుచున్న ఆ గోపగోపీజనులయొక్క విశిష్టమైన మహద్భాగ్యసంపదను ప్రస్తుతించుట ఎవరికి సాధ్యమగును?

శా. ఏలా బ్రహ్మపదంబు వేదములకున్ వీక్షింపఁగా రాని ని
న్నీ లోకంబున నీ వనాంతరమునందీమందలోఁ గృష్ణ యం
చాలాపాది సమస్తభావములు నీయందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాదరేణువులపై వేష్టించినం జాలదే. 572

ప్రభూ! వేదములన్నియును నిన్నుగూర్చి, నీ వైభవములనుగుఱించి వేనోళ్ల ప్రస్తుతించుచున్నవి. కాని నిన్ను దర్శించుభాగ్యమునకు మాత్రము అవి నోచుకొనుటలేదు. కాని ఈ భూలోకమున ఈ వనములలో ఈ గోకులమునగల గోపాలురు, గోపికలు 'కృష్ణా! కృష్ణా! అని సర్వాత్మనా నిన్నే కీర్తించుచు, తమ సర్వస్వమును నీకే సమర్పించుకొనుచు ధన్యులగుచున్నారు. ఈ గోపకులలో ఏ ఒక్కని పాదరేణువునైనను నా శిరమున ధరింపగల్గినచో నేను కృతార్థుడను అగుదును. దానిని మించి ఈ బ్రహ్మపదవినిగూడ నేను కోరను.

మ. నిను హింసించిన పూతనాదులకు మున్ నీమేటి సంకేత మి
చ్చిన నీకుం బుర దార పుత్ర గృహ గో శ్రీ ప్రాణ దేహాదు లె
ల్లను వంచింపక యిచ్చు గోపకులకున్ లక్షింప నేమిచ్చెదో
యని సందేహము దోఁచుచున్నది ప్రపన్నానీకరక్షామణీ! 573

నిన్ను శరణుజొొచ్చినవారిని రక్షించుటలో మేటివైన కృష్ణా! నిన్ను చంపదలచివచ్చిన పూతన మొదలగు రాక్షసులకును మోక్షమును ప్రసాదించితివి. ఇక తమ పురములను, భార్యాపుత్రులను, గృహములను, గోసంపదను, దేహములను, కడకు తమ ప్రాణములను సైతము నీకే అర్పించిన ఈ గోపాలురకు నీవు అంతకంటెను మించిన ఎట్టి ఉన్నతస్థానమును అనుగ్రహింతువో నేను ఎఱుగజాలను.

క. దేహము కారాగేహము, మోహము నిగళంబు రాగముఖరములు రిపు
వ్యూహములు భక్తితో ని, న్నూహింపని యంత తడవు నో కమలాక్షా! 574

కమలనేత్రా! భక్తితో నిన్ను స్మరింపనంతవఱకును (స్మరింపనివారికి) దేహము చెఱసాలయేయగును, ఆలు, బిడ్డలపైగల మోహములు, సంకెళ్లవలె బంధించును. రాగద్వేషాదులు శత్రువులవ్యూహములలో చిక్కులపాలు చేయును. కనుక నిన్ను అనన్యభక్తితో సేవించుటయే తరణోపాయము.

ఆ. ఆశ్రయించు జనులకానందసందోహ మీఁ దలంచి వివిధ హేలతోడ
నప్రపంచకుండ వయ్యుఁ బ్రపంచంబు వెలయఁజేయుదీవు విశ్వమూర్తి! 575

విరాట్పురుషా! నిన్ను ఆశ్రయించెడివారిని నీ వివిధ లీలావిలాసాదులతో ఆనందింపజేయ దలంతువు. అందులకై నీవు ప్రపంచమునకు అతీతుడవయ్యును ఈ ప్రపంచమును సృజించి, దానిని ప్రకాశింపజేయుచుందువు.

క. ఎఱిఁగినవారి యెఱుంగమి,యెఱుఁగమె బహుభాషలేల యీశ్వర! నీపెం
పెఱుఁగ మనో వాక్కులకున్, గుఱిసేయం గొలఁది గాదు గుణరత్ననిధీ! 576

అద్భుతములైన గుణములనెడి రత్నములకు నిధివైన కృష్ణా! నిన్ను గూర్చి పూర్తిగా ఎఱిగినవారుగా విఱ్ఱవీగెడి పండితమ్మన్యుల యొక్క అజ్ఞానము లోకప్రసిద్ధము. దానిని గూర్చి చెప్పనేల? నిన్ను గూర్చి తెలిసికొనుటకు మనస్సునకును, వాక్కులకును సాధ్యముగాదు.

క. సర్వము నీవ యెఱుంగుదు, సర్వవిలోకనుఁడవీవ జగదధిపతివిన్
సర్వాపరాధు నన్ను నో, సర్వేశ! యను గ్రహింపు చనియెద నింకన్. 577

సర్వేశ్వరా! నీవు ఈ జగత్తునకు అధిపతివి, ఈ లోకమునందలి అన్ని సంఘటనలను చూడగలవాడవు. కనుక నీవు ఎఱుగని విషయమే ఉండదు. నేను అన్నివిధములుగా అపరాధిని. దయానిధీ! నన్ను అనుగ్రహింపుము. నీ సెలవైనచో ఇంక నేను వెళ్లెదను.

క. జిష్ణు!నిశాట విపాటన!వృష్ణి కులాంభోజసూర్య! విప్రామర గో
వైష్ణవసాగర హిమకర!, కృష్ణా!పాషండ ధర్మ గృహదావాగ్నీ! 578

వ. దేవా! నీకుఁ గల్పపర్యంతంబు నమస్కరించెద నని యి వ్విధంబున సంస్తుతించి ముమ్మాఱు వలగొని, పాదంబులపై బడి వీడ్కొని, బ్రహ్మ తన నెలవునకుంజనియె. అతని మన్నించి, భగవంతుండైన హరి, తొల్లి చెడి తిరిగివచ్చిన వత్సబాలకులం గ్రమ్మఱం గైకొని, పులినంబుకడఁ జేర్చె నిట్లు. 579

కృష్ణా! నీవు జయశీలుడవు. రాక్షసులను చీల్చిచెండాడెడివాడవు, వృష్ణివంశమనెడి కమలమునకు సూర్యుడవు, (వృష్ణివంశమును వికసింపజేయువాడవు) బ్రాహ్మణులు, దేవతలు, గోవులు మున్నగు విష్ణుసేవాతత్పరులనెడి సాగరమునకు చంద్రునివంటివాడవు. (నిన్ను సేవించువారిని అందఱిని ఆనందింపజేయువాడవు). వేదవిరుద్ధములైన మతములను (నాస్తికవాదములను) నాశమొనర్చువాడవు. దేవా! కల్పాంతమువఱకును నీకు ప్రణమిల్లుచుందును" అని ప్రస్తుతించి, బ్రహ్మదేవుడు శ్రీకృష్ణునకు ముమ్మాఱు ప్రదక్షిణపూర్వకముగా సాష్టాంగపడెను. ఆ ప్రభువు ఆయనను క్షమించెను. ఆ స్వామిని వీడ్కొని బ్రహ్మ సత్యలోకమునకు వెళ్లెను. పిదప శ్రీకృష్ణుడు బ్రహ్మ మాయనుండి బయటపడి వచ్చిన ఆవుదూడలను, గోపబాలురను మఱల ఇసుకతిన్నెలకడకు చేర్చెను.

క. క్రించుతనంబున విధి తము, వంచించినయేఁడు గోపవరనందను లొ
క్కించుక కాలంబుగ నీ, క్షించిరి రాజేంద్ర! బాలకృష్ణుని మాయన్. 580

ఆ ఏమహాత్ము మాయ నీ విశ్వమంతయు మోహితాత్మకమయి మునిఁగియుండు
నట్టి విష్ణుమాయ నర్భకులొక్కయేఁ డెఱుఁగకుండిరనుట యేమి వెఱగు 581

పరీక్షిన్మహారాజా! బ్రహ్మదేవుడు అల్పబుద్ధితో తమను మాయతో ఉంచిన ఏడాదికాలమును గోపబాలురు బాలకృష్ణుని ప్రభావమున క్షణకాలముగా తలంచిరి. గోపబాలకులు ఒక సంవత్సరము గడచిపోయినను (బ్రహ్మ మాయలోపడియున్నను) విష్ణువు ప్రభావమున వారు ఆ సంగతినే ఎఱుగకుండిరి. ఏలననగా ఆ మహాత్ముని మాయకు ఈ విశ్వమంతయును మోహములో మునిగియుండునుగదా! ఇందు ఆశ్చర్యపడవలసినదే లేదు.

వ. అప్పుడు. 582

మ. చెలికాఁడా! యరుదెంచితే యిచటికిన్ సేమంబునం గ్రేపులున్
నెలవుల్ సేరె నరణ్యభూమి వలనన్ నీ వచ్చువందాఁకఁ జ
ల్దులు వీరించుక యెవ్వరుం గుడువరాలోకింపు రమ్మంచు నా
జలజాక్షుండు నగన్ భుజించిరచటన్ సంభాషలన్ డింభకుల్. 583

ఆ సమయమున గోపబాలకులు శ్రీకృష్ణునితో ఇట్లు నుడివిరి. "మిత్రమా! క్షేమముగా మా కడకు చేరితివిగదా! అదే! పదివేలు. దూడలును ఇచటికి చేరినవి. నీవు వనములనుండి ఇచటి చేరెడివఱకు నీకొఱకై నిరీక్షించు మేము ఎవ్వరమూ చల్దులను ఆరగింపకుంటిమి. చూడుము. అది సరే! రమ్ము రమ్ము" వారి అమాయకవచనములకు శ్రీకృష్ణుడు ఎంతయు నవ్వుకొనెను. పిమ్మట వారందఱును హాయిగా మాట్లాడుకొనుచు చల్దులను ఆరగించిరి.

వ. ఇట్లు బాలకులతోడఁ, జల్ది గుడిచి, వారలకు నజగరచర్మంబు సూపుచు వనంబున నుండి తిరిగి. 584

ఈవిధముగా బాలకృష్ణుడు తన తోడిబాలకులతో చల్దులను తిన్నపిమ్మట వారికి కొండచిలువచర్మమును చూపించుచు వనమునుండి ఇంటికి మఱలెను.

పంచచామరము. ప్రసూన పింఛమాలికా ప్రభా విచిత్రి తాంగుఁడుం
బ్రసిద్ధ శృంగ వేణునాద పాశబద్ధ లోకుఁడుం
బ్రసన్న గోపబాల గీత బాహువీర్యుఁడయ్యు ను
ల్లసించి యేఁగె గోపకుల్ సెలంగి చూడ మందకున్. 585

పూలమాలలను, నెమలిపింఛమును ధరించియున్న ఆ చిట్టికృష్ణుడు వివిధకాంతులతో ఎంతయు మెఱసిపోవుచుండెను. అతడు అద్భుతములైన కొమ్మబూరనాదములు, మధురములైన మురళీరవములు అనెడి పాశములతో లోకములను పరవశింపజేయువాడు. గోపబాలురు మనోహరములైన గీతములతో ఆ బాలకృష్ణుని బాహుబలపరాక్రమములను కొనియాడుచుండిరి. అప్పుడు గోపబాలకులు ఉల్లాసముతో చూచుచుండగా కన్నయ్య వారితోగూడి గొల్లపల్లెకు చేరెను.

వ. ఆ సమయంబున. 586

క. పెనుఁబాము తమ్ము మ్రింగిన, మన నందసుతుండు పాము మర్దించి మమున్
మనిచె నరణ్యము లోపల, నని ఘోషించిరి కుమారులాఘోషములోన్. 587

అట్లు పల్లెకు చేరిన పిమ్మట గోపకుమారులు "అరణ్యములో ఒక కొండచిలువ మమ్ములను మ్రింగివేసినది. అంతట శ్రీకృష్ణుడు ఆ మహాసర్పమును చావగొట్టి మమ్ములను రక్షించెను' అని ఆ పల్లెయందు అంతటను చాటిరి.

వ. అనిన విని నరేంద్రుం డిట్లనియె. 588

క. కని మనిచి యెత్తి పెంచిన తమజన్ములకంటె నందతనయుండా ఘో
ష నివాసులకు మనోరం, జనుఁ డెట్లయ్యెను బుధేంద్ర చను నెఱిఁగింపన్. 589

వ. అనిన శుకుం డిట్లనియె. 590

తదనంతరము పరీక్షిన్మహారాజు శుకయోగితో ఇట్లనెను. "మహాత్మా! ఆమందలోని గోపాలుందఱికిని తమకన్న సంతానముకంటెను నందతనయుడైన శ్రీకృష్ణుడే ప్రీతిపాత్రుడు ఎట్లయ్యెను? దయతో తెలుపుము".అంతట శుకమహర్షి ఆ రాజుతో ఇట్లనెను.

సీ. అఖిల జంతువులకు నాత్మవల్లభుఁడైన భంగి బిడ్డలు నిండ్లుఁ బసిఁడి మొదలు
వస్తువు లెవ్వియు వల్లభంబులు గావు సకలాత్మకుండైన జలజనేత్రుఁ
డఖిలజంతువులకు నాత్మ గావున ఘోషవాసులకెల్లను వల్లభత్వ
మునను మిక్కిలి యొప్పె మూఁడు లోకములకు హితము సేయఁగ జలజేక్షణుండు
ఆ. మాయతోడ మూర్తిమంతుఁడై యొప్పారుఁ గలఁ డతండు నిఖిల గణములందు
భవతి ధాతు వెట్లు భావార్థమై సర్వధాతుగణమునందుఁ దనరు నట్లు 591

"రాజా! సమస్తప్రాణులకును తమబిడ్డలు, నివాసములు (గృహములు) బంగారము మొదలగు వస్తువులకంటె తమ 'ఆత్మ'యే మిక్కిలి ప్రీతికరము. సర్వాంతర్యామియైన శ్రీహరి (శ్రీకృష్ణుడు) సకలప్రాణులకును ఆత్మస్వరూపుడుగావున ఆ పల్లెవాసులకు అందఱికిని మిగుల ప్రేమాస్పదుడయ్యెను. ముల్లోకములకును శ్రేయస్సును గూర్చువాడైన ఆ శ్రీహరి (కృష్ణుడు) తన మాయావిలాసములతో భౌతికశరీరముతో అవతరించుచుండును. భూధాతువు (భవతి) అన్ని క్రియాపదములలో అంతర్లీనమైయుండునట్లు కమలాక్షుడు సమస్త చరాచరప్రాణులయందును విలసిల్లుచుండును.

క. శ్రీపతి పదమను నావను, బ్రాపించి భవాబ్ధివత్సపదముగ ధీరుల్
రూపించి దాఁటి చేరుదు, రాపత్పదరహితులగుచు నమృతపదంబున్. 592

ధీరులు (జ్ఞానులు) శ్రీహరిపాదము అనెడి నావను ఆశ్రయించి, సంసారమనెడి సముద్రమును గోష్పాదమంత స్థలమునువలె దాటెదరు. ఆ విధముగా దైవానుగ్రహమునకు పాత్రులైనట్టి ఆ ధీరులు ఎట్టి ఆపదలకును లోనుగాక పరంధామమును చేరుదురు.

ఆ. అఘునిఁ జంపి కృష్ణుఁ డాప్తులుఁ దానును జల్ది గుడిచి జలజ సంభవునకుఁ
జిద్విలాస మైన చెలువుఁ జూపినకథఁ జదువ వినినఁ గోర్కి సంభవించు. 593

కొండచిలువ రూపములో వచ్చిన అఘాసురుని చంపి, శ్రీకృష్ణుడు తోడిబాలురతోగూడి చల్దులను ఆరగించెను. అంతేగాక ఆ మహాత్ముడు బ్రహ్మకు తనలీలావిలాసములను చూపి ఆయనకు కనువిప్పు కలిగించెను. ఈ ఘట్టమునుచదివినవారి, వినినవారియొక్క కోరికలు సఫలములగును".

## శ్రీకృష్ణుడు గోపాలురతోగూడి పశువులను మేపుటకై అడవికి వెళ్లుట

వ. అని చెప్పి మఱియు, వ్యాసనందనుం డిట్లనియె. 594

క. రాగంబున బలకృష్ణులు, పొగండ వయస్కులగుచుఁ బశుపాలకతా
యోగంబున బృందావన, భాగంబునఁ గాచి రంతఁ బశువుల నధిపా! 595

పిమ్మట ఆ శుకయోగి ఆ మహారాజుతో ఇంకను ఇట్లు నుడివెను. పౌగండవయస్సునకు చేరిన బలరామకృష్ణులు అన్యోన్యానురాగములతో ఒప్పుచు గోపాలకులగూడి పశువులను (గోవులను) మేపుచు బృందావనమున విహరింపసాగిరి.

వ. అయ్యెడఁ గృష్ణుం డొక్కనాఁడు రేపకడ లేచి, వేణువు పూరించి, బలభద్ర సహితుండై, గోపకుమారులు దన్ను బహువారంబులు కైవారంబులు సేయ, మ్రోల నాలకదుపుల నిడికొని, నిరంతర ఫల కిసలయ కుసుమంబును, గుసుమమకరంద నిష్యందపానానందదిందిందిరకదంబంబును, కదంబాది నానా తరులతా గుల్మ సంకులంబును, గులవిరోధ రహిత మృగ పక్షి భరితంబును, భరితసరస్సరోరుహ పరిమళిత పవనంబును నయిన వనంబుఁ గని, యందు వేడుకం గ్రీడింప నిశ్చయించి, వెన్నుఁడన్నకిట్లనియె. 596

అంతట శ్రీకృష్ణుడు ఒకనాడు వేకువజాముననే లేచి వేణునాదమొనర్చెను. ఆ మురళీరవమునకు గోపకుమారులు బలరాముడు మేల్కొని ఆ కన్నయ్య కడకు చేరిరి. పిదప గోపబాలురు పలువిధముల శ్రీకృష్ణుని ప్రస్తుతించిరి. అనంతరము వారు అందఱును ఆవులమందలను తోలుకొనిపోవుచు కొంతతడవునకు ఒక వనమును జూచిరి. ఆ వనము నిరంతరము కమ్మని ఫలములతోను, చక్కని పూవులతోడను విరాజిల్లుచుండెను. అచటి పూదేనెలను గ్రోలుచు తుమ్మెదలగుంపులు మిగుల ఆనందించుచుండెను. ఆ వనము కడిమి మొదలగు చెట్లతో, లతలతో, పొదలతో నిండియుండెను. అందలి మృగములు, పక్షులు జాతివైరములను మాని, స్వేచ్ఛగా సంచరించుచుండెను. అచటి సరస్సులయందు నిండారియున్న కమలములు కనువిందు గావించుచుండెను. వాటిమీదుగా ప్రసరించుచున్న వాయువులు సువాసనలను వెదజల్లుచుండెను. అట్టి వనమును గాంచి, శ్రీకృష్ణుడు క్రీడింప వేడుకపడి అన్నతో ఇట్లనెను.

శా. శాఖా పుష్ప ఫల ప్రభార నతలై చర్చించి యో దేవ! మా
శాఖిత్వంబు హరింపు మంచు శుకభాషన్ నీ కెఱింగించుచున్
శాఖాహస్తములఁ బ్రసూన ఫలముల్ సక్కన్ సమర్పించుచున్
శాఖి శ్రేణులు నీ పదాబ్జముల కోజన్ మ్రొక్కెడిం జూచితే. 597

"అన్నా! వరుసగానున్న ఈ వృక్షములను చూడుము. వీటికొమ్మలు గుత్తులు గుత్తులుగా నున్న పుష్పములతో, పండ్లతోగూడి వాటి భారముచే మిగుల వంగియున్నవి. ఇవి తమ కొమ్మలనెడి చేతులతో పూవులను, ఫలములను నీకు ప్రేమతో సమర్పించుచు 'దేవా! మా వృక్షజన్మలను తొలగించి ఉత్తమజన్మలను ఇమ్ము!' అని తమ చిలుకపలుకులతో సవినయముగా నిన్ను వేడుకొనుచు నీ పాదపద్మములకు మ్రొక్కుచున్నట్లున్నవి. గమనించితివా?

సీ. నిఖిలపావనమైన నీకీర్తిఁబాడుచు నీ తుమ్మెదలు వెంట నేఁగుదెంచె
నడవిలో గూఢుండవైన యీశుఁడవని మునరి కొల్వఁగ వచ్చె మునిగణంబు
నీలాంబరముతోడ నీవు జీమూతమవని నీలకంఠంబులాడఁ దొడఁగెఁ
బ్రియముతోఁజూచు గోపికలచందంబున నినుఁజూచెనదె హరిణీచయంబు
ఆ. నీవు వింద వనుచు నిర్మల సూక్తులు వలుకుచున్న విచటఁ బరభృతములు
నేఁడు విపినచరులు నీవు విచ్చేసిన ధన్యు లైరి గాదె తలఁచి చూడ. 598

అగ్రజా! తుమ్మెదలు ఎంతయు పావనమైన నీ కీర్తిని ప్రస్తుతించుచు నీవెంట వచ్చుచున్నవి. ఈ వనమునందలి మునులందఱును - నీవుమాఱురూపములోనున్న పరమేశ్వరుడవు' అని భావించి నిన్ను సేవించుటకై వచ్చి నీ చుట్టును చేరియున్నారు.నల్లని వస్త్రములను ధరించిన నిన్నుగాంచి, 'మేఘము' అని తలంచి, నెమళ్లు నృత్యము చేయుచున్నవి. ప్రేమతో జూచెడి గోపికలవలె ఇచటగల లేళ్లగుంపులు నీవైపు అనురాగముతో కనులార చూచుచున్నవి. కోకిలలు నిన్ను అతిథిగా భావించి తమ మధురస్వరములను వినిపించుచు గౌరవించుచున్నవి. ఇచటి వనచరులందఱును నీ రాకతో ఎంతయు ధన్యులైరి సుమా!

సీ. నీ పాదములు సోఁకి నేఁడు వీరుత్తృణ పుంజంబుతో భూమి పుణ్యయయ్యె
నీనఖంబులు దాఁకి నేఁడు నానాలతా తరుసంఘములు కృతార్థంబు లయ్యె
నీకృపాదృష్టిచే నేఁడు నదీ శైల ఖగ మృగంబులు దివ్యకాంతిఁ జెందె
నీ పెన్నురము మోవ నేఁడు గోపాంగనా జనముల పుట్టువు సఫలమయ్యె
ఆ. నని యరణ్యభూమి నంకించి పసులను మిత్రజనులు దాను మేపుచుండి
నలినలోచనుండు నదులందు గిరులందు సంతసంబు మెఱయ సంచరించె. 599

సోదరా! గుబురుగా పచ్చికబయళ్లతో విలసిల్లుచున్న ఈ వనభూమి నీ పాదముల స్పర్శతో నేడు పావనమయ్యెను. వివిధములగు లతలు, వృక్షములు నీ నఖములు తాకినంతనే కృతార్థములైనవి. ఇచటి నదులు, కొండలు, పక్షులు, మృగములు నీ కృపాదృష్టి ప్రసరించినంతనే దివ్యకాంతులతో తేజరిల్లుచున్నవి. విశాలమైన నీ వక్షస్థలమున చేరుటతో గోపికలజన్మలు సఫలములయ్యెను" అని ఆ వనభూమియందు శ్రీకృష్ణుడు బలరాముని ప్రశంసించెను. ఆ స్వామి మిత్రులతో గూడి పశువులను మేపుచు నదీతీరములయందును, కొండలపైనను హాయిగా సంచరించెను.

వ. మఱియు నయ్యీశ్వరుండు. 600

సీ. ఒకచోట మత్తాళియూథంబు ఝమ్మని మ్రోయంగ ఝమ్మని మ్రోయుచుండు
నొకచోటఁ గలహంసయూథంబుగూడి కేంకృతులు సేయంగఁ గేంకృతులు సేయు
నొకచోట మదకేకియూథంబులాడంగ హస్తాబ్జములు ద్రిప్పి యాడఁ దొడఁగు
నొకచోట వనగజయూథంబు నడవంగ నయముతో మెల్లన నడవఁ జొచ్చుఁ
ఆ. గ్రౌంచ చక్ర ముఖర ఖగములొక్కొకచోటఁ బలుక వానియట్ల పలుకుఁ గదిసి
పులుల సింహములను బొడగని యొకచోటఁ బఱచు మృగములందుఁ దఱచు గూడి. 601

అచట శ్రీకృష్ణుడు ప్రదర్శించిన లీలలు అద్భుతములు. ఒక ప్రదేశమునందు మదించిన తుమ్మెదల గుంపులు ఝుంకారములు చేయుచుండగా కృష్ణప్రభువుగూడ ఝుం, ఝుమ్మని పలుక దొడంగెను. మఱియొకచోట హంసల

సమూహములు క్రేంకారములు సల్పుచుండగా తానును అట్లే చేయసాగెను. వేఱొక ప్రదేశమున మదించిన నెమళ్లు నృత్యములు చేయుచుండగా తానుగూడ అట్లే అభినయించుచు ఆడుచుండెను. ఇంకొకచోట అడవి ఏనుగులు గంభీరముగా నడచుచుండుట గాంచి అతడును నేర్పుతో ఆ విధముగనే అడుగులిడుచుండెను. క్రౌంచపక్షులు, చక్రవాకములు, మొదలగు పక్షులు కావించు మధురాలాపములను గమనించి, ఆ స్వామియు వాటిని సమీపించి మధురవచనములు పలుకుచుండెను. పులులయొక్క, సింహముయొక్క కదలికలను గమనించి, లేళ్లు పఱుగులు దీయుచుండగా తానును ఆ గుంపులలో జేరి పరుగిడుచుండెను.

వ. మఱియును. 602

సీ. రా పూర్ణచంద్రిక! రా గౌతమీగంగ! రమ్ము భగీరథరాజ తనయ!
రా సుధాజలరాశి! రా మేఘబాలిక! రమ్ము చింతామణీ! రమ్ము సురభి!
రా మనోహారిణీ! రా సర్వమంగళ! రా భారతీదేవి! రా ధరిత్రి!
రా శ్రీమహాలక్ష్మి! రా మందమారుతి! రమ్ము మందాకిని! రా శుభాంగి!
ఆ. యనుచు మఱియుఁ గలుగు నాఖ్యలు గల గోవులడవిలోన దూరమందు మేయ
ఘన గభీరభాషఁ గడు నొప్పఁజీరు నాభీరజనులు బొగడఁ బెంపు నెగడ. 603

ఇంకను ఆ చిట్టికృష్ణుడు దూరప్రదేశములయందు మేయుచున్న గోవులను వివిధములగు పేర్లతో ఇట్లు పిలుచుచుండెను - "పూర్ణచంద్రికా! గౌతమీ! గంగా! భాగీరథీ! సుధాజలరాశీ! మేఘబాలికా! చింతామణీ! సురభీ! మనోహారిణీ! సర్వమంగళా! భారతీదేవీ! ధరిత్రీ! శ్రీమహాలక్ష్మీ! మందమారుతీ! మందాకినీ! శుభాంగీ!" మొదలగు పేర్లతో వాటిపై అనురాగమును చూపుచు గంభీరముగా పిలుచుచుండెడివాడు. ఆ విచిత్రరీతికి గోపాలురు ఎల్లరును అబ్బురపడుచు ఆయనను ఎంతయు మెచ్చుకొనుచుండిరి.

క. కాంతారవిహారమ్మున, శ్రాంతుండై గోపకాంకశయుఁడగు నన్నన్
సంతుష్టిఁ బొందఁజేయు ని, రంతర కర చరణ మర్దనాదుల నధిపా! 604

పరీక్షిన్మహారాజా! బలరాముడు ఆ వనప్రదేశములలో ఆవులవెంట తిరిగి తిరిగి అలసిపోయి, గోపబాలుర ఉత్సంగములలో (తొడలపై) పండుకొని విశ్రాంతి తీసికొనుచుండెను. అప్పుడు శ్రీకృష్ణుడు తన అన్నకు పూర్తిగా బడలికలు తొలగిపోవునట్లు ఆయనయొక్క కాళ్లు, చేతులు ఒత్తుచు తన సేవలతో ఆయనకు సంతుష్టిని గూర్చుచుండెను.

క. పాడుచు నాడుచు ముచ్చట, లాడుచు నొండొరులఁ దాఁకు నాప్తులఁ గని బి
ట్టాడుచుఁ జేతుల వ్రేయుచుఁ, గ్రీడింతురు నగుచు బలుఁడు గృష్ణుఁడు నొకచోన్. 605

తమ ఆప్తులైన గోపబాలురు ఆటలు ఆడుచు, పాటలు పాడుచు, ముచ్చట్లు చేయుచు, ఒకరినొకరు తాకుచు విహరించుచుండుట చూచి బలరామకృష్ణులు ఆనందించుచుండిరి. వారును వేడుకపడుచు తమ మిత్రులతో ఆటపాటలలో పాల్గొనుచు, ఒకరిపై మఱియొకరు చేతులు వేసికొనుచు విహరించుచుండిరి.

వ. ఇ వ్విధంబున. 606

సీ. వేదాంత వీథుల విహరించు విన్నాణి విహరించుఁ గాంతార వీథులందు
ఫణిరాజశయ్యపైఁ బవళించు సుఖభోగి పల్లవశయ్యలఁ బవ్వళించు
గురుయోగిమానసగుహలఁ గ్రుమ్మరు మేటి గ్రుమ్మరు నద్రీంద్ర గుహలలోనఁ
గమలతోడఁ బెనంగి కడు డయ్యు చతురుఁ డాభీరజనులతోడఁ బెనఁగి డయ్యు

ఆ. వఖిలలోకములకు నాశ్రయుండగు ధీరుఁ డలసి తరులనీడ నాశ్రయించు
యాగభాగచయములాహరించు మహాత్ముఁ డడవిలోని ఫలములాహరించు. 607

ఉపనిషన్మార్గములలో విహరించెడి (ఉపనిషత్తులచేత ప్రస్తుతింపబడెడి) శ్రీకృష్ణపరమాత్మ ఈ విధముగా వనవీథులలో సంచరించుచుండెను. ఆదిశేషుని తల్పముగా (శయ్యగా) చేసికొని హాయిగా శయనించుచుండెడి శ్రీహరి ఇక్కడ చిగురుటాకుల శయ్యలపై పవళించుచుండెను. యోగీశ్వరులమనస్సులనెడి గుహలలో మసలుచుండెడి మహాత్ముడు మహాపర్వతగుహలలో నడయాడుచుండెను. లక్ష్మీదేవితో జేరి సరససల్లాపములతో వినోదించుచు అలసిపోవుచుండెడి మాధవుడు గోపబాలురతోగూడి ఆటలాడుచు డస్సిపోవుచుండెను. సకలలోకములకును ఆశ్రయుడైన పరమాత్మ నేడు ఆటపాటలలో అలసిపోయి, చెట్లనీడలను ఆశ్రయించుచుండెను. యజ్ఞములయందలి హవ్యములను సేవించెడి పురుషోత్తముడు నేడు అడవులలోని పండ్లను ఆరగించుచుండెను.

వ. ఆ సమయంబున. 608

సీ. అలసినచోఁ గొందఱతిమోదమున వీఁపు లెక్కించుకొని పోదురేపుమెఱసి
సొలసి నిద్రించినచో నూరుతల్పంబులిడుదురు కొందఱు హితవుగలిగి
చెమరించి యున్నచోఁ జిగురుటాకులఁ గొందఱొయ్యన విసరుదురుత్సహించి
దవ్వేగి నిలుచుచోఁ దడయక గొందఱు పదములొత్తుదురతిబాంధవమున
ఆ. గోపవరులు మఱియుఁ గొందఱు ప్రియమున మాధవునకుఁ బెక్కు మార్గములను
బనులు సేసిరెల్ల భవములఁ జేసిన పాపసంచయములు భస్మములుగ. 609

ఆ సమయమున శ్రీకృష్ణుడు అలసిపోవునప్పుడు గోపబాలురు ఆయనను మిక్కిలి సంతోషముతో తమ వీపులపై ఎక్కించుకొని ఆనందించుచుండిరి. ఆ చిట్టికృష్ణుడు అలసిసొలసి నిద్రించుచుండునప్పుడు ఆయన సుఖనిద్రకొఱకై వారు తమ తొడలపై పరుండబెట్టుకొనుచుండిరి. ఆయనశరీరము చెమర్చినప్పుడు వారు చిగురుటాకులను చేబూని ఉత్సాహముతో విసరుచుండిరి. ఎక్కువదూరము తిరిగి అలసటతో నిలబడినప్పుడు వారు మిగుల ఆత్మీయతతో ఆ ప్రభువునకు పాదసేవలు చేయుచుండిరి. బుద్ధిమంతులైన గోపబాలురు తమ పూర్వజన్మలలోని పాపములన్నియు పటాపంచలై పోవుటకై ఆ ప్రభువునకు ఇట్లు పలురీతులుగా సేవలొనర్చుచుండిరి.

వ. ఆ య్యవసరంబున శ్రీదాము నామధేయుండైన గోపాలకుండు రామకేశవులం జూచి యిట్లనియె. 610

అంతట 'శ్రీదాముడు' అనుపేరుగల గోపబాలుడు శ్రీకృష్ణబలరాములతో ఇట్లు పలికెను.

## గర్దభాకారుండైన ధేనుకాసురుని బలభద్రుడు వధించుట

క. దూరంబునఁ దాలతరు, స్ఫారంబగు వనము గలదు పతితానుపత
ద్భూరి ఫలసహిత మది యే, ధీరులుఁ సార వెఱతురందు ధేనుకుఁడుంటన్. 611

వ. ఆ ధేనుకాసురుండు మహా శూరుండును ఖరాకారుండునునై, సమాన సత్త్వ సమేతులైన జ్ఞాతులుం, దానును, మనుష్యులంబట్టి, భక్షించుచుండు. అయ్యెడఁ బరిమళో పేతంబు లైన నూతన ఫలవ్రాతంబు లసంఖ్యాకంబులుఁ గలవు వినుఁడు. 612

"మిత్రులారా! ఇచటికి కొంతదూరమున ఒక వనముగలదు. అది తాటితోపులతో నిండియున్నది. ఆ తాటిచెట్లనుండి ఎల్లప్పుడు పండ్లురాలుచునే యుండును. ఆ వనమునందు ధేనుకాసురుడు నివసించుచుండుటచే ధీరులు సైతము

అందు కాలుమోపుటకు వెఱతురు - ఆ రాక్షసుడు గాడిదరూపమున ఉండును, మహాశూరుడు - తనతో సమానమగు బలశాలులైన తోడివారితోగూడి, మనుష్యులను పట్టుకొని భక్షించుచుండును ఆ వనమునందు ఎప్పటికప్పుడు బాగుగా పండిన ఫలములు రాలి రాసులు రాసులుగా పడియుండును. అవి సువాసనలను వెదజల్లుచుండును.

క. ఫలగంధము నాసాపుట, ములఁ జొచ్చి కలంచి చిత్తములఁ గొనిపోయెన్
ఫలముల నమలింపుడు మము, బలియురకును మీకు దైత్య భటులడ్డంబే 613

ఆ పండ్ల గుబాళింపులు మా ముక్కులకు తృప్తిని (హాయిని) గొల్పుచుండగా, వాటిని తినుటకై మా మనస్సులు ఉవ్విళ్లూరుచున్నవి. మీరు ఆ రాక్షసులబాధను తొలగించినచో మేము హాయిగా (నిర్భయముగా) ఆ పండ్లను తిందుము. మీ బలపరాక్రమములముందు ఆ అసురులు ఏపాటి?".

వ. అని పలికిన చెలికానిపలుకులాదరించి, విని నగి, వారుమం, దారును నుత్తాలంబగు తాలవనంబునకుం జని యందు. 614

క. తత్తఱమున బలభద్రుఁడు, తత్తాలానోకహములఁ దన భుజబలసం
పత్తిఁ గదల్చుచు గ్రక్కున, మత్తేభముభంగిఁ బండ్లు మహిపై రాల్చెన్. 615

కృష్ణబలరాములు శ్రీదామునిమాటలను శ్రద్ధగావిని నవ్వుకొనిరి. పిదప వారు తమ మిత్రులతోగూడి ఆ తాటి వనమునకు చేరిరి. అందు అంతటను మిగుల ఎత్తైన తాటిచెట్లు ఏపుగా పెఱిగియుండెను. పిదప బలరాముడు త్వరత్వరగా మదపుటేనుగువలె తన బలముకొలది అందలి తాటిచెట్లను కదల్చెను. వెంటనే ఆ చెట్లనుండి పండ్లు జలజల నేలపై రాలిపడెను.

వ. అప్పుడు పండ్లురాల్చిన చప్పుడు చెవులకు దెప్పరంబయిన, నదరిపడి, రిపుమర్దన కుతుకంబున గార్దభాసురుండు.

మ. పదవిక్షేపములన్ సవృక్ష ధరణీభాగంబు గంపింపఁగా
రదముల్ దీటుచుఁ గత్తిరించిన చెవుల్ రాజిల్ల వాలంబు భీ
తిద మై తూలఁగఁ గావరంబున సముద్దీపించి గోపాలకుల్
బెదరన్ రామునిఱొమ్ముఁ దన్నె వెనుకై బీరంబు తోరంబుగన్. 617

ఫలములు నేలపై గుభిల్లుమనుచు రాలినంతనే ఆ శబ్దమునకు గార్దభాసురుడు అదిరిపడెను. వెంటనే అతడు శత్రువును మర్దించుటకై కుతూహలముతో బయలుదేఱెను. అతనిపాదములతాకిడికి చెట్లతో నిండిన ఆ భూమి అంతయును దద్దరిల్లెను. కత్తిరింపబడిన చెవులు నిక్కపొడుచుకొనగా, పండ్లు పటపటకొఱుకుచు, తోకను భయంకరముగా ఆడించుచు మత్తెక్కితూలుచు మిగుల విజృంభించెను. అతనిని జూచి, గోపాలురు బెదరిపోసాగిరి. ఆ అసురుడు తన వెనుక కాళ్లతో బలముకొలది బలరాముని వక్షఃస్థలముపై తన్నెను.

క. మఱియును దనుజుఁడు రాముని గఱవఁగ గమకించి తెఱచి గావక యతనిం
జుఱచుచుఁ జూచుచు శౌర్యము, పఱిపోవఁగ నంత నింతఁ బదములఁ దన్నెన్ 618

వ. అంత బలభద్రుండు రౌద్రాకారంబున గర్దభాసురుపదంబులు నాలుగునొక్కకేల నంటంబట్టి భీట్టు దట్టించి, త్రిప్పి విగతజీవునిం జేసి. 619

ఇంకను ఆ అసురుడు బలరాముని కొఱికివేయుటకు ప్రయత్నించెను. బలభద్రుడు అతనికి దొరకకుండెను. అంతట రాక్షసుడు ఱెచ్చిపోయి, చుఱచుఱ జూచుచు, తనబలము క్షీణింపగా చేయునదిలేక భూమిపై అక్కడ ఇక్కడ

తన్నెను. అప్పుడు బలరాముడు రౌద్రాకారముతో ఆ ధేనుకాసురునినాలుగు పాదములను ఒక్కచేతితో గట్టిగా పట్టుకొని, గిరగిరత్రిప్పి విసరివేసెను. అంతట ఆ రాక్షసుడు అసువులను బాసెను.

మ. ఒక తాలాగ్రముఁ దాఁకినైవ నది కంపోద్రిక్తమై త్రుళ్ళి వే
తొక తాలాగ్రముపైఁ బడ న్నదియు నయ్యుగ్రాహతిన్ నిల్వ కొం
డొక తాలాగ్రముపైఁ బడన్ విఱిగి యి ట్లొండొంటిపైఁ దాలవృ
క్షకముల్ గూలెఁ బ్రచండమారుతము దాఁకన్ గూలు చందంబునన్. 620

బలరామునిచే విసరివేయబడిన గార్ధభాసురునిశరీరము ఒకతాటిచెట్టు యొక్క పైభాగమునకు కొట్టుకొనెను. ఆ దెబ్బకు కూకటివేళ్లతోసహా పెల్లగిలి ఆ తాలవృక్షము ఒరిగి, మఱియొక తాటిచెట్టుపై బడెను. దానిధాటికి అదియ మఱియొకదానిపై బడెను. ఇట్లు వరుసగా ఆ వనమునందలి తాటిచెట్లన్నియును ప్రచండమైన సుడిగాలి తాకిడికి గుఱియైనట్లుగా నేలగూలెను.

ఉ. తంతువులందుఁ జేలమువిధంబున నే పరమేశుమూర్తి యం
దింతయుఁ బట్టు నట్టి జగదీశుఁ డనంతుఁడు దైత్యమాత్రు ని
ట్లింతయు సేయుటెంత పని యద్భుతమే వినుమంతలోన వాఁ
డంతముఁ బొందు టెల్లఁగని యాతనిబంధులు గార్దభంబులై. 621

క. బలకృష్ణులపైఁ గవిసిన, బలియుర ఖరదైత్య భటులఁ బశ్చిమపాదం
బులు వట్టి తాళశిఖరం, బుల నెగురఁగవైచి వారు పొరిగొనిరధిపా! 622

దారపు పోగులనుండి వస్త్రమువలె ఆ పరమేశ్వరునుండి ఈ ప్రపంచము అంతయు ఉత్పన్నమగుచుండును. అనంతమైన శక్తిసంపన్నుడగు ఆ జగదీశ్వరుడు (బలరాముడు) ఒక అల్పరాక్షసుని హతమొనర్చుటలో ఆశ్చర్యమేమున్నది? రాజా! వినుము. ధేనుకాసురుడు అసువులను కోల్పోయిన వెంటనే అతని అనుచరులు గాడిదరూపములను దాల్చి[1] బలరామకృష్ణులపై విజృంభించిరి. అంతట ఆ గాడిదల ఆకారములలో వచ్చిన రాక్షసభటుల యొక్క వెనుకకాళ్లను పట్టుకొని వారు తాటిచెట్లపైకి ఎగురవేసిరి. ఆ దెబ్బతో రాక్షసులు నేలగూలిరి.

వ. అప్పుడు. 623

క. ఆలమున నోలిఁ గూలిన, తాలద్రుమఖండ దైత్య తనుఖండములన్
గీలితయై ధర జలధర, మాలావృత మైన మింటిమాడ్కిన్ వెలిఁగెన్. 624

ఆ యుద్ధమున పడిపోయిన తాటిచెట్లముక్కలతో, రాక్షసుల శరీరముల ఖండములతో నేలయంతయు నిండిపోయెను. అప్పుడు ఆ భూమి మేఘములతో వ్యాప్తమైన ఆకాశమువలె భాసిల్లెను.

1. సంస్కృతభాగవతములో (10-15-31) ధేనుకాసురుని విషయమున 'ఉపక్రోష్టా' అను పదము ప్రయోగింపబడినది. అనగా ఆ రాక్షసుడు 'గాడిద' రూపము గలవాడు అనుట స్పష్టము. కాని ఆ రాక్షసుడు మరణించిన పిమ్మట అతని అనుచరులు బలరామకృష్ణులమీదికి విజృంభించిరి - అను సందర్భమున వారిని సంస్కృత భాగవతమున (10-15-36) 'క్రోష్టారః' అని పేర్కొనుట జరిగినది.
ఉపక్రోష్టా - ఓండ్రపెట్టునది గాడిద అని అర్థము. శ్రీధరీయ వ్యాఖ్యానమున 'ఉపక్రోష్టా = గర్దభః' అని వివరింపబడినది.
ఈ సందర్భమున 'ఉపక్రోష్టా' అను పదమునకు గార్దభము - అను అర్థమును చెప్పినట్లుగనే 'క్రోష్టారః' అను పదమునకును 'నామమాత్రగ్రహణే నామగ్రహణం' అను న్యాయమును అనుసరించి గాడిదలు అను అర్థమే స్వీకరింపబడినది.

క. ధేనుకవనమున నమలిరి, మానవు లా వేళఁ దాటి ఫ్రూఁకులఫలముల్
ధేనువులు మెసఁగెఁగసవులు, ధేనుకహరభక్తకామధేనువు గలుగన్. 625

వ. ఆ సమయంబున సురలు విరులవానలు గురియించి, దుందుభులు మొరయించిరంతఁ గమలలోచనుండు, గోపజన జేగీయమాన వర్తనుండై, యన్నయుం దానును గోగణంబులం దోలుకొని, మందకుం జనియె నయ్యెడ. 626

భక్తులపాలిటి కామధేనువైన బలరాముడు ధేనుకాసురుని చంపుటతో గోపాలురు ఆ ధేనుకవనమునందలి తాటిచెట్లపండ్లను నిర్భయముగా తనివిదీర తినిరి. అట్లే ఆవులుగూడ అచటి పచ్చికలను కడుపార మేసెను. ఆ సంతోష సమయమున దేవతలు పూలవానలను కురిపించుచు, దుందుభులను మ్రోగించిరి. గోపాలురు బలరామకృష్ణుల బలపరాక్రమములను ప్రస్తుతించుచు జేజేలు పలికిరి. అంతట కృష్ణుడు అన్నతో, అనుచరులతో గూడి ఆవులను తోలుకొనుచు బృందావనము చేరెను.

ఉ. గో పదరేణు సంకలిత కుంతలబద్ధ మయూరపింఛు ను
ద్దీపిత మందహాస శుభదృష్టి లసన్ముఖు నవ్య పుష్ప మా
లా పరిపూర్ణు గోపజనలాలిత వేణురవాభిరాము నా
గోపకుమారునింగనిరి గోపసతుల్ నయనోత్సవంబుగన్. 627

అచటి గోపికలు అందఱును గోపకిశోరుడైన శ్రీకృష్ణుని కనులపండువుగా దర్శించిరి. అపుడు ఆవుల పాదముల తాకిడికి చెలరేగిన ధూళులు నెమలిపింఛమును ధరించియున్న శ్రీకృష్ణుని ముంగురులపై వ్యాపించియుండెను. ఆయనముఖము ముద్దులొలుకు చిఱునవ్వులతో, అందమైన చూపులతో మనోహరముగా ఉండెను. ఆ స్వామి క్రొత్తక్రొత్త పూలమాలలను ధరించియుండెను. ఆ ప్రభువుయొక్క మధురములైన మురళీరవములను గోపికలు తృప్తిగా ఆస్వాదించుచు కొనియాడుచుండిరి.

ఆ. కమలనయనువదనకమలమరందంబుఁ దవిలి నయన షట్పదముల వలనఁ
ద్రావి దిన వియోగతాపంబు మానిరి గోపకాంత లెల్లఁ గోర్కు లలర. 628

గోపికలు కమలాక్షుడైన శ్రీకృష్ణునియొక్క ముఖకమలము నుండి జాలువారెడి మకరందమును తమ చూపులనెడి తుమ్మెదలద్వారా తనివిదీర (తృప్తిగా) ఆస్వాదించిరి. పగలంతయు శ్రీకృష్ణుని దర్శనములేక కలవరపడుచున్న ఆ గోపికలయొక్క బెంగయంతయు ఆ సంతోషముతో తొలగిపోయెను, వారికోర్కెలు ఫలించెను.

వ. ఇట్లు గోపికలు సాదరంబుగం జూడ, వ్రీడా హాస వినయంబులం జూచుచుఁ, గ్రీడా గరిష్ఠుండయి ప్రోడ గోష్ఠంబు ప్రవేశించె. అంత రోహిణీయశోదలు కుఱ్ఱలవలని మచ్చికలు పిచ్చలింప, నిచ్చకు వచ్చినట్లయ్యే వేళల దీవించిరి. వారును మజ్జనోన్మర్దనాదులంగీకరించి, సురభి కుసుమగంధంబులు గైకొని, రుచిరచేలంబులు గట్టికొని, రసోపపన్నంబులయిన యన్నంబులు గుడిచి, తృప్తులై, మంజులశయ్యల సుప్తులయి యుండి రందు. 629

సందర్భోచితముగా తన కేళీవిలాసములను ప్రదర్శించుటలో నేర్పరియైన కృష్ణప్రభువు గోపికలు తనను సాదరంబున చూచుచుండగా సిగ్గును, దరహాసమును, వినయమును ప్రకటించుచు గొల్లపల్లెలో ప్రవేశించెను. పిమ్మట రోహిణీదేవియు, యశోదామాతయు తమ చిన్నారులపై మనసులలోని మరులన్నియు క్రుమ్మరించుచు, తోచినరీతిగా, సందర్భములకు

అనువుగా వారిని దీవించిరి. పిమ్మట బలరామకృష్ణులును తల్లులలాలనలలో నలుగుపిండితో స్నానములను ఆచరించిరి. సువాసనలుగల పూవులను (పూలమాలలను) ధరించిరి, గంధములను అలదుకొనిరి. ఇంపైన వస్త్రములను దాల్చిరి. షడ్రసోపేతములైన భోజనపదార్థములను తృప్తిగా ఆరగించిరి. పిమ్మట ఆ ఇరువురును తల్లుల జోలపాటలను వినుచు మెత్తని తల్పములపై హాయిగా నిదురించిరి.

## శ్రీకృష్ణుండు కాళియమర్దనము గావించుట

సీ. ఒకనాఁడు బలభద్రుఁడొక్కఁడు రాకుండ గోపాలకులు దానుఁ గూడి కృష్ణుఁ
డడవికిఁ జని యెండ నా గోవులును గోపకులు నీరువట్టునఁ గుంది డప్పి
కాళిందిలో విషకలితతోయముఁ ద్రావి ప్రాణానిలంబులు పాసి పడిన
యోగీశ్వరేశుండు యోగివంద్యుఁడు కృష్ణుఁ డీక్షణామృతధార లెలమిఁ గురిసి.
ఆ. పసుల గోపకులను బ్రదికించె మరలంగ వారు తమకుఁ గృష్ణువలన మరల
బ్రదుకు గలిగె నంచు భావించి సంతుష్టమానసములఁ జనిరి మానవేంద్ర! 630

మహారాజా! ఒకానొకనాడు బలరాముడు లేకుండగనే శ్రీకృష్ణుడు తోడిగోపాలురతోగూడి అడవికి వెళ్లెను. ఎండతాకిడికి దాహముగొని అలసిపోయి, గోవులును, గోపాలురును విషముతో కలుషితములైన యమునానదీజలములను త్రాగిరి. అంతటవారు అసువులను కోల్పోయి నేలపై పడిపోయిరి. అప్పుడు శ్రీకృష్ణుడు అమృతమయములైన తన చూపులను ప్రసరింపజేసి (దివ్యములైన నేత్రములతో చూచి) పశువులను, గోపాలురను బ్రతికించెను. నిత్యము యోగులచే ఆరాధింపబడుచుండెడి ఆ మహాయోగీశ్వరుని (శ్రీకృష్ణుని) మహిమలు అట్టివి. అంతటవారు శ్రీకృష్ణుని ప్రభావమువలన తాము బ్రతికితిమని భావించి, సంతోషముతో పొంగిపోవుచు తమ నివాసములకు చేరిరి.

క. కాళియఫణి దూషిత యగు, గాళిందిఁ బవిత్రఁజేయఁగా నుత్సుకుఁడై
కాళిందీ జలవర్ణుఁడు, కాళియు వెడలంగ నడిచెఁ గౌరవముఖ్యా! 631

రాజా! కాళిందీ (యమునా) నదీజలములవలె నీలవర్ణుడైన శ్రీకృష్ణుడు 'కాళియుడు' అను మహాసర్పముయొక్క విషముచే ప్రాణాంతకములుగా మారిన ఆ నదీజలములను పవిత్రమొనర్చుటకై ఉత్సాహపడెను. పిమ్మట ఆ ప్రభువు కాళియుని ఆ నదినుండి వెళ్లగొట్టెను.

వ. అనిన నయ్యగాధజలంబువలన మాధవుం డెట్టి నేర్పున, సర్పంబుదర్పంబు మాపి వెడలించె నందుఁ బెద్దకాలం బావ్యాళంబేల యుండె నెఱింగింపుము. 632

పిదప శుకయోగితో పరీక్షిన్మహారాజు ఇట్లనెను. మహాత్మా! ఆ నదీజలములు మిక్కిలి లోతైనవిగదా! వాటినుండి ఆ మహావిషసర్పమును శ్రీకృష్ణుడు ఎట్లు వెడలగొట్టెను? ఆ కాళియునియొక్క గర్వమును అణచుటలో ఆ ప్రభువు చూపిన నేర్పు ఎట్టిది? ఆ సర్పము ఆ నదీజలములో ఎంతోకాలము ఉండుటకు కారణమేమి? వివరింపుము.

క. తొట్టిలఁ గాచిన నందుని, కుఱ్ఱనిచరితామృతంబు గొనకొని చెవులన్
జుఱ్ఱంగఁ దనివి గల్గునె, వెఱ్ఱులకయినను దలంప విప్రవరేణ్యా! 633

విప్రోత్తమా! గోవులనుగాచిన నంధకుమారునిచరిత్రము అమృతమువలె దివ్యమైనది ఆ చరితామృతమును ఎంతగా జుర్రినను పామరులకుసైతము తనివితీరదుగదా!".

వ. అనిన శుకుం డిట్లనియె. 634

సీ. మానవేశ్వర! యొక్క మడుఁగు కాళిందిలోఁ గలదది యెప్పుడుఁ గాళియాహి
విషవహ్ని శిఖలచే వేఁచుచుండును మీఁదఁ బఱతెంచి నంతన పక్షులైనఁ
బడి మ్రగ్గు నందుఁ దద్భంగ శీకరయుక్త పవనంబు సోఁకినఁ బ్రాణు లెవ్వి
యైన నప్పుడ చచ్చు నట్టి యా మడుఁగులో నుదకంబు వొంగుచు నుడుకుచుండఁ
తే. జూచి వెఱఁగంది కుజనుల ద్రుక్కఁజేయ నవతరించిన బలువీరుఁ డాగ్రహించి
భుజగ విషవహ్ని దోషంబు పొలియఁజేసి సుజలఁ గావించి యా నదిఁ జూతు ననుచు. 635

అనంతరము శుకమహర్షి ఇట్లు నుడివెను. మహారాజా! యమునానదిలో ఒక పెద్ద మడుగుకలదు. అందలి జలములు ఎల్లప్పుడును కాళియసర్పముయొక్క విషాగ్నిజ్వాలలచే ఉడుకుచుండును. (సెగలు గ్రక్కుచుండును). ఆ నీటిమీదుగా ఆకాశమున సంచరించెడి పక్షులుగూడ ఆ విషప్రభావమునకు చచ్చిపోయి అందు పడిపోవుచుండును. ఆ మడుగునీటి అలలతుంపరలను తాకుచువచ్చిన గాలులు సోకినంతనే ఎంతటి ప్రాణియైనను మఱుక్షణమే చచ్చిపోవును. దుష్టులను హతమార్చుటకై అవతరించిన శ్రీకృష్ణుడు ఆ మడుగులోని జలములు విషాగ్నిజ్వాలలచే ఉడికిపోవుచుండుట చూచి మిక్కిలి ఆశ్చర్యపడెను. అంతట ఆ మహావీరుడు ఆగ్రహించి, 'కాళియసర్పముయొక్క విషాగ్నిజ్వాలల ప్రమాదమును తొలగించి, ఆ జలములను పవిత్రములుగా జేయుదును' అని సంకల్పించెను.

వ. కృతనిశ్చయుండై, పూర్వజన్మ భాగ్యంబులం దనచరణ సంస్పర్శంబునకు యోగ్యంబై, తత్సమీపంబున విశాల విటపశాఖా కదంబంబుతో నున్న కదంబ భూజంబు నెక్కి. 636

శ్రీకృష్ణుడు అట్లు నిశ్చయించుకొని, ఆ సమీపముననేగల ఒక కదంబవృక్షముపైనెక్కెను. దాని కొమ్మలు విశాలములై దట్టముగా ఉన్నవి. ఆ వృక్షము తన పూర్వజన్మలో చేసికొనిన సుకృతఫలముగా ఆ స్వామి యొక్క పాదస్పర్శకు నోచుకొనినది.

మ. కటిచేలంబు బిగించి పింఛమునఁ జక్కం గొప్పు బంధించి దో
స్తటసంస్ఫాలనమాచరించి చరణద్వంద్వంబుఁ గీలించి త
త్కుటశాఖాగ్రముమీఁదనుండి యుఱికెన్ గోపాలసింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదంబులో గుభగుభధ్వానంబనూనంబుగన్. 637

పిమ్మట ఆ మహాగోపాలుడు (సింహపరాక్రముడైన శ్రీకృష్ణుడు) నడుమునకు చుట్టును వస్త్రమును బిగించెను. పింఛముతోగూడిన వెంట్రుకలను ముడిచెను (చక్కగా ముడివేసికొనెను). తనరెండు చేతులతో భుజాస్ఫాలనము గావించెను, (భుజములను చఱచెను). రెండు పాదములను గట్టిగా అదిమిపట్టి, చెట్టుమీదినుండి మడుగులోనికి దూకెను. అప్పుడు ఆ మడుగునుండి వెలువడిన గుభిల్లుమనెడి అద్భుతధ్వనులు అన్నిదిక్కులయందును మార్మోగెను.

ఉ. భూరి మహాప్రతాప పరిపూర్ణ భయంకర గోపబాల కం
ఠీరవ పాతవేగ వికటీకృత దుర్విష భీషణోర్మి సం
పూరిత మై వడిం గలఁగి పొంగి ధనుశ్శతమాత్ర భాగ వి
స్తారము పొంగె నమ్మడుఁగు తప్త పయఃకణ బుద్బుదోగ్రమై. 638

బాలకృష్ణుడు కొదమసింగమువలె మహాప్రతాపశాలి. అనిర్వర్ణనీయమైన పరాక్రమముచే శత్రుభయంకరుడగు ఆ ప్రభువు దూకినంతనే ఆ మడుగులోని జలములన్నియును ఒక్కుమ్మడిగా మీదికి చిమ్మెను. మడుగునిండ వ్యాపించి, ప్రమాదకరమైన విషప్రభావమున భయంకరముగానున్న అందలి నీటి అలలు శ్రీకృష్ణుని వేగమునకు (వేగముగా

దూకుటవలన) చెల్లాచెదరై వందబారలదూరమువఱకు ఎగిసిపడెను. అప్పుడు విషాగ్నిజ్వాలలకు తీవ్రముగా వేడెక్కియున్న నీటికణములు బుడగలతో ఒప్పుచు భీకరములై కన్పట్టుచుండెను.

శా. పాఠీనాకృతిఁ దోయరాశి నడుమన్ భాసిల్లి మున్నాథ్యుఁడై
కాఠిన్యక్రియ నీఁదు నేర్పు దనకుం గల్మిన్ భుజంగేంద్ర హృ
త్పీఠాగ్రంబున రోషవహ్నులెగయన్ భీమంబుగా నీఁదె ను
ల్లోలోత్తుంగ తరంగ మై మడుఁగు దుర్లోక్యంబుగా బాహులన్. 639

మత్స్యావతారమున అగాధమైన జలరాశియందు నలుమూలలకును, అనాయాసముగా సంచరించిన శ్రీహరి ఈదుటలో సర్వసమర్థుడు. అల్లకల్లోలమై, ఉవ్వెత్తుగా ఎగసిపడుచున్న అలలతో చూడభయంకరముగా నున్న ఆ మడుగును ఆ ప్రభువు తన బాహువులతో ఈదెను. ఆ కారణముగా, నీటిమడుగున చేరియున్న కాళియసర్పముయొక్క హృదయమున రోషాగ్నులు ప్రజ్వరిల్లెను. ఈ దృశ్యము మిగుల భీకరముగా ఉండెను.

వ. ఆ సమయంబున. 640

శా. బాలుం డొక్కఁడు వీఁడు నామడుఁగు విభ్రాంతోచ్ఛలత్కీర్ణ క
ల్లోలంబై కలఁగం జరించె నిట నే లోనుంటఁ జూడండు మ
త్కీలాభీల విశాల దుస్సహ విషాగ్ని జ్వాలలన్ భస్మమై
కూలంజేసెద నేఁడు లోకులకు నా కోపంబు దీపింపఁగన్. 641

అప్పుడు కాళియుడు ఇట్లు తలపోసెను. 'ఒకసామాన్యుడైన బాలుడు నా మడుగులోచొచ్చి ఆశ్చర్యకరమైన రీతిలో అలలు ఎగసిపడునట్లుగా దీనిని అల్లకల్లోలమొనర్చుచున్నాడు. నేను ఇచట ఉన్నట్లు ఇతనికి తెలియనట్లున్నది. ఇతని చేష్టలకు నాలో మంటలు చెలరేగుచున్నవి. మిక్కిలి భయంకరమై, దుస్సహమైన నా విషాగ్నిజ్వాలలతో ఇప్పుడే ఇతనిని భస్మమొనర్చెదను. ఈ దెబ్బతో నా ప్రతాపప్రభావములు లోకులకు తెలిసిరాగలవు.'

వ. అని తలంచి విజృంభించి. 642

ఉ. ఘోర విషానల ప్రభలు గొబ్బునఁ గ్రమ్మఁగ సర్ప సైన్య వి
స్ఫారుఁడు కాళియోరగుఁడు పాటి వడిం గఱచెం బయోధరా
కారుఁ బయోవిహారు భయకంప విదూరు మహాగభీరు నా
భీరకుమారు వీరు నవపీత శుభాంబరధారు ధీరునిన్. 643

క. కఱచి పిఱుతివక మఱియును, వెఱవక నిజ వదనజనిత విషదహనశిఖల్
మెఱయఁ దన నిడుద యొడలివి, నెఱి హరిఁబెనఁగొనియె భుజగనివహపతి వడిన్. 644

ఇట్లు తర్కించుకొనిన పిమ్మట పెద్ద సర్పసైన్యముతోగూడి భయంకరముగానున్న ఆ కాళియుడు విజృంభించి, వెంటనే ముందునకు ఉఱికి శ్రీకృష్ణుని కఱచెను. అప్పుడు ఆ నీలమేఘశ్యాముడు నీళ్లలో స్వేచ్ఛగా విహరించుచుండెను. కాంతులీనుచున్న పీతాంబరమును ధరించి, మిగుల గంభీరముగా నున్న వీరుడగు ఆనందనందనుడు ఆ సర్పముయొక్క కాటునకు భయపడక ఏమాత్రమూ చలింపక ధైర్యముగా ఉండెను. ఇట్లు కఱచిన పిదప ఆ సర్పరాజు, వెనుకకు మఱలక, భీతిల్లక తననోళ్లనుండి విషాగ్నిజ్వాలలను వెళ్లగ్రక్కుచు, తన పొడవైన శరీరముతో ఒక్కక్షణములో శ్రీకృష్ణుని చుట్టివేసెను.

వ. ఇట్లు భోగిభోగపరివేష్టితుండై, చేష్టలు లేనివాని తెఱంగునఁ గానంబడుచున్న ప్రాణసఖునిం గనుంగొని, తత్ప్రభావంబులెఱుంగక, తత్సమర్పిత ధన దార మనోరథ మానసులు గావున. 645

చ. అదె మనకృష్ణునిం గఱచె నంతటఁ బోక భుజంగమంబు దు
ర్మదమున మేనఁ జుట్టుకొని మానక యున్నది యింక నేమి సే
యుదమెటఁ జొత్త మే పురుషులోపుదు రీ యహి నడ్డపెట్ట నె
య్యది సదుపాయమంచుఁబడి రార్తరవంబులఁ దూలి గోపకుల్. 646

అప్పుడు కాళియసర్పశరీరముచే బంధింపబడియున్న శ్రీకృష్ణుడు నిశ్చేష్టుడై యున్నవానివలె కన్పట్టెను. పిమ్మట గోపాలకులు తమ ప్రాణమిత్రుని స్థితినిజూచి ఆ స్వామి ప్రభావమును ఎఱుంగక మిగుల వేదనకు లోనైరి. వారు త్రికరణశుద్ధిగా తమ సంపదలను, భార్యాపుత్రులను, కోరికలను శ్రీకృష్ణునిసేవలయందే సమర్పించినవారు, (సమర్పణబుద్ధిగలవారు.) అందువలన వారు తమ ఆత్మీయునికొఱకై ఇట్లు వగచిరి. 'అదిగో చూడుడు. ఆ విషసర్పము మనకృష్ణుని కాటువేసినది. అంతటితో ఆగక అది దురహంకారమున ఆయనను చుట్టుకొని విడిచిపెట్టకున్నది. ఇప్పుడు ఏమి చేయుదము? ఎక్కడికి పోవుదము? ఈ పామును అదుపుచేయగల సమర్థులెవరు? ఈ ఆపదనుండి గట్టెక్కు ఉపాయమేమి?" అని గగ్గోలు పెట్టుచు వారు తూలిపడిపోయిరి.

క. గోపకుమారక శేఖరు, నేపున సర్పంబు గఱచుటీక్షించి వగన్
మేపులకుఁ దొలఁగి గోవులు, వాపోవుచు నుండె వృషభవత్సంబులతోన్. 647

ఆ పాము గోపాలురలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని తీవ్రముగా కాటువేయుటచూచి, దుఃఖముతో ఆవులు, కోడెదూడలు మేతమేయుట మాని, గోడుగోడుమనుచుండెను.

క. భూతములు వడఁకె నుల్కా, పాతంబులు మింటఁ గానఁబడె ఘోషములో
వ్రేతలకును గోపక సం, ఘాతములకదరె వలకడకన్నులిలేశా! 648

రాజా! ఆ సమయమున భూమి కంపించెను. ఆకాశమునందు తోకచుక్కలు కనబడెను. గొల్లపల్లెలోని గోపికలకు కుడి కన్నులు, గోపాలురకు ఎడమ కన్నులు అదరెను.

వ. అంత నా దుర్నిమిత్తంబులు పొడగని, బెగడు గదిరిన చిత్తంబుల నుత్తలపడుచు, మందనున్న నందయశోదాదులైన గోపగోపికాజనంబులు హరి దళసరి యెఱుంగక, గోపాల గోగణ పరివృతుండైన కృష్ణుం డెక్కడ నైనం జిక్కు నోపునని పొక్కుచుం, బెక్కువలయిన మక్కువలు చెక్కులొత్త, నొక్కపెట్ట బాలవృద్ధ సమేతులై, మహాఘోషంబున నా ఘోషంబు వెలువడి. 649

అంతట గోకులమునగల నందుడు, యశోదాదేవి మొదలగు గోపాలురు, గోపికలు ఆ అపశకునములను జూచి, మానసికముగ మిక్కిలి ఆందోళనకు గుఱియైరి. శ్రీకృష్ణునిశక్తిసామర్థ్యములను తెలిసికొనలేక వారు 'గోపాలురతోడను, గోవులతోడను కూడియున్న కృష్ణుడు ఎక్కడైన ఆపదలలో చిక్కుకొన్నాడో ఏమో?' అని దుఃఖించిరి. అంతట వారు అతిప్రేమలకారణముగా తమ ఆత్మీయులకు ఆపదలను శంకించుచు[1] ఒక్కుమ్మడిగా పిల్లలతో, వృద్ధులతో సహా పెద్దగా గగ్గోలుపెట్టుచు ఆ గొల్లపల్లెనుండి బయలుదేఱిరి.

1. 'అతిప్రేమః పాపశంకీ' – అతిప్రేమగలవారు తమఆత్మీయులకు ఎట్టి ప్రమాదములు వచ్చిపడునో? అని శంకించుచుందురు.

క. వారిబ్బంగి నెఱుంగని, వారై హరిఁ జూడఁ బోవ వడిగొని నగుచున్
వారింపఁ డయ్యె రాముఁడు, వారిని హరిలావెఱుంగువాఁడయ్యు నృపా! 650

పరీక్షిన్మహారాజా! ఆ గోకులములోని వారందఱును కృష్ణునిప్రభావమును ఎఱుంగక, ఈ విధముగా బాదపడుచు పరుగుపరుగున హరిని జూడపోయిరి. శ్రీకృష్ణునిశక్తియుక్తులను ఎఱిగిన బలరాముడు మాత్రము వారి అజ్ఞానమునకు నవ్వుకొనుచు, వారిని నివారింపకయుండెను.

వ. అంతలోన వారునుందానును గాంతారమార్గంబు వట్టి పోవుచు,నెడనెడ గోప గోష్పదంబుల నందుల నింత నంత నక్కడక్కడ యవాంకుశ హల కమల కులిశ చక్ర చాప కేతనాది రేఖాలంకృతంబులై, మార్గాభరణంబు లైన హరిచరణంబులజాడఁగని, చొప్పు దప్పక చని, దుర్ఘటం బయిన యమునాతటంబు సేరి, వారి మధ్యంబున నితరుల కసాధ్యంబైన సర్పంబుచేతఁ గాటువడి, దర్పంబు సూపక, భోగిభోగ పరివృతుండైన కృష్ణునిఁ గృష్ణకృష్ణేతి విలాపంబులఁ దాపంబులం బొందుచుఁ, దత్కాలంబునం బ్రతికూలంబయ్యె ననుచు దైవంబుఁ దిట్టు గోపికలను, గోపకులం గలసి, మేఁతలుడిగి, తెప్పలిడక, కృష్ణునిం దప్పక చూచుచు, నొరలుచున్న గోవులం గనిరందు గోపికలు యశోదం బట్టుకొని, విలపించుచుఁ గృష్ణు నుద్దేశించి, యిట్లనిరి. 651

బలరాముడు నందయశోదాదులతోగూడి శ్రీకృష్ణుని జాడను తెలిసికొనుటకై, అడవిదారులనుబట్టి పోవుచుండెను. మార్గమున వారికి గోపాలురయొక్క, గోవులయొక్క కాళ్లగుర్తులు కనబడినవి. వాటి మధ్య అక్కడక్కడ యవరేఖలు (వరికంకినిబోలిన రేఖలు) అంకుశచిహ్నములు, నాగలి, పద్మము, వజ్రాయుధము, చక్రము, ధనస్సు, ధ్వజము మున్నగు శుభరేఖలుగల శ్రీకృష్ణునిపాదచిహ్నములు కనబడినవి. ఆ శుభచిహ్నములు మార్గములకు ఆభరణములుగా విరాజిల్లుచుండెను. క్రమముగా వారు ఆ దారినీడక ఎట్టకేలకు యమునానదీతీరమునకు చేరిరి. ఆ యమునాజలములలో ఇతరులకు ఎదిరింపసాధ్యముగాని ఒక మహాసర్పముయొక్క కాటునకు గుఱియై, దానిచే చుట్టబడియు, పరాక్రమింపక తిన్నగా ఉన్న కృష్ణుని జూచిరి. అచటవారు గోపికలను, గోపాలురను, గోవులను కలిసికొనిరి. అప్పుడు గోపికలు, గోపాలురు, 'కృష్ణా! కృష్ణా!' అని విలపించుచు మిగుల దుఃఖించుచుండిరి. ఇంకను వారు 'విధి మనకు ప్రతికూలముగా ఉన్నది' అని దైవమును దూషించుచుండిరి. గోవులు మేతమేయుటమాని, రెప్పలార్పక దీనముగా చూచుచు కన్నీరుగార్చుచుండెను. అంతట గోపికలు యశోదాదేవిని పట్టుకొని విలపించుచు, కృష్ణుని ఉద్దేశించి ఇట్లు పలికిరి.

సీ. ఎదురువచ్చినఁ జాల నెదురుగాఁ జనుదెంతు వెదురువచ్చిన నేఁ డదేల రావు
చూచినఁ గృపతోడఁ జూచుచుందువు, నీవు సూచినఁ గనువిచ్చి చూడ వేల
డాసిన నఱలేక డాయంగ వత్తువు డాసిన నేటికి డాయవిచటఁ
జీరిన నో యని చెలరేఁగి పలుకుదువిది యేమి సీరిన నెఱుఁగకుంట
ఆ. తలఁపు సేయ నంతఁ దలపోయు చుందువు తలఁపుసేయ నేఁడు తలఁపవకట!
యనుచు భక్తివివశలాడెడి కైవడి వ్రేత లెల్లనాడి వివశ లైరి. 652

"కృష్ణా! మేము నీ కొఱకు వచ్చుట గమనించి, నీవు మాకు ఎదురుగా వచ్చుచుండెడివాడవు. కాని నేడు అట్లు రాకుంటివేల? మేము నీ వైపు ప్రేమతో చూచుచున్నప్పుడు నీవు మాపై కృప జూపుచుండెడివాడవు. కాని ఇప్పుడు ఆ విధముగా మావైపే తిరిగి చూడవేమి? మేము నిన్నుచేరినంతనే నీవు మాయమర్మములు లేక మా దరి జేరుచుండెడివాడవు. కాని నేడు మా కడకు రావేల? మేము 'కన్నయ్యా!' అని పిలిచినంతనే 'ఇదిగో! వచ్చుచున్నాను' అని కేరింతలతో పలుకుచుండెడివాడవు - కాని ఈనాడు నీవు ఇట్లు మౌనము వహించియుంటివేల? మేము నిన్ను గూర్చి మా మనస్సులలో

స్మరించినంతమాత్రమునే నీవు మా కనులముందు నిలుచుచుండెడివాడవు. కాని నేడు మేము నిన్ను ఎంతగా వేడుకొనుచున్నను నీకు మా జోలే పట్టకున్నది - అదేల?" అనుచు భక్తిపారవశ్యముతో పలికెడి రీతిగా ఆ గోపికలు పరితాపముతో నుడువుచు నిశ్చేష్టలైరి.

వ. ఆ సమయంబున నందయశోదాదులు హరిం జూచి, యధికంబైన శోకంబున నిట్లనిరి. 653

క. విషకుచయుగ యగు రక్కసి, విషకుచదుగ్ధంబు ద్రావి విషవిజయుఁడవై
విషరుహలోచన! యద్భుత, విషయుం డగు నీకు సర్పవిషమెక్కెఁగదా. 654

క. కట్టా! క్రూరభుజంగము, గట్టలుకన్ నిన్నుఁ గఱవఁ గంపించితివో
తిట్టితివో పాపువిధిఁ, బట్టి మముం దలఁచి కాఁకఁ బలవించితివో. 655

ఆ సమయమున నందుడు, యశోదమున్నగువారు కృష్ణునిజూచి, అంతులేని శోకముతో ఇట్లు వాపోయిరి. "కమలలోచనా! విషపూరితములైన స్తనములతో వచ్చిన పూతనరాక్షసియొక్క విషస్తన్యమును త్రాగియు ఎట్టి బాధకు గురికాక విజయుడవైతివి. (పూతనను చంపితివి) నిజముగా నీవు అద్భుతములకు నిలయుడవు. అట్టి మహిమాన్వితుడవైన నీకు ఈ సర్పవిషము ఎట్లెక్కెను? అయ్యో! ఆ క్రూరమైన సర్పము మిగుల కోపావేశముతో నిన్ను కఱచినప్పుడు నీవు ఎంతగా విలవిలలాడితివో! దుష్టవిధిని ఎంతగా తిట్టిపోసితివో! కన్నయ్యా! మమ్ము గుర్తుచేసికొనుచు ఎంతగా పరితపించితివో గదా!

క. పన్నగము మమ్ముఁ గఱవక, నిన్నేటికిఁ గఱచెఁ గుట్టి! నెమ్మి గలిగి నీ
వున్నను మము రక్షింతువు, నిన్నున్ రక్షింప నేము నేరము తండ్రీ! 656

బిడ్డా! ఆ పాము మమ్ములను కఱవకుండా నిన్ను ఎందులకు కాటువేసెను. నీవు క్షేమముగా ఉన్నచో మమ్ములను కాపాడెడివాడవు. తండ్రీ! ఇప్పుడు మేము నిన్ను రక్షింపజాలముగదా!

ఉ. చూడ వదేమి గారవపుఁ జూపుల మమ్ము సఖాళితోడ మా
టాడ వదేమి! నర్మముగ నందెలు పాదములందు మ్రోయ నేఁ
డాడ వదేమి నర్తనము లవ్వల మ్రోలను గోపికావళిం
గూడ వదేమి నవ్వులకు గోపకుమారవరేణ్యా! చెప్పుమా. 657

గోపాలచూడామణీ! నీ మధురమైన చూపులతో మమ్ము గాంచవేమి? నీ మిత్రులతో సరసములాడవేమి? అందెలు ఘల్లుమనునట్లుగా మా యెదుట ముద్దులొలుకుచు నృత్యములు చేయవేమి? గోపికలను నవ్వించుచు మాట్లాడవేమి? నాయనా! తెలుపుము.

సీ. శ్రవణరంధ్రంబులు సఫలతఁ బొందఁగ నెలమి భాషించువా రెవ్వ రింకఁ
గరచరణాదులకలిమి ధన్యత నొంద నెగిరి పైఁ బ్రాఁకువా రెవ్వ రింక
నయనయుగ్మంబులున్నతిఁ గృతార్థములుగా నవ్వులు సూపువా రెవ్వ రింక
జిహ్వలు గౌరవ శ్రీఁ జేరఁ బాటల యెడఁ బరికించు వారెవ్వరింకఁ

ఆ. దండ్రి! నీవు సర్పదష్టుండ వై యున్న నిచట మాకుఁ బ్రభువు లెవ్వరింక
మరగి పాయలేము మాకు నీతోడిద లోకమీవులేని లోకమేల 658

కన్నయ్యా! నీవు సర్పముయొక్క కాటునకు గుఱియై మా జోలియేలేక ఇట్లు చేష్టలుడిగియున్నచో ముద్దుముద్దు మాటలతో మాకు వీనులవిందు గూర్చువారెవ్వరు? నీవు ఎగిరిఎగిరి మాపై ప్రాకుచున్నప్పుడు నీ తను స్పర్శమాత్రమున మా కరములు, పాదములు మొదలగు అవయవములు అన్నియును తన్మయములై హాయిని పొందుచుండెడివి. ఇంక మాకు ఆ ఆనందమును గూర్చువారు ఎవరు? నీవు చిఱునవ్వులముత్యాలను చిందించుచుండగా మేము కనులారగాంచి మురిసిపోవుచుండెడి వారము. ఇంక మాకు ఆ అదృష్టమును కలిగించువారెవరు? నీచే గోరుముద్దలు తినుపించుచు, నిన్ను ఆటలాడించుచు, నిద్రపుచ్చుచు తనివిదీర పాటలు పాడుచు ఆనందించుచుండెడివారము. ఇంక మాకు ఆ భాగ్యమును దక్కించువారెవ్వరు? ఇంక మాకు ప్రభువెవరు? మాకు నీతోడిదే లోకమైనది. అట్లు జీవించుచున్న మేము నిన్ను విడిచిపెట్టి ఉండలేము. నీవు మా కనులముందు లేనప్పుడు మాకు ఈ లోకముతో పనియేమి?"

వ. అని యొండొరులం బట్టుకొని విలపించుచుం గృష్ణునితోడన మడుఁగు జొత్తము చత్తమనుచుఁ, గృష్ణవిరహ వేదనానలభారతప్తులై, మడుఁగుఁ జొరఁబాఱుచున్న వారలఁ గనుంగొని, భగవంతుండైన బలభద్రుఁడు, మీరు మీఁ దెఱుంగరు. ధైర్యంబు విడుచుట కార్యంబు గాదు. సహించి చూడుండనుచు వారిని వారించె. 659

ఈవిధముగా ఒకరినొకరు పట్టుకొని విలపించుచు 'కన్నయ్యతోడనే మనముగూడ ఈ మడుగులో ప్రవేశించి, అసువులను వీడెదము' అనుచు వారు కృష్ణునిఎడబాటునకు తట్టుకొనలేక మడుగులో ప్రవేశించుటకు సిద్ధమైరి. అంతట అవతారపురుసుడైన బలరాముడు కృష్ణునిశక్తిని ఎఱిగినవాడు గావున 'మీరు మున్ముందు జరుగబోవు సంఘటనలను ఎఱుగకున్నారు. అధైర్యపడుట ఏమాత్రమును మంచిదిగాదు. ఓపిక పట్టుడు' అని పలికి వారిని వారించెను.

క. తనుఁ గూర్చి యి వ్విధంబున, వనితలు బిడ్డలును దారు వాపోయెడి ఘో
షనివాసులఁగని కృష్ణుఁడు, మనుజునిక్రియ నొకముహూర్త మాత్రము జరిపెన్. 660

శా. అంతం గృష్ణుఁడు మేను వెంప భుజగుం డా వృత్తులం బాసి తా
సంతప్తాయత భోగుఁడై కఱచుటల్సాలించి నిట్టూర్పుతో
శ్రాంతుండై తలలెత్తి దుర్విషము నాసావీథులం గ్రమ్మ దు
శ్చింతన్ దిక్కులు సూచుచుం దలఁగి నిల్చెన్ ధూమకాష్ఠాకృతిన్. 661

ఈవిధముగా నందాదిగోకులవాసులు ఆలుబిడ్డలతో గూడి తనకొఱకే వాపోవుచుండుటను శ్రీకృష్ణుడు గమనించెను. పిమ్మట ఆ ప్రభువు ఒక ముహూర్తకాలము మానవమాత్రునివలె లీలగా గడపెను. అంతట కృష్ణుడు తన శరీరమును పెద్దగా పెంచెను. ఆ స్వామియొక్క బలమునకు తాళలేక కాళియుడు ఆయనను చుట్టుకొనియున్న తన శరీరమును సడలించెను. విశాలమైన తన పడగలకు వేడెక్కగా అతడు కాటువేయుట మానెను. బాగుగా అలసిపోయిన అతడు తనముక్కురంధ్రములలో విషములు నిండగా నిట్టూర్పులు విడువసాగెను, చేయునదిలేక మిగుల చింతించుచు నలుదిక్కులు చూచుచు శ్రీకృష్ణుని విడిచిపెట్టి, పొగతోగూడిన కట్టెవలె నిల్చెను.

చ. వెఱమెర లేని యట్టి బలువీరుఁడు కృష్ణకుమారుఁ డొక్కచేఁ
జఱచి ఖగేంద్రుచందమునఁ జక్కన దొడలు వట్టి కన్నులం
జొఱచొఱ దుర్విషానలము జొబ్బిలుచుండఁగ నెత్తి లీలతో
జిఱజిఱఁ ద్రిప్పి వైచెఁ బరిశేషిత దర్పముఁ గ్రూరసర్పమున్. 662

మిక్కిలి బలశాలి, మహావీరుడునైన శ్రీకృష్ణుడు ఏమాత్రమూ భయసందేహములులేక, తన చేతితో కాళియుని

పడగలపై గట్టిగా చఱచెను. గరుత్మంతునివలె ఒడుపుతో సర్పముయొక్క దవడలను పట్టుకొని, పైకెత్తి, గిరగిరత్రిప్పివేసెను. అంతటితో ఆ కాళియుని యొక్క కన్నులనుండి విషాగ్నులు వెల్లుబికెను, ఆ దెబ్బతో అతని గర్వము అణగిపోయెను.

వ. ఇట్లు వేగంబున నాగంబు వీచి వైచి, జగజెట్టియైన నందునిపట్టి రెట్టించిన సంభ్రమంబున. 663

సీ. ఘన యమునానదీ కల్లోలఘోషంబు సరస మృదంగ ఘోషంబు గాఁగ
సాధు బృందావనచర చంచరీక గానంబు గాయక సుగానంబు గాఁగఁ
గలహంస సారస కమనీయ మంజు శబ్దంబులు తాళశబ్దములు గాఁగ
దివినుండి వీక్షించు దివిజ గంధర్వాది జనులు సభాసీనజనులు గాఁగ
తే. బద్మరాగాది రత్న ప్రభాసమాన మహిత కాళియఫణి ఫణామండపమున
నళినలోచనవిఖ్యాత నర్తకుండు నిత్య నైపుణ్యమునఁ బేర్చి నృత్యమాడె. 664

తిరుగులేని పరాక్రమశాలియైన నందకుమారుడు ఇట్లు ఆ సర్పమును మిక్కిలి వేగముతో త్రిప్పికొట్టిన పిమ్మట ఔట్టించిన సంభ్రమముతో (ఉత్సాహముతో)ఒప్పాఱెను. ప్రసిద్ధ నర్తకుడైన ఆ కమలలోచనుడు పద్మరాగాది మణులతో భాసిల్లుచున్న, కాళియుని పడగలనెడి మండపమునందు తన సహజమైన నేర్పుతో విజృంభించి నృత్యము చేసెను. అప్పుడు గొప్పవియగు యమునానదీతరంగముల ధ్వనులు వినసొంపైన మృదంగధ్వనులుగా విలసిల్లెను. బృందావనమున సంచరించెడి తుమ్మెదలయొక్క మధురఝుంకారములు గాయకులయొక్క కమ్మనిగానములుగా విరాజిల్లెను. కలహంసలయొక్క, బెగ్గురుపక్షులయొక్క శ్రావ్యములైన మనోజ్ఞశబ్దములు తాళములై ఒప్పాఱెను. ఆకాశమునందుండి ఈ నృత్యమును వీక్షించుచున్న దేవతలు, గంధర్వులు మొదలగువారు సభాసదులై అలరారుచుండిరి. ఇట్లు మృదంగాదుల సహకారముతో ఆ నటనసూత్రధారినృత్యము వైభవోపేతముగా రంజిల్లెను.

శా. కుక్షిన్ లోకములున్న గౌరవముతో గోపాకృతిన్నున్న యా
రక్షోహంత వడిన్ మహాఫణిఫణారంగప్రదేశంబుపై
నక్షీణోద్ధతి నాడుఁ బాడుఁ జెలఁగున్ హాసంబుతోడం బద
ప్రక్షేపంబులు సేయు గేళిగతులం బ్రాణైక శేషంబుగన్. 665

సమస్తలోకములను తన కడుపులో పదిలపఱచిన ఆ శ్రీహరిబరువును వివరించుట ఎవరితరము? అట్టి బరువుతో గోపాలుని ఆకృతిలోనున్న ఆ రాక్షససంహారకుడు (శ్రీకృష్ణుడు) మిగులవేగముగా కాళియుని పడగలు అనెడి రంగస్థలముపై ఎంతయు విజృంభించి ఆడెను, పాడెను. దరహాసము చేయుచు, లీలావిలాసగతులతో లయబద్ధముగా అడుగులువేసెను. అంతట ఆ కాళియుని ప్రాణములు అన్నుబట్టెను.

క. ఘనతర సుషిరానంద స్వనములతో సిద్ధ సాధ్యచారణ గంధ
ర్వ నిలింప మునిసతులు చ, య్యనఁ గురిసిరి విరులవానలాడెడు హరిపై. 666

అంతట సిద్ధులు, సాధ్యులు, చారణులు, గంధర్వులు, దేవతలు, మునిపత్నులు, మున్నగువారు మిక్కిలి సంతోషముతో వేణువులు మొదలగు వాద్యముల మధురస్వరములను అత్యద్భుతముగా ఆలపించుచున్నవారై నృత్యము చేయుచున్న శ్రీహరి (కృష్ణుని)పై ఆకాశమునుండి పూలవాన కురిపించిరి.

వ. ఇట్లు దుష్టజన దండధరావతారుండైన హరి, వడి గలిగిన పడగలమీఁదఁ దాండవంబు సలుప, బెండువడి, యొండొండ ముఖంబుల రక్తమాంసంబులుమియుచుఁ గన్నుల విషంబు గ్రక్కుచు, నుక్కు సెడి, చిక్కి, దిక్కులు సూచుచుం, గంఠగత ప్రాణుండై ఫణీంద్రుండు తన మనంబున. 667

దుష్టజనులపాలిటి మృత్యుదేవతయైన అవతారమూర్తియగు శ్రీకృష్ణుడు వడివడిగా ఆ మహాసర్పముయొక్క పడగలపై నాట్యము చేయసాగెను. అప్పుడు కాళియుడు శక్తినికోల్పోయి, నోళ్లనుండి రక్తమాంసములను వెళ్లగ్రక్కుచుండెను. అతని కన్నులనుండి విషము వెల్లుబుకుచుండెను. మదమణగిపోవుటతో అతడు కృశించి, దిక్కులు చూడసాగెను. ప్రాణములు అన్నుబట్టగా అతడు తన మనస్సులో ఇట్లు తలపోయసాగెను.

ఉ. వేలుపులైన లావు సెడి వేదనఁ బొందుచు నా విషానల
జ్వాలలు సోఁకి నంతటన చత్తురు నేఁడిది యేమి చోద్యమా
భీల విషాగ్ని హేతిచయపీడకు నోర్చియుఁ గ్రమ్మఱంగ నీ
బాలుఁడు మత్ఫణాశతము భగ్నముగా వెసఁ ద్రొక్కి యాడెడిన్. 668

'నా విషాగ్నిజ్వాలలు సోకినంతనే దేవతలు సైతము శక్తిహీనులై వేదనపడుచు అసువులను కోల్పోయెదరు. కాని ఈ బాలుడుమాత్రము భయంకరమై నా విషాగ్నిజ్వాలలధాటికి తట్టుకొని నిలబడుటయేగాక నా నూఱుపడగలను చిత్తుచిత్తు గావించుచు, వాటిపైన నిర్భయముగా ఆడుచున్నాడు. ఇది మిగుల ఆశ్చర్యకరముగా ఉన్నది.

క. ఈతఁడు సర్వచరాచర, భూతేశుండైన పరమపురుషుఁడు సేవా
ప్రీతుఁడు శ్రీహరి యగు నని, భీతిన్ శరణంబు నొందె బిట్టలసి నృపా! 669

మహారాజా! ఈతడు సామాన్యుడుకాడు. నిజముగా సకలచరాచర ప్రాణులకును ప్రభువైన ఆ పరమేశ్వరుడే. సేవలవలనమాత్రమే ఈతడు ప్రసన్నుడగును' అని తలంచుచు మిక్కిలి అలసియున్న ఆ కాళియుడు ఆ శ్రీహరిని శరణుజొచ్చెను.

## కాళియునిభార్యలైన నాగాంగనలు శ్రీకృష్ణుని నుతించుట

వ. ఇట్లు క్రూరంబులయిన హరిచరణప్రహారంబులం బడగలెడసి, నొచ్చి, చచ్చిన క్రియనున్న పతిం జూచి, నాగకాంతలు దురంతంబైన చింతాభరంబున నివ్వటిల్లెడు నెవ్వగల నొల్లంబోయి, పల్లటిల్లిన యుల్లంబుల,670

దుష్టులను శిక్షించుటలో కఠినములైన శ్రీహరియొక్క పాదముల దెబ్బలకు పడగలు నుగ్గునుగ్గుకాగా, చచ్చినవానివలె పడియున్న తమపతిని నాగకాంతలు చూచిరి. అంతట వారు అంతులేని దుఃఖభారముతో దురపిల్లుచు తల్లడిల్లసాగిరి.

మ. కచబంధంబులు వీడ భూషణములాకంపింపఁ గొఁదీవియల్
కుచయుగ్మంబులవ్రేఁగునం జడియఁబైకొంగుల్ వడిన్ జాఱగాఁ
బ్రచురభ్రాంతిఁ గలంగి ముందట రుదద్బాలావలిం గొంచు ప్రు
క్కుచు భక్తిం జని కాంచిరా గుణమణిన్ గోపాలచూడామణిన్. 671

వ. కని దండప్రణామంబులాచరించి, నిటలతట ఘటిత కరకమలలై యిట్లనిరి. 672

ఆ స్థితిలో వారియొక్క కొప్పుముడులు వీడిపోయెను. ఆభరణములు అటునిటు ఊగుచుండెను. వక్షఃస్థలభారముతో తీగెలవలె సుకుమారమైన వారిసన్నని నడుములు వణికిపోవుచుండెను, పైటకొంగులు జాఱిపోవుచుండెను. వారు మిగుల భ్రాంతికి లోనై కలవరపడసాగిరి, తమకు ముందుభాగమున బోరున ఏడ్చుచున్న పిల్లలను తీసికొని, భయభక్తులతో సద్గుణసంపన్నుడగు శ్రీకృష్ణుని గాంచిరి. వెంటనే వారు ఆ ప్రభువునకు దండప్రణామంబులాచరించి, ఫాలభాగమున చేతులు జోడించి, ఇట్లు స్తుతించిరి.

క. క్రూరాత్ముల దండింపఁగ, ధారుణిపై నవతరించి తనరెడి నీ కీ
క్రూరాత్ముని దండించుట, క్రూరత్వము గాదు సాధుగుణము గుణాఢ్యా! 673

గుణనిధీ! క్రూరాత్ములను దండించుటకై (శిక్షించుటకై) నీవు ఈ లోకమున అవతరించుచుందువు. కనుక నీవు ఈ దురాత్ముని ఇట్లు దండించుట ఏ మాత్రము దుష్టకార్యము కానేకాదు. నీవు ఇట్లు చేయుట సముచితమే.

క. పగవారి సుతులయందును, బగ యించుకలేక సమతఁ బరఁగెడి నీకుం
బగ గలదె ఖలుల నడఁచుట, జగదవనముకొఱకుఁగాక జగదాధారా! 674

జగన్నాథా! నీయెడ శత్రుభావము గల్గియున్న దుష్టులను దండించినను, నీవు వారిసుతులపై మాత్రము కనికరమునే (ప్రసన్నత్వమునే) కనబఱచుచుందువు[1] లోకకల్యాణార్థము (జగద్రక్షణము కొఱకై) దుర్మార్గులను హతమొనర్చుచుందువేగాని, యథార్థముగా నీకు ఎవ్వరిపైనను శత్రుభావమే యుండదు.

క. నిగ్రహమె మము విషాస్యుల, నుగ్రుల శిక్షించుటెల్ల నూహింప మహా
నుగ్రహము గాక మాకీ, నిగ్రహము విషాస్యభావనిర్గతిఁజేసెన్. 675

స్వామీ! మేము (సర్పజాతివారము). కోఱలయందు విషముగలవారము, క్రూరాత్ములము. కనుక నీవు మమ్ము ఇట్లు శిక్షించుట వాస్తవమునకు అనుగ్రహించుటయే, నిగ్రహించుట ఏమాత్రమూ కాదు. నీవు మమ్ము దండించుటవలన మాలోని విషగర్వము తొలగిపోయినది. (కనువిప్పు కలిగినది).

ఉ. ఎట్టితపంబు సేసెనొకొ యెట్టి సుకర్మములాచరించెనో
యెట్టి నిజంబు వల్కెనొకొ యీ ఫణి పూర్వభవంబునందు ము
న్నెట్టి మహానుభావులకు నెన్నఁడు జేరువ గాని నీవు నేఁ
డిట్టి వినోదలీలఁ దలలెక్కి నటించెదవీఫణీంద్రుపై. 676

ప్రభూ! ఈ కాళియుడు తన పూర్వజన్మలలో ఎంతటి తపస్సు చేసెనో? ఎట్టి సత్కర్మలను ఆచరించెనో? ఎంతగా సత్యవ్రతమును పాటించెనో. ఎఱుగము. కాని ఎంతటి మహాత్ములకును లభ్యముగాని నీవు నేడు నీ వినోదలీలలతో ఈతనిపడగలపై నాట్యము చేసితివి. (నీ పాదకమలముల స్పర్శతో ఈతనిని ధన్యునిగావించితివి). కావున ఇదియంతయు ఈతనిపురాకృతసుకృతఫలమే.

మ. బహుకాలంబు తపంబు సేసి వ్రతముల్ పాటించి కామించి నీ
మహనీయోజ్జ్వల పాదరేణుకణ సంస్పర్శాధికారంబు శ్రీ
మహిళారత్నము తొల్లి కాంచె నిదె నేమంబేమియున్‌లేక యీ
యహి నీపాదయుగాహతిం బడసె నేఁ డత్యద్భుతంబీశ్వరా! 677

సర్వేశ్వరా! స్త్రీలకే తలమానికమైన లక్ష్మీదేవి ఎంతోకాలము తపస్సుచేసి, ఎన్నో నోములునోచి, నిన్నే తన సర్వముగా భావించి, త్రికరణశుద్ధిగా నిన్ను సేవించినది. తత్ఫలితముగా ఆ దేవి దేదీప్యమానముగా వెలుగొందు నీ పాదపద్మములయొక్క ధూళికణములను స్పృశించు భాగ్యమును పొందినది. కాని ఏ నియమములను పాటింపకయే ఈ కాళియుడు నీ పాదస్పర్శకు నోచుకొనెను. ఇది ఎంతయు అద్భుతము.

1. శ్రీహరి, దుష్టులైన హిరణ్యకశిపుడు మొదలగువారిని శిక్షించినను వారి కుమారులైనప్రహ్లాదాదులపై తన అనుగ్రహమునే ప్రసరింపజేసెను. ఆ పరమాత్ముడు శిష్టరక్షకుడుగదా!

ఉ. ఒల్లరు నిర్జరేంద్రపదమొల్లరు బ్రహ్మపదంబు నొందఁగా
నొల్లరు చక్రవర్తి పదమొల్లరు సర్వరసాధిపత్యము
న్నొల్లరు యోగసిద్ధి మఱి యొండు భవంబుల నొంద నీని నీ
సల్లలితాంఘ్రిరేణువుల సంగతి నొందిన ధన్యు లెప్పుడున్. 678

సుకుమారములైన నీపాదకమలములధూళులను తలదాల్చిన మహితాత్ములు పునర్జన్మరహితమైన కైవల్యమును పొందుదురు. అట్టి ధన్యాత్ములు, చక్రవర్తి పదవినిగాని, సమస్తభూమండలాధిపత్యమునుగాని (వరుణపదవినిగాని) కోరుకొనరు. అంతేగాదు యోగసిద్ధినిగాని, దేవేంద్రపదవినిగాని, కడకు బ్రహ్మపదమును సైతము అపేక్షింపరు.

క. ఘన సంసారాహతులగు, జనులాకాంక్షింపఁగడు నశక్యంబగు శో
భనము సమక్షంబున నహి,కనియెం దామసుఁడు రోషకలితుండయ్యున్. 679

పూర్తిగా సంసారబంధములలో చిక్కుకొనినవారు పరమశ్రేయస్కరమైన నీపాదస్పర్శను కోరుకొనుటకు గూడ అర్హులు కారు. కాని తమోగుణముగలవాడు, క్రోధావేశపరుడు ఐన కాళియుడు మాత్రము నీ సాక్షాత్కారమునకును, నీ పాదస్పర్శభాగ్యమునకును నోచుకొనెను.

వ. దేవా! సకల పురుషాంతర్యామిరూపత్వంబువలనఁ బరమపురుషుండవయ్యును నపరిచ్ఛిన్నత్వంబువలన మహాత్ముండవయ్యును నాకాశాది భూత సమాశ్రయత్వంబువలన భూతవాసుండవయ్యును భూతమయత్వంబు వలన భూతశబ్దవాచ్యుండవయ్యును, గారణాతీతత్వంబువలనఁ బరమాత్ముండవయ్యును, జ్ఞానవిజ్ఞాన పరిపూర్ణత్వంబు గలిగి, నిర్గుణత్వ నిర్వికారత్వంబువలన బ్రహ్మంబవయ్యును, బ్రకృతి ప్రవర్తకత్వంబువలన ననంతశక్తివై, యప్రాకృతుండవయ్యును, గాల చక్ర ప్రవర్తకత్వంబునఁ గాలుఁడవయ్యును, గాలశక్తి సమాశ్రయత్వంబువలనం గాలనాభుండవయ్యును, సృష్టి జీవన సంహారాది దర్శిత్వంబువలనం గాలావయవ సాక్షివయ్యును నొప్పు నీకు నమస్కరించెదము. మఱియును, 680

స్వామీ! సకలపురుషులలో (సమస్తచరాచరప్రాణులలో) అంతర్యామి (జీవాత్మ) రూపంబున ఉన్నందున నీవు పరమపురుషుడవు, దేశకాలవస్తువులచేత వేఱుపడనివాడవు (అపరిచ్ఛిన్నుడవు) గావున మహాత్ముడవు, ఆకాశము మొదలైన పంచమహాభూతములకు ఆశ్రయుడవు ఐనందున నీవు భూతవాసుడవు. సకలభూతములును (ప్రాణులును) నీలో ఉన్నందున నీవు భూతమయుడవు. కావున నీవు భూతశబ్దవాచ్యుడవైతివి (మహాభూతముగా పేర్కొనబడితివి). లోకమును నిమిత్తకారణము, ఉపాదానకారణముగూడ నీవే. అనగా నీ నుండియే జగత్తంతయు వ్యక్తమైనది. కాని నీకు మాత్రము ఏ కారణములేదు. కావున నీవు పరమాత్ముడవు, జ్ఞానవిజ్ఞాన పరిపూర్ణుడవు గావున[1] త్రిగుణాతీతుడవు, షడ్వికారరహితుడవు, కావున నీవు పరబ్రహ్మవు. నీవు అనంతశక్తిమంతుడవై ప్రకృతిని ప్రవర్తింపజేయుదువు. కనుక నీవు ప్రకృతికి అతీతుడవు. అనగా అప్రాకృతుడవు. కాలచక్రమును నడపువాడవు. గావున నీవు కాలస్వరూపుడవు. కాలశక్తికి నీవు ఆశ్రయుడవు. అనగా సృష్టిస్థితిలయములకు స్థానమైనవాడవు. కనుక కాలనాభుడవు సృష్టి స్థితి లయములను కాలావయవములు అని వ్యవహరింతురు. వాటికి నీవు సాక్షిభూతుడవు. అందువలన నీవు కాలావయవసాక్షివి. అట్టి మహితాత్ముడవైన నీకు మేము నమస్కరించుచున్నాము.

1. జ్ఞానము = పంచభూతాత్మకమైన జగత్తునుగూర్చిన జ్ఞానము - లేక వేదశాస్త్రజ్ఞానము. విజ్ఞానము = జగత్తునకు ఆధారమైన పరమాత్మతత్త్వమును గూర్చి తెలిసికొనుట - లేదా 'బ్రహ్మసత్యమ్ - జగన్మిథ్య' అను తత్త్వమును ఎఱుంగుట. త్రిగుణములు = సత్త్వరజస్తమో గుణములు. షడ్వికారములు = ఉత్పత్తి, అస్తిత్వము, వృద్ధి, విపరిణామము, అపక్షయము, వినాశము.

సీ. విశ్వంబు నీవయై విశ్వంబుఁ జూచుచు విశ్వంబు సేయుచు విశ్వమునకు
హేతువవై పంచ భూతమాత్రేంద్రియములకు మనఃప్రాణబుద్ధి చిత్త
ముల కెల్ల నాత్మవై మొనసి గుణంబుల నావృత మగుచు నిజాంశభూత
మగు నాత్మచయమునకనుభూతి సేయుచు మూఁడహంకృతులచే ముసుఁగువడక
తే. నెఱి ననంతుడ వై దర్శనీయరుచివి గాక సూక్ష్ముండవై నిర్వికార మహిమఁ
దనరి కూటస్థుఁడన సమస్తంబు నెఱుఁగు నీకు మ్రొక్కెదమాలింపు నిర్మలాత్మ! 681

పరబ్రహ్మస్వరూపా! నీవు విశ్వస్వరూపుడవు. అనగా విరాడ్రూపుడవు, విశ్వద్రష్టవు, విశ్వమును సృజించువాడవు, విశ్వమునకు కారకారకుడవు. పంచభూతములకును, పంచతన్మాత్రలకును, పంచజ్ఞానేంద్రియములకును, పంచకర్మేంద్రియములకును, మనస్సు, ప్రాణము, బుద్ధి, చిత్తము అనువానికిని ఆత్మయైనవాడవు (స్వరూపుడవు).[1] త్రిగుణములచే ఆవృతమైనవాడవు, నీ అంశలైన దేవ, తిర్యఙ్మనుష్యాది ప్రాణికోటికి సుఖదుఃఖాదుల అనుభూతిని కలుగజేయువాడవు, సాత్త్విక, రాజస, తామసాహంకారములచే బద్ధుడవు కానివాడవు, నీవు అనంతుడవు. అనగా దేశకాలవస్తు విభాగములు లేనివాడవు. మనోహరమైన కాంతిస్వరూపుడవు, అణువుకంటెను సూక్ష్మమైనవాడవు, నిర్వికారుడవు, శాశ్వతుడవు, సర్వజ్ఞుడవు, అట్టి నీకు మా నమస్కారములు.

వ. మఱియుఁగలండు, లేఁడు, సర్వంబు నెఱుంగు, నించుక యెఱుంగు, బద్ధుండు, విముక్తుండొకం, డనేకుఁ డు నను నివి మొదలుగాఁగల వాదంబులు మాయవలన ననురోధింపుదురు. కావున నానా వాదానురోధకుండ వయ్యును, నభిధానాభిధేయ శక్తిభేదంబువలన బహుప్రభావప్రతీతుండవయ్యును, జక్షురాది రూపంబుల వలనఁ బ్రమాణ రూపకుండవయ్యును, నిరపేక్ష జ్ఞానంబుకలిమిం గవివయ్యును, వేదమయ నిశ్వాసత్వంబువలన శాస్త్రయోనివయ్యును, సంకర్షణ వాసుదేవ ప్రద్యుమ్నానిరుద్ధ రూపంబులవలనఁ జతుర్మూర్తివయ్యును, భక్తజనపాలకుండవయ్యును, నంతఃకరణప్రకాశకత్వంబు గలిగి, సేవకజనఫలప్రదానంబుకొఱకు గుణాచ్ఛాదకుండవయ్యును, జిత్తాదివర్తనంబులం గానందగిన గుణంబులకు సాక్షివై యొరుల కెఱుంగరామి నగోచరుండవయ్యును, దర్కింపరాని పెంపువలన నవ్యాహత విహారుండవయ్యును, సకల కార్య హేతువయ్యు, నంతఃకరణ ప్రవర్తకత్వంబువలన హృషీకేశుండ వయ్యును, సాధనవశంబు గాని యాత్మారామత్వంబువలన మునివయ్యును, స్థూల సూక్ష్మ గతులనెఱుంగుచు, నెందుం జెందక, నీవు విశ్వంబు గాకయు, విశ్వంబు నీవ యయ్యును; విశ్వభావాభావసందర్శనంబు సేయుచు, విద్యావిద్యలకుహేతువయిన నీకుం బ్రణామంబు లాచరించెదమవధరింపుము. 682

శ్రీకృష్ణా! భగవంతుడు ఉన్నాడనియు, లేడనియు, సర్వజ్ఞుడు అనియు, కించిజ్ఞుడు అనియు, మాయకు లోబడినవాడు అనియు, మాయాతీతుడు అనియు, ఏకస్వరూపుడు అనియు, అనేక రూపములలో ఉండువాడు అనియు, జనులు తమ అజ్ఞానకారణముగ వాదోపవాదములకు దిగుచుందురు. ఇట్లు నీవు పలువాదములకు తావిచ్చువాడవు. వస్తువులపేర్లను బట్టియు, వస్తువులను బట్టియు, వాటిగుణములనుఅనుసరించి వాటి భేదములవలనను పెక్కు ప్రభావములచే ప్రసిద్ధుడవు. (ప్రపంచదృష్టిగలవారికి అనేక నామములతోడను, రూపములతోడను, గుణములచేతను తోచుచుండువాడవు). చక్షురాది

1. పంచమహాభూతములు = ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి. పంచతన్మాత్రలు = శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. పంచజ్ఞానేంద్రియములు = చర్మము, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు. పంచకర్మేంద్రియములు = వాక్పాణి పాదపాయూపస్థములు. మనస్సు = సంకల్పించునది, బుద్ధి = నిశ్చయాత్మకమైనది, ప్రాణములు = పంచప్రాణములు, చిత్తము= ఆలోచించునది.

ఇంద్రియములకు ప్రమాణస్వరూపకుడవు, సాధనాంతరములతో పనిలేని దివ్యజ్ఞానసంపత్తిచే స్వయంప్రకాశకుడవు, నీ నిశ్వాసరూపములలో వేదములను ప్రకటించినవాడవు అగుటచే సమస్తశాస్త్రములకు జన్మస్థానమైనవాడవు. సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అను నాలుగు విధములరూపములుగల వాడవు (చతుర్మూర్తివి), అనన్యభక్తులకు ఆశ్రయమైనవాడవు, మనోబుద్ధ్యహంకార చిత్తములనెడి అంతఃకరణములను ప్రకాశింపజేయువాడవు అగుటవలన నిన్ను సేవించువారికి మోక్షాది ఫలములను ప్రసాదించుటకై సగుణరూపమును దాల్చినవాడవు, అంతశ్చతుష్టయముచే తెలిసికొనదగిన త్రిగుణములకు అతీతుడవైనందున నీవు బ్రహ్మజ్ఞానములేని వారికి అగోచరుడవు, తర్కములకు (ఊహలకు) అందని మహత్త్వము కలవాడవు అగుటవలన సృష్ట్యాదికార్యములయందు తిరుగులేనివాడవు, సకలకార్యములకును మూలకారణమైనవాడవు, అంతఃకరణ ఇంద్రియ వ్యాపారములను ప్రవర్తింపజేయువాడవు గనుక నీవు హృషీకేశుండవు, మంత్రాదిసాధనలకు వశముగాని ఆత్మారాముడవు ఐనందున మననశీలుడవు, స్థూల, సూక్ష్మప్రాణుల (పిపీలికాది బ్రహ్మపర్యంత) గతులను ఎఱిగియు దేనికిని అంటకయుండువాడవు, విశ్వస్వరూపుడవుగా గోచరించుచున్నను వాస్తవముగా నీవు విశ్వమునకు అతీతుడవు, విశ్వముయొక్క కలిమికిని, (ఉనికికిని) లేమికిని, (లేకుండుటకును), నీవు సాక్షివి. జ్ఞానమునకును, అజ్ఞానమునకును (మాయకును.) నీవే కారణుడవు. అట్టి పరమాత్మవైన నీకు మా నమస్కారములు.

క. లోక జని స్థితి లయములు, గైకొని చేయుదువు త్రిగుణకలితుఁడవై కా
లాకారమున నమోఘ, శ్రీకలితుఁడ వగుచు నిచ్ఛ సెందక యీశా! 683

సర్వేశ్వరా! నీవు అద్భుతములైన అణిమాది సంపదలు గలవాడవు. కాలస్వరూపుడవై త్రిగుణాత్మకమైన ప్రకృతిద్వారా (బ్రహ్మ విష్ణు మహేశ్వరుల రూపంబున) జగత్తుయొక్క సృష్టి స్థితి లయములను నెఱపుచుందువు. ఈ కార్యక్రమములను నీవు యాదృచ్ఛికముగనే (ఆసక్తిరహితుడవై) జరపుచుందువు.

క. నీశాంతలుగాని తనువులీశా! యీ మూఢజాతులీసజ్జాతుల్
నీ శాంతతనువులందుఁ, బ్ర కాశింతువు ధర్మహితముగా సుజనులలోన్ 684

పరమేశ్వరా! ముల్లోకములందు శాంతములు, అశాంతములు, మూఢములు అని తనువులు మూడు విధములు. ఇవి క్రమముగా సత్త్వగుణ, రజోగుణ, తమోగుణ ప్రధానములు. ఇవి అన్నియును నీ లీలాస్వరూపములే. ఐనను ఇప్పుడు సత్త్వగుణ ప్రధానులైన సజ్జనులే నీకు ఎంతయు ప్రీతిపాత్రములు. ఏలనన సాధుజనములను రక్షించుటకును, ధర్మమును కాపాడుటకును నీవు ఇట్లు అవతరించి, ఈ లీలలను ప్రదర్శించుచున్నావు.

ఉ. నేరములెన్న నెక్కడివి నేము తలంచు తలంపు లోపలన్
నేరుపులున్నవే సుతుల నేరమిఁ దండ్రులు త్రోసిపుచ్చరే
నేరము సేయువారి ధరణీపతులొక్కొకమాటు గావరే
నేరము గల్గు మద్విభుని నేఁడిటఁ గావఁగదే కృపానిధీ! 685

దయామయా! మేము మూఢులము (తామస ప్రవృత్తిగలవారము.) అందువలన మా తలంపులలో, చేష్టలలో దోషములు సహజములు. నీవు అనుగ్రహించినచో మా నేరములు నేరములే కావు. తండ్రులు తమ కుమారుల దోషములను పట్టించుకొనరుగదా! రాజులు ఒక్కొక్కప్పుడు నేరములు చేసినవారిని క్షమించుచుందురుగదా! నీవు జగత్పితవు, జగత్ప్రభుడవు. కనుక మా భర్త (కాళియుడు) చేసిన అపరాధములను క్షమింపుము.

శా. బాలుండీతఁడు మంచివాఁడనుచుఁ జెప్పన్ రాము క్రూరుండు దు
శ్శీలుండౌ నవు నైన నేము సుభగశ్రీఁ బాసి వైధవ్య దు

ష్టాలంకారముఁ బొంద నోడెదమనాథాలాపమాలింపవే
చాలున్ నీ పదతాండవంబు పతిభిక్షంబెట్టి రక్షింపవేఁ 686

దేవా! మూఢుడైన ఇతడు 'మంచివాడు' అని మేము పలుకుటలేదు. వాస్తవముగా ఇతడు క్రూరాత్ముడు, దుశ్శీలుడు (చెడ్డస్వభావముగలవాడు) మేము మా మాంగల్యమును కోల్పోయి, శోభాజీవితమునకు దూరమై, వైధవ్యమును భరింపజాలము. మా దీనాలాపములను ఆలించి, (మా నాథుని పడగలపై) నీ నృత్యమును చాలించి, మాకు పతిభిక్ష పెట్టుము. మమ్ము రక్షింపుము.

ఉ. ఆకులమయ్యె భోగమిదె యౌఁదలలన్నియు వ్రస్సెఁ బ్రాణముల్
రాకలఁ బోకలం బొలిసె, రాయిడి వెట్టక మా నిజేశుపై
నీ కరుణాకటాక్షములు నిల్పఁగదే తగ నో సమస్త లో
కైకశరణ్య!యో యభయకారణ! యో కమలామనోహరా! 687

లక్ష్మీమనోహరా! నీవు సర్వలోకములకును శరణ్యుడవు, ఆశ్రయించినవారికి అభయప్రదాతవు. మా పతియొక్క శరీరము అంతయును హూనమైనది, పడగలన్నియు నుగ్గునుగ్గైనవి. ఆయన యొక్క ప్రాణములు ఉండునా? పోవునా? అనుస్థితిలో ఉన్నవి. ఇక ఏ మాత్రము బాధింపక, నీ దయాదృష్టిని ప్రసరింపజేసి, మా ప్రాణేశ్వరుని కనికరింపుము.

ఆ. మమ్ముఁ బెండ్లిసేయు మా ప్రాణవల్లభు ప్రాణ మిచ్చి కావు భక్తవరద!
నీవు సేయు పెండ్లి నిత్యంబు భద్రంబుఁ బిన్ననాటి పెండ్లి పెండ్లి గాదు. 688

స్వామీ! మా పతిప్రాణములను నిలిపి, మాకు శుభములను చేకూర్చుము. నీ చేతులమీదుగా జరుగు ఈ (మా) పాణిగ్రహణము భద్రమైనది, శాశ్వతమైనది. నీ కృపకు పాత్రులమైన మాకు మా చిన్ననాటి పెండ్లి ఒక పెండ్లియేగాదు నీవు భక్తులను ఆదుకొనువాడవుగదా! దేవా! అది బొమ్మలపెండ్లి మాత్రమే.

ఇంద్ర. నీ యాన!యెవ్వారిని నిగ్రహింపండాయుగ్ర పాపాకృతినందఁ డింకన్
నీ యాజ్ఞలో నుండెడు నేఁటఁగోలెన్ మా యీశు ప్రాణంబులు మాకు నీవే. 689

సర్వేశ్వరా! నీ పాదములసాక్షిగా చెప్పుచున్నాము. ఇకమీదట మా భర్త ఎవ్వరినిగూడ బాధింపడు, ఈ భయంకరస్వరూపమును విడిచిపెట్టును. నేటినుండి నీ ఆజ్ఞానుసారముగా నడచుకొనును. కృపతో మా పతిప్రాణములను మాకు ప్రసాదింపుము".

వ. అని యిట్లు తమ పెనిమిటి బ్రతుకుఁ గోరెడి భుజగసతులయందు శరణాగతరక్షకుండైన పుండరీకాక్షుండు గరుణించి, చరణఘట్టనంబు సాలించి, తలంగిన నెట్టకేలకుఁ బ్రాణేంద్రియంబుల మరలం బడసి, చిదిసి నలఁగిన తలలు సవరించుకొని, వగర్చుచు భుజగపతి జలజనయమునికి నంజలి సేసి, మెల్లన నిట్లనియె.690

శరణాగతరక్షకుడైన పుండరీకాక్షుడు (శ్రీకృష్ణుడు) 'తమ పతికి ప్రాణభిక్ష పెట్టుము' అని వేడుకొనిన నాగాంగనల యెడ ప్రసన్నుడయ్యెను. వెంటనే ఆ స్వామి కనికరముతో తన నృత్యమును (పాదఘట్టనములను) ఆపివేసి, ప్రక్కకు తొలగెను. ఎట్టకేలకు ప్రాణములను పొందిన కాళియుడు మిగుల నలిగిపోయిన తన పడగలను సవరించుకొనెను. పిదప ఆయాసపడుచు శ్రీకృష్ణునకు అంజలిఘటించి, తిన్నగా ఇట్లు విన్నవించుకొనెను.

చ. మలఁకలు మా ప్రచారములు మా ముఖముల్ విషవహ్ని ఘోరముల్
ఖలులము రోషజాతులము గర్వులమేమొక మంచివారమే

నళినదళాక్ష! ప్రాణులకు నైజగుణంబులు మాననేర్చునే
వెలయవె మా వికారములు వింతలె మేలొనరించితీశ్వరా! 691

"పరమేశ్వరా! మా నడకలు వంకరటింకరయైనవి. ఎల్లప్పుడు బుసలుకొట్టుచు విషమును గ్రక్కుచుండెడి మా నోళ్లు ఎంతయు భయంకరమైనవి. మేము కటిక దుర్మార్గులము, మా సర్పజాతికి క్రోధము ఎక్కువ. మాకు అహంకార గర్వములు అధికములు. మేము ఏవిధముగను మంచివారము కానేకాము. ఏ ప్రాణులకైనను (ఎవ్వరికైనను) పుట్టుకతో వచ్చిన స్వభావములు మాఱవుగదా! మా దుశ్చేష్టలు అన్నియును నీవు ఎఱింగినవే (లోకప్రసిద్ధములే!) ఐనను, ప్రభూ! మాకు మేలు చేసితివి. నీ కృప అపారముగదా!

సీ. వివిధ భావాకార వీర్య బీజాశయ జవ యోనియుతముగా జగము లెల్ల
నీవ చేసితి మున్ను నే మా జగంబులో సహజ కోపనులము సర్పములము
దుర్వారమైన నీ తోరంపుమాయ నే మెఱిఁగి దాఁటెడుపనికెంతవార
మంతకుఁ గారణ మఖిలేశ్వరుండవు సర్వజ్ఞుఁడవు నీవు జలజనయన!
తే. మనిచెదేనియు మన్నించి మనుపు నన్ను నిగ్రహించెదవేనియు నిగ్రహింపు
మింక సర్వేశ! మా యిమ్ము లెందుఁ గలవు చిత్తమందున్న క్రమమునఁజేయఁదగును. 692

కమలాక్షా! వివిధములగు భావవికారములు, ఆకారములు, శక్తులు, ప్రాణుల పుట్టుకలకు కారణములగు బీజములు, వేగములు, స్త్రీ పురుషక్షేత్రములు మొదలగు వాటితోగూడిన సకలలోకములను నీవే సృష్టించితివి. మా సర్పజాతియంతయు నీ సృష్టిలోని భాగమే. సహజముగనే మేము కోపస్వభావముగలవారము. అద్భుతమైన నీ మాయ అధిగమింపరానిది. దానిని దాటుటకు మేము ఎంతటివారము. జగన్నాథుడవైన నీవే ఈ అన్నింటికిని కారణము. నీకు తెలియనిదే లేదు .కాపాడదలచినచో మమ్ము కనికరింపుము. లేనిచో శిక్షింపుము. సర్వేశ్వరా! మేము నివసించుటకు అనుకూలమైన ప్రదేశములెవ్వి? నీ ఇష్టానుసారము అనుగ్రహింపుము.

క. నా పుణ్య మేమిచెప్పుదు, నీ పాదరజంబుఁ గంటి నే సనకాదుల్
నీపాదరజము గోరుదు, రే పదమందున్న నైన నిఁక మేలు హరీ! 693

స్వామీ! నిరంతరము సనకాదియోగీశ్వరులు సైతము కోరుకొనుచుండెడి నీ పాదధూళి నేడు నాకు అబ్బుట నా సుకృతఫలము. పూర్వజన్మలలో నేను చేసికొనిన పుణ్యాము ఎట్టిదో నాకు తెలియదు. నీ కృపకు నోచుకొనిన నేను ఎచట ఉన్నను నాకు మేలే జరుగును".

వ. అని విన్నవించినఁ, గాళియుపలుకులు విన నవధరించి, కారుణ్యమానసుండయిన సర్వేశ్వరుం డతని కిట్లనియె.

క. గోవర్గముతో మనుజులు, త్రావుదు రీ మడుఁగు నీరు దగదిందుండన్
నీవును నీ బాంధవులును, నీ వనితలు సుతులుఁ జనుఁడు నేఁడంబుధికిన్. 695

ఇట్లు విన్నవించుకొనిన కాళియుని పలుకులను ఆలకించి, కరుణామూర్తియైన శ్రీకృష్ణప్రభువు అతనితో ఇట్లు నుడివెను. "కాళియుడా! ఈ మడుగులోని జలములను, గోవులును, గోపాలురును త్రాగుచుందురు. కనుక నీవు ఈ మడుగులో ఉండరాదు. వెంటనే నీవు నీ భార్యలతో, సుతులతో, బంధువులతో గూడి నేడే సముద్రమునకు చేరుము.

క. విను నే శాసించినకథ, మనమునఁ జింతించి రేపు మాపును గీర్తిం
చిన మనుజులు నీ భయమును, విను మెన్నఁడుఁ బొందరెందు విషవిజయముతోన్. 696

ఓయీ! నేను నిన్ను అదుపుచేసిన ఈ కథను మనస్సులో స్మరించుచు ఎల్లప్పుడు ప్రస్తుతించెడి వారికి ఎట్టి విషప్రమాదమూ ఉండదు. వారు ఎన్నడును నీవంటి సర్పముల భయమును పొందరు.

చ. ఇది మొదలెవ్వరైన నరులీయమునా నళినీ హ్రదంబులో
వదలక తోఁగి నన్ను నుపవాసముతోడఁ దలంచి కొల్చుచుం
గదలక దేవతాదులకుఁగా జలతర్పణమాచరించినన్
సదమలచిత్తులై దురితసంఘముఁ బాయుదురాక్షణంబునన్. 697

ఇక ఇప్పటినుండి ఎవ్వరైనను ఈ యమునానదీమడుగులో పూనికతో స్నానములను ఆచరించి, ఉపవాసదీక్షతో నన్ను స్మరించుచు సేవించినచో, వారు మిగుల పవిత్రులగుదురు. అట్టివారు దేవతలకును, ఋషులకును, పితృగణములకును తర్పణములను ఆచరింపగా, వారిచిత్తములు పునీతములై నిర్మలములగును. అప్పటికప్పుడే వారి పాపములన్నియును పటాపంచలైపోవును.

ఆ. గరుడభీతి రమణకద్వీప మొల్ల కీ మడువుఁ జొచ్చి తీవు మత్పదాబ్జ
లాంఛనములు నీ తలను నుంటఁ జూచి యా పక్షిరాజు నిన్నుఁ బట్టఁడింక. 698

కాళియుడా! గరుత్మంతునకు భయపడి, నీవు రమణకద్వీపమును వీడి ఈ మడుగునకు చేరితివి. నీ తలలపై నా పాదముద్రలను చూచినంతనే ఆ పక్షిరాజు నిన్ను పట్టుకొనుట మానును".

వ. అని యిట్లు విచిత్రవిహారుండైన గోపాలకృష్ణకుమారుం డానతిచ్చిన, నియ్యకొని, చయ్యన న య్యహీంద్రుండు, తొయ్యలులుం, దాను నెయ్యంబుననయ్యీశ్వరునకు నవ్య దివ్యాంబరాభరణ రత్నమాలికానులేపనంబులు సమర్పించి, తేంటి తండంబులకు దండ యగు నీలోత్పలంబుల దండ యిచ్చి, పుత్ర మిత్ర కళత్రసమేతుండై, బహువారంబులు గైవారంబు సేసి, వలగొని, మ్రొక్కి,లేచి, వీడ్కొని, రత్నాకర ద్వీపంబునకుం జనియె నిట్లు.

ఇట్లు అద్భుతలీలలకు కుదురైన శ్రీకృష్ణుడు ఇచ్చిన ఆనతిని కాళియుడు తలదాల్చెను. వెంటనే ఆ సర్పరాజు తన పత్నులతోగూడి, భక్తితో ఆ పరమాత్మునకు దివ్యములైన నూతన వస్త్రములను, ఆభరణములను, రత్నహారములను, అనులేపనములను (పరిమళగంధాదులను) సమర్పించెను. తుమ్మెదలకు నెలవైన నల్లకలువలదండను అలంకరించెను. పిదప అతడు భార్యలతో, సుతులతో, మిత్రులతో గూడి పలుమాఱులు (పెక్కువిధముల) స్తుతించి, ప్రదక్షిణపూర్వకముగా ప్రణమిల్లెను. అనంతరము అతడు ఆ స్వామిని వీడ్కొని, సపరివారముగా రత్నాకరద్వీపంబునకు చేరెను.

క. వారిజలోచనుఁ డెవ్వరు, వారింపఁగ లేని ఫణినివాసత్వంబున్
వారించిన యమున సుధా, వారిం బొలుపారె నెల్లవారికిఁ బ్రియమై. 700

ఇట్లు కమలలోచనుడైన శ్రీకృష్ణుడు ఎవ్వరికిని లొంగనికాళియుని అదుపుచేసి, అతనినివాసమును మార్చెను. అంతట యమునానదియొక్క అమృతజలములు ఎల్లరకును ప్రీతిపాత్రములాయెను. (అందఱును ఆ మధుర జలములను త్రావుచు సంతోషముతో పొంగిపోసాగిరి.)

## కాళీయునిపూర్వకథ

వ. అనిన విని, మునీంద్రా! యేమి కారణంబునఁ గాళియుండు భుజగనివాసంబయిన రమణక ద్వీపంబు విడిచె నతం డొక్కరుండును గరుడున కేమి తప్పుఁదలంచె నని నరవరుం డడిగిన, మునివరుండిట్లనియె.701

ఈ విషయములను అన్నింటిని వినిన పిదప పరీక్షిన్మహారాజు ఆ శుకయోగితో ఇట్లు నుడివెను. "మహర్షి! కాళియుడు సర్పములకు నివాసమైన రమణకద్వీపమును విడిచిపెట్టుటకు కారణమేమి? అతడు ఒక్కడుమాత్రమే గరుత్మంతునకు ఏమి హానిని గూర్చెను" అని ఆ రాజు అడుగగా అంతట మునీశ్వరుడు ఇట్లు వచించెను.

సీ. సర్పభీరువులైన జనులెల్ల నెలనెల సరస భక్షములు వృక్షముల మొదల
సర్పంబులకుఁ బెట్ట సర్పంబులును మును సర్పాంతకుఁడు దమ్ముఁ జంపకుండఁ
బ్రతిమాసమును దమ భాగభక్ష్యంబు లాపక్షిరాజున కిచ్చి బ్రదుకుచుండఁ
విషవీర్య దుర్మదావిష్టుఁడై కాళియుం డహికులాంతకుని పాలపహరించి,
తే. యూక తన పాలిబలిభాగమెల్లఁ దినిన విని ఖగేంద్రుఁడు కోపించి వీనితలలు
చీరి చెండాడి భోగంబు చించి వైచి ప్రాణములఁ బాపి వచ్చెదఁ బట్టి యనుచు 702

క. అక్షీణ కనక సన్నిభ, పక్ష యుగోద్భూత ఘోరపవమాన మహా
విక్షేప కంపితానే, క క్షోణిధరేంద్రుఁ డగుచు గరుడుఁడు వచ్చెన్. 703

"రాజా! జనులు సర్పములకు భయపడి, ప్రతిమాసమునందును వాటికొఱకై కమ్మని భక్ష్యములను వృక్షమూలములయందు ఉంచుచుండిరి. సర్పాంతకుడైన గరుత్మంతుడు తమను చంపకుండుటకై అవి ఆ సర్పములు తమకు సమర్పింపబడిన భక్ష్యములను ఆ పక్షిరాజునకు ఆహారముగా (కానుకగా) ఇచ్చుచు నిశ్చింతగా బ్రతుకుచుండెను. విషగర్వముచే మదించియున్న కాళియుడు మాత్రము తనకు సమర్పింపబడిన భక్ష్యములను (తోడివారివలె) గరుడునకు అప్పగింపక తానే తినుచుండెను. ఆ విషయమును ఎఱిగిన గరుత్మంతుడు మిగుల కుపితుడై, 'ఈ అహంకారియొక్క పడగలను పట్టుకొని చీల్చిచెండాడెదను, శరీరమును ఛిన్నాభిన్నమొనర్చి, ప్రాణములను హరించెదను' అని వచించి, అందులకై పూనుకొనెను. పిమ్మట ఆ ఖగరాజు కాళియునిమదమణచుటకై రమణకద్వీపమునకు విచ్చేసెను. అతడు ఆ ద్వీపమునకు పయనించుచు బంగారుకాంతులీనెడి బలమైన తన రెండు ఱెక్కలను విసరగా, ఏర్పడిన మహావాయువులధాటికి పెద్దపెద్ద పర్వతములు సైతము కంపించెను.

ఉ. వచ్చిన సర్పవైరిఁ గని వ్రాలక లేచి మహాఫణావళుల్
విచ్చి దృగంచలంబుల నవీన విషాగ్ని కణంబులొల్కఁగా
నుచ్చల దుగ్రజిహ్వలు మహోద్ధతిఁ ద్రిప్పుచు నూర్పులందుఁగా
ర్చిచ్చెగయంగఁ బాఱిఁ కఱచెన్ విహగేంద్రు నహీంద్రుఁడుగ్రతన్. 704

కాళియుడు తనను చంపుటకై వచ్చిన గరుత్మంతుని చూచెను. అంతట అతడు ఏ మాత్రమూ భీతిల్లక ఆ పక్షీంద్రుని ఎదుర్కొనుటకై తన పడగలను విప్పెను. క్షణములో తన చూపులనుండి విషాగ్నికణములను వెల్రిగ్క్కెను, భయంకరమైన నాల్కలను బయటికి చాచి, త్రిప్పుచు తన పరాక్రమమును ప్రకటించెను. తన పూత్కారముల (బుసల)నుండి దావాగ్నులను చిమ్ముచు ఒక్కయుదుటన లేచి గరుత్మంతుని భీకరముగా కాటువేసెను.

క. కఱచిన భుజగమురదములు, విఱుగఁగ వదనములు విషము వెడల్గఁగ శిరముల్
పఱియలుగ నడిచె గరుడుఁడు, తఱిమి కనకరుచులు గలుగు తనదాఱెక్కన్ 705

వెంటనే గరుడుడు 'తనను కాటువేసిన కాళియుని' బంగారుకాంతులీను తన ఎడమఱెక్కతో చఱచెను. ఆ దెబ్బకు ఆ మహాసర్పము యొక్క కోఱలు ముక్కలైపోయెను. కంఠమునందలి విషము బయటికి వచ్చెను. అతని తలలు (పడగలు) బ్రద్దలాయెను.

వ. ఇట్లహికులారాతిచేత వ్రేటువడి, వెఱచి, పఱతెంచి, కాళియుండీగభీరంబయిన మడుఁగుఁ జొచ్చె. మఱియు నొక్క విశేషంబు గలదు. 706

రాజా! ఇట్లు గరుత్మంతునిచేతిలో చావుదెబ్బతినిన కాళియుడు మిగుల భీతిల్లి ఆ ద్వీపమును విడిచిపెట్టి, పఱుగుపఱుగున లోతైన ఈ యమునానది మడుగులో ప్రవేశించెను. అది సరే! ఇంకొక విశేషము గూడగలదు దానిని వివరించెదను వినుము.

సీ. ముమ్ము సౌభరి యను ముని యీ హ్రదంబునఁదపము సేయుచునుండ ధరణిలోన
నాఁకలి గొని పన్నగాంతకుఁ డొకనాఁడు సనుదెంచి యిందుల జలచరేంద్రు
నొడిసి భక్షించిన నున్న మీనము లెల్ల ఖిన్నంబులై వగఁగ్రిస్సి యున్నఁ
జూచి యా మునిరాజు శోకించి కోపించి గరుడుఁడుఁ నేఁడాదిగాఁగ నిందుఁ
తే. జొచ్చి మీనంబులను మ్రింగఁ జూచె నేని జచ్చుఁ గావుతమని యుగ్రశాప మిచ్చెఁ
గాళియుం డొక్కఁడా శాపకథ యెఱుంగు నితర భుజగంబు లెవ్వియు నెఱుఁగ వధిప! 707

పూర్వకాలమున 'సౌభరి' అను ఒక మహామునిగలడు. అతడు ఈ మడుగున (మడుగు సమీపమున) తపస్సు చేసికొనుచుండెను. ఒకనాడు గరుత్మంతుడు ఎంతయు ఆకలిగొని భూతలమునగల ఈ మడుగునకు వచ్చి, ఒక మహామీనమును ఒడిసిపట్టుకొని భక్షించెను. అంతట అచటి చేపలు అన్నియును ఆ సంఘటనకు భీతిల్లి మిగుల దుఃఖముతో కృశించెను. ఆ చేపలపరిస్థితిజూచి, ఆ మునీశ్వరుడు ఎంతయు ఖిన్నుడయ్యెను. పిదప ఆ ఋషి కుపితుడై 'గరుత్మంతుడు ఈనాటినుండి, ఈ మడుగునకువచ్చి, చేపలను తినుటకు ప్రయత్నించినచో వెంటనే అతడు మృతిచెందును' అని తీవ్రమైన శాపమును ఇచ్చెను. ఈ శాపవిషయము కాళియునకు మాత్రమే తెలియును. ఇతర సర్పములకు తెలియదు.

వ. అది కారణంబుగాఁ గాళియుండీమడుఁగుఁ జొచ్చియున్న గో మనుజ రక్షణార్థంబు కృష్ణుం డతని వెడలించె. నిట్లు దివ్య గంధాంబర సువర్ణ మణిగణ మాలికాలం కృతుండై, మడుఁగు వెడలి వచ్చిన మాధవుం గని ప్రాణలాభంబులం బొందిన యింద్రియంబులం బోలె, యశోదా రోహిణీ సమేతలయిన గోపికలును, నంద సునందాదులైన గోపకులును మూర్ఛలం బాసి, తేఱి, తెప్పఱి, లేచి, పరమానందంబునం బొందిరి. బలభద్రుండు తమ్ముని నాలింగనంబు సేసె నప్పుడు, 708

అందువలన కాళియుడు 'ఈ మడుగు తనకు సురక్షితమైనదని భావించి, ఇందు ప్రవేశించి నివసింపసాగెను. ఇప్పుడు శ్రీకృష్ణుడు గోవులను, గోపాలురు మున్నగు వారిని రక్షించుటకై ఈ మడుగు నుండి కాళియుని పంపివేసెను. పిమ్మట శ్రీకృష్ణప్రభువు ఆ మడుగునుండి బయటికివచ్చెను. అప్పుడు ఆ స్వామి దివ్యములైన సుగంధములతో, వస్త్రములతో, మణులు చెక్కిన బంగారు ఆభరణములతో అలరారుచుండెను. అప్పుడు యశోదాదేవియు, రోహిణియు, గోపికలును, నందసునందాది గోపాలురును ఆ స్వామిని గాంచినంతనే వారికి ప్రాణములులేచి వచ్చెను. మూర్ఛనుండి తేఱుకొనిన ఆ నందయశోదాదులలో చైతన్యము వెల్లివిరిసెను. అంతటవారు అందఱును పరమానందభరితులైరి. బలరాముడు సంతోషముతో తన తమ్ముని ఆలింగనము చేసికొనెను.

క. అంకెలువైచె వృషభములహంకారముతోడ లేఁగలట్టి ట్టుటికెం
బొంకముల నొప్పె ధేనువు, లంకురితములయ్యెఁ దరువు లా హరిరాకన్ 709

శ్రీహరి తమకడకు వచ్చినంతనే వృషభములు ఆనందముతో ఱంకెలు వేసెను, లేగలు అటునిటు తిరుగుచు గంతులు వేయసాగెను. ఆవులు సంతోషముతో ఉప్పొంగిపోయెను. చెట్లు చిగిర్చెను.

క. నీ సుతుఁడహిచే విడివడె, నీ సురుచిర భాగ్యమహిమ నిశ్చలమనుచున్
భూసురులు సతులు దారును భాసుర వచనముల నందుఁ బలికిరిలేశా! 710

మహారాజా! పిదప బ్రాహ్మణులు, ముత్తైదువలు 'నీ కుమారుడు కాళియసర్ప ప్రమాదమునుండి బయటపడి వచ్చెను. నీ మహాభాగ్యమును ఎంతని కొనియాడగలము? అది తిరుగులేనిది" అని పలుకుచు నందుని అభినందించిరి.

శా. నిన్నాయుగ్ర భుజంగమంబు గఱవన్ నీ వాపదం బొందుచున్
నన్నేమంటి తనూజ!యోడవు గదా నా కూన! నా తండ్రి రా
వన్నా! యంచు శిరంబు మూర్కొని నిజాంకాగ్రంబుపై నిల్పుచున్
గన్నీరొల్కఁగఁ గౌగిలించెఁదనయున్ గారాముతోఁదల్లి దాన్ 711

పిమ్మట యశోదాదేవి 'నా బుజ్జికన్నా! నాయనా! నా దగ్గఱకు రమ్మ' అని పల్కుచు, తన ముద్దుల కన్నయ్యను గారాబముతో చేరదీసి, ఆతని శిరమును మూర్కొని, ఆ చిన్నారిని తన యొడిలో కూర్చుండబెట్టుకొనెను. అక్కున జేర్చుకొని ఆనందబాష్పములను రాల్చెను. అనంతరము ఆ తల్లి తన కృష్ణునితో 'కుమారా! ఆ మహాసర్పము నిన్ను కఱచినప్పుడు నీకు ఏమాత్రమూ ప్రమాదము జరుగలేదు గదా! అప్పుడు నన్ను తలచుకొన్నావా? నీకు భయము కలుగలేదుగదా!' అని ఆత్మీయముగా అడిగెను.

## గోవులను, గోపాలురను, గోపికలను కార్చిచ్చు చుట్టుముట్టుట

వ. ఇట్లు పరమసంతోషులై, ఘోషజనులారేయి కాళిందీటతంబున నాఁకలి నీరువట్టుల డస్సి, క్రుస్సి, గోవులుం దారునుండ నగణ్యంబగు న య్యరణ్యంబున నొక్క దవానలంబు పుట్టి, చుట్టుముట్టికొని నడురేయి నిద్రితం బైన వ్రజంబుమీఁద గదిసిన, నదరిపడి, లేచి, దందహ్యామాన దేహులయి సకల జనులును మాయామనుజ బాలకుండైన హరికి శరణాగతులై, యిట్లనిరి. 712

ఆ సంతోషములో మునిగి తేలిన ఆ వ్రజవాసులు ఆ రాత్రికి ఆ యమునానది తీరమునందే ఉండిపోయిరి. వారును, గోవులును, ఆకలిదప్పులకులోనై ఎంతయు అలసి కృశించియుండిరి. ఇంతలో దట్టమైన ఆ అడవిలో దావాగ్ని ఏర్పడి వారిని చుట్టుముట్టెను. అర్ధరాత్రివేళ గాఢనిద్రలో మునిగియున్న ఆ గోపాలాదులు తమ చుట్టును వ్యాపించుచున్న కార్చిచ్చును జూచి, అదిరిపడి లేచిరి. ఆ మంటలకు గాయములపాలై, వారందఱును మాయాబాలకుడైన ఆ హరిని (శ్రీకృష్ణుని) శరణుజొచ్చి ఇట్లు విన్నవించిరి.

మ. అదె వచ్చెన్ దవవహ్ని ధూమకణ కీలాభీల దుర్వారమై
యిదె కప్పెన్ మము నెల్లవారి నిటమీఁ దేలాగు రక్షింపు నీ
పదపద్మంబుల కాని యొండెఱుఁగ మోపద్మాక్ష! యో కృష్ణ! మ్రొ
క్కెద మోరామ! మహాపరాక్రమ!దవాగ్నిన్ వేగ వారింపవే. 713

"కమలాక్షా!శ్రీకృష్ణా! మిక్కిలి పరాక్రమశాలివైన బలరామా! మీదికి ఎగయుచున్న పొగలతో, చిటపటలాడుచున్న నిప్పురవ్వలతో, ఎగసిపడుచున్న అగ్నిజ్వాలలతో భయంకరముగానున్న దావాగ్ని అదిగో! రానేవచ్చుచున్నది. దానిని నివారించుట మాబోంట్లకు అసాధ్యముగా కన్పట్టుచున్నది. ఇదిగో మమ్ములను అందఱను చుట్టుముట్టుచున్నది. ఇకమీదట

ఏమగునోఏమో? మీ పాదపద్మములే (మీరే) మాకు దిక్కు. మీకు పదేపదే మ్రొక్కుచున్నాము. వెంటనే ఈ కార్చిచ్చును నివారించి, మమ్ము రక్షింపుడు, రక్షింపుడు.

క. నీపాదంబులు నమ్మిన, నాపద లెక్కడివి జనులకత్యుగ్ర మహో
దీపిత దావజ్వలనము, పైపడకుండెడి విధంబు భావింపఁగదే. 714

కృష్ణా! నీ పాదములను (నిన్ను) నమ్ముకొన్నవారికి ఎట్టి ఆపదలును కలుగవు. పెద్దపెద్దమంటలతో విజృంభించి వచ్చుచున్న ఈ దావాగ్ని మనలను (మమ్ము) కబళింపకుండెడి ఉపాయమును ఆలోచింపుము".

వ. అని ఘోషించు ఘోషజనులం గరుణించి, జగదీశ్వరుండగు ననంతుం డనంతశక్తి యుతుండై, గహనంబు నిండిన దావదహనంబు, పానంబు చేసిన విజయగానంబు దశదిశల నిగిడె. అంత రామకృష్ణులు గోగణ జ్ఞాతి సహితులై మందయానంబున మందకుంజనిరిట్లు రామకేశవులు గోపాలబాలవేషంబులం గ్రీడించుసమయంబున, 715

ఇట్లు గగ్గోలుపెట్టుచున్న గోపాలురపై కనికరము చూపుచు, అనంతశక్తిశాలియైన ఆ జగదీశ్వరుడు అరణ్యమునందు అంతట వ్యాపించియున్న దావాగ్నిని మ్రింగివేసెను. పిదప అచటివారు ఒనర్చిన విజయనాదములు దశదిశలయందును పిక్కటిల్లెను. అనంతరము బలరామకృష్ణులు గోవులతో, గోపాలురతోగూడి తిన్నగా సాగుచు వ్రేపల్లెకు చేరిరి. ఈ విధముగా బలరామకృష్ణులు గోపాలురవేషములలో విహరింపసాగిరి. అది వేసవికాలము!

## గ్రీష్మర్తు వర్ణనము

సీ. దినములంతంతకు దీర్ఘంబులై యుండ దిననాథుఁ డుత్తరదిశఁ జరించె
నాఁటి నాఁటికి నెండ నవ్యమై ఖరమయ్యె వెచ్చని గాడ్పులు విసరఁ జొచ్చె
మేదినిరేణువుల్ మింట సంకులమయ్యె నేఱులుఁ గొలఁకులుఁ నిగిరిపోయెఁ
బానీయశాలలఁ బథిక సంఘము నిల్చెఁజప్పరంబుల భోగిచయము డాఁగెఁ
ఆ. దరులఁ గుసుమచయముదళములతో వాడె మిథునకోటికి రతి మెండు దోఁచె
నఖిలజంతు భీష్మమైన గ్రీష్మము రాకఁ గీలి యడవులందుఁ గేలి సలిపె. 716

ఆ సమయమున సూర్యుడు ఉత్తరదిశయందు సంచరించుచుండెను. (ఉత్తరాయణము నడచుచుండెను). పగటివేళలు క్రమక్రమముగా అధికము అగుచుండెను. రోజురోజునకు ఎండలు తీవ్రముకాజొచ్చెను. గాలులు వేడిగా వీవసాగెను. ధూళిరేణువులు మీదికి లేచుచు ఆకాశమును కప్పివేయుచుండెను. నదులు, సరస్సులు ఎండిపోసాగెను. (జలములు ఇంకిపోసాగెను.) బాటసారులు చలివేంద్రములకు చేరుచుండిరి. పాములు ఎండతీవ్రతకు తట్టుకొనలేక మరుగుగలిగిన చల్లని ప్రదేశములకు చేరుకొనసాగెను. చెట్లయొక్క పూవులు, ఆకులు వాడిపోదొడగెను. దంపతులలో సుఖభావనలు పెరిగెను. సమస్తప్రాణులను తపింపజేసెడి భీకరమైన గ్రీష్మఋతువు రాకతో దావాగ్నులు చెలరేగుచుండెను.

ఆ. వాఁడి రుచులు గలుగువాని వేఁడిమి గ్రీష్మ కాలమందు జగము గలయఁబడియె
బ్రహ్మ జనులకొఱకు బ్రహ్మాండఘటమున నుష్ణరసముఁదెచ్చి యునిచె ననఁగ. 717

బ్రహ్మదేవుడు ప్రజలకొఱకై బ్రహ్మాండమనెడి ఘటమునందు ఉష్ణోదకమును దెచ్చి యుంచినాడా? అనునట్లు సూర్యకిరణతాపములకు తాళలేక ఆ గ్రీష్మకాలమున జనులలో కలవరపాటు ఏర్పడెను.

వ. ఇట్లాభీలంబయిన నిదాఘకాలంబు వర్తింప, బృందావనంబు రామగోవింద మందిరంబైన కతంబున, నిదాఘకాల లక్షణంబులం బాసి, నిరంతర గిరినిపతిత నిర్ఝరశీకర పరంపరాభాసితపల్లవిత కుసుమిత తరులతం బయ్యును, దరులతా కుసుమ పరిమళమిళితమృదులపవనంబయ్యును, బవనచలిత కమలకల్హార సరోవర మహా గభీర నదీహ్రదం బయ్యును, నదీ హ్రద కల్లోల కంకణ ప్రభూత పంకం బయ్యును, బంకసంజనిత హరితాయమానతృణనికుంజంబయ్యును, జనమనో రంజనంబై వసంతకాల లక్షణంబులు గలిగి, లలిత మృగ పక్షి శోభితంబయి యొప్పుచుండె మఱియు నందు, 718

ఇట్లు లోకమునందు గ్రీష్మకాలము భయంకరమై కొనసాగుచున్నను బృందావనముమాత్రము బలరామకృష్ణుల నివాసభూమి అగుటచే వేసవికాలలక్షణములను వీడి, వసంతకాల లక్షణములను సంతరించుకొని జనులకు ఆహ్లాదకరముగానుండెను. ఎల్లప్పుడును (నిరంతరముగా) పర్వతములనుండి ప్రవహించుచున్న సెలయేళ్ల తుంపరల స్పర్శచే అచటి చెట్లు, తీగెలు చక్కని చిగుళ్లతో, పూవులతో అలరారుచుండెను. అచటి చిఱుగాలులు ఆ చెట్లయొక్క లతలయొక్క పూవుల సువాసనలనుండి ఎంతయు హాయిని గొల్పుచుండెను. అచటి సరోవరములయందును, మిగుల లోతైన నదుల మడుగులలోనుగల కమలములు, రంగురంగులకలువలు ఆ పిల్లగాలులకు కొద్దికొద్దిగా కదలుచు కనువిందు గావించుచుండెను. నదులమడుగులలోని అలలతుంపరలు పడుచుండుటచే దరులయందలినేలలు బురదగా మాఱుచుండెను. ఆ బురదనేలలయందు పచ్చికలు మొలచి గుబురుగా పెఱుగుచుండెను. ఆ ప్రదేశము అంతయును సాధుస్వభావముగల మృగములతోను, పక్షులతోను నిండి మనోహరముగా ఒప్పుచుండెను.

క. పికముల కోలాహలమును, శుకసంఘముకలకలంబు శుభగ మయూర
ప్రకరముకేకారవమళినికరముఝంకారవమళినికరముఁ రొదయును జెలంగె నెఱి నయ్యడవిన్. 719

ఇంకను ఆ బృందావనప్రదేశమునందలి కోకిలల కుహూకుహూ రావముల కోలాహలములు, చిలుకల కలకలధ్వనులు, అందమైన నెమళ్ల క్రేంకారములు, తుమ్మెదలఝుంకారములు హాయిని గూర్చుచుండెను.

క. ఆతత యమునాసరసీ, జాతతరంగాభిషిక్త జలరుహ గంధో
పేతానిలమడఁచె నిదా, ఘాతత దావాగ్నిపీడనవ్వనమందున్ 720

విశాలములైన యమునానదిమడుగులలోని తరంగజలములచేత కమలములు, కలువలు తడుపబడుచుండెను. ఆ పూవులమీదుగా వీచెడి గాలులు సువాసనలను వెదజల్లుచు వేసవికాలమునందలి తీవ్రమైన దావాగ్నిబాధను తొలగించుచుండెను.

వ. ఇట్లామని కందువతెఱంగు గల్గి, సుందరంబై బృంధావనంబునకుం బలకృష్ణులు గోవుల రొప్పికొని చని, గోపకులుం దారును నొండొరులతో నగుచుఁ, దెగడుచుఁ జెలంగుచుఁ, దలంగుచు, జిఱజిఱఁ దిరుగుచుఁ, దరులసందులకరుగుడుఁ, దాగిలిఁ మూఁత లాడుచు గీతంబులు పాడుచు, వేణునాదంబులు ఘటియించుచు, నటియించుచు, గతులు దప్పినక్రియ నొఱగుచుఁ, గుప్పలకుఱుకుచుఁ, జప్పటలు గొట్టుచుఁ, గందుకంబులఁ దట్టుచు, నుప్పరం బెగసి, దర్దురంబుల చందంబున దాఁటుచు, నామలక బిల్వాదిఫలంబుల మీటుచుఁ, గుట విటపంబులఁ గదల్చుచు, మృగంబుల నదల్చుచుఁ బేరల రేఁపుచు, మధుమక్షికలఁ జోపుచుఁ, దేనియలు ద్రావుచు, పొమ్మలువోపుచు, గురుశిష్యకల్పనంబులం బనులు సేయుచుఁ, గాకపక్షధరులై, ముష్టి యుద్ధంబులకు డాయుచుఁ బన్నిదంబులు సఱచుచు బులుఁగుల భంగి నఱచుచు, బహురూపంబులు పన్నుచు, నెగిరి తన్నుచు, సేవ్య సేవక మిత్రామిత్ర భావంబులు వహించుచు, నుత్సహించుచు, మఱియు, ననేక విధంబులఁ గ్రీడించి రందు. 721

బలరామకృష్ణులు, తోడివారితోగూడి, గోవులను పరుగులెత్తించుచు, వసంతఋతువునందువలె చల్లదనముగలిగి, మనోహరముగానున్న బృందావనమునకు చేరిరి. అచట వారు నవ్వుకొనుచు, ఎగతాళి చేసికొనుచు, కేరింతలు కొట్టుచు, తొలగిపోవుచు, గిరగిర తిరుగుచు, చెట్లసందులకు వెళ్లుచు, దాగుడుమూతలు ఆడుకొనిరి. ఇంకను వారు పాటలు పాడుచు వేణువులను ఊదుచు, అభినయించుచు, అడుగులు తడబడినట్లుగా ప్రక్కకు ఒఱుగుచు, ఇసుకతిన్నెలమీదికి ఉఱుకుచు, చప్పట్లు చఱచుచు, బంతులాటలు ఆడుచు, పైకెగిఱి కప్పగంతులు వేసిరి. మఱియు వారు ఉసరిక, మారేడు మొదలగు పండ్లను ఎగురవేయుచు, చెట్లకొమ్మలను ఊపుచు, లేళ్లను అదలించుచు, తేనెతెట్టెలను కదల్చుచు, తేనెటీగలను పాఱద్రోలుచు, తేనెలను త్రాగుచు, మత్తిల్లి పడిపోయిరి. గురుశిష్యుల ఆటలాడుచు, జులపాలు గలిగి పిడిగుద్దులఆటలనాడుచు, పందెములను వేసికొనుచు, పక్షులవలె అఱచిరి. ఇంకను వారు పెక్కువేషములను వేయుచు, ఎగిరెగిరి తన్నుచు, యజమాని సేవకులరీతిగా ప్రవర్తించుచు, మిత్రులవలె, శత్రువులవలె నటించుచు ఉత్సాహముగా ఇట్లు పెక్కువిధముల క్రీడించిరి.

క. మాపాలికి బలకృష్ణులు, భూపాలకులంచు నెగిరి బొబ్బలిడుచు న
గ్గోపాలురు మోతురు ప్రమ, దాపాదకు లగుచు పల్లికాందోళికలన్. 722

అచట 'బలరామకృష్ణులే మాపాలిటి మహారాజులు' అని గోపాలురు వారికి జేజేలు కొట్టుచుండిరి. ఇంకనువారు బలరామకృష్ణులను తీగెలపల్లకీలలో కూర్చుండబెట్టి మోయుచు వారిని సంతోషపెట్టుచుండిరి.

క. గోపకులందఱు నాడుచు, దీపింపఁగ రామవాసుదేవుల వెనుకం
బైపడి పాఠక గాయక, రూపంబులఁ బొగడుదురు నిరూఢాత్మకులై 723

ఇంకను గోపాలురు ఉత్సాహముతో బలరామకృష్ణులవెనుకజేరి, ఆడుచు, స్థిరచిత్తముగలవారై స్తోత్రపాఠకులవలె వారిని కొనియాడుచుండిరి.

క. ప్రీతిన్ గోపకులందఱు, గీతంబులు పాడఁ దరులక్రిందను నగుచుం
జేతులు ద్రిప్పుచు వెడవెడ, పాతరలాడును యశోదపాపం డడవిన్. 724

మ. జలజాక్షుండును రాముఁడున్ నటనముల్ సల్పంగ గోపాలమూ
ర్తులతో వారలఁ గొల్చు నిర్జరులు సంతోషించి వేణుస్వనం
బులు గావించుచుఁ గొమ్ములూఁదుచు శిరంబుల్ ద్రిప్పుచుం బాడుచున్
వలనొప్పన్ వినుతించిరప్పుడు నటుల్ వర్ణించు చందంబునన్. 725

కృష్ణుడు తోడివారితోగూడి ఆ వనమునందలి చెట్లక్రింది చేరిన పిమ్మట గోపాలురు పాటలు పాడుచుండగా ఆ యశోదానందనుడు నవ్వుచు, చేతులు త్రిప్పుచు అప్పుడప్పుడు నృత్యము చేయుచుండెను. శ్రీకృష్ణుడు, బలరాముడు నృత్యములు చేయుచుండగా గోపాలరూపములలోనున్న దేవతలు సంతోషముతో వారిని సేవించుచుండిరి. మఱియు వారు వేణునాదములను గావించుచు, కొమ్ముమువాద్యములను వాయించుచు, లయాన్వితముగా తలలాడించుచు, పాడుచుండిరి. ఆ విధముగా నటులు వర్ణించునట్లు వారు రామకృష్ణులను ఎంతయు ప్రస్తుతించిరి.

## బలభద్రుండు ప్రలంబాసురుని వధించుట

వ. ఇట్లు రామకృష్ణులు నదనదీ తీరంబులఁ, గొలంకులసమీపంబుల, గిరులచఱుల, సెలయేఱుల పొంతల, మడుఁగుల చెంతలఁ, బొదల క్రేవలం, బసిమిగల కసవుజొంపంబులఁ బసుల మేపుచుండఁ, బ్రలంబుం డను

రక్కసుండుక్కు మిగిలి, గోపాలరూపంబున వచ్చి, వారల హింస సేయం దలంచుచుండ, నయ్యఖిల దర్శనుండగు సుదర్శనధరుం డెఱింగియు నెఱుఁగని తెఱంగున, 726

ఈవిధముగా రామకృష్ణులు గోవులను నదులదరులయందును, నదముల(1) తీరములయందును, సరస్సుల సమీపములయందును, కొండలప్రక్కను, సెలయేళ్ల చేరువలోను, మడుగుల చెంతను, పొదలదగ్గఱను, నిలుపుచు పచ్చగా, గుబురుగానున్న లేతలేత పచ్చికలను మేపుచుండిరి. అంతట మిక్కిలి మదించియున్న ప్రలంబుడు అను రాక్షసుడు రామకృష్ణాదులను హింసింపదలంచి, గోపాలరూపమున అచటికి వచ్చెను. సర్వమును (భవిష్యత్తును) దర్శింపగల శ్రీకృష్ణుడు అచటికి వచ్చినవాడు రాక్షసుడనియు, అతడు దుర్బుద్ధితో వచ్చినాడనియు, గ్రహించినను, ఏమియు ఎఱుగనివానివలె ఉండెను.

క. ఆ రామునిసహజన్ముఁడు, రారమ్మని వానిఁజీరి రాకం బోకన్
గారాము సేసి మెల్లన, పోరామి యొనర్చెఁ బిదపఁ బొరిగొనుకొఱకున్. 727

పిమ్మట కృష్ణుడు ఆ రక్కసుని చంపివేయదలంచి, అతనిని తమకడకు రమ్మని సాదరముగా పిలిచెను. మిక్కిలి చనవు చూపుచు అతనితో మైత్రి నెఱపెను.

వ. ఇట్లు ప్రలంబునితోఁ జెలిమి సేయుచుఁ, గృష్ణుండు గోపాలకులకు నిట్లనియె. 728

ఆ. మనకుఁ బ్రొద్దుపోదు మన మిందఱము రెండు గములవార మగుచుఁగందుకముల
శిలలు గుఱులు సేసి చేరి క్రీడింతము రండు వలయు జయపరాజయములు 729

ఇట్లు ప్రలంబునితో చెలిమి చేయుచు, కృష్ణుడు తన తోడి గోపాలురతో ఇట్లనెను. "మనకు ప్రొద్దుపోవుటలేదు. కనుక మనము రెండుజట్లుగా ఏర్పడి, బంతులతో ఱాళ్లను గుఱిచేసి కొట్టెడి ఆటలు ఆడుదము. గెలుచుట, ఓడిపోవుట అనునది ముందుగా తెలియునవికావు గదా!"

వ. అని యిట్లు పలికి, తానును బలభద్రుండును, బెన్నుద్దులై, యితరవల్లవులెల్ల నుద్దించుకొని చిఱుద్దులై వచ్చిన సమయంబున విభజించికొని, రెండుగములవారై, మార్గంబులందుఁ దృణదారు శిలాకల్పితంబులగు గుఱులొడ్డి, కందుకశిలాది ప్రక్షేపణంబుల, లక్ష్యంబులఁ దాఁక వైచి, జయపరాజయనిర్ణయంబులు గైకొని, వాహ్యావాహక లక్షణంబుల నిర్జితులు జేతల వహించి, క్రీడించుచు, బలరామునికి వానిచందంబు రహస్యంబున నెఱింగించి, పసుల వెల్చుచు, భాండీరకం బను వటంబుఁ సేరిరాసమయంబునఁ గ్రీడయందుఁ శ్రీదామనామధేయుండైన గోపకుండు శ్రీకృష్ణునివహించె భద్రసేనుండు వృషభు నెక్కించు కొనియె. బలభద్రుండు ప్రలంబునారోహించె నప్పుడు. 730

ఇట్లు పలికిన పిదప శ్రీకృష్ణుడు, బలరాముడు చెఱియొక జట్టునకు నాయకులైరి. తక్కిన గోపాలురు సమానముగా ఆ రెండు జట్లలో చేరిరి. ఇట్టి విభజనతో రెండుజట్లును ఏర్పడి, వారు గడ్డితో, కఱ్ఱలతో, ఱాళ్లతో గుర్తులు పెట్టుకొని, వాటిని బంతులతోను, ఱాళ్లతోను గుఱిచూచి కొట్టుచు, ఓడినవారు గెలిచినవారిని మోయునట్లు నిర్ణయించుకొనిరి. ఆ నియమముప్రకారము ఆ ఆటలలో ఓడినవారు గెలిచినవారిని మోయుచు క్రీడింపసాగిరి. ఆ సమయమున శ్రీకృష్ణుడు బలరామునకు ప్రలంబాసురునిపన్నాగమునుగూర్చి తెలిపెను. పిమ్మట వారు అందఱును పశువులను తోలుకొనుచు 'భాండీరకము' అను ఒక మఱ్ఱిచెట్టు క్రిందికి చేరిరి. అచట కొనసాగిన ఆటలలో బలరామునిపక్షమునగల 'శ్రీదాముడు'

1. నదము = పడమరదిక్కునకు ప్రవహించునట్టిది.

అను పేరుగలవాడు ఓడిపోవుటవలన, అతడు శ్రీకృష్ణుని తన వీపుపై ఎక్కించుకొనెను. అట్లే ఓటమిపాలైన భద్రసేనుడు వృషభుని ఎక్కించుకొనెను. ఆవిధముగనే శ్రీకృష్ణుని జట్టులోనున్న ప్రలంబాసురుడు ఓడిపోయి, బలరాముని తనవీపుపై ఎక్కించుకొనెను.

మ. వనజాక్షున్ బలిమిన్ బలాఢ్యుఁడు తృణావర్తుండు మున్ మింటికిం
గొనిపోఁజాలక చిక్కినాఁ డితని నాకున్ మోవ రాదంచు నా
దనుజారిన్ గొనిపోఁ దలంపక వడిన్ దైత్యేశుఁడయ్యాటలోఁ
గొనిపోయెన్ గిఱి దాఁటి రాము నఖిల క్రూరక్షయోద్దామునిన్. 731

'పూర్వము మిగుల బలశాలియైన తృణావర్తుడు శ్రీకృష్ణుని, ఆకాశమునకు ఎత్తుకొని పోయియు, మోయజాలక హతుడయ్యెను. కనుక నేను ఇతనిని (ఈ బలరాముని) మోయజాలను!' అని ప్రలంబాసురుడు తలపోసెను. ఇట్లు నిర్ణయించుకొనిన ఆ రక్కసుడు క్రూరులను మట్టుపెట్టులలో సమర్థుడైన బలరాముని తన వీపుపై ఎక్కించుకొని, నిర్ణయింపబడిన హద్దును దాటిపోయెను.

వ. ఇట్లు క్రీడాకల్పిత వాహనుండైన ప్రలంబుండు బలభద్రునిం గొనిపోవుచు 732

మ. గురు శైలేంద్రసమాన భారుఁడగు నా గోపాలకున్ మోవ లే
క రయోద్రేకము మాని దైత్యుఁడు నరాకారంబు సాలించి భీ
కర దైత్యాకృతి నేఁగె హేమ కటకాకల్పంబుతో రాముతో
మురువొప్పంగఁ దటిల్లతేందుయుత జీమూతంబుచందంబునన్. 733

ఈవిధముగా ప్రలంబుడు ఆటలలో భాగముగా వాహనమై, బలరాముని మోసికొనిపోసాగెను. మహాపర్వతమువలె మిక్కిలి బరువుగానున్న బలరాముని మోయలేక క్రమముగా వేగము తగ్గించి అతడు మానవాకారమును త్యజించి, భీకరమైన రాక్షసుడుగా మారి వెళ్లదొడంగెను. అట్లు అహంభావముగల ఆ రక్కసుడు బంగారు కడియములను ధరించియున్న బలరాముని మోసికొనిపోవుచున్నప్పుడు మెఱుపులతో, చంద్రునితో గూడిన మేఘమువలె ఒప్పారెను.

ఉ. మోసములేక వాని పెనుమూఁపున నుండుచు నాహలాయుధుం
డా సమయంబునం గనియె హాటకరత్న కిరీట కుండలో
ద్భాసిత మస్తకున్ భృకుటి భాసుర దారుణనేత్రునుగ్రదం
ష్ట్రాసహితుం బ్రలంబు నురుశౌర్యవిలంబు మదావలంబునిన్. 734

వ. కని నక్తంచరుం డని యించుక శంకించి వెఱవక, 735

క. కడువడిఁదను దివికింగొని వడిఁ, జనియెడు దనుజు శిరము వ్రయ్య హలధరుం
డదరి పటు చటులతర ముగు, పిడికిట వెస విసరి పొడిచె బిఱుసున నలుకన్. 736

ప్రలంబునిమూపుపై ఏమాత్రమూ ఏమఱుపాటులేక కూర్చొనియున్న బలరాముడు ఆ రక్కసుని తేఱిపాఱజూచెను. అప్పుడు ఆ రాక్షసుడు రత్నములు చెక్కిన బంగారు కిరీటముతోడను, కుండలములతోను భాసిల్లుచుండెను. అతడు భయంకరముగా చూచుచు, బొమముడి వైచియుండెను. అతనికోఱలు భీకరముగా ఉండెను. అతడు మిగులశౌర్యముగలిగి మదించియుండెను. ప్రలంబుని చూచినంతనే బలరాముడు అతనిని రాక్షసునిగా గుర్తించి, నిర్భయముగా ఉండెను. వెంటనే ఆ స్వామి తనను బలముకొలది వీపున మోయుచు ఆకాశమువైపు వేగముగా సాగిపోవుచున్న ఆ రక్కసునియొక్క

శిరస్సును బ్రద్దలుచేయుటకు పూనుకొనెను. అంతట బలభద్రుడు కుపితుడై బలమైన తన పిడికిలి బిగించి, మెఱుపువేగముతో అతనిశిరస్సుపై గట్టిగా పొడిచెను.

క. హలధరు బలు పిడికిటి హతిఁ, దల పగిలిన రుధిరజలము తనువివరములం
దొలఁక మొఱయిడుచు దనుజుఁడు, బలరిపుపవినిహత నగము పగిదిం బడియెన్. 737

బలరామునియొక్క తీవ్రమైన పిడికిలి పోటునకు రక్కసుని తల బ్రద్దలుకాగా అతని నవరంధ్రములనుండి రక్తము స్రవింపసాగెను. అంతట ప్రలంబాసురుడు 'కుయ్యో! మొఱ్ఱో' - అని మొత్తుకొనుచు, ఇంద్రుని వజ్రాయుధము దెబ్బకు నేలగూలిన పర్వతమువలె పడిపోయెను.

మత్తకోకిలము. మేలు మేలు గదయ్య! రాముఁడు మేటిరక్కసు నొక్కఁడున్
నేలఁ గూలిచె నొక్కపోటున నేఁడు విస్మయమంచు గో
పాలకుల్ గని చచ్చి వచ్చిన భ్రాతఁ గన్న విధంబునన్
జాల దీవనలిచ్చి రాముని సత్కరించిరి వేడుకన్. 738

అప్పుడు గోపాలకులు - 'భళీ! భళీ! నేడు మన బలరాముడు ఒక్కడే బలశాలియైన ఈ రాక్షసుని ఒక్కపోటుతో నేలగూల్చెను. ఇది మిగుల ఆశ్చర్యమును కలిగించుచున్నది. ఇప్పుడు మనసోదరుడు పునర్జన్మనెత్తి వచ్చినట్లున్నది' అని, అనుకొనుచు ఉత్సాహముతో ఆ ఆస్వామికి దీవెనలిచ్చుచు సత్కారములను గావించిరి.

క. బలవంతుఁడగు ప్రలంబుఁడు, బలు ముష్టిన్ నిహతుఁడైన బ్రదికితి మనుచున్
బలసూదనాదిదివిజులు, బలుపై గుసుమములవానఁ బరఁగించి రొగిన్. 739

'మిగుల బలశాలియైన ప్రలంబుడు బలరామునిముష్టిఘాతనకు నిహతుడాయెను. మనము రక్షింపబడితిమి' అని తలపోయుచు ఇంద్రాదిదేవతలు ఆ స్వామిపై ఒక్కపెట్టున పూలవాన కురిపించిరి.

## శ్రీకృష్ణుండు దావాగ్నిని మ్రింగి గోవులను, గోపాలకులను గాపాడుట

వ. ఇట్లు గోపకులు క్రీడింప, గోవులంతంతఁ గాంతారంబున వింతకసవులు మెసవుచు, మేఁతవడి నొండడవికి దూరంబు సని, యందు దవదహన పవన సంస్పర్శంబు సైరింపక, కంపించి దప్పి నొప్పునెడి ఘోషించిన.

ఈవిధముగా గోపాలకులు ఆటపాటలలో మునిగియుండిరి. అప్పుడు గోవులు ఆ అడవియందు పలువిధములగు గడ్డిపరకలను మేయుచు, ఆ ధోరణిలోబడి, అచటికి దూరమునగల మఱియొక అడవిలో ప్రవేశించెను. అచట గాలికి చెలరేగిన దావాగ్ని తాకిడికి తాళలేక, కంపించుచు, దాహబాధకు తట్టుకొనలేక అవి బిగ్గఱగా అఱవసాగెను.

శా. ఆ గోపాలకులందఱుం బసులకుయ్యాలించి కౌమారకే
ళీగాఢత్వము మాని గోఖుర రదాళి చ్ఛిన్న ఘాసంబుతో
బాగై యున్న పథంబునం జని దవాపన్నంబు గాకుండ వే
వేగన్ గోగణమున్ మరల్చి రటవీవీథిన్ జనం బొప్పఁగన్ 741

ఆ గోవులగగ్గోలు గోపాలురచెవులబడెను. వెంటనే వారు తమ బాలక్రీడలను ఆపివేసి ఆ గోవులకొఱకై వెళ్లిరి. దారిలో వారికి ఆవులగిట్టలక్రిందబడిన పచ్చికల గుర్తులును, అవి కొఱికిన గడ్డి గుర్తులును కనబడెను. ఆ జాడలనుబట్టి వారు ఆ మార్గమున కొంతదూరము ముందునకు వెళ్ళగా వారికి ఆవులు కనబడెను. అవి ఆ దావాగ్నిబాధకు గుఱికాకుండ వడివడిగా దారికి మళ్లించిరి.

క. జలధర గభీరరవమున, నళినదళాక్షుండు తమ్మ నామాంకములం
బిలిచిన విని ప్రతిఘోషణ, ములు సేయుచుఁ బసులు దిరిగె ముదమున నధిపా! 742

పరీక్షిన్మహారాజా! వెంటనే శ్రీకృష్ణుడు మేఘగర్జనవంటి గంభీరధ్వనితో ఆవులను పేరుపేరున పిలిచెను. అంతట ఆ గోవులు 'అంబా' - అని ప్రతిరవములు చేయుచు ఆనందముగా తిరిగివచ్చెను.

వ. అంతనవ్వనంబున దైవయోగంబునం బుట్టిన కార్చిచ్చు, బిట్టు విసరెడి కరువలివలన మిన్ను ముట్ట మిట్టిపడి గట్టు చెట్టనక దరికొని యట్టె క్రాలుచుఁ జుట్టుకొని పఱవం గని, పల్లటిల్లిన యుల్లంబులతో వల్లవులెల్లఁ దల్లడిల్లి, సబలుం డైన హరికి మృత్యుభీతులరీతిం జక్క మ్రొక్కి యిట్లనిరి. 743

పిమ్మట ఆ వనమునందు విధివిలాసముచే ఏర్పడిన కాఱుచిచ్చు, పెనుగాలి తాకిడికి చెలరేగి ఆకాశముతాకునంతగా విజృంభించెను. ఆ దావాగ్ని గట్లను, చెట్లను కాల్చివేయుచు, ఆవిధముగా అంతటను వ్యాపించుచుండగా చూచి, మనస్సు తత్తఱపాటునకు లోనుకాగా గోపాలురు ఎంతయు తల్లడిల్లిరి. వెంటనే వారు బలరామునితోగూడి శ్రీకృష్ణునిజేరి, చావుభయముతో ఆయన కాళ్లకు మొక్కుచు ఇట్లు నుడివిరి.

క. అభ్రంకష ధూమాయిత, విభ్రాంత మహా స్ఫులింగ విసరోగ్ర శిఖా
విభ్రష్ట దగ్ధలోకా, దభ్రంబై వచ్చెఁ జూడు దవశిఖి కృష్ణా! 744

"కృష్ణా! దావాగ్ని భయంకరముగా మన సమీపమునకు వచ్చుచున్నది. దాని పొగలు ఆకాశమును తాకుచున్నవి, అది విభ్రాంతిని గొలిపెడి చిటపటలతో గూడిన అంతులేని నిప్పురవ్వలను వెదజిమ్ముచున్నది. ఉగ్రమైనదాని జ్వాలలకు లోకములన్నియు దగ్ధములై పోవుచున్నవి. చూడుము.

శా. నీ చుట్టాలకు నాపదల్‌గలుగునే నేమెల్ల నీవారమ
న్యాచారంబు లెఱుంగమీశుఁడవు మాకాభీల దావాగ్ని నేఁ
డే చందంబున నింక దాఁటుదుము మమ్మీక్షించి రక్షింప వ
న్నా! చంద్రాభ! విపన్నులన్ శిఖివితానచ్ఛన్నులన్ ఖిన్నులన్. 745

వ. అని విన్నవించిరంత. 746

ప్రభూ! మేము అందఱము నిన్నే ఆశ్రయించుకొనియున్నవారము. నీకు ఆత్మీయులమైన మాకు ఇట్టికష్టాలు రావచ్చునా? ఎన్నడును అధర్మకృత్యములను చేసి యెఱుగము. మాకు నీవే దిక్కు; భయంకరమైన ఈ దావాగ్ని నుండి ఎట్లు బయటపడగలము? చంద్రునివలె హాయిని గూర్చువాడా! దావాగ్ని జ్వాలలు చుట్టును ముసరుకొని వచ్చుచుండుటచే ఆపదలపాలై, ఖిన్నులమై యున్న మమ్ము నీ చల్లని చూపులతో రక్షింపుము" అని విన్నవించుకొనిరి.

ఉ. బంధుజనంబుచేత నిటు ప్రార్థితుఁడై హరి విశ్వరూపుఁడో
బంధువులార! మీ నయనపంకజముల్ ముకుళింపుఁ డగ్ని నీ
సంధి నడంతు నే ననినఁ జక్కన వారలు నట్ల సేయుడున్
బంధుర దావపావకముఁ బట్టి ముఖంబునఁ ద్రావె లీలతోన్. 747

అంతట విశ్వరూపుడైన శ్రీహరి (కృష్ణుడు) తనకు సన్నిహితులైన గోపాలురప్రార్థనలను మన్నించుచు వారితో 'మిత్రులారా! కమలములవంటి మీ కనులను మూసికొనుడు. నేను ఈ లోపల దావాగ్నిని అణచివేయుదును' అని

వచించెను. అట్లే అనుచు వారు కనులను మూసికొనిరి. వెంటనే కృపాళువు ఐన ఆ ప్రభువు దట్టమైన ఆ కాఱుచిచ్చును పట్టుకొని, అవలీలగా త్రాగివేసెను.

వ. ఇట్లు నిజయోగ వైభవంబున దావదహనంబు పానంబు సేసి, నిమిషమాత్రంబున గోపకులనందఱ భాండీరకవట సమీపంబునకుం దెచ్చి విడిచిన, వారు వికసిత నయనకమలులయి, కృష్ణునియోగమాయాప్రభావంబున నెరగలిచిచ్చు ప్రుగ్గెనని, యగ్గించుచుఁ దమ మనంబులందు. 748

క. కార్చిచ్చార్పు పటుత్వము, నేర్చునె నరుఁడొకఁడు శౌరి నేఁడిదె కార్చి
చ్చార్చి మనల రక్షింపఁగ, నేర్చె నితం డజుఁడొ హరియొ నిటలాక్షుండో. 749

వ. అని వితర్కించిరంతఁ గృష్ణుండు సాయాహ్నసమయంబున రామసహితుండై వంశనాళంబు పూరించుచు, గోపగణజేగీయమానుం డై, గోష్ఠంబు ప్రవేశించె నప్పుడు. 750

ఈవిధముగా తనయోగమహిమచే దావాగ్నిని పానంబుచేసిన మఱుక్షణమే ఆ స్వామి గోవులను, గోపాలురనందఱిని 'భాండీరకము' అను మఱ్ఱిచెట్టుకడకు తీసికొనిపోయెను. అంతట వారు కనులు తెఱచిచూచి, 'శ్రీకృష్ణుని యోగమాయా ప్రభావముననే ఈ కాఱుచిచ్చు చల్లాఱినది' అని ఆయనను పొగడసాగిరి. పిమ్మట వారు తమ మనస్సులలో 'దావాగ్నిని ఆర్పివేయుట సామాన్య మానవునకు అసాధ్యము. కాని నేడు శ్రీకృష్ణుడు మాత్రము కాఱుచిచ్చును చల్లార్చి మనలను రక్షింపగలిగెను. దీనినిబట్టి చూడగా ఈ స్వామి బ్రహ్మదేవుడో? శ్రీమహావిష్ణువో? పరమశివుడో? అయియుండును' అని తలపోసిరి. పిమ్మట గోపాలురు ప్రశంసలు కురిపించుచుండగా శ్రీకృష్ణుడు, బలరామునితోగూడి సాయంసమయమున వేణువును మ్రోగించుచు గొల్లపల్లెలో (గోశాలలో) ప్రవేశించెను.

క. కమలాక్షుఁ డొద్ద నుండని, నిమిషము యుగశతము గాఁగ నెగడిన గోప
ప్రమదలు సంభ్రమమున నా, కమలాక్షునిఁ జూచి ముదముఁగనిరి మహీశా! 751

పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడు తమచెంత లేనప్పుడు గోపికలు క్షణమును ఒక నూఱుయుగములుగా భావింతురు. అట్టి ఆ గోపాంగనలు శ్రీకృష్ణుని జూచినంతనే ఉత్సాహపడుచు అంతులేని సంతోషమును పొందిరి.

వ. ఆ సమయంబున గోపకులిండ్లకడ నున్న వృద్ధ కాంతాజనంబులకు రామకృష్ణులచిత్రచరిత్రంబులు సెప్పిన విని, వారు వారిని గార్హ్యార్ధు లై వచ్చిన వియచ్చరవరులని తలంచిరంత, 752

అనంతరము గోపాలురు, ఇండ్లయొద్దనున్న వృద్ధులకును, స్త్రీలకును బలరామకృష్ణులఅద్భుతకథలను (బలరాముడు ప్రలంబాసురుని హతమార్చిన విషయమును, శ్రీకృష్ణుడు దావాగ్నిని త్రాగిన వృత్తాంతమును) వివరించిరి. వారు ఆ మాటలను విన్న పిమ్మట 'ఈ బలరామకృష్ణులు ఘనకార్యములను నెఱవేర్చుటకై దివినుండి భువికి ఏతెంచిన అవతారపురుషులే కాబోలును' అని అనుకొనిరి.

## వర్ష ఋతువర్ణనము

సీ. పూర్వవాయువులు ప్రభూతంబులై వీచెఁ బడమట నింద్రచాపంబు తోఁచెఁ
బరివేషయుక్తమై భానుమండలమొప్పె మెఱపులుత్తరదిశ మెఱవఁదొడఁగె
దక్షిణగాములై తనరె మేఘంబులు జలచరానీకంబు సంతసించెఁ
జాతకంబుల పిపాసలు కడపలఁ జేరెఁ గాంతారవహ్నులగర్వమడఁగె

ఆ. నిజ కరాళివలన నీరజబంధుండు తొల్లి పుచ్చుకొన్న తోయమెల్ల
మరల నిచ్చుచుండె మహి కర్షకానంద కందమైన వాన కందువనొగి. 753

తూర్పుదిక్కునుండి పెనుగాలులు వీవసాగెను. పడమరదిశయందు ఇంద్రధనుస్సు కన్పట్టెను. సూర్యమండలము (సూర్యుని) చుట్టును పరివేషము[1] ఒప్పారెను. ఉత్తరదిశయందు మెఱపులు అలరారెను. మేఘములు దక్షిణదిశగా సాగిపోవుచుండెను. జలచరములకు (నీటిలో జీవించెడి చేపలు మొదలగువాటికి) సంతోషము కలిగెను. వానకోయిలలయొక్క దాహములు తీఱెను. దావాగ్నుల విజృంభణము ఆగిపోయెను. (కాఱుచిచ్చులు చల్లాఱెను) సూర్యుడు ఇంతకుముందు తన కిరణములద్వారా ఆవిరిరూపమున గ్రహించిన జలములను మేఘవర్షముల ద్వారా తిరిగి ఇచ్చుచుండెను. ఈ స్థితి కర్షకులకు మిగుల ఆనందదాయకము అయ్యెను.

క. వర్షాకాల భుజంగుఁడు, హర్షముతో నిడిననవనఖాంకములని యు
త్కర్షింప భూమిసతిపైఁ గర్షకహలరేఖలమరె గహనాంతమునన్. 754

వానాకాలము ప్రారంభమగుటతో ఆ అడవిని ఆనుకొనియున్న చదరపు భూమిని కర్షకులు నాగలితో దున్నిరి. నాగలి చాలులతో ఒప్పుచున్న ఆ భూసతి సుఖకేళి సమయమున వర్షాకాలమనెడి ప్రియునియొక్క నఖముల గుర్తులతో విలసిల్లుచున్నదా! అనునట్లు శోభిల్లుచుండెను.

క. చెలువుఁడు ప్రావృట్కాలుఁడు, పొలసినఁ బులకించు భూమి పులకములనఁగా
మొలచి తలలెత్తి నిక్కుచు, సలలితగతి జాలువాఱె సస్యములధిపా! 755

మహారాజా! వర్షాకాల పురుషుడనెడి చెలికాడు దరిజేరగా (అతని సుఖస్పర్శ కలుగగా) భూమియనెడి వనితకు ఏర్పడిన పులకలా! అనునట్లు పొలములో మొలచి నిక్కపొడుచుకొనియున్న పైరుమొలకలు విరాజిల్లుచుండెను.

వ. మఱియుఁ, జటుల పవనచలితంబులై పన్ని, మిన్ను దన్ని, లెక్కకు మిక్కిలియై, తెక్కలుగల నీలగిరుల సిరుల మీఱి, కాఱుకొని తెఱపి పడక నిబిడంబులై, శిశిరకిరణ తరణి మండలంబుల చొప్పు దప్పించి, విప్పు గలిగి, చదలు గప్పు కొనినలీలంగ్రాలు నీలమేఘంబులును, మేఘవిముక్తంబులయి జలదసమయ విటుండు సరస గతి ధరణిసతి యురమ్మున దర్పించి, నేర్పున సమర్పించు కర్పూరఖండంబుల వడువునఁబుడమిం బడు కరకలును, గరకానుగతంబు లై యసితభోగిభోగంబులబాగున, నీలమణి మాలికావిశేషంబుల విధంబున నెడపడక పడు సలిల ధారలును, ధారాధర విగళిత విమలసలిలంబులం దోఁగుచు మదజలాభిషిక్త మత్త మాతంగంబుల సొబగున నుండు కొండలును, గొండల తుదలనుండి గండశైలంబులపైఁబడి వికీర్యమాణంబులగు గిరినిర రంబుల శీకరంబులును, శీకరపరంపరలఁ జొదుగులు మదుగులు గొనినఁ బిదపిద నగుచుఁ జిదుకు చిదుకు మనురొంపులును, రొంపులు గ్రొచ్చి క్రచ్చఱ నుచ్చలితంబులయి పఱచు వఱదలును, వఱదలవలన మెదలి కదలి పొఱెడి యేఱులును, నేఱులవెంట గఱులు ద్రిప్పుచు గములుగొని క్రొన్నీటికెదురు నడచు మీనంబులును, మీననయనల మెఱుంగుసొంపుపెంపు సైరింపక కంపించి, తిరిగి సురిఁగి చనియెడికరణి మేఘమధ్యంబులం బొలసి, మలసి, నిలువక మరలిచను క్రొమ్మెఱుంగులును, మెఱుంగుల తెఱంగున మగువలు పురుషులం దగిలి నిలువరని జనుల కెఱుంగ నలువ మొఱయిడిన తెఱంగున మొరయు నుఱుములును, నుఱుములకులికిపడక కికురు పొడుచుచుఁ బించెంబులు గొంచెంబులు సేయక, విప్పి దెప్పరంబుగ రొప్పుచు నర్తనంబులు సేయు మయూరంబులును, మయూరఘోషంబులు భీషణంబులై చెవులు సోకననూనంబు లైన

1. పరివేషము = సూర్యచంద్రుల చుట్టును ఏర్పడెడి కాంతివలయము.

మానంబుల నాసలు సెడి, యొండొరులకుం గ్రిందుపడి క్రందుకొను విరహిజనులును, జనులకు రేపు మాపని నిరూపింప రాక మాలతీ కుసుమవిసర వికసన విదితావసానంబులగు దుర్దినంబులును, దినావసాన సమయంబున మినుకు మినుకుమని మెఱయుచుం దిరుగు ఖద్యోతంబులును, ఖద్యోత సందర్శనంబు గోరుచు నుడుగక విడువక కురియు జడింబడి, వలిగొని వడఁకుచు నశనయత్నంబులు వర్జించి, ఖర్జూర జంబూఫల భక్షణంబుల దేహసంరక్షణంబులాచరించు వనచరులును, వనచరానందకారిణులయి వారరమణులరుచి ననవరత భుజగసమేతలగు కేతకులును, గేతకీ కదంబయూథికా కుటజ కుసుమ పరిమళ మిళితంబులగు విపినమార్గంబులును, మార్గనిరోధంబులగుచుం బెరిఁగి రసికంబులై పసరుదొలంకుచు హరిన్మణి కిరణ పుంజంబులభంగి రంజిల్లి తొంగలించుచు, జొంపంబులు గొనిన కసవులును, గసవులు మెసవి మిసమిసఁ దనువులు మెఱవ, వలుఁద పొదుఁగుల బరువునం గదలక నిలిచి, నెమరమరనిడు ధేనువులును గలిగి, ధేనువ్రజంబు కైవడిఁ బయఃకణమనోహరంబై, హరకరంబు భంగిఁ బరిపూర్ణ సారంగ భాసురంబై, సురగిరిచెలువున హరిశరాసన విభీషణంబై, విభీషణహృదయంబు పోలికం బ్రకటిత హరిశబ్దవైభవంబై, భవపూజనంబు చందంబున నింద్రగోపాది విభవ జనకంబై, జనకయాగంబు భాతి సీతాప్రకరణాలంకృతంబై, కృతయుగంబు సొంపున బహువర్షంబునై వర్షాగమంబు చెలువొందె నప్పుడు. 756

వర్షాగమనముతో అసంఖ్యాకముగా ఉన్న మేఘములు పెనుగాలులకు కదలి, ఆకాశమును తాకుచుండెను. అవి టెక్కులుగల నల్లని కొండలను మించిన, నలుపువన్నె గలిగి దట్టముగా వ్యాపించియుండెను. ఇంకను అవి చంద్రసూర్యకిరణములప్రకాశములను అడ్డగించి, అంతటను వ్యాపించుచు ఆకాశమును కప్పుకొనినట్లుగా విలసిల్లుచుండెను. మేఘములచే వర్షింపబడిన వడగండ్లు నేలపై పడుచుండెను. అప్పుడు అవి వర్షాకాలమనెడి ప్రియుడు ప్రేమతో భూమియనెడి వనితయొక్క వక్షఃస్థలమునందు సంతోషముతో సమర్పించిన కర్పూరపు కణికలవలె విరాజిల్లుచుండెను. ఆవడగండ్లను అనుసరించుచు తెఱపిలేకుండా వర్షధారలు పడుచుండెను. అవి నల్లని సర్పములశరీరములవలెను, నీలమణులహారములవలెను అలరారుచుండెను. స్వచ్ఛములైన వర్షజలధారలలో తడియుచున్న కొండలు నిరంతర మదధారలతో ఒప్పుచున్న మదపుటేనుగులవలె శోభిల్లుచుండెను. ఆ కొండలపైనుండి పెద్దపెద్ద ఱాళ్లమీదపడి చెదరిపోవుచున్న సెలయేళ్లతుంపరలను చూడముచ్చటగొలుపుచుండెను. ఆ తుంపరలు వరుసగా పడుచుండుటచే నెమ్మెక్కి మెత్తగానైన బురదలు చిదుకు చిదుకుమను ధ్వనులతో[1] ఒప్పుచుండెను. బురదలపై బడి దొరలుచు జలములు వరదలై ప్రవహించుచుండెను. వఱదలు వచ్చి పడుచుండుటచే వాగులు పొంగి ఏఱులై పాఱుచుండెను. ఏఱులలో గుంపులుగాచేరి, చేపలు టెక్కులాడించుచు, అచటికి వచ్చిపడుచున్న కొత్తనీటికి ఎదురుగా నడచుచుండెను (ఎదురీదుచుండెను). మేఘములమధ్యనుండి వెలువడిన క్రొత్తక్రొత్త విద్యుత్కాంతులు మిఱుమిట్లు గొలుపుచుండెను. అవి సుందరీమణుల వన్నె చిన్నెలను జూచి ఓర్వలేక దాగికొనుచున్నవా అనునట్లు క్షణములో మాయమగుచుండెను. వరుసగా మేఘగర్జనలు (ఉఱుములు) చెలరేగసాగెను. అప్పుడు ఆ ఉఱుములు 'మెఱపు తీగెలవలె చంచలచిత్తలైన మగువలు పురుషులచెంత నిలకడగా (ఎక్కువసేపు) ఉండరు సుమా!' అని బ్రహ్మదేవుడు లోకమునకు చాటుచున్నాడా? అనునట్లు ఒప్పుచుండెను. అప్పుడు నెమళ్లు ఉఱుములకు ఏమాత్రము భీతిల్లక పూర్తిగా పురులు విప్పి, బిగ్గఱగా క్రేంకారములు సలుపుచు నాట్యములు చేయుచుండెను. భీకరమైన నెమళ్ల క్రేంకారములు చెవులసోకినంతనే విరహిజనుల వేదనలు ఎక్కువకాగా అందులకు తట్టుకొనలేక వారు తమ తమ అభిమానములను (పట్టుదలలను) వీడి, ఒకరికొకరు చేరువయ్యెరి. సూర్యకాంతులు ప్రసరించుటకు వీలులేనంతగా ఆకాశమునందంతటను మేఘములు (మబ్బులు)

1. వ్యక్తి బురదలో కాలిడినప్పుడు కలిగెడి ధ్వనులను చిదుకుచిదుకు మను ధ్వనులు - అని పలుకుచుందురు. ఇది ధ్వన్యనుకరణము.

క్రమ్ముకొనుటచే చీకట్లు అలముకొనగా 'ఇది పగలు, ఇది రాత్రి' అని గుర్తించుటకు వీలులేకుండెను. కాని బాగుగా వికసించిన మాలతీకుసుమములవాసనలు గుబాళించుచుండుటను బట్టి 'ఇది సంధ్యాసమయము' అని ఎఱుంగుటకు వీలయ్యెను. (దుర్దినము = మబ్బులు క్రమ్ముకొని, సూర్యరశ్మి ప్రసరింపని దినము) సాయంసమయములయందు మిణుగురు పురుగులు మినుకు మినుకు కాంతులతో తిరుగుచుండెను. ఎడతెఱిపిలేకుండా జడివానలు (కుంభవృష్టి) పడుచుండుటచేతను, చలిగాలులు తీవ్రముగా విసరుచుండుటవలనను ఆ బాధకు తట్టుకొనలేక వణకుచున్న అడవిజనులు సూర్యరశ్మికై నిరీక్షించుచు వంట ప్రయత్నములు చేయకుండిరి. కాని వారు ఖర్జూరఫలములను, నేరేడుపండ్లను తినుచు ఆకలిబాధను తీర్చుకొనుచుండిరి. సర్పములకు ఆటపట్టైన (పాములనెడి విటులతో కూడిన) మొగలి పొదలు తమ సువాసనలను వెదజల్లుచు వారాంగనలవలె వనచరులను మిగుల ఆనందింపజేయుచుండెను. అడవులలోని అన్ని మార్గములయందును బాగుగా వికసించిన మొగలి, కడిమి, పెద్దగోరంట, కొండమల్లె పూవులవాసనలు గుబాళించుచుండెను. దారులకు అడ్డముగా, గుబురుగా పెఱుగుచున్న పచ్చికలు రసవంతములై ఆ ప్రదేశములయందు అంతటను పచ్చదనమును నింపుచుండెను. అప్పుడు అవి గరుడపచ్చ (ఆకుపచ్చ) మణుల కాంతిపుంజమువలె రంజిల్లుచు మనోహరముగా ఉండెను. అచట సంచరించుచుండెడి పాడియావులు కడుపాఱ పచ్చికలను మేయుటచే వాటి శరీరము నునుపదేలి మిసమిసలాడుచు మెఱయుచుండెను. పాలతోనిండి, బలముగా ఉన్న పొదుగుల బరువుచే ఆ గోవులు అటునిటు కదలక నిలిచి హాయిగా నెమరువేయుచుండెను. ఇంకను ఆ వానకాలము పయఃకణములను కలిగియుండుటచే ఆవులగుంపువలె మనోహరముగా ఉండెను. (పయస్సు = నీరు, పాలు) - జలధారలుగలది వానకాలము, పాలధారలుగలది ఆవులగుంపు. అది పరిపూర్ణముగా సారంగములతో భాసిల్లుచుండుటవలన పరమశివుని హస్తమువలె విరాజిల్లుచుండెను. (సారంగము = చాతకపక్షి, లేడి.) పూర్తిగా చాతకపక్షులతో నిండియుండునది వానకాలము, నిండైన లేడితో భాసిల్లుచుండునది. శంకరునిహస్తము. ఇది హరిశరాసనమును గల్గి వైభవోపేతముగా ఉండుటచే మేరుగిరివలె అలరారుచుండెను. (హరిశరాసనము = ఇంద్రధనుస్సు, విష్ణువును బాణముగా సంధించిన చోటు.) ఇంద్రధనుస్సుచే విలసిల్లుచుండునది వానకాలము. విష్ణువును బాణముగా సంధించిన ప్రదేశము మేరు పర్వతము.) ఇది హరిశబ్దములతో విలసిల్లుచుండునది గావున విభీషణుని హృదయమువలె భాసిల్లుచున్నది. (హరిశబ్దములు = కప్పలబెకబెకలు, హరినామసంకీర్తనములు) కప్పల బెకబెకలతో ఒప్పుచుండునది వానకాలము, హరినామ సంకీర్తనములచే పవిత్రమగుచుండునది విభీషణుని హృదయము.

ఇది ఇంద్రగోపాది వైభవములకు కారణమగుటచే శివపూజవలె చెలువొందుచున్నది. (ఇంద్రగోపాదికము = ఆరుద్రపురుగు మొదలగునవి, ఇంద్రుడు, శ్రీకృష్ణుడు మున్నగువారు, ఆరుద్ర మొదలగు పురుగులకు వైభవమును (ఆనందమును) గూర్చునది వానకాలము. ఇంద్రుడు, శ్రీకృష్ణుడు మున్నగువారి వైభవములకు కారణమైనది శివపూజ. ఇది సీతాప్రకరణముచే అలంకృతమై ఉండునది గావున జనకయాగమువలె భాసిల్లుచున్నది. (సీతాప్రకరణాలంకృతము = నాగటి చాళ్ల విభాగముతో విలసిల్లుచుండునది, సీతాదేవి వృత్తాంతముతో అలరారునది.) నాగటి చాలులతో శోభిల్లుచుండునది వానకాలము. సీతాదేవి వృత్తాంతముతో పేరుమోసినది జనకమహారాజుయొక్క యాగము. ఇది బహువర్షశోభితము అగుటచే కృతయుగమువలె విలసిల్లుచున్నది. (బహువర్షము = అధికమైన వానలుగలది, పెక్కు సంవత్సరముల ప్రమాణముగలది.) జడివానలతో ఒప్పుచుండునది వానకాలము, నాలుగు యుగములలో ఎక్కువ సంవత్సరముల ప్రమాణము గలది కృతయుగము.

క. వాడక వ్రాలక తెవులుల, గూడక తగ నల్ల కెఱలు కొని నవకము లై
చూడఁగ భద్రములగుచును, వీడెన్ సస్యంబులిడుమ వీడెం బ్రజకున్. 757

పొలములలోని పైర్లు (వర్షములు పడుచుండుటవలన) ఏమాత్రము వాడిపోక, వంగిపోక, తెగుళ్లకు (రోగములకు) గుఱికాక ఏపుగా పెఱిగి నవనవలాడుచు చెక్కుచెదరక చక్కగానుండెను. దానివలన ప్రజలకష్టములు తొలగిపోయెను. (ప్రజల శ్రమ ఫలించెను.)

క. జీవనము సాలఁ గలిగియుఁ, గావరమున మిట్టిపడని ఘనునిక్రియ నదీ
జీవనములు సొర జలనిధి, ప్రావృట్కాలమున డిందుపడి యుండె నృపా! 758

రాజా! సంపదలు కొల్లలుగా ఉన్నప్పటికిని, గర్వముతో మిడిసిపడక (గర్వములేక) సత్పురుషుడు నిండుగా ప్రవర్తించును. అట్లే వర్షాకాలమునందు (పొంగి పొఱలివచ్చుచున్న) నదుల జలములు ఎంతగా ప్రవేశించుచున్నను సముద్రము తొణకక యథాస్థితిలో ఉండెను.

శా. ఆ వర్షాగమమందు గోవుల నరణ్యాంతంబులన్ మేపుచున్
గోవిందుండు ప్రలంబవైరియుతుఁడై గోపాలవర్గంబుతోఁ
బ్రావీణ్యంబునఁ గందమూలఫలముల్ భక్షించుచున్ మంజుల
గ్రావాగ్రంబులఁ బ్రీతిఁ జల్ది గుడిచెం గాసారతీరంబులన్. 759

శ్రీకృష్ణుడు బలరామునితో, గోపాలురతో గూడి ఆ వర్షాకాలమునందు అడవుల సమీపమునందు గోవులను మేపుచుండెను. అప్పుడు ఆ స్వామి తమవారితోగూడి సరస్సులయొక్క గట్టులపై స్వచ్ఛముగా (నునుపుగా) నున్న పెద్ద బండలపై జేరి, కందమూలఫలములను నేర్పుగా భక్షించుచు, కడుపు నిండునట్లుగా చల్దులను ఆరగించెను.

వ. ఆ సమయంబున. 760

సీ. విశ్వమోహనమైన వేణునినాదంబు సరస గంభీర గర్జనము గాఁగ
మహనీయ నిర్మల మందహాసద్యుతి లలిత సౌదామినీలతిక గాఁగఁ
దలచుట్టు బాగుగఁదనరు పింఛపుదండ శైలభేదనశరాసనము గాఁగఁ
గరుణా కటాక్షవీక్షణ సుధావర్షంబు సలిలధారా ప్రవర్షంబు గాఁగఁ
తే. జాడ నేతెంచు గోపాలజన మునీంద్ర చాతకంబుల దురవస్థ సక్కఁజేసి
కృష్ణమేఘంబు బహుతర కీర్తి నొప్పె విమల బృందావనాకాశవీథియందు. 761

ఆ సమయమున శ్రీకృష్ణుడు అనెడి మేఘము మనోహరమైన బృందావనమనెడి వినువీధియందు (ఆకాశమునందు) మిగుల వైభవముతో ప్రఖ్యాతి వహించెను. విశ్వమును పరవశింపజేయగల వేణునాదము సరసమై, గంభీరమైన మేఘగర్జనముగా ఒప్పుచుండెను. మనోహరముగా స్వచ్ఛముగానున్న ఆ స్వామి చిఱునవ్వు చూడముచ్చట గొలిపెడి మెఱపుతీగయై విలసిల్లుచుండెను. తలకు చుట్టును అలంకృతమైయున్న నెమలిపింఛపు దండ ఇంద్రధనుస్సుగా శోభిల్లుచుండెను. ఆ ప్రభువుయొక్క అనుగ్రహముతోగూడి క్రీగంటి చూపులనెడి అమృతవర్షము జలధారలతో గూడిన జడివానగా విరాజిల్లుచుండెను. ఈవిధముగా ఒప్పాఱుచున్న కృష్ణమేఘము గోపాలురు, మునీంద్రులు అనెడి చాతకపక్షులయొక్క తాపమును చల్లార్చుచుండెను.

క. గోవుల వృషవత్సంబుల, వావిరిఁ బూజించి పిదప వర్షాకాల
శ్రీవనితను బూజించెను, శ్రీవల్లభుఁడయ్యు గోపశేఖరుఁ డధిపా! 762

వ. ఇట్లు కృష్ణుండు విహితవిహారంబుల వర్షాకాలంబు పుచ్చె నంత, 763

మహారాజా! గోపాలకులకు తలమానికమైన శ్రీకృష్ణుడు లక్ష్మీనాథుడు ఐనప్పటికిని గోవులను, కోడెదూడలను (ఎద్దులను, దూడలను) ప్రేమతో పూజించెను. పిదప వర్షాకాలమనెడి లక్ష్మీదేవిని ఆరాధించెను. శ్రీకృష్ణప్రభువు ఇట్లు సముచితముగా విహరించుచు వర్షాకాలమును గడపెను. పిదప శరదృతువు ప్రారంభమయ్యెను.

## శరదృతువర్ణనము

క. జొంపములు కొనియె వనములు, రొంపులిగిరె నెమలిగములరొదలుడిగె నదుల్
పెంపులకుఁ బాసె నుఱుముల, శంపలసంపదలు మానె శారదవేళన్. 764

ఆ శరత్కాలమునందు వనములు అన్నియును గుబురులై యొప్పెను. బురదలు ఇంకిపోయెను. నెమళ్ల క్రేంకారములు ఆగిపోయెను. నదులజలములు తగ్గిపోయెను. (నదుల ప్రవాహములు సన్నగిల్లెను.) మేఘముల ఉఱుములు, మెఱుపులు సద్దుమనిగెను.

వ. మఱియు, జీవనంబులు విడిచి, విమల జ్ఞానవశంబున ముక్తులగు పురుషరత్నంబుల చెన్నునఁ జెన్ను వదలి, మిన్ను విడిచి, వాయువశంబులై, వెల్లివిరిసి చను మేఘంబులును, మేఘపటలరహితంబును, గలశభవమునిసహితంబునునై, విజ్ఞానదీప విలసితంబగు యోగిహృదయంబుచందంబున శుభ్రంబయిన యభ్రంబును, నభ్రంబున నీలదుకూల వితాన సంయుక్త ముక్తాఫలంబుల వడువున నెగడు నుడుగణంబులును, నుడుగణమయూఖంబు క్రొవ్వులువ్వెత్తుగొని నివ్వటిల్లుచు, బ్రహ్మాండకరండ కర్పూర ఖండాయమానంబులగు చంద్రకిరణంబులును, జంద్రకిరణ సంస్పర్శనంబున సగర్భంబులై భూమికి దుర్భరంబులగుచు నిండి పండి హాలిక కర నిశిత లవిత్ర ధారాసంరంభంబుఁదలంచి, తల్లడిల్లి, వెలువెలుకం బాఱుచుఁదల్లి యగు విశ్వంభరకు మునుకొని, ప్రణతంబులై వడంకుచు, నెఱుఁగ మొఱయిడుచున్న పెంపున సంపన్నంబులయిన యెన్నుల వ్రేఁగున వ్రాలి, గాలిందూలుచు, మర్మరధ్వనులసారస్యంబులగు కలమాది సస్యంబులును, సస్యమంజరీ పుంజంబుల గొంచక చంచువులఁ ద్రుంచి, కబళించి, పిల్ల పెంటి తండంబులం గూడి, కడుపులు నిండ మెక్కి, విక్కవిరిసి, చొక్కుచుఁ ద్రిక్కలుకొని, మహోత్తుంగ సమంచిత మంచ ప్రదేశంబు లెక్కి సంచరించుచు, వెన్నుల కావలియున్న యన్నుల కెమ్మోవులు బింబఫలంబులని కఱచి, తత్కరాస్ఫాలనంబుల నులికిపడి, వెగసి చను శుకనికరంబులకలకలంబులును, కలహంస కోక సారస కోలాహల మండితంబులై, నిండిన నిర్మల జలంబులుగల జలాశయంబులును, జలాశయంబుల జలములనుదినము నిగుర గృహములం బ్రతుకు దినములు సనుట యెఱుంగనిమనుజులగమనికం దిరుగుజలచరంబులును, జలచర హృదయముల బెదరుగదుర డొంకియింకిన నదులును, నదులందుఁగర్పూరమండపంబుల తెఱంగున, మణికుట్టిమంబుల మాడ్కిని, సౌధ సోపాన మార్గంబుల జాడను విలోకితంబులగు నూతన సైకతంబులును, సైకతప్రదేశంబుల నుదయవేళ నిత్యకర్మానుష్ఠాన నిరతులగు మునులును, ముని కన్యకా కరకలశ సలిలాభిషిక్త మూలంబులగు తపోవన బాలరసాల సాలంబులును, సాల విటపి వాసంతికా కుంజపుంజంబుల తఱుచున నిముడుకొని, దినకర కిరణములకుం గరువలికిం జొర వెఱవుపడని వనమ్ములును, వనమ్ముల దరులం కొనల నాకలములు నేకలములై మెసంగి, మసరుకవిసి, క్రొవ్వి, కొమ్ముల కొనల మీటి, యేటిదరులు త్రవ్వి, చిమ్మి కుమ్మి కోరాడెడి వనగజంబులును, గజకుంభ కనక కుంభ రుచిర కుచభార భీరుమధ్య సమంచితలగు చెంచితలును, జెంచితల క్రూరమ్ములగు వాలమ్ముల సారమ్ములు చెడి, ఖేదంబునఁ బాదంబులు దొట్రువడఁ బెను గాతంబులం బడు వరాహ పుండరీకంబులును, బుండరీక కుముద కురంటకాది కుసుమ మకరందంబులు గ్రోలి,తేలి, సోలి, వాలి, మహాహంకృతుల ఝుంకృతులు సేయు తేఁటి కదుపులును, గదుపులం గలయక యెడ గలిగి, మదమున

నదను పద నెఱింగి, మదనమార్గణ ప్రేరితంబులై, పెంటితుటుముల వెంటంజని, యొండొంటి గెంటించుచుం దగుల నెక్కి గర్భంబులు నెక్కొలుపు మృగ వృషభరాజంబులును గలిగి, రాజరాజ గృహంబుపగిది విలసితకుంద పద్మ సౌభాగ్యంబై, భాగ్యహీనుకర్ణంబురేఖ నశ్రుత నీలకంఠశబ్దంబై, శబ్ద శాస్త్రవేది హృదయంబు బాగున విశద ప్రకాశాభిరామంబై, రామ సంగ్రామంబు కైవడి బాణాసనాలంకృతంబై, కృతాంత హృదయంబు కరణి నపంకంబై, పంకజాసను గేహంబు సొంపున రాజహంసవిరాజమానంబై, మానధనునిచరిత్రంబుసొబగున నకల్మష జీవనంబై, వననిధి పోలుపున సమ్మిళిత భూభృద్వాహినీ సంకులంబై, కులవధూరత్నంబుచెలువున నదృష్ట పయోధరంబై, ధరణికిం దొడవగుచు శరత్కాలంబు వచ్చె నంత. 765

బాగుగా జలములను వర్షించియున్న మేఘములు కాంతివిహీనములై, (వాయువుల తాకిడికి ఆకాశమున చెల్లాచెదురై) సాగిపోవుచుండెను. అప్పుడు అవి సాంసారిక జీవనమును త్యజించి, తత్త్వజ్ఞాన ప్రభావమున బంధవిముక్తులైన మహాపురుషులవలె విలసిల్లుచుండెను. ఆకాశము మేఘములులేనిదై, అగస్త్య నక్షత్రముతో విలసిల్లుచు స్వచ్ఛముగా ఉండెను. అప్పుడు అది విజ్ఞానమనెడి జ్యోతితో వెలుగొందుచుండెడి యోగిహృదయమువలె విరాజిల్లుచుండెను. నీలాకాశమునందలి నక్షత్రములు నీలపురంగులో ఉన్న పట్టువస్త్రములపై కూర్చబడిన ముత్యాలవలె మిలమిల మెఱయుచుండెను. చంద్రకిరణములప్రభావమున చుక్కలకాంతులు వెలవెలబోవుచుండెను. అప్పుడు చంద్రకిరణములు బ్రహ్మాండమనెడి బరణియందలి కర్పూరఖండములవలె విరాజిల్లుచుండెను. వరి మొదలగు పైరులు అన్నియును (చల్లని తేమలను వర్షించు) చంద్రకిరణములస్పర్శచే ఏపుగా పెఱిగి పొట్టకు వచ్చి, పొలములయందు గుబురుగా (దట్టముగా) వ్యాపించి బాగుగా పండియుండుటచే అవి భూమికి బరువై విలసిల్లుచుండెను. ఇంక వాడియై పదనుదేలియున్న కొడవళ్లతో రైతులు తమను కోసివేయుదురేమో! అను భావముతో తల్లడిల్లుచున్నవా అనునట్లు అవి వెలవెలబోవుచుండెను. కోతకు వచ్చిన ఎన్నుల (కంకుల) భారమునకు వంగియున్న ఆ పైరులు గాలితాకిడికి అటునిటు కదలుచు మర్మరధ్వనులు చేయుచుండెను. అప్పుడు ఆ సస్యములు తమ బాధను (కొడవళ్లకోతలబాధను) గూర్చి, భూమాతకు వినమ్రములై మొఱపెట్టుకొనుచున్నవా? అనునట్లు ఒప్పుచుండెను. అంతట చిలుకలగుంపులు గుత్తులు గట్టియున్న ఆ పైరుల కంకులను తమ ముక్కుపుటలతో నిర్భయముగా త్రుంచి కబళింపసాగెను. ఇంకను అవి తమ పిల్లచిలుకలతో, భార్యలతోగూడి ఆ ధాన్యపు గింజలను కడుపునిండా మెక్కి మెక్కి, మిగుల సంతోషముతో చొక్కి సోలుచుండెను. ఆ సమయమున స్త్రీలు చక్కని ఎత్తైన మంచెలపైకెక్కి అటునిటు కదలుచు పక్షులు వెన్నులను దినకుండుటకై కాపలాకాయుచుండిరి. చిలుకలు అచటినుండి వెళ్లిపోవుచు ఆ యువతులయొక్క ఎఱ్ఱని పెదవులను దొండపండ్లుగా భ్రమపడి వాటిని ముక్కులతో పొడవసాగెను. అంతట కాంతలు తమ చేతులతో వాటిని అదలించుచుండగా అవి భయపడి వెళ్లుచు కలకలధ్వనులు చేయసాగెను. నిర్మలమైన జలములతోగూడిన అచటి సరోవరములయందు కలహంసలు, చక్రవాకములు, బెగ్గురు పక్షులు కోలాహల ధ్వనులను గావించుచుండెను. అచటి మడుగులలో దినదినమునకు నీళ్లు ఇంకిపోవుచుండగా అందలి చేపలు మొదలగు జలచరములు దిక్కుతోచక అటునిటు తిరుగుచుండెను. అప్పుడు అవి జీవనాధారమును కోల్పోవుచుండగా ఇక ఈ గృహములలో ఉండి, బ్రతుకుబండిని లాగుట ఎట్లాయని తికమకపడుచున్న మనుజులను తలపింపజేయుచుండెను. చేపలు మొదలగు జలచరములగుండెలు గుభేలుమనునట్లుగా నదులలోని జలములు మిగుల ఇంకిపోయెను. నదులలోని నీళ్లు (పూర్తిగా) ఇంకిపోవుటచే అందలి తెల్లని ఇసుకతిన్నెలు బయల్పడెను. అప్పుడు ఆ సైకతములు కర్పూరమండపములవలెను, మణులతో చెక్కబడిన వేదికల విధమునను, సున్నముతో నిర్మింపబడిన మేడలయొక్క సోపానముల రీతిగను విరాజిల్లుచుండెను. ఆ ఇసుకతిన్నెలమీద ప్రతినిత్యము ప్రాతఃకాలములయందు మునులు నిత్యకర్మానుష్ఠానములను నెఱపుచుండిరి. అందలి తపోవనములలోని తియ్యమామిడి మొక్కలకు (మొక్కల పాదులకు)

మునికన్యలు కలశములతో నీరు తెచ్చి ప్రేమతో తడుపుచుండిరి. అచటి వనములయందు పాలవృక్షములు, అడవిమొల్లలు, పొదరిండ్లు అంతటను దట్టముగా వ్యాపించియుండెను. అందువలన అచట సూర్యకిరణములుగాని, గాలులుగాని ప్రవేశించుటకు వీలులేకుండెను. అడవి ఏనుగులు అచటి వనములయందును, నదీతీరములయందునుగల ఆకులలములను ఒంటరిగా కడుపార తిని, ఎంతయు బలిసి, మత్తిల్లి యుండెను. అవి తమ దంతముల చివరలతో పొడిచి, నదులదరులను త్రవ్వి, చిమ్ముచు, క్రుమ్ముచు నేలలను పెల్లగించుచుండెను. ఆ వనములయందలి చెంచు వనితలు ఏనుగుల కుంభస్థలములవలెను, బంగారు కలశములరీతిగను మనోహరముగా నున్న కుచములుగలిగి శోభిల్లుచుండిరి. ఆ కుచభారములకు వణకిపోవుచున్న సన్నని నడుములతో ఒప్పుచు ఆ చెంచుయువతులు ఎంతయు దర్శనీయముగా ఉండిరి. అచటి వనవరాహములు, పెద్దపులులు ఆ చెంచువనితల వాడిబాణములధాటికి మిగుల దెబ్బతిని, బలహీనపడి ఎంతయు బాధపడసాగెను. పిమ్మట అవి కాళ్లు తడబడుచుండగా (నిలువలేక) పెద్దగుంతలలో పడుచుండెను. అచటి పద్మములు, కలువలు, పచ్చగోరింటలు మొదలగు పూవులలోని మకరందములను తనివిదీఱ గ్రోలి, తేలిసోలిపోవుచున్న తుమ్మెదలగుంపులు మిక్కిలి అహంకారముతో (నిర్భయముగా) ఝుంకారములు చేయుచుండెను. అచట పడుచు వయస్సులో ఉన్న మృగములును, వృషభములును గుంపులతో గలియక వాటికి దూరముగా ఉండి, మదావేశముతో మురకచూచి, యుక్తసమయమును గుర్తించి, (ఆడుమృగములు, ఆవులు ఎదకు వచ్చియున్నట్లు గమనించి) కామవికారములకు లోనగుచుండెను. పిదప అవి ఆడుమృగములను, ఆవులను వెంబడించి, వాటిని నెట్టుచు ప్రేమతో వాటిపై ఎక్కి, దాటి వాటికి చూలు గలిగించుచుండెను.

ఆ శరత్కాలము వికసించిన మొల్లలతో, పద్మములశోభలతో ఒప్పుచు కుబేరునిగృహమువలె విరాజిల్లుచుండెను. (శరత్కాలము మొల్లలు, పద్మములు అను పూవులతో ఒప్పుచున్నది, కుబేరుని గృహము కుందము, పద్మము అను నిధులతో [1] ఒప్పుచున్నది.) నెమళ్ల క్రేంకారములు ఆగిపోవుటతో శరత్కాలము దురదృష్టవంతుని చెవివలె ఒప్పుచుండెను. (శరత్కాలమునందు నీలకంఠముల (నెమళ్ల) క్రేంకారములు ఆగిపోవును, దురదృష్టవంతుని చెవికి నీలకంఠుని (శివుని) శబ్దంబులు (హర, హర అను శివభజనలు) సోకవు. స్వచ్ఛమైన కాంతులతో మనోహరముగా ఉన్న శరత్కాలము వ్యాకరణశాస్త్రజ్ఞుని హృదయమువలె భాసిల్లుచుండెను. (స్వచ్ఛములైన కాంతులతో మనోజ్ఞముగా నున్నది శరదృతువు, శబ్దార్థజ్ఞానము గలిగి మనోహరముగా విలసిల్లుచున్నది. వ్యాకరణశాస్త్రజ్ఞుని హృదయము.) బాణాసనములచే ఒప్పుచున్న శరత్తు శ్రీరాముని యుద్ధమువలె రాజిల్లుచుండెను. (శరత్కాలమునందు రాజులు ధనుర్బాణములను చేబూని విజయయాత్రలు గావించుచుందురు, రామరావణయుద్ధమున రణభూమియందు అంతటను ధనుర్బాణములు నిండియుండెను.) అపంకమైయున్న శరత్తు యమునిహృదయమువలె అలరారుచుండెను. (పంకము = బురద, పాపము. బురదలులేనిది శరత్తు. పాపములు లేనిది యముని హృదయము. యముని శిక్షలు నిష్పక్షపాతముగా ఉండునుగాన ఆయనకు పాపములు అంటవు.) రాజహంసలతో విరాజిల్లుచుండెడి శరత్తు బ్రహ్మదేవునిగృహమువలె విలసిల్లుచుండెను. (శరత్కాలమునందు రాజహంసలు సరస్సులలో విహరించుచుండును. బ్రహ్మదేవునివాహనము రాజహంస - కనుక ఆ దేవునిగృహమునందు హంసలు తిరుగాడుచుండును.) కల్మషములు లేని జీవనములుగల శరత్తు మానధనుని చరిత్రమువలె శోభిల్లుచుండెను. (మానధనుడు = మిగుల గౌరవముతో జీవించుచుండువాడు; కల్మషము = మురికి, మచ్చ, జీవనము=

1. మహాపద్మశ్చ, పద్మశ్చ, శంఖో, మకరకచ్ఛపౌ ।
ముకుంద, కుంద, నీలాశ్చ, వరశ్చ నిధయో నవ ॥ (అమరకోశము)
మహాపద్మము, పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, వరము - అనునవి నవనిధులు (తొమ్మిది నిధులు)

నీరు, జీవితము. మురికిలేని (నిర్మల) జలములుగలది శరత్తు. మచ్చలేని జీవితము గలవాడు మానధనుడు). భూభృద్వాహినులతో విలసిల్లుచున్న శరత్తు సముద్రము రీతిగా భాసిల్లుచుండెను (వననిధి = జలనిధి, సముద్రము, భూభృత్తులు = భూమిని పాలించువారు, రాజులు. వాహినులు = సేనలు. భూభృత్తులు = పర్వతములు, వాహినులు = ప్రవాహములు, నదులు - (విజయయాత్రలొనర్చు రాజులతో, సేనలతో ఒప్పుచుండునది శరత్తు - కొండలతో, నదీప్రవాహములతో కూడియుండునది సముద్రము.) పయోధరములు కన్పట్టకుండుటచే శరత్తు ఉత్తమ గృహిణివలె విరాజిల్లుచుండెను. (పయస్సు = నీరు, పాలు. పయోధరములు = మేఘములు, స్తనములు. శరత్తునందు మేఘములు లేకుండును. పతివ్రత పమిటతో తన వక్షఃస్థలమును కప్పుకొనును) శరత్కాలము ఈవిధముగా విరాజిల్లుచుండెను.

క. వాజుల నీరాజనములు, రాజుల జయగమనములును రాజిత లక్ష్మీ
పూజలు దేవోత్సవములు, రాజిల్లెను జగతియందు రాజకులేంద్రా! 766

పరీక్షిన్మహారాజా! శరత్కాలము వచ్చుటలో భూతలమున రాజులు విజయయాత్రలకై బయలుదేఱుచుండిరి. యుద్ధాశ్వములకు (రథాశ్వములకు) నీరాజనములను పట్టుచుండిరి. ధనలక్ష్మీపూజలు, దేవతలకు ఉత్సవములు నిర్వహింపబడుచుండెను.

క. చేగ గల చెఱకువింటను, బాగుగ నీలోత్పలంబు బాణంబుగ సం
యోగంబు సేసి మదనుఁడు వేగంబున విరహిజనుల వేఁటాడె నొగిన్. 767

మన్మథుడు మిగుల చేవగల చెఱకును ధనుస్సుగా జేసికొని, నల్లగలువను బాణముగా సంధించి, విరహములోనున్న యువతీయువకులపై ప్రయోగింపసాగెను. ఆవిధముగా మదనుడు వారివిరహమును పెంచసాగెను.

వ. ఇట్లు భాసురంబు లయిన శరద్వాసరంబుల గోవిందుండు గోబృందసమేతుండై, బృందావనంబునఁ బసులఁ బొసంగ మేపుచు, 768

శరత్కాలము ఇట్లు మనోజ్ఞమై విలసిల్లుచుండగా, శ్రీకృష్ణుడు తోడిగోపాలకులతోగూడి, బృందావనమునందు హాయిగా పశువులను మేపుచుండెను.

సీ. కర్ణావతంసిత కర్ణికారప్రభ గండభాగద్యుతిఁ గడలుకొలుప
భువనమోహనమైన భ్రూవిలాసంబుతో వామభాగానత వదన మొప్ప
నపసవ్యకర మృదులాంగుళీ చాతురీ షడ్జధ్వనికి మర్మసరణిఁ జూప
డాకాలిమీఁద నడ్డము సాఁచి విల్చిన పదనఖద్యుతి భూమిఁ బ్రబ్బి కొనఁగ
తే. మౌళిపింఛముఁ గంఠదామమును మెఱయ విలసిత గ్రామముగ నొక్క వేణువందు
బ్రహ్మగాంధర్వ గీతంబు పరఁగ జేసెఁ జతురనటమూర్తి గోపాలచక్రవర్తి. 769

నటనలో చతురుడైన గోపాలకృష్ణప్రభువు చెవులపై భూషణములుగా ధరించిన కొండగోగుపూలకాంతి ఆయన చెక్కిళ్ల శోభలను ఇనుమడింపజేయుచుండెను. విశ్వమునే మోహింపజేయగల బొమముడుల సోయగములు విలాసముగా ఎడమవైపునకు వంచబడిన ముఖశోభలు మనోహరములుగా ఉండెను. కుడిచేతివ్రేళ్ల నైపుణ్యములు 'స, రి, గ, మ, ప, ద, ని' అను సప్తస్వరముల రహస్యములను ప్రకటించుచుండెను. ఎడమకాలిమీద అడ్డముగా పెట్టిన కుడికాలియొక్క నఖములకాంతులు భూమిపై తళుకులీనుచుండెను. శిరస్సుపై అలంకృతమైన నెమలిపింఛము, కంఠమున ధరింపబడిన వనమాలయు కనువిందుగావించుచుండెను. వేణునాదమునందలి సప్తస్వరసమ్మేళనము సామవేదగానములను పలికించుచుండెను. (వ్యత్యస్తపాదారవిందుడైన శ్రీకృష్ణుని సౌందర్యములు ఇందు మనోజ్ఞముగా వర్ణింపబడినవి.)

వ. ఇట్లు హరి వేణునాదంబు పూరించిన, మారవికార హేతువగు తద్గీతంబాలించి, సిగ్గులు సాలింప, ముక్కువలు సెక్కులొత్త, గోపికలోపికలులేక, తమ తమ పొత్తుకత్తెలుం దారును, దత్తరంబునఁ బదుగురు. నేగురుం దుటుములు గట్టి, జిలిబిలి ముచ్చటలకుం జొచ్చి, తమలోన. 770

శ్రీకృష్ణుని వేణుగాన మాధుర్యములు గోపికలకు కామవికారములను కలిగించుచుండెను. అప్పుడు శ్రీకృష్ణునిపై వారికిగల అనన్యప్రేమలు అధికమగుచుండగా తట్టుకొనలేక వారు తత్తరపాటుతో ఐదుగురుగా, పదిమందిచొప్పున గుంపులుగా చేరి, బిడియములు వీడి, తమలో తాము ఇట్లు ముద్దుముచ్చట్లు చేయసాగిరి.

మ. శ్రవణోదంచిత కర్ణికారకముతో స్వర్ణాభ చేలంబుతో
నవతంసాయిత కేకి పింఛకముతో నంభోజ దామంబుతో
స్వవశుండై మధురాధరామృతముచే వంశంబుఁ బూరించుచు
న్నువిదా! మాధవుఁ డాలవెంట వనమందొప్పారెడిం జూచితే. 771

చెలీ! మన మాధవుడు చెవులపై ధరించిన కొండగోగుపూవుల శోభలు మనోహరములు. ఆ ప్రభువు దాల్చిన బంగారుచేలములు అద్భుతముగా ఉన్నవి. శిరస్సుపై చెక్కిన నెమలిపింఛములకాంతులు మనోజ్ఞములు కంఠమున ధరించిన వనమాలవైభవములు అపూర్వములు. ఆ స్వామి ఇప్పుడు మైమఱచి, తన కమ్మని అధరామృతమును మేళవించి, హాయిగా మురళిని మ్రోగించుచు బృందావనమున గోవులవెంట విహరించుచున్నాడు. చూచితివా?

శా. రావే సుందరి!యేమె బోటి! వినవే రాజీవనేత్రుండు బృం
దావీథిం దగ వేణువూఁదుచు లసత్సవ్యానతాస్యంబుతో
భ్రూవిన్యాసములంగుళీక్రమములం బొల్పార షడ్జంబుగాఁ
గావించెన్ నటుభంగి బ్రహ్మమగు తద్గాంధర్వ సంగీతమున్. 772

ఓ సుందరీ! ఇటు రమ్ము, ఏమే! చెలీ! ఇది వినుము. కమలాక్షుడైన శ్రీకృష్ణుడు ఈ బృందావనప్రదేశములలో చక్కగా వేణువును ఊదుచున్నాడు. ఎడమముఖమును సొంపుగా వంచి భ్రూవిన్యాసము గావించుచు, సుకుమారములైన వ్రేళ్లను ఆడించుచు, సప్తస్వరమాధుర్యములను ఒలికించుచున్నాడు. మహానటునివలె దివ్యమగు తన గంధర్వగానమున మధురిమలను చిలుకుచున్నాడు.

క. తలఁకెను గొబ్బునఁ జిత్తము, నళినాక్షునిమధుర వేణునాదము నా వీ
నులు సోఁకినంతమాత్రన, చెలియా! యింక నేటి వెఱపు చింతింపఁగదే. 773

చెలియా! అందాలరాశియైన శ్రీకృష్ణునియొక్క మధురమైన వేణుగానము చెవులకు సోకినంతనే నా చిత్తము పరవశించి పోవుచున్నది. కావున ఇంక శ్రీకృష్ణప్రభువును చేరుటకు, భయమెందులకు? ఆలోచింపుము.

క. నాతోడ వెఱవ వలదే, నాతోడనె కొనుచుఁబోయి నళినదళాక్షున్
నీతోడుతఁ బలికించెద, నీతోడి జనంబు మెచ్చ నీతోడు సుమీ. 774

సఖీ! నా దగ్గఱ భయపడవలసిన పనియేమున్నది? (నా దగ్గర దాచుట ఎందులకు) నేను నిన్ను వెంటబెట్టుకొని, శ్రీకృష్ణునికడకు తీసికొని వెళ్ళెదను. ఆ స్వామి నీతో మాట్లాడునట్లు చేసెదను. అప్పుడు నీతోగూడియున్న చెలులు అందఱును మెచ్చుకొందురు. నీమీద ఒట్టు సుమా!

వ. అని పెక్కుభంగుల నోర్తోర్తు నుద్దేశించి పలుకుచు, గోపసుందరులు బృందావనంబునకు గోవిందునకెదురు చని, పరమానందంబున నతనిం దమమనంబులఁ బ్రతిపదంబును నాలింగనంబు సేసినవారలగుచు రామకృష్ణుల నుద్దేశించి. 775

ఇట్లు గోపికలు ఒకరితోనొకరు మర్మభాషణములు (సరసములు) గావించిరి. పిమ్మట వారు బృందావనమునందు ఉన్న గోవిందునకు ఎదురుగావెళ్ళిరి. పిదప ఆ సుందరీమణులు పరమానందమును పొందుచు, ఆ కృష్ణప్రభువును తమ మనస్సులలో పదేపదే ఆలింగనమును చేసికొనిరి. అనంతరము వారు బలరామకృష్ణులను గూర్చి తమలో తాము ఇట్లు అనుకొనిరి.

మ. నవ గోష్ఠానక రంగమందుఁ బరమానందంబుతోఁ జూతప
ల్లవ నీలోత్పల పింఛ పద్మ దళమాలా వస్త్రసంపన్ను లై
కవలై వేణువులూఁదుచున్ బహు నటాకారంబులం గేళితాం
డవముల్ సేసెదరీకుమారకులు వేడ్కం గామినుల్ కంటిరే! 776

క. ఓ చెలువలార! వినుఁడీ, వాచాశతకంబులేల వర్ణింపంగా
లోచనముల కలిమికి ఫల, మీ చెలువురఁ జూడఁగలుగుటింతియ సుండీ. 777

వనితలారా! ఈ బలరామకృష్ణులు మామిడిచిగుళ్లను, నల్లకలువలను, నెమలిపింఛములను, పద్మదళమాలలను, చక్కని వస్త్రములను ధరించియుండిరి. జోడుగానున్న ఈ ఇద్దరును క్రొత్తవియైన ఆవులకొట్టములనెడి రంగస్థలములయందు చేరి, పరమానందముతో వేణువులను మ్రోగించుచున్నారు. అనేకవిధములైన నటులవేషభూషలతో విలాసముగా నృత్యములనొనర్చుచున్నారు. ఈ దృశ్యములను చూచితిరా? చెలువలారా! ఆలకింపుడు, వీరినిగూర్చి పలురీతులుగా వర్ణింపవలసిన పనియేమి? కనులున్నందులకు ఈ అందగాండ్రయొక్క సోయగములను దర్శించుటయే ఫలము (అదృష్టము) సుమా!

వ. అని పలికి రందుఁ గొందఱు గోవిందు నుద్దేశించి, 778

మ. ఒనరన్ వ్రేతలకించుకేనినట లేకుండంగ గోపాలకృ
ష్ణునికెమ్మోవిసుధారసంబు గొనుచుం జోద్యంబుగా మ్రోయుచుం
దన పర్వంబులు నేత్రపర్వములుగా దర్పించెఁ బూర్వంబునన్
వనితా! యెట్టి తపంబు చేసెనొకొ యీ వంశంబు వంశంబులోన్. 779

గోపికలు ఇట్లు ముచ్చటించుకొనిన పిదప వారిలో కొంతమంది శ్రీకృష్ణుని గుఱించి ఇట్లు వచించిరి. వనితా! క్రమముగా ఈ వేణువు (మురళి) గోపికలకు ఏమాత్రమూ మిగులకుండా శ్రీకృష్ణునియొక్క అధరామృతమును గ్రోలుచు, అద్భుతముగా మ్రోగుచున్నది; అది (తన నాదములచే వీనులవిందుగావించుచు) తన రంధ్రములచే కన్నులపండువు సేయుచు త్రుళ్లిపడుచున్నది. వెదుళ్లలో పుట్టిపెరిగిన ఈ పిల్లనగ్రోవి (వంశము) పూర్వజన్మలో ఎంతటి తపస్సుచేసినదో ఏమో?

మ. ముదితా! యే తటినీ పయఃకణములన్ మున్ వేణు వింతయ్యె నా
నది సత్పుత్రునిఁ గన్న తల్లిపగిదిన్ నందంబుతో నేఁడు స
మ్మద హంసధ్వని పాటగా వికచ పద్మశ్రేణి రోమాంచ మై
యొదవన్ తుంగ తరంగహస్త నటనోద్యోగంబుఁ గావింపదే. 780

ఉవిదా! ఈ వేణువు యమునా నదీజలబిందువులు చిందెడి ప్రదేశమున (ఆ నదీజలముల తుంపరలు స్పృశించుచు) మధురముగా గానము చేయుచు చక్కగా వర్ధిల్లినది. ఆ దృశ్యమునకు నదీమతల్లి బంగారు (ఉత్తముడైన) కొడుకును గన్న తల్లివలె ఆనందముతో పొంగిపోయియుండును. అంతేగాక ఆ నది సంతోషమును పట్టలేక హంసధ్వనులు అనెడి పాటలతో, బాగుగా వికసించిన పద్మములనెడి రోమాంచములతో, ఎగసిపడుచున్న తరంగములనెడి హస్తవిన్యాసములతో నృత్యములొనర్చియుండును.

క. నలినోదరుభక్తునిఁ గని, కులజులు నందాశ్రుజలము గురియుపగిది భ్రూఁ
కులు పూఁదేనియ లొలికెడు, నలినాక్షునిచేతివంశనాళము మ్రోఁతన్. 781

చెలియా! శ్రీమహావిష్ణువుయొక్క (శ్రీకృష్ణునియొక్క) భక్తుని జూచి, అతని వంశమువారు ఆనందాశ్రువులు రాల్చుచున్నట్లుగా ఆ కృష్ణప్రభువు యొక్క మురళీగానమునకు పరవశించిన వృక్షములు తమ పూవులనుండి మకరంద బిందువులను స్రవింపజేయుచున్నవా యనునట్లు అచటి పూదేనియలు జాలువాఱుచుండెను.

శా. నా మోసంబున కెద్ది మేర వినవే నా పూర్వజన్మంబులన్
లేమా! నోములు నోఁచుచో నకట! కాళిందీతటిన్ వేణువై
భూమిం బుట్టెద నంచుఁ గోరఁ దగదే బోధిల్లి యట్లైన నీ
బామం దిప్పుడు మాధవాధర సుధాపానంబు గల్గుం గదే. 782

వనితా! వినుము. నా పూర్వజన్మలలో నేను దిద్దుకొనరాని పెద్ద పొఱపాటునే చేసియుంటిని. ఆ జన్మలలో నోములు నోచునప్పుడు 'దేవా! ఈ భూతలమునందు కాళిందీనదీతీరమున వంశముగా పుట్టెదను' అని కోరుకొనవలసియుండెను. ఆవిధముగా కోరుకొనియున్నచో ఈ జన్మలో వేణువునై పుట్టి శ్రీకృష్ణుని అధరామృతమును గ్రోలెడి భాగ్యము నాకు దక్కియుండెడిది.

క. కాళిందీకూలంబున నాళీ యీ నందతనయు నధరామృతమున్
గ్రోలెడి వేణువ నగు నో, మేలాగున నోఁచవచ్చు నెఱిఁగింపఁగదే. 783

చెలియా! శ్రీకృష్ణుని అధరామృతమును గ్రోలుటకు అనువుగా ఈ కాళిందీతీరమున వేణువునై పుట్టుటకు ఏ నోమును నోచవలెనో? తెలుపుము.

క. వనితా! కృష్ణుఁడు నల్లని, ఘనమనియున్ వేణురవము గర్జనమనియున్
మనమునఁ దలంచి రొప్పుచు, ననవరతము నెమలితుటుములాడెడిఁగంటే. 784

ఉవిదా! నల్లని వన్నెగల కృష్ణుని మేఘమనియు, ఆ ప్రభువుయొక్క వేణురవమును (నాదమును) మేఘగర్జనము అనియు భావించి, నెమళ్ల క్రేంకారములను గావించుచు నిర్విరామముగా నృత్యములు చేయుచున్నవి. చూచితివా?

క. గిరిచర మిథునములోలిం, బరికింపఁగఁ గృష్ణపాద పద్మాంకితమై
సురరాజు నగరికంటెను, దరుణీ! బృందావనంబు దద్దయు నొప్పెన్. 785

తరుణీ! గిరులపై వనములలో సంచరించెడి దంపతులు (లేదా! గిరులపై సంచరించెడి దివ్యజాతులవారు) పరికించి చూచినచో వారికి శ్రీకృష్ణుని పాదముద్రలతో ఒప్పుచున్న (పునీతమైన) ఈ బృందావనము ఇంద్రుని పట్టణమైన అమరావతికంటెను వైభవోపేతముగా తోచుచుండవచ్చును.

మ. అమరేంద్రాంగనలాకసంబున విమానారూఢలై పోవుచుం
గమలాక్షున్ శుభమూర్తిఁ గాంచి మురళీగానంబులందంద క
ర్ణములన్ నిల్పుచు మేఖలల్ వదలఁగా నాథాంక మధ్యంబులం
బ్రమదా! వ్రాలిరి చూచితే వివశలై పంచాశుగభ్రాంతలై. 786

యువతీ! దివ్యాంగనలు ఆకాశమున విమానములలో సంచరించుచు సర్వాంగసుందరుడైన శ్రీకృష్ణుని కనులార చూచుచు, మధురమైన మురళీగానమును చెవులప్పగించివినుచు పరవశించిపోవుచుండిరి. అంతట కామవికారములకు లోనగుటచే వారికటిసూత్రములు సడలిపోసాగెను. ఆ పారవశ్యములో వారు తమ నాథులయొక్క ఒడులలో వ్రాలిపోయిరి.

ఉ. కానలనుండుచున్ సరస గాన వివేక విహీన జాతలై
వీనుల నేఁడు కృష్ణముఖ వేణు రవామృతధార సోఁకినన్
మేనులు మేఁతలున్ మఱచి మెత్తని చూడ్కి మృగీ మృగావళుల్
మానిని చూడవమ్మ బహుమానము సేసెఁ, గృతార్థచిత్తలై. 787

అడవులలో నివసించుచుండెడి ఆడు, మగ మృగములకు సహజముగా, సరసమైన సంగీతజ్ఞానము ఏమాత్రమూ ఉండదు. కాని శ్రీకృష్ణుని వేణువునుండి జాలువాఱుచున్న మధురనాదములు చెవుల సోకినంతనే అవి మేతలు మాని, మైమఱచిపోవుచున్నవి. అంతట తమ చిత్తములు కృతార్థములు అగుటతో అవి సుకుమారములైన చూపులతో ఆ ప్రభువును సమ్మానించుచున్నవి.

ఉ. తల్లులచన్నుఁబాలు మును ద్రావు తఱిన్ దమ కర్ణవీథులన్
వల్లభమైన మాధవుని వంశ రవామృతధార సొచ్చినం
ద్రుళ్ళక పాలు రాఁ దివక దూఁటక మానక కృష్ణుమీఁద దృ
గ్వల్లులు సేర్చి నిల్చె నదె వత్సములంగనలార! కంటిరే. 788

అంగనలారా! ఆవుదూడలు తమ తల్లుల దగ్గఱ పాలు త్రాగుచున్నప్పుడు, ప్రియమైన శ్రీకృష్ణుని వేణువునుండి వెలువడుచున్న కమ్మని నాదములు చెవులలో బడినంతనే అవి ఎంతో హాయిని అనుభవించుచున్నవి. ఏమాత్రమూ త్రుళ్లిపడుటలేదు. పైగా పొదుగులను క్రుమ్ముటయు, పాలు త్రాగుటయు మానివైచినవి. చన్నులను నోట నుంచుకొనియే అవి ఱెప్పలార్పక తమ చూపులను, శ్రీకృష్ణునిమీదనే నిల్పియున్నవి. గమనించితిరా?

మ. మమతన్ మోములు మీఁది కెత్తుకొని రోమంథంబు పాలించి హృ
త్కమలాగ్రంబులఁ గృష్ణు నిల్పి మురళీ గానామృత శ్రేణి క
ర్ణములం గ్రోలుచు మేఁత మాని గళితానందాశ్రులై చిత్రితో
పములై గోవులు సూచుచున్నవదిగోఁ బద్మాక్షి! వీక్షించితే. 789

పద్మాక్షీ! గోవులు కృష్ణప్రభువుపైగల మమకారముతో నెమరువేయుట మాని, మోరలు పైకెత్తి, తమ హృదయకమలములను శ్రీకృష్ణునకే సమర్పించియున్నవి. వీనులవిందుగానున్న మురళీనాదమధురిమలను తనివిదీర ఆస్వాదించుచున్నవి. మేతలు మాని, ఆనందాశ్రువులను రాల్చుచున్నవి. నిశ్చలముగా ఉన్న బొమ్మలవలె ఒప్పుచు ఆ గోవులు తదేకదృష్టితో ఆ ప్రభువునే దర్శించుచున్నవి. చూచితివా?

మ. జగతీజంబుల శాఖలెక్కి మురళీ శబ్దామృత స్యందమున్
మిగులన్ వీనులఁ ద్రావి వ్రేఁగువడి నెమ్మిం గృష్ణ రూపంబు చి

త్తగమై యుండఁగ నడ్డపెట్టుక్రియ నేత్రంబుల్ దగన్ మూసి యీ
ఖగముల్ సొక్కెడిఁ జూచితే మునిజనాకారంబులం గామినీ! 790

ముదితా! చెట్లకొమ్మలపై చేరియున్న పక్షులు శ్రీకృష్ణుని మురళీరవమధురధారలను ఎంతయు ప్రీతితో చెవులార ఆస్వాదించుచు పరవశించి పోవుచున్నవి. ప్రేమతో కృష్ణుని రూపమును తమ చిత్తములయందు నిల్పుకొని, ఆచిన్మూర్తి బయటికి పోకుండ అడ్డుపెట్టుటకా అనునట్లు కనులు మూసికొని చొక్కి సోలిపోవుచున్నవి. అట్లు పరమానందమును అనుభవించుచున్న ఆ పక్షులు మహామునులవలె అలరారుచున్నవి.

మ. క్రమ మొప్పన్ నదులెల్ల వంశరవమాకర్ణించి సంజాత మో
హమునన్ మన్మథసాయక క్షత విశాలావర్తలై హంసవా
క్యములం జీరి తరంగహస్తముల నాకర్షించి పద్మోపహా
రములం గృష్ణపదార్చనంబు సలిపెన్ రామా! విలోకించితే. 791

పడతీ! నదులన్నియు హాయినిగొలిపెడి మురళీరవములను వినుచు వినుచు క్రమముగా మోహపరశలైనట్లు కన్పట్టుచున్నవి. సుడులు తిరుగుచున్న ఆ వాహినులు మన్మథబాణములకు గుఱియై (కామవికారములకు లోనై) తూలి సోలిపోవుచున్నవా? అనునట్లు ఒప్పుచున్నవి. ఆ స్థితిలో నున్న ఆ నదీభామినులు హంసధ్వనుల రూపములో ఆహ్వానించుచు తరంగములనెడి హస్తములతో శ్రీకృష్ణుని తమ కడకు లాగికొనుచు, ఆ స్వామి పాదములను కమలములతో సేవించుచున్నవా? అనునట్లు తోచుచున్నది. పరికించితివా?

ఆ. వనిత! నేఁడు కృష్ణువంశనినాదంబు విని పయోధరంబు విరులు గురిసి
తన శరీరమెల్ల ధవళాతపత్రంబుఁ జేసి మింట నీడఁ జేసెఁ గంటె. 792

వనితా! మేఘము శ్రీకృష్ణునిపిల్లనగ్రోవిరవములను విని పూలవాన గురిపించుచు తన శరీరమనెడి తెల్లని గొడుగుతో ఆ స్వామికి నీడను అమర్చుచున్నదా? అనునట్లు ఒప్పుచున్నది. వీక్షించితివా?

క. మంచి ఫలంబులు హరిచే, నించి కరాలంబనముల నెగడుచు నిదె క్రీ
డించెదరంగన! చూడుము, చెంచితలం బింఛపత్ర చేలాంచితలన్. 793

తరుణీ! నెమలిపింఛములను, ఆకులను చీరచెరగులుగా ధరించిన ఈ చెంచువనితలను చూడుము. వారు బాగుగా పండిన పండ్లను శ్రీకృష్ణునకు అర్పించుచు, ఆ స్వామిహస్తములను ఆలంబనముగా చేసికొని, ఒప్పుచు క్రీడించుచున్నారు.

క. ఉల్లసిత కుచభరంబుల, నల్లాడెడి నడుముతోడ నలరులదండన్
భిల్లి యొకతె హరికిచ్చెను, హల్లోహల కలిత యగుచు నంగన కంటే. 794

అంగనా! బాగుగా ఎదిగిన స్తనములయొక్క భారముచే ఒక బోయతయొక్క (ఒక భిల్లవనితయొక్క) నడుము అటునిటు ఊగుచున్నది. ఆమె ప్రేమతో తొట్రుపడుచు శ్రీకృష్ణునకు పూలదండను సమర్పించుచున్నది. చూచితివా?

క. గిరులెల్ల జగములయ్యెం, దరులెల్లను బల్లవించె ధరణి గగన భూ
చరులెల్లను జొక్కిరి హరి, మురళి రవామృతము సోఁక ముద్దియ! కంటే. 795

ముద్దియా! శ్రీకృష్ణుని మురళీగానామృతము సోకినంతే గిరులు అన్నియును కటిగి నీరైనవి. వృక్షములన్నియును ఆనందముతో చిగురులు తొడిగినవి. భూతలమునను, ఆకాశమునందును సంచరించెడివారు అందఱును ఆ గానమాధుర్యములకు పరవసించిపోయిరి.

మ. బలకృష్ణాంఘ్రిసరోజసంగమముచే భాసిల్లుచున్ ధన్యమై
ఫలపుష్పంబులఁ గానికల్ గురిసి సంభావించి మిన్నందుచున్
జలఘాసంబుల గోవులం దనిపి చంచద్భూజరోమాంచమై
వెలసెం జూడఁగదమ్మ యీ గిరి పురోవీథిన్ సరోజాననా! 796

సరోజవదనా! ఎదురుగాఉన్న ఈ కొండను చూడుము. అది బలరామకృష్ణుల పాదపద్మముల స్పర్శచే పునీతమై ధన్యతను పొందినది. పండ్లను, పూవులను కానుకలుగా సమర్పించి, వారిని సత్కరించుచున్నది. ఆనందముతో ఆకాశమును తాకుచున్నది. జలములను, పచ్చికలను అందించుచు గోవులను తనియజేయుచున్నది. చక్కగా అలరారుచున్న వృక్షములనెడి రోమాంచములతో ఒప్పుచున్నది. ఈ దృశ్యము ఎంతో హాయినిగొలుపుచున్నది.

వ. అని యిట్లు బృందావన విహారియైన గోవిందుని సందర్శించి, పంచబాణభల్ల భగ్న హృదయలయి, వల్లవకాంత లేకాంతంబులఁ జింతించుచుఁ దత్పరతంత్రలయి యుండి రంత. 797

ఆ గోపికలందఱు ఇట్లు ముచ్చటించుకొనిరి. వారు బృందావనమున విహరించెడి శ్రీకృష్ణునిగాంచి మన్మథుని బాణములకు గుఱియై మిగుల కలవరపడసాగిరి. అంతేగాక వారు ఏకాంతమున కృష్ణప్రభువును అనుక్షణము స్మరించుచు ఉండిపోయిరి.

## హేమంతఋతువర్ణనము

క. చామంతికా ప్రగంచిత, సీమంతసతీ కుచోష్ణ జిత శీతభయ
శ్రీమంతంబయి గొబ్బున, హేమంతము తోఁచె మదనుఁ దేఁచె విరహులన్. 798

పిమ్మట హఠాత్తుగా హేమంతఋతువు ప్రవేశించెను. ఆ సమయమున స్త్రీలు తమశిరస్సులపై చేమంతి పూలమాలను ధరించి హొయలొల్కుచుండిరి. ఆ తరుణీమణులకుచస్పర్శ పురుషులకు హాయిని గూర్చుచుండుటచే వారికి చలిబాధ తొలగిపోయెను. అట్లు విరాజిల్లుచున్న ఆ హేమంతమునందు మన్మథుడు తన పూలబాణములతో విరహావస్థలోనున్న వారిని ఎంతయు బాధింపసాగెను.

క. ఉత్తరపుగాలి విసరె వి, యత్తలమునఁ దుహినకిరణుఁ డహితుండయ్యెం
బొత్తు జరిగె మిథునములకు, నెత్తమ్ములు దఱిఁగె హిమము నెలకొనియె నృపా! 799

రాజా! అప్పుడు ఉత్తరదిశనుండి గాలులు వీవసాగెను. ఆకాశమున విరాజిల్లుచు చల్లని కిరణములను వెదజల్లుచున్న చంద్రుడు విరహిజనులకు శత్రువయ్యెను. (విరహావస్థలోనున్న స్త్రీపురుషులు ఆ చల్లని వెన్నెలలకు తట్టుకొనలేకుండిరి.) ఆ దెబ్బతో ఒకరికొకరు దూరముగానున్న యువతీయువకులు చేరువయైరి. పూర్తిగా మంచు క్రమ్ముకొనుటచే కమలములన్నెలు తఱిగిపోయెను.

క. అహములు సన్నములయ్యెను, దహనము హితమయ్యె దీర్ఘ దశలయ్యె నిశల్
బహు శీతోపేతంబయి, యుహుహూ యని వడఁకె లోకముర్వీనాథా! 800

హేమంతఋతువునందు పగటివేళలు తగ్గిపోయెను. రాత్రిసమయములు ఎక్కువ అయ్యెను. అందఱును వెచ్చదనమును (చలిమంటలను) కోరుకొనుచుండిరి. లోకమంతయును ఆ చలిబాధకు తట్టుకొనలేక 'ఉహుహూ' అని వణకిపోవుచుండెను.

క. అన్నులచన్నులదండ వి, పన్నులుగాకెల్ల వారు బ్రదికిరి గాకీ
చన్నులు మీఱిన వలి నా, పన్నులు గాకుండఁ దరమె బ్రహ్మాదులకున్. 801

చలిబాధకు వణకుచున్న పురుషులు తరుణీమణులయొక్క స్తనములసుఖస్పర్శ వేడిని (హాయిని) గూర్చుచుండుటచే వారు ఆ చలిబాధనుండి బయటపడి సుఖముగా జీవించుచుండిరి. అట్టి సుఖస్పర్శయే లేనిచో ఈ హేమంతమునందు బ్రహ్మాదులకు సైతము ఇట్లు తీవ్రమైన వ్యథకు లోనుగాకుండుట అసాధ్యము.

ఆ. పొడుపుఁ గొండమీఁదబొడుచుట మొదలుగాఁ బరువు వెట్టి యినుఁడు పశ్చిమాద్రి
మఱుఁగుఁ జొచ్చెఁగాక మసలినఁ జలిచేతఁ జిక్కిఁ జిక్కి నవఁగ జిక్కకున్నె. 802

తూరుపుకొండపై ఉదయించినప్పటినుండియు సూర్యుడు చలికి భయపడి పరుగులుదీయుచు అస్తాద్రికి చేరి దానిచాటున దాగికొనుచుండెను. అట్లుగాక నెమ్మదిగా నడచియున్నచో అతడును చలిబాధకు లోనుగాక తప్పదు (చలికి చిక్కక తప్పదు.) అతడు ఎంతటివాడైనను చలికి చిక్కినచో చిక్కిపోక తప్పదుగదా!

క. చెంగల్వవిరులగంధము, మంగళముగఁ గ్రోలుచున్న మధుపములొప్పె
న్నంగజ వహ్నులపై ను, ప్పొంగి విజృంభించు పొగల పోలికనధిపా! 803

రాజా! తుమ్మెదలు చెంగల్వపూలవాసనలను (అందలి మకరందములను) సంతోషముతో ఆస్వాదించుచున్నవి. అప్పుడు అవి కామాగ్నులనుండి బయల్వెడలి, విజృంభించుచున్న పొగలా! అనునట్లు ఒప్పుచున్నవి.

ఆ. శంభుకంటనొకటి జలరాశినొక్కటి మఱియునొక్కటి మనుజమందిరముల
నొదిఁగెఁ గాక మెఱసి యున్న మూఁడగ్నులు చలికి నులికి భక్తి సలుపకున్నె. 804

మూడు అగ్నులును (దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని అనునవి) చలికి భయపడి తప్పించుకొని, వాటిలో ఒకటి శివునికంటియందును, మఱియొకటి (బడబాగ్నిగా) సముద్రమునందును, ఇంకొకటి మానవుల వంటయిండ్లలోను ఒదిగి మెఱయుచున్నవి. అట్లుగాక అవి బయటనే యున్నచో చలిచేతికి చిక్కి వణకుచు దానికి సేవలు చేయుచుండెడివే.

శా. ఈ హేమంతమురాకఁ జూచి రమణీ హేలాపరీరంభ స
త్సాహాయ్యంబునఁ గాని దీని గెలువన్ శక్యంబు గాదంచుఁ దా
రూహాపోహవిధిం ద్రిమూర్తులు సతీయుక్తాంగులైనారుగా
కోహో! వారలదేమి సంతత వధూయోగంబు రాఁ గందురే. 805

సృష్టిస్థితి లయ కారకులైన త్రిమూర్తులు (బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) హేమంతఋతువు వచ్చినట్లు గమనించి - తమతరుణీమణులగాఢమైన కౌగిళ్ల సుఖములద్వారా మాత్రమే ఈ చలిబాధకు తట్టుకొనుట సాధ్యమగును - అని నిర్ణయించికొనినట్లున్నది. అందువలననే కాబోలు వారు తమ సతులతోగూడి (సతులను తమ శరీరములలో భాగములుగచేసికొని) యున్నారు. లేనిచో వారు అట్లు నిరంతరము తమ భార్యలతో కూడియుండెడివారా?

క. ఈ హేమంతమురాకకు, శ్రీహరి యొక్కింత వడఁకి చింతింపంగా
నోహో! వెఱవకుమని తా, మా హరికిని శ్రీకుచంబులభయంబిచ్చెన్. 806

హేమంతఋతువు చలిని విజృంభింపజేయుచు రాగా ఆ బాధకు తాళలేక శ్రీహరి ఒకింత వణకుచు చింతించుచున్నాడా? అని భావించి, లక్ష్మీదేవిస్తనములు 'శ్రీహరీ! నీవు ఏ మాత్రమూ భయపడకుము. నీ చలిబాధను తొలగించుటకు మేము ఉన్నాముగదా!' అని ఆ స్వామికి అభయము ఇచ్చినవట.

వ. ఇట్లు నితాంతంబగు హేమంతంబున మొదలినెల తొలిదినంబునందు, నందునిమందంగల గోపకుమారికలు రేపకడ లేచి చని, కాళిందీజలంబులం దోఁగి, జలతీరంబున నిసుమునం గాత్యాయనీరూపంబుఁ జేసి, సురభి కుసుమగంధంబులిడి, ధూపదీపంబులిచ్చి, బహువిధోపహారంబులు సమర్పించి. 807

ఇట్లు హేమంతఋతువు విజృంభించుచుండెను. అంతట నందుని పాలనలోనున్న గోపకన్యలు అందఱును ఒకమాసము పాటు 'కాత్యాయనీ వ్రతము'ను ఆచరించుటకై దీక్షగైకొనిరి. వారు ఆ మాసము యొక్క మొదటిరోజున వేకువజాముననే నిద్రనుండి లేచి, కాళిందీనదికి వెళ్లి, ఆ జలములలో స్నానములను ఆచరించిరి. పిదప ఆ తీరమునందలి ఇసుకతిన్నెపై కాత్యాయనీదేవి ప్రతిమను నిలిపిరి. అనంతరము వారు ఆ దేవికి సువాసనలతోగూడిన గంధములను, పూవులను సమర్పించి ధూపదీపములతో, వివిధములగు ఉపహారములతో ఆ తల్లిని అర్చించిరి.

క. ఓ కాత్యాయని! భగవతి!, నీకున్ మ్రొక్కెదము నేము నేఁడనుకంపన్
మాకిందఱకును వైళమ, శ్రీకృష్ణుఁడు మగఁడు గాఁగఁ జేయుము తల్లీ! 808

క. ఓ తల్లి! మాకుఁ గృష్ణుఁడు, చేతోవిభుఁడైననాఁడు చెలువలమెల్లన్
నేతివసంతములాడుచు, జాతర సేసెదము భక్తిచాతురితోడన్. 809

వ. అని నమస్కరించి, హవిష్యంబులు గుడుచుచు, నివ్విధంబున మాసవ్రతంబు సలిపిరందొక్కనాఁడు. 810

తదుపరి ఆ గోపికలు ఆ దేవిని ప్రార్థించుచు ఇట్లు పలికిరి. "భగవతీ! కాత్యాయనీ! మేము నీకు మ్రొక్కుచున్నాము. తల్లీ! దయతో మాకు వెంటనే శ్రీకృష్ణుడు భర్తయగునట్లు చేయుము. అమ్మా! అట్లు శ్రీకృష్ణుడు మాకు మనోనాథుడైనచో వెంటనే మేము (గోపకన్యలము) అందఱము మిగుల భక్తితో నేతివసంతములాడుచు నీకు ఉత్సవములను జరిపెదము" అని నమస్కరించి, నైవేద్యములను స్వీకరించిరి. వారు అట్లు క్రమముగా ఒకమాసము ఆ కాత్యాయనీ వ్రతమును ఆచరించిరి.

## గోపికావస్త్రాపహరణము

మ. రమణుల్ ప్రొద్దున మేలుకాంచి సఖులన్ రండంచు నాత్మీయ నా
మములంజీరి కుచద్వయీభరములన్ మధ్యంబులల్లాడఁగాఁ
బ్రమదోద్దామ గజేంద్రయానలగుచుం బద్మాక్షునిం బాడుచున్
యమునాతీరముఁ జేరఁబోయిరి గృహీతాన్యోన్య హస్తాబ్జలై. 811

ఒకానొకనాడు ఆ గోపకన్యలు ప్రాతఃకాలముననందే నిద్రనుండి మేల్కొనిరి. పిదప వారు 'రండు రండు' అనుచు తమ చెలికత్తెలను పేరుపేరున పిలుకొనిరి. అప్పుడు స్తనభారములతో వారినడుములు అటునిటు కదలుచుండగా వారు శ్రేష్ఠములైన గజములవలె అడుగులు వేయుచు పరస్పరము చేతులు పట్టుకొని శ్రీకృష్ణుని కీర్తించుచు యమునానదీతీరమునకు చేరిరి.

వ. ఇట్లా నదీతీరంబు చేరంజని, గజగమనలు విజనస్థలంబున వలువలు విడిచి యిడి, మది శంక లేక, యకలంకలై, గ్రుంకులిడఁజలంబుల జలంబులు సొచ్చి. 812

అందమైన నడకలుగల ఆ తరుణీమణులు ఆ నదీతీరమునందు ఒక నిర్జనప్రదేశమున వస్త్రములను విడిచియుంచిరి. అనంతరము విగతవస్త్రలైయున్న ఆ గోపకన్యలు ఏమాత్రమును సందేహపడక నిర్మలహృదయములతో, పూనికతో స్నానములు చేయుటకై యమునానదీజలములలోనికి దిగిరి.

క. వారిజలోచనుఁ బాడుచు, వారిజలోచనలు వారివారికి వేడ్కన్
వారివిహారము సలిపిరి, వారి విహారములుజగతివారికిఁ గలవే. 813

అందమైన కనులుగల ఆ కన్యలు కమలములవంటి నేత్రములుగల శ్రీకృష్ణునిగూర్చి పాటలు పాడుకొనుచు, తమకు ఇష్టమైన రీతిలో వేడుకపడుచు హాయిగా జలకములాడుచుండిరి. ఈ లోకమున అట్టి జలక్రీడలు ఎంతమందికి అబ్బును?

వ. ఆ సమయంబున, 814

క. తోయజనయనలు యమునా, తోయములం దుండుటెఱిఁగి దూరగుఁడయ్యుం
దోయజనయనుఁడు హరి తన, తోయము గోపకులుఁ దానుఁ దోఁతెంచె నృపా! 815

రాజా! ఒయ్యారములనొలుకుచున్న ఆ గోపికలు అప్పుడు జలకములాడుచుండుట గమనించి, చక్కని కనుతీరుగల శ్రీకృష్ణుడు అచటికి దూరమున ఉన్నప్పటికిని, తనతోడి గోపాలకులతోగూడి ఆ తీరమునకు ఏతెంచెను.

తరలము. కదలకుండని తోడివారలఁ గన్నుసన్నల నిల్పుచుం
బదములొయ్యన నేలఁ బెట్టుచుఁబద్మనేత్రుఁడు మౌనియై
పొదలమాటుననల్లనల్లన పొంచి పొంచి నతాంగుఁడై
యదను గోరుచుడాసి వ్రేతలయంబరంబులు దొంగిలెన్. 816

పిమ్మట ఆ కృష్ణప్రభువు 'కదలక మెదలక ఇక్కడనే ఉండుడు' అని తోడి బాలకులకు కనుసంజ్ఞ చేసెను. పిదప ఆస్వామి ఏమాత్రమూ చప్పుడు కాకుండ నేలపై అడుగులు వేసెను. మౌనియై (మౌనముతో) శరీరమును వంచి, పొదలచాటున పొంచియుండెను. తదుపరి ఆ అల్లరి కృష్ణుడు అదనుచూచుకొని, తీరమునకు చేరి ఆ గోపికల వస్త్రములను అపహరించెను.

వ. ఇట్లు దొంగిలి, 817

శా. ఉద్యద్గంధగజేంద్ర గౌరవముతో యోషాంబరంబుల్ విభుం
డాద్యుండర్భకుభంగి నర్భకులతో హాసార్థియైకొంచుఁ ద
న్నద్యంభఃకణ శీతవాత జనితానందంబుతో నెక్కెఁదా
సద్యోముక్త దురంత పాదప జనుస్సంతాపమున్ నీపమున్. 818

దేవాదిదేవుడైన ఆ కృష్ణప్రభువు గోపికలవస్త్రములను గైకొని మదపుటేనుగువలె గంభీరముగా నడవసాగెను. పిమ్మట అతడు చలిగాలులకు చింది పడుచున్న నదీజలముల తుంపరలకు ఆనందించుచు బాల్యచాపల్యముతో తోడిబాలురను నవ్వించుటకై ఒక కడిమిచెట్టుమీదికి ఎక్కెను. శ్రీకృష్ణునిస్పర్శతో ఆ చెట్టు పునీతమయ్యెను, పాపములనుండి దానికి విముక్తి లభించెను. వృక్షమై పుట్టినందులకు బాధపడుచున్న ఆ చెట్టుయొక్క తాపము అంతయును తీఱిపోయెను.

వ. అప్పు డయ్యింతులిట్లనిరి. 819

క. మా మా వలువలు ముట్టకు, మామా కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మానమేల కొనియెదు, మా మానసహరణమేల మానుము కృష్ణా! 820

అంతట ఆ గోపకన్యలు చెట్టుపైనున్న శ్రీకృష్ణునితో ఇట్లు విన్నవించుకొనిరి. "కృష్ణా! మా వస్త్రములను తాకవద్దు. (పురుషుడు ఆడువారి గుడ్డలను ముట్టుకొనుట పాడిగాదు గదా!) వాటిని తీసికొనిపోవద్దు. మమ్ము క్షమింపుము. ఇట్లు మా పరువులు తీయకుము, మా మనస్సులను ఎందులకు హరించెదవు? ఇక నీ చిలిపిచేష్టలను మానుకొనుము.

సీ. బహు జీవనముతోడ భాసిల్లి యుండుటో గోత్రంబు నిల్పుటో కూర్మితోడ
మహినుద్ధరించుటో మనుజసింహంబవై ప్రజలఁ గాచుటొ కాక బలిఁదెరల్చి
పిన్నవై యుండియుఁ బెంపువహించుటో రాజుల గెల్చుటో రణములందు
గురునాజ్ఞసేయుటో గుణనిధివై బలప్రఖ్యాతిఁ జూపుటో భద్రలీల
ఆ. బుధులు మెచ్చ భువిఁ బ్రబుద్ధత మెఱయుటో కలికితనము సేయ ఘనత గలదె
వావి లేదు వారివారు నావారను నెఱుకవలదె వలువలిమ్ము కృష్ణ! 821

కృష్ణా! ఇట్లు చిలిపితనమునకు పూనుకొనుట ఏమంత గొప్ప పని? ఇది గొప్ప గౌరవముతో జీవించుచు వన్నె కెక్కుటయా? (జీవనము = జీవితము, నీరు - సముద్రజలములో (మత్స్యమై) భాసిల్లుటయా?) వంశమునకు వన్నె దెచ్చుటయా? (గోత్రము = వంశము, కొండ. కూర్మమై మందర పర్వతమును ఎత్తుటయా?) ఆదర్శముతో లోకమును ఉద్ధరించుటయా? (మహి = లోకము, భూమండలము. వరాహమై భూదేవిని రక్షించుటయా?) పురుషశ్రేష్ఠుడవై ప్రజలను కాపాడుటయా? (మనుజసింహము = పురుషశ్రేష్ఠుడు, నరసింహరూపము. నరసింహుడవై భక్తులను ఆదుకొనుటయా?). చిన్నవాడవై యుండియు బలశాలులను క్షోభపెట్టుటద్వారా ఖ్యాతి వహించుటయా (బలి = బలశాలి, బలిచక్రవర్తి. పొట్టి వామనుడవై బలిచక్రవర్తిని క్షోభపెట్టి లోకములను ఆక్రమించుటయా?) గర్వితులైన రాజులను సమరములయందు గెలుచుటయా? (పరశురాముడవై కార్తవీర్యార్జునుడు మొదలగు క్రూరులైన రాజులను యుద్ధములలో వధించుటయా?) సద్గుణములు గలవాడవై గురువు యొక్క ఆజ్ఞను పాటించుటయా (గురువు = విద్యలను నేర్పినవాడు, తండ్రి. శ్రీరాముడవై తండ్రియాజ్ఞను పాలించుటయా?) చెక్కు చెదరని రీతిగా బలప్రదర్శనగావించి ఖ్యాతికెక్కుటయా? (బలము = పరాక్రమము - బలరాముడు. బలరాముడవై ప్రలంబాసురుడు మున్నగు దుష్టులను వధించి వన్నెకెక్కుటయా?) మేధావులు మెచ్చుకొనునట్లుగా భువియందు ప్రజ్ఞచూపి ప్రసిద్ధి వహించుటయా? (ప్రబుద్ధత = ప్రతిభ, జ్ఞానము. బుద్ధుడవై పండితులు మెచ్చుకొనురీతిగా జ్ఞానమును పంచియిచ్చుటయా? లేక లోకమున అహింసాధర్మమును ప్రకటించుటయా?) కలికివై దుష్టసంహారము చేయుటయా? నీవు చేయుచున్న ఈ అల్లరిపని వీటిలో ఏదియును కాదుగదా? నీకు వావివరుసలు లేనట్లున్నది. నీవారెవరో? పరులెవరో ఎఱుగవలదా? (భగవంతునకు స్వపరభేదములు లేవుగదా?)[1] పెక్కుమాటలతో పనిలేదుగాని, మా వస్త్రములను మాకు ఇమ్ము.

క. కొంటివి మా హృదయంబులు, గొంటివి మానంబు లజ్జ గొంటివి వలువల్
గొంటివిఁక నెట్లు సేసెదొ, కొంటెవు గద నిన్ను నెఱిఁగికొంటిమి కృష్ణా! 822

కృష్ణా! మా హృదయములను (మనస్సులను) దోచుకొంటివి. మా పరువును తీసితివి. (మా అభిమానమును చూరగొంటివి.) మా బిడియమును తీసివేసితివి. మా వస్త్రములను అపహరించితివి. ఇకమీద మమ్ము ఏమి చేసెదవో? ఏమో? నీవు ఎంతో కొంటెవాడవు. మొత్తముమీద నీ గుణము మాకు ఎఱుకయైనది.

సీ. రాజసంబున నీవు రంజిల్లు టెఱుఁగమే చెలరేఁగి వింతలు సేయుచుండ
సత్త్వసంపద గల్గి జరుగుటఁ దలఁపమే సిరిగల్గి యన్యుల జెనకుచుండ
గురుతర శక్తియుక్తుఁడ వౌట యెఱుఁగమే తామసంబున నెగ్గు దలఁచుచుండ
నొకభంగితో నుండకుంటఁ జింతింపమే మాయావివై మాఱు మలయుచుండ

1. గోపికలు పూర్వజన్మలో జ్ఞానసంపన్నులైన మహామునులు. అందువలన వారు తమ పూర్వజన్మ జ్ఞానప్రభావమున ఇట్లు తాత్త్విక వచనములను పలుకుచున్నారు.

ఆ. నేమి జాడవాఁడవేపాటి గలవాఁడవే గుణంబు నెఱుఁగవెల్లయెడల
నొదిగి యుండనేరవోరంత ప్రొద్దును బటములీఁగదయ్య! పద్మనయన! 823

కమలనేత్రా! ఎదురులేని రీతిగా నీవు ఒనర్చిన వింత చేష్టలనుబట్టి నీరాజసము మాకు తెలియుచునే యున్నది. (దేవా! నీవు రజోగుణమును ఆదరించి, బ్రహ్మవై వింతవింతలైన లోకములను సృష్టించితివి). నీవు సిరిసంపదలుగలవాడవై ఇతరులను కలవరపెట్టుచుంటివని మేము ఎఱుగుదుము. (లక్ష్మీనారాయణుడవైన నీవు సత్త్వసంపన్నుడవు అగుచు దుష్టులను శిక్షించి, సత్పురుషులను రక్షించుచుండుట మాకు తెలియును.) తమోగుణప్రభావమున దుర్మార్గులకు కీడుతలపెట్టుచుండుటనుబట్టి నీ అద్భుత శక్తిసంపదలు మాకు ఎఱుకయే. (తమోగుణమును చేరదీసి రుద్రుడవై గొప్ప శక్తియుక్తులను ప్రదర్శించినను లోకములను లయింపజేయుచుందువు.) నీవు మాయావివై లోకులకు దిగ్భ్రమను కలిగించుచుండుటనుబట్టి ఒక తీరుగా నడచుచుండువాడవుగావని మేము అనుకొనుచునే యున్నాము. (నీ యోగమాయా ప్రభావముచే (నీవు) అనేక రూపములలో మసలుచుందువు.) నీ జాడలేవో మాకు తెలియవు. (భగవంతుడు సర్వవ్యాపి) నీ శక్తి యెంతటిదో మేము ఎఱుగము. (నీవు సర్వశక్తిమంతుడవు.) నీ గుణగణములు ఎట్టివో తెలియవు. (నీవు గుణాతీతుడవు) ఎల్లప్పుడునూ, ఎక్కడకూ ఒదిగియుండవు. (నీవు ఎల్లవేళలయందును అంతటను నిలిచియుందువు.) అది సరే మా వస్త్రములను మాకు దయచేయుము.

క. రాజులనెఱుఁగవు బలిమిని, రాజిల్లెదు చీరలీవు రమణుల మింకన్
రాజునకెఱిఁగించెదమో, రాజీవదళాక్ష! నీవురాజవె ధరకున్. 824

కృష్ణా! నీకు రాజులనుగూర్చి (రాజులు శిక్షింతురను విషయమునుగూర్చి) తెలియదు. బలముగల వానివలె నీవు ప్రవర్తిల్లుచున్నావు. మేము అబలలము. మా వస్త్రములను మాకు ఇమ్ము. లేనిచో రాజునకు తెలిపెదము. నీవు ఈ భూమికి (ఇచట నివసించుచున్న మాకు) రాజువు కాదు గదా!

వ. అని పలికిన కన్నియలపలుకులాలించి, మందహాస సుందర వదనారవిందుఁడై గోపాలబాలకుల కరంబులం గరంబులు వ్రేసి, యమ్ముద్దియల నుద్దేశించి నెఱవాదిచతురుండిట్లనియె. 825

ఆ గోపకన్యలమాటలను వినిన పిదప ఆహ్లాదకరముగా ముసిముసినవ్వులు నవ్వుచు తోడిగోపాలుర చేతులను తన చేతులతో పట్టుకొని మాటకారియైన శ్రీకృష్ణుడు ఆ ముద్దుగుమ్మలతో ఇట్లనెను.

శా. రామల్ రాజులతోడ నీ పనికి నారంభింతురే మీక్రియన్
మోమోటేమియులేక దూఱెదరు మీ మోసంబు చింతింపరం
భోమధ్యంబుననుండి వెల్వడి వెసన్ బూర్ణేందుబింబాననల్
మీ మీ చీరలు వచ్చి పుచ్చుకొనుఁడీ మీకిచ్చెదం జెచ్చెరన్ 826

"చంద్రముఖులారా! (గోపకన్యలారా!) ఎప్పుడైనను స్త్రీలు రాజులతో మీవలె ప్రవర్తించుదురా? ఏమాత్రమూ మొగమోటము లేకుండ నన్ను తప్పు పట్టుచున్నారు. మీ పొఱపాటును మీరు గుర్తించుటలేదు. (మీ మనస్సులలో మీరు నన్ను కోరుకొనుచునే ఇప్పుడు ఇట్లు ప్రవర్తించుచుండుట వంచన కాదా?) మీ చీరలను మీకు తప్పకుండా ఇచ్చెదను. వెంటనే మీరు నీళ్లలోనుండి బయటికి వచ్చి ఎవరి వస్త్రములను వారు తీసికొనుడు."

వ. అనిన నమ్మానవతులొండొరుల మొగంబులు సూచి నగుచు, మర్మంబులు నాఁటునమ్మాటలకు మగుడం బలుక సిగ్గువడుచు, నగ్గలం బయిన చలిని వలిగొని, కంఠప్రమాణజలంబులందుండి, డోలాయమాన మానసలై, యిట్లనిరి. 827

ఆ మాటలను విన్నంతనే ఆ కన్యలు నవ్వుచు ఒకరిమొగమును ఒకరు చూచుకొనిరి. నర్మగర్భితములైన ఆ మాటలకు ప్రత్యుత్తరము నిచ్చుటకు సిగ్గుపడిరి. పిదప వారు తట్టుకొనలేని చలికి వణకుచు గొంతులోతు నీళ్లలో నిలబడి, మనస్సులు తటపటపడుచుండగా (దిక్కుతోచని స్థితిలో) ఇట్లు నుడివిరి.

క. మా వలువలాగడంబున, నీ వేటికిఁ బుచ్చుకొంటివీవల్పుఁడవే
నీ వెఱుఁగనిదేమున్నది, నీ వందఱిలోన ధర్మ నిరతుఁడవు గదే. 828

మ. ఇంతుల్ తోయములాడుచుండ మగవారేతెంతురే వచ్చిరా
యింతల్ సేయుదురే కృపారహితులై యే లోకమందైన నీ
వింతల్ నీతలఁ బుట్టెఁ గాక మఱియేవీ కృష్ణ! యో చెల్ల, నీ
చెంతన్ దాసులమై చరించెదము మా చేలంబులిప్పింపవే 829

"కృష్ణా! నీవు దుడుకుతనముతో మా వస్త్రములను ఎట్లు తీసికొని వెళ్లితివి. నీవు సామాన్యుడవు గావు. నీవు అందఱిలో ధర్మనిరతుడవుగదా! కనుక నీకు తెలియనిదేమున్నది? స్త్రీలు జలకములాడుచుండగా పురుషులు ఇటు రావచ్చునా? ఒకవేళ వచ్చినను ఎక్కడైనను (ఎవ్వరైనను) సభ్యతను మఱచి, ఇట్లు ఆగడములను పాల్పడుదురా? ఈ వింతపోకడలు నీ బుఱ్ఱలోనే పుట్టినట్లున్నవి. ఇతరత్ర ఇట్టి సంఘటనలు జరిగెనా? నీకడ (నీకు) దాసులమై (దాసి+లు= దాసులు) నడచుకొందుము. మా వస్త్రములను మాకు దయచేయుము.

క. వచ్చెదము నీవు పిలిచిన, నిచ్చెద మేమైనఁ గాని యెటఁ జొరుమునినం
జొచ్చెదము నేఁడు వస్త్రము, లిచ్చి మముం గరుణతోడ నేలుము కృష్ణా! 830

కృష్ణా! నీవు పిలిచినచో ఎక్కడికైనను వచ్చెదము. నీవు ఏమికోరినను ఇచ్చెదము. నీ ఆజ్ఞమేరకు ఎక్కడనైనను మసలెదము. మాపై కనికరము చూపి, మా వలువలు మాకు ఇమ్ము".

వ. అనిన దరహసితవదనుండై హరి యిట్లనియె. 831

క. ఏ తరుణుఁడు మగఁడౌటకు, మీ తపములు సెప్పుఁ డింక మీయానలు సుం
డీ తప్పిన నీ కూరిమి, మీ తలలనె పుట్టె నోటు మేదిని లేదే. 832

క. ఎవ్వనిఁ గని మోహించితి, రెవ్వఁడు మీ మానధనములెల్ల హరించెన్
నివ్వటిలె మీకుఁగూరిమి, యెవ్వనిపైఁ బలుక రాదె యేనన్యుఁడనే. 833

ఆ గోపకన్యలమాటలకు చిఱునవ్వు చిందించుచు శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను. యువతులారా! మీరు తపస్సులు చేయునప్పుడు (నోములు నోచుకొనుసమయమున) ఏ యువకుడు భర్తకావలెనని మీరు మ్రొక్కుకొంటిరి? ప్రమాణపూర్తిగా తెలుపుడు. ఇట్టి ప్రేమలు మీకు మాత్రమే కాదు. అందఱికిని సహజము. మీరు ఎవరిపై మోహాపడితిరి? మీ మనస్సులను దోచుకొనిన ఆ మగవాడెవడు? ఎవరిమీద మీ ప్రేమలు చిగురించినవి? నేను మీకు కావలసినవాడనే గదా! (నేను మీకు ఆత్మీయుడనుకానా?) నిజము పల్కుడు".

వ. అనిన విని, సుందరులన్యోన్యసందర్శనంబులు సేయుచు, హృదయారవిందబులందుఁ గందర్పుండు సందడింప నగుచు, నిరుత్తరలయి యున్న లోకోత్తరుండిట్లనియె. 834

అంతట ఆ సుందరీమణులు ఒకరినొకరు చూచుకొనసాగిరి. అప్పుడు వారి సుతిమెత్తని హృదయములతో (కృష్ణునిపై) మరులు పొంగిపొరలెను. పిదప వారు నవ్వుచు మిన్నకుండిరి. అంతట ఆ పురుషోత్తముడు (శ్రీకృష్ణుడు) ఇట్లనెను.

క. నా యింటికి దాసులరై, నా యాజ్ఞ వహించి మీరు నడచెదరేనిన్
మీ యంబరంబులిచ్చెదఁ దోయంబులు వెడలిరండు తొయ్యలులారా. 835

తరుణీమణులారా! మీరు నా సేవలకు సిద్ధపడి, నా ఆజ్ఞను పాటించుచు మసలుకొనదలచినచో నా ఇంటికి విచ్చేయుడు. అట్లైనచో మీ వస్త్రములను మీకు ఇచ్చెదను. నీళ్లలో నుండి బయటికి రండు".

వ. అనిన విని హరిమధ్యలు చలికి వెఱచి, సలిలమధ్యంబున నిలువనోపక, 836

క. కొందఱు వెడలుదమందురు, కొందఱు వెడలుటయు సిగ్గుఁ గొను గోవిందుం
డందురు కొందఱు తమలోఁ, గొందల మందుదురు వడఁకుగొని మనుజేంద్రా 837

వ. మఱియు, నెట్టకేలకుఁ జిత్తంబులు గట్టిపఱచుకొని, తనుమధ్యలు తోయమధ్యంబు వెలువడి.. 838

మహారాజా! శ్రీకృష్ణుని పలుకులను విన్న పిదప ఆ సుందరాంగులు ఆ చలితీవ్రతకు నీళ్లలో నిలువలేక తమలో తాము ఇట్లనుకొనిరి. వారిలో కొందరు 'నీళ్లలో నుండి బయటపడుదము' అనిరి. బయట పడినచో శ్రీకృష్ణుడు మనలను ఆటపట్టించును' అని మఱికొందఱు పల్కిరి. ఇంకను కొందఱు చలికి వణకుచు అయోమయస్థితిలోనుండిపోయిరి. మొత్తముమీద వారు మనస్సులను చిక్కబట్టుకొని జలములనుండి బయటికి వచ్చిరి.

క. చంచత్పల్లవకోమల, కాంచననవరత్న ఘటిత కంకణరుచిరో
దంచిత కరసంఛాదిత, పంచాయుధగేహలగుచుఁబడఁతులు వరుసన్. 839

వ. చని ప్రౌఢలైన సుందరులముందట నిడుకొని, మందగమనలు మందహాసంబుతోడ నెదుర నిలిచిన, నరవిందనయనుం డిట్లనియె. 840

అప్పుడు నవనవలాడు చిగురుటాకులవలె సుకుమారముగా నున్నవారి చేతులు రత్నములు పొదిగిన బంగారు కంకణములతో ఇంపైన కాంతులతో అలరారుచుండెను. అంతట వారు తమచేతులతో మర్మాంగములను కప్పుకొనిరి. పిమ్మట ఆ సుందరాంగులు ప్రౌఢస్త్రీలను ముందు నిల్పుకొని, నవ్వుకొనుచు మందగమనములతో వెళ్లి శ్రీకృష్ణుని ఎదుట నిల్చిరి. పిదప శ్రీకృష్ణుడు ఇట్లనెను.

సీ. శృంగారవతులార! సిగ్గేల మిముఁ గూడి పిన్ననాఁటను గోలెఁ బెరిఁగినాఁడ
నెఱిఁగనే మీలోన నెప్పుడు నున్నాఁడ నేను జూడని మర్మమెద్ది గలదు
వ్రతనిష్ఠలై యుండి వలువలు గట్టక నీరు సొత్తురె మీరునియతిఁదప్పి
కాత్యాయనీదేవిఁ గల్ల సేయుట గాక యీరీతి నోఁచువారెందుఁ గలరు
ఆ. వ్రతఫలంబు మీకు వలసినఁ జక్కఁగ నింతు లెల్లఁ జేతులెత్తి మ్రొక్కి
చేరి పుచ్చుకొనుఁడు చీరలు సిగ్గువోనాడనేల యెగ్గులాడనేల 841

సుందరీమణులారా! చిన్నతనమునుండియు నేను మీతోగూడి పెఱిగినవాడనేగదా! ఇక మీకు నా ముందర సిగ్గు ఎందులకు? నేను ఎల్లప్పుడును మీలోననే ఉన్నాను గదా! (ఆత్మ స్వరూపుడనై మీలోనే ఉన్నాను గదా!) మీ మర్మములు (రహస్యములు) అన్నియు నాకు తెలియనివిగావు. మీరు దీక్షతో కాత్యాయనీ వ్రతమును ఆచరించుచు నియమములను ఉల్లంఘించి, ఇట్లు వివస్త్రలై జలకములాడరాదు గదా! ఇట్లు చేయుట ఆ దేవియెడ అపరాధమొనర్చుటయేగదా! ఎవరైనను దీక్షకు కట్టుపడక నోములు నోచుకొనువారు ఉందురా? మీరు నోములకు తగిన ఫలితము దక్కవలెనని అనుకొన్నచో (మీరు కోరుకొనిన భర్త లభింపవలెనని అనుకొన్నచో) ఇంతులారా! పూర్తిగా మీ రెండు చేతులను పైకెత్తి మ్రొక్కి, మీ వస్త్రములను గైకొనుడు. సిగ్గువిడిచి ఇట్లు మాట్లాడుట ఎందులకు? అనవసరముగా నన్ను తప్పుబట్టుట ఎందులకు?

వ. అనిన విని, మానవతులు దమలోన. 842

మ. వ్రతముల్ సేయుచు నొక్కమాటయిన నెవ్వానిన్ విచారించినన్
వ్రతభంగంబులు మాను నట్టి వరదున్ వామాక్షులీక్షించియున్
గతచేలాప్లవనంబు నేఁడు వ్రతభంగంబంచు శంకించి ఫా
లతటన్యస్త కరాబ్జలై సరసలీలన్ మ్రొక్కిరట్లందఱున్. 843

శ్రీకృష్ణునిపలుకులను విన్న పిమ్మట ఆ మానినులు "వ్రతదీక్షలో ఉన్నప్పుడు వివస్త్రలై జలకములాడుట వ్రతభంగమే. (వ్రతము భంగమైనట్లే!) కాని పరమ పురుషుడైన శ్రీకృష్ణుని స్మరించుటవలన ఆ దోషము తొలగిపోయినట్లే గదా!" అని తమలో తాము అనుకొనిరి. పిమ్మట వారు అందఱును వరములకు ఫలప్రదాతయగు ఆ మహాత్ముని (శ్రీకృష్ణుని) వీక్షించియు (శ్రీకృష్ణుడు తమ ఎదుటనే ఉన్నప్పటికిని) ఎట్టి జంకుగొంకులునులేక తమ చేతులను ఫాలభాగమున జోడించి ఆ స్వామికి మ్రొక్కిరి.

క. బాలలకు హస్తకీలిత, ఫాలలకు నితాంత శీతపవనాగమనా
లోలలకు నంబరములు కృపాలుఁడు హరి యిచ్చె భక్తపాలకుఁడగుటన్. 844

ప్రబలమైన చలిగాలులకు వణకుచునే ఆ గోపకన్యలు నొసలునందు చేతులు జోడించి, మ్రొక్కుచుండగా దయామయుడైన శ్రీకృష్ణప్రభువు వారికి వస్త్రములను ఇచ్చెను. ఆ స్వామి తన భక్తులను (సేవించువారిని) ఎంతయు ఆదుకొనువాడు గదా!

ఆ. చీరలపహరించి సిగ్గులు విడిపించి పరిహసించి యైనఁ బరఁగ మనకు
ఘనుఁడు నోము కొఱఁత గాకుండ మ్రొక్కించె ననుచు హరి నుతించిరబలలెల్ల. 845

పిమ్మట ఆ యువతులు అందఱును శ్రీకృష్ణుడు మొట్టమొదట మన చీరలను అపహరించి, మన సిగ్గుదీసి, మనలను పరిహసించినప్పటికిని, కడకు ఆ పుణ్యాత్ముడు మనచే మ్రొక్కింపజేసి, మన కాత్యాయనీ వ్రతమునకు ఎట్టి లోపమూ కలుగకుండా రక్షించినాడుగదా!" అని పలుకుచు, వారు ఆ శ్రీహరిని (కృష్ణుని) మిగుల కీర్తించిరి.

క. ఉల్లములు నొవ్వ నాడినఁ, గల్లలు సేసినను నగినఁ గలఁచిన నైనన్
వల్లభులు సేయు కృత్యము, వల్లభలకు నెగ్గు గాదు వల్లభమధిపా! 846

రాజా! ఇష్టమైనవారు మనస్సులు నొచ్చుకొనునట్లుగా మాట్లాడినను, అపరాధములొనర్చినప్పటికిని, పరిహసించినను, కలవరపఱచుట మొదలగు కృత్యములు ఎన్ని గావించినను ప్రియురాండ్రు బాధపడరు. పైగా వారు వాటిని ప్రియముగా భావింతురు.

వ. ఇట్లు హరి వలువలిచ్చినం గట్టుకొని, సతులతనియందు బద్ధానురాగలయి జలింపక తెప్పలిడక తప్పక చూడ, నా ప్రోడ యెఱింగి, చేరి, వారికిట్లనియె. 847

శ్రీహరి ఇచ్చిన వస్త్రములను ఆ కన్యలు ధరించిరి. అంతేగాక వారు ఆ స్వామిపై మిగుల ప్రేమానురాగములను పెంచుకొనిరి. ఏమాత్రమూ చలింపక, తెప్పలార్పక ఆ ప్రభువునే దర్శించుచుండిరి. ఆ స్వామి వారి స్థితిని గమనించి ఇట్లు నుడివెను.

సీ. లక్షణవతులార! లజ్జించి చెప్పరు గాని మీ మర్మముల్ గానఁబడియె
నను గొల్వఁ జింతించినారు నాచేతను సత్యంబు మీ నోము సఫలమగును
గామితార్థంబులకలిమిఁ జెప్పఁగ నేల ననుఁ గొల్వ ముక్తికి నడవ వచ్చుఁ
గడమ కూడఁగ నంబికాదేవి నోఁచంగ నటమీఁద రాత్రులయందు మీకు.
ఆ. నన్నుఁ బొందఁ గల్గు నమ్మి పొందని హరి పల్కనింతులెల్ల భ్రాంతిఁ జనిరి
తపము పండె ననుచుఁ దత్పదాంభోజముల్ మానసించుకొనుచు మందకడకు. 848

"ముద్దుగుమ్మలారా! మీరు బయటికి చెప్పకున్నను మీ మనసులలోని భావములను (మీ అంతర్యములను) నేను గ్రహించితిని. మీరు నన్ను పతిగా పొంది, సేవించుటకై నోములు నోచినారు. ఇక మీ నోములు ఫలించును, ఇది ముమ్మాటికిని నిజము. నన్ను గొల్చినవారి కోరికలు తీరుటయేగాదు. వారికి సకలార్థ సంపదలును సమకూరును. అంతేగాదు మోక్షముగూడ ప్రాప్తించును. మీరు కాత్యాయనీవ్రతమును నోచినందువలన ఇక మీదట రాత్రులలో నా అనుగ్రహమును పొందగలరు. నన్ను విశ్వసింపుడు. ఇక మీరు వెళ్లవచ్చును" అనుచు వారు వెళ్లుటకు ఆజ్ఞ ఇచ్చెను. పిమ్మట ఆ గోపికలు నివ్వెరపడుచు, 'ఇక మన నోములు పండినట్లే' అని తలపోయుచు, మనస్సులయందు ఆ స్వామిపాదములనే ధ్యానించుచు వ్రేపల్లెకు చేరిరి.

వ. ఇట్లు గోపకన్యకలందుఁ బ్రసన్నుండై గోవిందుండు బృందావనంబు దాఁటి దూరంబున ధేనువుల మేపుచుండఁ జండకిరణుని యెండం బడి దండిచెడి తరులదండ నండగొనుచు నాతపత్రాకారంబులై నీడలు సేయుచున్న వృక్షంబుల నీక్షించి కృష్ణబల శ్రీదామదేవప్రస్థవిశాలార్జున ప్రముఖులకుం దక్కినగోపకులిట్లనిరి. 849

ఇట్లు గోవిందుడు గోపికలను అనుగ్రహించిన పిమ్మట బృందావనమునకు దూరముగా ఆవులను మేపుచుండెను. సూర్యకిరణములు (ఎండ) తీవ్రముగా ఉండుటచే అలసట చెంది, వారు చెట్లక్రిందికి చేరిరి. గొడుగులవలె అమరి, నీడలను ఇచ్చుచున్న ఆ వృక్షములను వారు పరికించి చూచిరి. అంతట శ్రీకృష్ణుడు, బలరాముడు, శ్రీదాముడు, దేవప్రస్థుడు, విశాలుడు, అర్జునుడు మున్నగు ప్రముఖులతో గోపాలురు ఇట్లు నుడివిరి.

మ. అపకారంబులు సేయవెవ్వరికి నేకాంతంబులందుండు నా
తప శీతానిల వర్షవారణములై త్వగ్గంధ నిర్యాసభ
స్మ పలాశాగ్ర మరందమూల కుసుమచ్ఛాయాఫలశ్రేణిచే
నుపకారంబులు సేయు నర్థులకు నీ యుర్వీజముల్ గంటిరే. 850

"మిత్రులారా! ఈ తరువులను చూచితిరా! ఇవి ఎవ్వరికిని ఏ మాత్రము హాని కలిగింపవు. ఎవ్వరిజోలియు లేక ఏకాంతమున ప్రశాంతముగా ఉండును, ఇవి తమను ఆశ్రయించినవారికి ఎండ, చలి, గాలి, వర్షము మున్నగువాటినుండి ఎట్టి బాధయు లేకుండ చేయును. పైగా అర్థులకు బెరళ్లు, సువాసనలు, జిగురులు, భస్మములు, చిగురుటాకులు, తేనెలు, వేర్లు, పూవులు, నీడలు, పండ్లు మొదలగు వానిని ఇచ్చుచు ఉపకారములనే చేయుచున్నవి."

వ. అని చిగురాకు పువ్వు కాయ పండుల తండంబుల వ్రేఁగున వీఁగిన తరువులనడిమితెరువునం బసులదాఁటుల దాఁటించి, యమునకుం జని, వెడఁదమడుఁగుల మెల్లన చల్లని నీరు ద్రావించి, తత్సమీపంబున మేపుచు, వల్లవులెల్ల మూఁకలు గొని, యాఁకలి గొంటిమని విన్నవించినఁ, దనకు భక్తురాండ్రగు విప్రభార్యలవలనం బ్రసన్నుం డై, వారలం జూచి, రామసహితుండై హరి యిట్లనియె. 851

అనంతరము వారు చిగురుటాకులు, పువ్వులు, కాయలు, పండ్లగుత్తులు మున్నగువాటి బరువుతో వంగియున్న చెట్లయొక్క మధ్యగల బాటలద్వారా పశువులమందలను తోలుకొని యమునాతీరమునకు చేరిరి. అచటి మడుగులలో పశువులను నీరు త్రావించిరి. అనంతరము వారు ఆ ఆవులను మేపుచు గుంపులుగా చేరి 'మిగుల ఆకలిగనియున్నాము' అని విన్నవించుకొనిరి. అంతట శ్రీకృష్ణుడు తనకు భక్తురాండ్రైన విప్రుల పత్నులను అనుగ్రహింపదలచినవాడై ఆ స్వామి బలరామునితోగూడి, ఆ గోపకులతో ఇట్లనెను.

## విప్రులభార్యలు అన్నములను తీసికొనివచ్చి, శ్రీకృష్ణునకు సమర్పించుట

సీ. వల్లవులార! యీ వనమున విప్రులు బ్రహ్మావాదులు దేవభవనమునకు
నరుగుటకాంగిరసాహ్వయ సత్త్రంబు సలుపుచు నున్నారు చనుఁడు మీరు
మా నామములు సెప్పి మైత్రితో నడిగిననన్నంబు పెట్టెదరనుచుఁ బలుక
వారలు చని విప్రవరులకెల్లను మ్రొక్కి పసుల మేపుచు బలభద్రకృష్ణు
తే. లలసి పుత్తెంచిరిట మమ్ము నన్న మడుగ ధర్మవిదులార! యర్థిప్రదాతలార!
పెట్టుఁడన్నంబు, శ్రాంతులఁ బిలిచి తెచ్చి పెట్టుదురు గాదె మిముబోఁటి పెద్దలెల్ల! 852

క. ఘనదీక్షితునకు నైనం, జనుఁగుడువగఁ బశువధంబు సౌత్రామణియుం
జనిన వెనుక దోషములే, దనఘాత్మకులార! పెట్టుఁడన్నము మాకున్. 853

వ. అని గోపకులు పలికిన. 854

"గోపాలకులారా! ఈ వనమునందు బ్రహ్మావాదులైన విప్రులు స్వర్గసుఖములు లభించుటకై 'అంగిరసము' అను ఒక మహాయజ్ఞమును జరుపుచున్నారు. మీరు వారికడకు వెళ్ళి, మా పేర్లు చెప్పి, గౌరవపూర్వకముగా వారిని అర్థించుడు. అంతట వారు మీకు అన్నంబుపెట్టెదరు." శ్రీకృష్ణుడు ఇట్లు పలికిన పిదప ఆ గోపాలకులు ఆ బ్రాహ్మణులకడకు వెళ్ళి వారికి మొక్కి ఇట్లు అర్థించిరి. "ధర్మాత్ములారా! మీరు మహాదాతలు. బలరామకృష్ణులు ఈ వనమునందు ఆవులను మేపుచు అలసిపోయి ఉండిరి. అన్నముకొఱకై మమ్ము మీ యొద్దకు పంపిరి. అన్నంబు పెట్టుడు. మీ వంటి మహాత్ములు అలసివచ్చినవారిని పిలిచి అన్నమును పెట్టుచుందురుగదా! పుణ్యాత్ములారా! పశువధయు, (వపాహోమమూ) ఇంద్రునకు సంబంధించిన హోమములును పూర్తియైన పిమ్మట యజ్ఞదీక్షలో ఉన్నవారును భుజింపవచ్చును, ఇతరులకును పెట్టవచ్చును. కావున అన్నము పెట్టుడు" అనుచు గోపాలురు విన్నవించిరి.

మ. క్రతువున్ మంత్రముఁ దంత్రమున్ ధనములుం గాలంబు దేశంబుదే
వతయున్ ధర్మము నన్యముల్ దలఁప నెవ్వాఁ డట్టి సర్వేశ్వరున్
మతి నూహింపక గోపబాలుఁడనుచున్ మంద స్థితిం జూచి దు
ర్మతులై యన్నము లేదు లేదనిరి సమ్మాన క్రియాశూన్యులై. 855

యథార్థముగా శ్రీకృష్ణుడు సర్వేశ్వరుడు. మంత్రతంత్రములు, సంపదలు, కాలము, దేశము, దైవము, ధర్మము మొదలగునవి అన్నియును ఆ మహాత్ముని స్వరూపములే' అట్టి శ్రీకృష్ణమహత్త్వమును ఎఱుంగలేక మందబుద్ధులైన ఆ బ్రాహ్మణులు ఆ ప్రభువును సామాన్య గోపబాలునిగా భావించిరి. అనంతరము వారు మదాంధులై గోపాలురను చులకన చేయుచు 'అన్నము లేదు, గిన్నములేదు పొండు' అనుచు వారిని (గోపకులను) పంపివేసిరి.

వ. అంత గోపకులు నిరాశులై వచ్చి, యెఱింగించిన, హరి లౌకికానుసారి యగుచు మీరయ్యార్యుల నడుగక, వారిభార్యలకు మా రాకఁ జెప్పుండన్నంబు వెట్టెదరని పంచిన వారలు సని, బ్రాహ్మణసతుల దర్శించి, నమస్కరించి, సంపూజితులై, యిట్లనిరి. 856

క. గోవుల మేపుచు నాఁకొని, గోవిందుండన్న మడిగికొని రండని మ
మ్మీ వేళం బుత్తెంచెను, ధీవిలసితలార! రండు తెండన్నంబుల్. 857

పిమ్మట గోపాలురు నిస్పృహతో కృష్ణునికడకు వచ్చి, జరిగిన విషయమును వివరించిరి. అంతట ఆ స్వామి సమయస్ఫూర్తితో "మీరు ఈ మాఱు విప్రులయొద్దకు వెళ్లక వారిపత్నులకడకు వెళ్లి మేము వచ్చినట్లు తెలుపుడు. వారు మీకు అన్నము పెట్టెదరు" అని పలికి వారిని పంపివేసెను. వెంటనే గోపాలురు బ్రాహ్మణసతుల యొద్దకు చేరి వారికి నమస్కరించిరి. ఆ సతీమణులు వారిని సత్కరించిరి. పిదప వారు "తల్లులారా! ఈ సమీపమున గోవిందుడు గోవులను మేపుచు ఆకలిగొనియున్నాడు. మిమ్ములను అడిగి, అన్నమును తీసికొనిరమ్మని మమ్ము ఇచటికి పంపెను. మీ చల్లని చేతులమీదుగా దయతో అన్నమును పెట్టుడు".

వ. అనిన విని, గోవిందదర్శనకుతూహలలై, ధరణీసురసుందరులు, సంభ్రమానందంబులు డెందంబుల సందడింప భక్ష్య భోజ్య లేహ్య చోష్య పానీయ భేదంబులుం గలిగి, సంస్కారసంపన్నంబులైన యన్నంబులు కుంభంబుల నిడికొని, సంరంభంబుల సముద్రంబునకు నడచు నదుల తెఱంగున, 858

క. బిడ్డలు మగలును, భ్రాతలు, నడ్డము చని వలదనంగ నటు దలఁడని మా
టొడ్డుచు జగదీశ్వరునకు, జడ్డననన్నంబు గొనుచుఁ జనిరాసుదతుల్. 859

వ. చని యమునా సమీపంబున నవపల్లవాతిరేకంబును, విగత వనచరశోకంబునునైన యశోకంబు క్రింద నిర్మలస్థలంబున, 860

అప్పుడు గోవిందుని దర్శించుటకై ఎంతయు కుతూహలపడుచున్న ఆ బ్రాహ్మణసతులు మిగుల ఆనందోత్సాహములకు లోనైరి. పిమ్మట వారు మధురములైన భక్ష్యభోజ్యములతో, కమ్మని పచ్చళ్లతో, పులుసులతో, రుచికరములైన పానీయములతోగూడిన ఆహారపదార్థములపై అభిఘరించుకొని[1] వాటిని పాత్రలలో చేర్చుకొనిరి. అనంతరము వారు ఆ పాత్రలను తీసికొని సముద్రమును జేరుటకు సాగిపోవు నదులవలె తహతహపాటుతో శ్రీకృష్ణునికడకు బయలుదేఱిరి. అప్పుడు వారిపిల్లలు, భర్తలు, సోదరులు వారిని వారించుచు అడ్డువచ్చిరి. అంతట ఆ కులసతులు 'తొలగిపొండు' అని పలుకుచు, ఆ జగన్నాథునకై తీసికొనిన అన్నపానాదులతో త్వరత్వరగా ముందుకు సాగిరి. క్రమముగా వారు యమునానదీతీరమునగల ఒక అశోకవృక్షము కడకు చేరగా అచట వారికి శ్రీకృష్ణుని దర్శనమాయెను. లేతలేత చిగుళ్లతో విలసిల్లుచున్న ఆ అశోకవృక్షము వనచరుల అలసటలను పోగొట్టుచు వారికి హాయిని గూర్చుచుండెను.

సీ. ఒక చెలికానిపై నొకచేయి సాఁచి వేఱొకచేత లీలాబ్జమూఁచువానిఁ
గొప్పునకందని కొన్ని కుంతలములు చెక్కుల నృత్యంబు సేయువానిఁ
గుఱుచ చుంగులు పుచ్చి కొమరారఁ గట్టిన పసిఁడివన్నియగల పటమువాని
నొఁదలఁ దిరిగి రా నలవడఁ జుట్టిన దట్టంపుఁ బింఛెపు దండవాని
తే. రాజితోత్పల కర్ణపూరములవాని మహిత పల్లవ పుష్పదామములవాని
భువనమోహన నటవేష భూతివానిఁ గనిరి కాంతలు కన్నులకఱవు దీఱ 861

1. అభిఘరించుట = అన్నము మున్నగు ఆహారపదార్థములపై నేతిని వేయుట.

అప్పుడు బాలకృష్ణుడు ఒక చెలికానిపై చేయివేసి, రెండవచేతితో ఒక పద్మమును విలాసముగా త్రిప్పుచుండెను. ముడికి అందని అందమైన కొన్ని ముంగురులు ఆ స్వామి చెక్కిళ్లపై నృత్యము చేయుచుండెను. ఆయన ధరించిన పట్టుపీతాంబరము చక్కని చిన్నిచిన్ని కుచ్చులు గలిగి అందములొలుకుచుండెను. ఆ స్వామి తలచుట్టును అలంకృతమైయున్న నెమలిపింఛపు దండ మనోహరముగా ఒప్పుచుండెను. ఆ ప్రభువుయొక్క చెవులపైగల కలువపూవులు కలకలలాడుచుండెను. ఆయనమెడలో విరాజిల్లుచున్న పల్లవ పుష్పహారములు[1] అద్భుతముగా నుండెను. ఆ జగన్నాటక సూత్రధారియొక్క అందచందాలు సకలలోకములను మోహింపజేయుచుండెను. అప్పుడు ఆ విప్రసతులు ఆ జగదేక సుందరుని వైభవమును తనివిదీరునట్లు కన్నులార గాంచిరి.

క. కని లోచనరంధ్రంబుల, మునుమిడి హరిలలితరూపమును లోఁగొని నె
మ్మనములఁ బరిరంభించిరి, తనుమధ్యలు హృదయజనిత తాపము పాయన్. 862

ఆ సుందరీమణులు శ్రీహరియొక్క సుకుమారమైన రూపమును కఱవుదీర దర్శించి, దర్శించి, (ఆ మధురాకృతిని) కనుల రంధ్రములద్వారా తమ హృదయములలో నిల్పుకొనిరి. పిమ్మట హృదయతాపము తీరునట్లుగా వారు మనస్సులలోనే ఆ స్వామిని తనివిదీర కౌగిలించుకొనిరి.

వ. ఇవ్విధంబున. 863

క. వారిత సర్వ స్పృహలై, వారందఱుఁ దన్నుఁ జూడ వచ్చుట మదిలో
వారిజనయనుఁడు పొడగని, వారికినిట్లనియె నగి యవారిత దృష్టిన్. 864

ఇట్లు సంసారపుజంజాటములను అన్నింటిని త్రోసిపుచ్చి, తనను దర్శించుటకై వచ్చిన బ్రాహ్మణసతుల భక్తితాత్పర్యములను ఆ కమలనయనుడు గ్రహించెను. పిమ్మట ఆ స్వామి తదేకదృష్టితో వారిని జూచుచు చిఱునవ్వుతో ఇట్లు నుడివెను.

శా. కాంతారత్నములార! మీగృహములం గళ్యాణమే యేమి గా
వింతున్ మీ కిటు రండు మమ్ము నిచటన్ వీక్షింప నేతెంచినా
రెంతే వేడుకతో నెఱుంగుదును నిర్వేతు స్థితిన్ నన్ను ధీ
మంతుల్ మీక్రియఁ జేరి కందురు గదా మత్సేవలన్ సర్వమున్. 865

వనితామణులారా! సమీపమునకు విచ్చేయుడు. మీ మీ ఇండ్లలో అందఱును కుశలమేగదా! మీరు నన్ను దర్శించుటకై ఎంతో వేడుకపడి ఇచటికి వచ్చిన విషయమును నేను ఎఱుగుదును. మీకు ఏమి కావలయునో తెలుపుడు. బుద్ధిమంతులు మీవలె నిష్కామభావముతో నా కడకు వచ్చి, సేవలొనర్చి, సమస్త సుఖములను పొందుచుందురు గదా!

వ. కావున గృహస్థులైన మీపతులు మిమ్ముం గూడి క్రతువు నిర్విఘ్నంబుగా సమాప్తి సేసెదరు. మీరు యాగవాటంబునకుం జనుండనిన, విప్రభార్య లిట్లనిరి. 866

కావున, గృహస్థాశ్రమమునందున్న మీ భర్తలు మీతోగూడి ఆ యజ్ఞమును ఎట్టి విఘ్నములను లేకుండ పూర్తి చేసెదరు. ఇక మీరు యజ్ఞవేదికకు వెళ్లుడు" అని నుడివెను. అప్పుడు విప్రులసతులు ఇట్లు పలికిరి.

1. పల్లవ పుష్పహారములు = చిగురుటాకులతో, పూవులతో సిద్ధపఱచబడిన హారములు.

మ. తగునే మాధవ! యిట్టి వాఁడిపలుకుల్ ధర్మంబులే మాయెడన్
మగలున్ బిడ్డలు సోదరుల్ జనకులున్ మమ్ముల్ నివారింప మ
చ్చిగ నీయంఘ్రులు సేరినారమటఁ బోఁజేకొందురే వారలా
పగిదేమొల్లము కింకరీజనులఁగా భావించి రక్షింపవే. 867

"మాధవా! నీవు ఇట్లు కఠినముగా పలుకుట న్యాయమా! ఇందువలన మా మనస్సులు మిగుల ఖేదమునకు గుఱియైనవి. మేము అందఱము నీ కడకు వచ్చునప్పుడు మా పతులు, పిల్లలు, సోదరులు, తండ్రులు మమ్ములను వారించిరి. ఐనను (మాకు) నీయందుగల భక్తిశ్రద్ధల కారణమున నీ పాదములసన్నిధికి చేరితిమి. ఇప్పుడు మేము అక్కడికి వెళ్లినచో వారు మమ్ములను స్వీకరింపరు. తిరిగి ఇండ్లకు వెళ్లుటకు మేము ఇష్టపడము. నీ పాదములను సేవించుచు ఇచటనే యుందుము. దయతో రక్షింపుము".

వ. అనిన జగదీశ్వరుండు. 868

సీ. నా సమీపమున నున్నారంచు నలుగరు బంధులు భ్రాతలుఁ పతులు సుతులు
మిమ్ము దేవతలైన మెత్తురంగనలార! నా దేహసంగంబు నరులకెల్ల
సౌఖ్యానురాగసంజనకంబు గాదు ముక్తిప్రదాయకము నా కీర్తనమున
దర్శనాకర్ణన ధ్యానంబులను గర్మ బంధ దేహంబునఁ బాసి మీరు
తే. మానసంబులు నా యందు మరుగఁజేసి నన్నుఁ జేరెద రటమీఁద నమ్మఁడనుచుఁ
బలికి వారలు దెచ్చిన భక్షణాదులాప్త వర్గంబుతో హరి యారగించె. 869

వారు ఇట్లు పలికిన పిదప శ్రీహరి ఈవిధముగా వివరించెను. "పుణ్యవతులారా! మీరు నా దగ్గఱకు వచ్చినందులకు మీ పతులు, సుతులు, సోదరులు, బంధువులు మొదలగువారు ఎవ్వరును మిమ్ము కోపపడరు. అంతేగాదు దేవతలు సైతము మెచ్చుకొందురు. మానవులసాంగత్యమువలె నాసంగమము శారీరకమైన సుఖములను, అనురాగమును కలిగించెడిదిగాదు అది ముక్తిని అనుగ్రహించును. నన్ను కీర్తించుట, దర్శించుట, ధ్యానించుట, నా కథలు వినుట మున్నగు వాటివలన మీ కర్మబంధములు తొలగిపోవును. మీ మనస్సులను నాయందు నిలుపుటచే, దేహములను చాలించిన పిదప నన్ను చేరెదరు. (మోక్షమును పొందెదరు.) నా మాటలను విశ్వసింపుడు". పిమ్మట శ్రీహరి ఆ సాధ్వీమణులు తీసికొనివచ్చిన ఆహారపదార్థములను తనతోడివారితోగూడి ఆరగించెను.

క. పరమేశ్వరార్పణంబుగఁ, బరజనులకు భిక్ష యిడినఁ బరమ పదమునం
బరఁగెదరఁట తుది సాక్షాత్పరమేశుఁడు భిక్ష గొన్న ఫలమెట్టిదియో 870

పరీక్షిన్మహారాజా! 'సర్వం శ్రీకృష్ణార్పణమ్' అని భావించుచు ఇతరులకు 'భిక్ష' ఇడినచో జనులు పరమపదమును చేరుదురట. ఇప్పుడు ఆ పుణ్యవతులనుండి పరమేశ్వరుడే (శ్రీకృష్ణుడే) స్వయముగా భిక్షను స్వీకరించెను. ఇక వారికి లభించెడి పుణ్యములు ఎంతటివో? వర్ణింపనలవిగాదు.

వ. ఇట్లు సర్వేశ్వరుం డయిన హరికి భిక్షయిడి, తమభార్య లతనివలనం గృతార్థలగుట యెఱింగి, భూసురవరులు తమలో నిట్లనిరి. 871

ఈవిధముగా తమపత్నులు సర్వేశ్వరుడైన కృష్ణపరమాత్మకు భిక్షను సమర్పించి, ఆయన అనుగ్రహమును పొందినట్లు ఎఱింగి ఆ బ్రాహ్మణోత్తములు తమలో ఇట్లు చింతించిరి.

చ. కటకట! మోసపోయితిమి కాంతలపాటియు బుద్ధి లేదు నేఁ
డిట హరిఁ గానఁబో నెఱుఁగమేము దురాత్ముల మేము కల్మషో
ద్భటులము విష్ణుదూరగుల ప్రాజ్ఞతలేల తపంబులేల ప
ర్యటనములేల శీలములు యాగములున్ మఱి యేల కాల్పనే. 872

క. జపహోమాధ్యయనంబులుఁ దపములు వ్రతములును లేని తరుణులు హరి స
త్కృపఁ బడసిరన్ని గలిగియుఁ, జపలతఁ బొందితిమి భక్తి సలుపమినకటా! 873

"అయ్యయ్యో! మోసపోయితిమి. మన భార్యలకు ఉన్నంత బుద్ధియు మనకు లేకుండెను. నేడు శ్రీహరిని (శ్రీకృష్ణుని) దర్శించుటకై వెళ్లకుంటిమి. నిజముగా మనము ఎంతయు అధమాధములము, పాపాత్ములము, శ్రీమహావిష్ణువుయొక్క అనుగ్రహమునకు నోచుకొననప్పుడు మన తెలివితేటలు వ్యర్థములు, మన తపస్సులు వృథా, మనము చేసిన తీర్థయాత్రలు నిష్ఫలములు, మన నియమనిష్ఠలు, యజ్ఞములు కాల్పనా? మనగృహిణులు (అబలలు) జపములు చేయలేదు, హోమములను ఆచరింపలేదు, వేదాధ్యయనము సున్న, తపస్సులమాట సరేసరి. ఎట్టి నోములనూ నోచి ఎఱుగరు. ఐనను వారు శ్రీహరియొక్క సత్కృపను పొందగలిగిరి. ఇవి అన్నియు ఉన్నప్పటికిని మనము బుద్ధిచాంచల్యముచే భక్తిహీనులమై అయ్యయ్యో! ఆ ప్రభువును సేవింపకుంటిమి.

క. సురగురులగు యోగీంద్రుల, నరుదుగ మోహితులఁ జేయు హరిమాయ మమున్
నరగురుల మూఢవిప్రుల, నురవడి మోహితులఁ జేయ నోపక యున్నే. 874

దేవతలకును పూజ్యులైన యోగీంద్రులను సైతము ఆ హరి మాయామోహములో ముంచివేయును. ఇక మనము నరులకు మాత్రమే గురువులము, పైగా మూర్ఖులము. ఇట్టి మనలను ఆ భగవన్మాయమోహములో పడవేయుట ఏమాత్రమూ ఆశ్చర్యకరముగాదు.

మ. క్రతువుల్ ధర్మము మంత్ర తంత్ర ధనముల్ కాలంబు దేశంబు దే
వతయున్ వహ్నులు, మేదినీసురులు నెవ్వాఁ డట్టి సర్వేశుఁడీ
క్షితి రక్షింప జనించినాఁ డెఱుఁగ మా శ్రీభర్తకుం గర్తకుం
గుతలోద్ధర్తకు మేము మ్రొక్కెదము రక్షోనాథసంహర్తకున్. 875

యజ్ఞయాగములు, ధర్మములు, మంత్రతంత్రములు, సంపదలు, కాలము, దేశము, దేవతలు, అగ్నులు, బ్రాహ్మణులు మున్నగువారు అందఱును ఆ సర్వేశ్వరుని రూపములే. అట్టి ఆ పరమాత్ముడే ఈ భూమండలమును రక్షించుటకై శ్రీకృష్ణుడుగా అవతరించినాడు. ఈ దివ్యరహస్యమును మనము ఎఱుగకుంటిమి. ఆ శ్రీమన్నారాయణుడే సకలలోకములకును కర్త, ఈ భూతలమును ఉద్ధరించెడివాడు ఆ మహాత్ముడే. రాక్షసులను హతమార్చి, సజ్జనులను రక్షించెడి ఆ జగన్నాథునకు మ్రొక్కెదము".

## నందుడు మొదలగువారు ఇంద్రయాగమును గూర్చి శ్రీకృష్ణునితో చర్చించుట

వ. అని మఱియు ననేక విధంబులఁ బశ్చాత్తాపంబులం బొంది, హరిం దలంచి, శమింపుమని మ్రొక్కి, బ్రాహ్మణులు కంసభీతులయి బలకృష్ణ సందర్శనంబు సేయం జనరైరంత నక్కడ నఖిలదర్శనుండైన హరి, యింద్రయాగంబు సేయం దలంచి, తనకడకు వచ్చిన నందాది గోపవృద్ధులం గని, నందునకిట్లనియె.876

ఇట్లు ఆ విప్రులు పెక్కువిధములుగా పశ్చాత్తాపపడిరి, శ్రీహరిని తలంచుకొనుచు తమ అపరాధములను మన్నింపుమని ఆ స్వామికి పదేపదే మ్రొక్కిరి. కాని వారు కంసునకు భయపడి బలరామకృష్ణులను దర్శించుటకై వెళ్లకుండిరి. అనంతరము గోపాలురలో ప్రముఖులైన నందుడు మొదలగువారు ఇంద్రయాగమును చేయుటకు సంకల్పించిరి. పిమ్మట వారు శ్రీకృష్ణునికడకేగిరి. అంతట ఆ సర్వజ్ఞుడు అందఱిని కలయజూచుచు వినయపూర్వకముగా నందునితో ఇట్లనెను.

సీ. యాగంబు చేయంగ వర్తించి వచ్చితి రీ యాగమున ఫల మేమి గలుగు
నెవ్వాఁడు దీనికి నీశ్వరుం డధికారి యెవ్వఁడు సాధనమెంత వలయు
శాస్త్రీయమో జనాచారమో కార్యంబు వైరులకెఱిఁగింపవలదు గాని
యెఱిఁగెడి మిత్రుల కెఱిఁగింపఁ దగుఁ జేరి యెఱిఁగి చేసినఁ గోర్కులెల్లఁ గలుగుఁ
ఆ. బగయుఁ జెలిమిలేక పరఁగిన మిముబోఁటి మంచివారి కేల మంతనంబు
తలఁపులెల్ల మాకుఁ దగ నెఱిఁగింపవే తాత! వాక్సుధాప్రదాతవగుచు. 877

వ. అని పలికిన, ప్రౌఢకుమారునికిఁ దండ్రి యిట్లనియె, 878

"తండ్రీ! మీరు యాగము చేయుటకై నిశ్చయించుకొని వచ్చినట్లున్నారు. అది సరే. ఇంతకును ఈ యాగము చేయుటవలన ప్రయోజనమేమి? ఈ యజ్ఞమునకు అధిష్ఠానదైవము ఎవరు? దీనకి కర్త ఎవరు? దీనిని నిర్వహించుటకు సాధనసంపత్తి ఎంత కావలయును? ఇది నిజముగా శాస్త్రీయమేనా? లేక పరంపరగా వచ్చుచున్న ఆచారమా? ఈ యజ్ఞకార్యమును గూర్చి శత్రువులకు తెలియనీయరాదు. కాని దీనియెడ ఆసక్తియున్న మిత్రులకు మాత్రము తెలుపదగును. లోతుగా ఆలోచించి చేసినచో కార్యములు ఫలించును. నిజముగా మీకు వీరు శత్రువులు, వీరు మిత్రులు అనుభేదము లేదు. కనుక మీ వంటి సజ్జనులకు దాపఱికముతో పనియేలేదు. అందువలన మీ ఆలోచనలు అన్నింటిని మధురవచనములతో (ప్రేమపూర్వకముగా) వివరింపుడు. అంతట నందుడు కార్యసమర్థుడైన తన కుమారునితో ఇట్లనెను.

సీ. పర్జన్యుఁడధికుండు భగవంతుఁ డమరేంద్రుఁ డతనికిఁ బ్రియమూర్తులగుచునున్న
మేఘబృందంబులు మేదినీతలముపై నతని పంపున భూతహర్షణముగ
జలములు గురియుఁ దజ్జలపూరములఁ దోఁగి పండు సస్యంబులాపంట తమకు
ధర్మార్థ కామ ప్రదాయకంబుగ లోకులెల్లను బ్రదుకుదురింత యెఱిఁగి
తే. మేఘవిభుఁడైన యింద్రుండు మెచ్చుకొఱకు నింద్రయాగము సేయుదురెల్లనృపులు
కామ లోభ భయ ద్వేషకలితులగుచుఁ జేయకుండిన నశుభంబు చెందుఁ బుత్ర! 879

కుమారా! దేవతలకు ప్రభువైన ఇంద్రుడు ఐశ్వర్యసంపన్నుడు, ఆ స్వామి వర్షాధిదేవత. మేఘములు అన్నియును అతనికి ప్రియమైనవి ఆయనయొక్క ఆజ్ఞను అనుసరించి, అవి ఈ భూతలమున వర్షములను కురియుచుండును. ఆ వర్షజలములు సకలప్రాణులకును ఆనందదాయకములు. ఆ వానజల్లులవలన పంటలు పండుచుండును. ఆ పంటలు లభించుటతో లోకులయొక్క ధర్మార్థ కామములు నెఱవేఱుచుండును. అంతట వారు హాయిగా బ్రతుకుచుందురు. ఈ విషయములను ఎఱిగిన మహారాజులు మేఘములకు ప్రభువైన ఇంద్రునకు ప్రీతిని గూర్చుటకై 'ఇంద్రయాగము'ను ఆచరించుచుందురు. అట్లుగాక కామలోభ భయద్వేషములకు వశులై, జనులు ఇంద్రయాగమును చేయకున్నచో వారు అశుభములకు గుఱియగుదురు.

వ. అదియునుం గాక. 880

ఆ. మఖము చేయ వజ్రి మది సంతసించును వజ్రి సంతసింప వానగురియు
వానగురియఁ గసవు వసుమతిఁ బెరఁగును గసవు మేసి ధేనుగణము బ్రదుకు. 881

క. ధేనువులు బ్రదికెనేనిన్, మానదు ఘనమైన పాఁడి మందలఁ గలుగున్
మానుగను బాఁడి గలిగిన,మానవులును సురలుఁ దనిసి మనుదురు పుత్రా! 882

వ. అని యిట్లు నొడివిన నందునివచనంబులు విని, యింద్రునికిఁ గోపంబు దీపింప దనుజదమనుండు తండ్రి కిట్లనియె. 883

నాయనా! అంతేగాక యాగమును చేసినచో ఇంద్రుడు సంతోషించును. ఆ ప్రభువు తృప్తిని పొందినచో వానలు పడుచుండును. ఆ వానలప్రభావమున ఈ భూతలమున పచ్చికలు వృద్ధియగును. వాటిని మేయుటవలన ఆవులమందలు పుష్టిగా నుండును. అవి హాయిగా ఉన్నచో ఆవులపాడి సర్వసమృద్ధిగా ఉండును. అప్పుడు మానవులు, దేవతలు తృప్తిగా ఉందురు. నందునిమాటలను వినిన పిమ్మట శ్రీకృష్ణుడు ఇంద్రునకు కోపము వచ్చునట్లుగా తండ్రితో ఇట్లనెను.

క. కర్మమునఁ బుట్టు జంతువు, కర్మమునన వృద్ధి బొందుఁ గర్మమునఁ జెడుం
గర్మమె జనులకు దేవత, కర్మమె సుఖదుఃఖములకుఁ గారణమధిపా! 884

క. కర్మములకుఁదగు ఫలములు, కర్ములకు నిడంగ రాజు గాని సదా ని
ష్కర్ముఁడగు నీశ్వరుండును, గర్మవిహీనునికి రాజు గాఁడు మహాత్మా! 885

"మహారాజా! ప్రాణులన్నియును పూర్వజన్మలలో తాము చేసికొనిన పుణ్యాపాపకర్మలను అనుసరించి ఈ లోకమున జన్మించును. అట్టి కర్మలఫలితముగనే వృద్ధిక్షయములను పొందుచుండును. కావున ఈ జనులందరికిని కర్మయే దైవము. జీవులయొక్క సకల సుఖదుఃఖములకును కర్మలే కారణములు. కర్మలకు తగిన ఫలములను ఇచ్చెడివాడు ఈశ్వరుడే ఐనచో జీవులకు వారికర్మలకు తగిన ఫలములను అతడే ఒసంగును. అంతేగాని కర్మలను చేయనివానికి అతడు ఎట్టి ఫలములను ఈయడుగదా!

వ. కావునఁ గర్మానుయాతంబులయిన భూతంబులకు బురుహూతునివలని భీతి యేటికి పురాతన జన్మసంస్కారంబులు కుప్పలుగొని కప్పినఁ గర్మంబులు దప్పించి, పెంపు వడయనప్పరమేశ్వరుండును నేరండితరులం జెప్పనేల. సురా సుర నరానీకంబులతోడి లోకంబు నిజసంస్కారవశంబై యుంద డింది యున్నది. సందేహంబు లేదు. దేహి కర్మవశంబున గురుతను దేహంబులం జొచ్చి వెడలు నొజ్జ, వేలువు, నెచ్చెలి, పగఱు, చుట్టంబులు, కర్మంబు, జీవుండు కర్మంబుతోడన వర్తించు. నతనికిఁ గర్మంబు దైవతంబు. కర్మంబునం బ్రతుకుచు నితరసేవ సేయుట, సతి పతి విడిచి, జారుం జేరిన చందంబగు. విప్రుండు వైదిక కర్మంబున మెలంగు. నృపతి ధరణీపాలనంబున సంచరించు. వైశ్యుండు వాణిజ్య కృషి కుసీద గోరక్షణాదుల వర్తించు, శూద్రుండగ్ర జన్ముల సేవించి బ్రదుకు. సత్త్వరజ స్తమోగుణంబులుత్పత్తి స్థితి లయ కారణంబు. లందు రజంబున జగంబు జన్మించు రజోగుణ ప్రేరితంబులయి మేఘంబులు వర్షించు. వర్షంబునం బ్రజావృద్ధియగు, నింద్రుండేమి సేయంగల వాఁడు అదియునుం గాక, 886

మహాత్మా! కర్మలను అనుసరించి సుఖదుఃఖములను అనుభవించెడి ప్రాణులకు ఇంద్రునివలన భయపడవలసిన పనియేమి? పూర్వజన్మల సంస్కారములు రాసులై క్రమ్ముకొనినప్పుడు వాటిఫలములను తప్పించుకొనుటకు ఈశ్వరునకును శక్యముగాదు. ఇంక ఇతరులవిషయము చెప్పనేల? దేవతలతోడను, అసురులతోడను, మానవులతోడను

నిండియున్న లోకము తన సంస్కారముల (స్వభావము) ప్రకారము ప్రవర్తించును. ఇందులకు సందేహము లేదు. జీవుడు తన కర్మఫలములకు అనుగుణముగా ఆయా దేహములను పొందుచుండును, త్యజించుచుండును. గురువు, దైవము, మిత్రులు, శత్రువులు, బంధువులు మున్నగువారు అందఱును కర్మఫలితముగనే కలుగుచుందురు. జీవుడు కర్మానుసారముగనే మెలగుచుండును. అతని పాలిటికి కర్మమే దైవము. కర్మానుసారియై జీవించుచు ఇతరులను సేవించుట పాడిగాదు అట్లు చేయుట సతి పతిని విడిచి, జారుని చేరుట వంటిది. విప్రుడు వైదికకర్మలను ఆచరించుచుండవలెను, ప్రజలను పాలించుచుండుట రాజధర్మము, వాణిజ్యము, వ్యవసాయము, వడ్డీవ్యాపారము, గోరక్షణము మొదలగునవి వైశ్యునివిధులు. అగ్రజన్ములను సేవించుచు జీవించుచుండుట శూద్రుని కర్తవ్యము. సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము అనునవి సమస్త ప్రాణులయొక్క ఉత్పత్తి, స్థితి, లయములకు కారణములు. జగత్తు రజోగుణప్రభావముచే ఏర్పడును. ఆ రజోగుణ కారణముననే మేఘములు వర్షించుచుండును. వర్షములవలన ప్రజావృద్ధి జరుగుచుండును. ఇంక ప్రత్యేకముగా ఇంద్రుడు చేయగలిగినది ఏమున్నది? అంతేగాక,

శా. కోపింపం బని లేదు శక్రునికిఁ దాఁ గోపించుఁ గాకేమి సం
క్షేపంబయ్యెడిదేమి పట్టణములుం గేహంబులుం దేశముల్
వ్యాపారంబులు మీకుఁ బోయెడినె శైలారణ్యభాగంబులన్
గోపత్వంబున నుండుచున్ మనకు సంకోచింపఁగా నేటికిన్. 887

ఇందులకు ఇంద్రుడు కుపితుడు కావలసిన పనియేలేదు. ఒకవేళ ఆయన కోపించినను మనకు వచ్చెడి నష్టములేదు. మీ పట్టణములకును, గృహములకును, మీ ప్రదేశములకును, వ్యవసాయాదులకును ఇబ్బంది కలుగునని భయమా? మనము పర్వతములపైనను, అడవులలోను నివసించుచుండెడి గోపాలకులము. కనుక మనము ఇంద్రునకు జంకవలసిన పనియేలేదు.

సీ. పసులకుఁ గొండకు బ్రాహ్మణోత్తములకు మఖము గావించుట మంచిబుద్ధి
యింద్రయాగంబునకేమేమి దెప్పింతురవి యెల్లఁ దెప్పింపుడరసి మీరు
పాయసంబులు నపూపములు సైఁదపుఁ బిండివంటలుఁ బప్పును వలయునట్టి
ఫలశాకములు వండఁ బంపుఁడు హోమంబు సేయుఁడు ధేనుదక్షిణలనిచ్చి

తే. బహు రసాన్నంబు పెట్టుండు బ్రాహ్మణులకు నచలులై పూజలొనరింపుఁ డచలమునకు
నధమచండాలశునక సంహతికిఁ దగిన భక్ష్యములనిండు కసవులు పసులకిండు. 888

మన బ్రతుకుదెఱువునకాధారమైన పశువులకును, పశువులను మేపుకొనుటకు ఆధారమైన గోవర్ధనపర్వతమునకును, మనకు శుభములను కోరెడి విప్రోత్తములకును, తృప్తిని కలిగించునట్లుగా యజ్ఞములను ఆచరించుట ఎంతేని మంచిపని. మీరు ఇంద్రయాగమునకై సమకూర్చెడి వస్తువులను అన్నింటిని తెప్పింపుడు. పాయసములను, అపూపములును (అప్పాలను), గోధుమపిండి వంటకములను, పప్పును, ఇంకను అనువగు పండ్లను, శాకపాకములను వండించుడు. విధివిధానముగా హోమములను నిర్వహింపుడు. బ్రాహ్మణులకు గోదానములను, దక్షిణలను ఒసంగి, షడ్రసోపేతములైన అన్నములను పెట్టింపుడు. గోవర్ధనపర్వతమునకు గాఢమైన భక్తితో పూజలు చేయుడు. అణగారినవారిని, అనాథులను చక్కని భోజనములతో సంతృప్తిపఱచుడు. కుక్కలు మొదలగు జంతువులచే తగిన పదార్థములను తినిపింపుడు. పశువులకు లేలేతపచ్చికలను సమకూర్చుడు.

శా. గంధాలంకరణాంబరావళులచేఁ గైసేసి యిష్టాన్నముల్
బంధుశ్రేణియు మీరలుం గుడిచి నా భాషారతిన్ వేడుకల్
సంధిల్లన్ గిరిగో ద్విజానల నమస్కారంబు గావింపుఁడో
జం ధర్మం బని తోఁచెనేని జనకా! జన్మంబు ధన్యంబగున్ 889

తండ్రీ! నా మాటలు మీకు సముచితముగా తోచినచో నాపై విశ్వాసమునుంచుడు. బంధుమిత్రులతోగూడి, మీరు సుగంధములను అలదుకొనుడు, చక్కని ఆభరణములను, నూతన వస్త్రములను ధరింపుడు. రుచికరమైన పదార్థములతో సంతృప్తిగా భోజనములను గావింపుడు. క్రమముగా గోవర్ధన పర్వతమునకును, గోవులకును, బ్రాహ్మణులకును, అగ్నిదేవునకును (అగ్నికిని) భక్తితత్పరులై, సాదరముగా నమస్కరింపుడు. ఇట్లు చేయుటవలన మనజన్మములు ధన్యములగును.

వ. అని మఱియు, నిలింపపతిసొంపు దింపుతలంపున, నిమ్మఖంబు తనకు సమ్మతంబని, గోవిందుండు పలికిన, నందాదులు మేలు మేలని, తద్వచనప్రకారంబునం బుణ్యాహవాచనంబులు చదివించి, ధరణీసురులకు భోజనంబులిడి, పసులకుం గసవులొసంగిరప్పుడు. 890

ఇట్లు పలికిన పిమ్మట శ్రీకృష్ణుడు ఇంద్రుని గర్వమును అణచివేయదలచి, 'నేను చెప్పినవిధముగా యాగము చేయుట నాకు సమ్మతము' అని పలికెను. వెంటనే నందాది గోపకులు 'బాగుబాగు' అనుచు ఆ స్వామి చెప్పినరీతిగా పుణ్యాహవాచనములను జరిపించిరి, విప్రులకు అన్నదానములను గావించిరి. పశువులకు మేలైన పచ్చికలను సమకూర్చిరి.

మ. సకలాభీరులు వీఁడె కృష్ణుఁడన నైజంబైన రూపంబుతో
నకలంకస్థితినుండి శైలమిదె మీరర్చింప రండంచుఁదా
నొక శైలాకృతిఁ దాల్చి గోపకులతో నొండొండ పూజించి గో
పక దత్తాన్నములాహరించె విభుఁడా ప్రత్యక్ష శైలాకృతిన్. 891

గోపాలురు అందఱును 'ఇడుగో! కృష్ణుడు' అనుకొనురీతిగా ఆ ప్రభువు తన సహజమైన రీతిలో నిర్మలాకృతితో ఒప్పుచుండెను. ఆయన 'ఇదిగో! ఈ పర్వతమును అర్చించుటకై రండు' అని పలుకుచు తాను ఒక శైలాకృతిని దాల్చెను. పిమ్మట అతడు గోపాలకులతోగూడి క్రమముగా ఆ శైలమును ఆరాధించెను. (శైలము యొక్క ఆకారముతో తాను విలసిల్లుచునే, గోపాలకులతోడను ఒకడై పూజసల్పెను) అంతట శైలాకారములోనున్న ఆ కృష్ణప్రభువు గోపాలురు సమర్పించిన మధురాహారములను ప్రీతితో ఆరగించెను.

మ. వినుఁడీ శైలము కామరూపి ఖలులన్ వేధించు నాజ్యాన్నముల్
మనమొప్పించిన నాహరించె మనలన్ మన్నించెఁ జిత్తంబులో
ననుకంపాతిశయంబు సేసె మనపై నంచున్ సగోపాలుఁడై
వనజాక్షుండు నమస్కరించె గిరికిన్ వందారుమందారుఁడై. 892

ఆశ్రయించి సేవించెడివారికి (అర్థులపాలిటి) కల్పవృక్షమైన ఆ కృష్ణుడు "మిత్రులారా! ఈ పర్వతము తనకు ఇష్టమైనరీతిగా వివిధరూపములను ధరింపగలదు. దురాత్ములను శిక్షించును, మనము సమర్పించిన నేతి పదార్థములను ఆదరముతో తనివిదీర స్వీకరించెను. నిండుమనస్సుతో మనలను అనుగ్రహించెను" అని పలికెను. పిదప ఆ కమలనయనుడు తోడి గోపాలురతోగూడి ఆ గిరికి నమస్కరించెను.

వ. ఇట్లు గోపకులు హరిసమేతులై, గిరికిం బూజనోపహారంబులు సమర్పించి, గోధనంబులం బురస్కరించుకొని, భూసురాశీర్వాద వచనంబులతో గిరికిం బ్రదక్షిణంబు సేసిరాసమయంబున, 893

ఈవిధముగా గోపాలకులు కృష్ణునితోగూడి ఆ గోవర్ధనగిరిని పూజించి, నైవేద్యములను సమర్పించిరి. పిదప వారు పూజ్యార్హములైన ఆవులను ముందిడుకొని, భూసురులఆశీర్వాదములను గొనుచు ఆ పర్వతమునకు ప్రదక్షిణపూర్వకముగా ప్రణమిల్లిరి.

క. గుఱ్ఱములపరువు మెచ్చని, నఱ్ఱులఁ గట్టిన రథమ్ము నందప్రముఖుల్
కుఱ్ఱలయార్పులు సెలఁగఁగ దొఱ్ఱులగమి వెంటనంటఁ దోలిరిలేశా! 894

పరీక్షిన్మహారాజా! అనంతరము నందుడు మున్నగు గోపకులు తమబండ్లకు, గుఱ్ఱములకంటె వేగముగా పఱుగెత్తగల ఎద్దులను కట్టిరి. పిల్లలు ఉత్సాహముతో కేరింతలు కొట్టుచుండగా వారు తమ బండ్లపైనెక్కి, ఆవులగుంపులవెంట బయలుదేఱిరి.

క. పాటించి గానవిద్యా పాటవమునఁ దేరులెక్కి, బహుతానములం
బాటలగంధులు కృష్ణునిఁ బాటలఁ బాడిరి విరోధిపాటనుఁడనుచున్. 895

అంతట గోపికలు బండ్లపై చేరి, 'ఈ కృష్ణుడు శత్రువులను పరిమార్చుటలో దిట్ట' అనుచు ఆ స్వామి వైభవమును గూర్చి మధురముగా పాటలు పాడిరి. అప్పుడు వారు తమ గానవిద్యాకౌశలమును ప్రకటించుచు హాయిగా కమ్మని రాగాలాపనములను గావించిరి.

క. కుండనిభాపీనంబులు, మండిత వర్ణములు వివిధ మహితాకృతులున్
నిండిన కడుపులుఁ గన్నుల, పండువులుగఁ బాఁడి కుఱ్ఱిపదువులు నడచెన్. 896

గోపాలురపాడియావుల పొదుగులు కుండలవలె భాసిల్లుచున్నవి. వాటి వన్నెచిన్నెలు మనోహరములు, అవి పలువిధములైన ఆకారములతో విలసిల్లుచుండెను. అవి పచ్చికలను బాగుగా మేసియుండుటచే వాటి కడుపులు నిండుగా ఉన్నవి. అవి కనులపండువుగా ముందునకు సాగిపోవుచుండెను.

క. పొగరెక్కిన మూఁపురములుఁ, దెగగల వాలములు శైలదేహంబులు భూ
గగనములు నిండు ఱంకెలు, మిగుల మెఱయు వృషభగణము మెల్లన నడచెన్ 897

వారివృషభములమూపురములు మిగుల బలిష్ఠముగానుండెను. వాటివాలములు (తోకలు) మిగుల పొడవైనవి. దేహములు కొండలవలె దృఢమైనవి. అవి భూమ్యాకాశములు నిండునట్లుగా ఱంకెలు వేయుచు తిన్నగా పురోగమించుచుండెను.

వ. ఇట్లు పర్వత ప్రదక్షిణంబు సేసి, గోపకులు మాధవసమేతులై, మందకుం జనిరంత మహేంద్రుండంతయు నెఱింగి, మహాకోపంబునఁ బ్రళయప్రవర్తకంబులగు సంవర్తకమేఘంబులఁ జీరి యిట్లనియె. 898

ఇట్లు గోపాలురు శ్రీకృష్ణునితోగూడి సపరివారముగా పర్వతమునకు ప్రదక్షిణలు గావించి, తమ నివాసములకు చనిరి. ఈ విషయములను పూర్తిగా ఎఱిగిన దేవేంద్రుడు మిగుల క్రుద్ధుడయ్యెను. అంతట అతడు ప్రళయకాలమున విజృంభించెడి సంవర్తక మేఘములను రప్పించి, ఇట్లు నుడివెను.

మ. పెరుఁగుల్ నేతులు ద్రావి క్రొవ్వి భువి నాభీరుల్ మదాభీరులై
గిరిసంఘాత కఠోర పత్త్రదళన క్రీడా సమారంభ దు
ర్ధర దంభోళిధరుం బురందరు ననుం బాటించి పూజింపక
గ్గిరికిం బూజలు సేసి పోయిరిదెపో కృష్ణుండు ప్రేరేపఁగన్. 899

"గొల్లలు అందఱును పాలుపెఱుగులను, నేతులను కడుపార మెక్కి, బలిసి మిగుల గర్వితులైయున్నారు. నా వజ్రాయుధము తిరుగులేనిది. నేను దానిని ధరించి పర్వతములయొక్క కఠోరములైన ఱెక్కలను అవలీలగా ఛేదించువాడను. దేవతలకు ప్రభువును. అట్టి నన్ను భక్తితో పూజించుటమాని, గోపాలురు శ్రీకృష్ణుని ప్రేరణతో కొండకు పూజలుచేసి, ఇప్పుడే వెళ్లిపోయిరి.

క. గురుదేవహీను బాలుని, గిరిభూజప్రముఖవాసుఁగృష్ణు ననీశుం
బరిణామశీలుఁ గుల గుణ,విరహితుఁ జేపట్టి యింద్రు విడిచిరి గొల్లల్ 900

శ్రీకృష్ణుడు గురువులను, దేవతలను గౌరవించునట్టివాడు కాడు. అతడు ఎల్లప్పుడును కొండలలో, కోనలలో నివసించుచుండెడివాడు. అతడు ఎవ్వరికిని ప్రభువు కాడు. అతని స్వభావము చంచలము, కులములేనివాడు, గుణహీనుడు.[1] అట్టి మూర్ఖునిమాటలు నమ్మి ఈ గొల్లలు సురపతినైన నన్ను పూజించుట మానిరి.

ఆ. విమల ఘనతరాత్మ విజ్ఞానవిద్యచే నిగుడలేక యుడుపనిభములగుచుఁ
గర్మమయములైన క్రతువుల భవమహార్ణవముఁ గడవఁ గోరినారు వీరు. 901

వీరు నిర్మలమైన, ప్రబలమైన ఆత్మవిజ్ఞానసంపదను (బ్రహ్మజ్ఞానము పొందలేక) చిన్నిచిన్ని నాటుపడవలవంటి కర్మపరంపరతో నిండిన యాగములను ఆచరించుటద్వారా సంసారమనెడి మహాసముద్రమును దాటగోరుచున్నారు.

శా. ఉద్యత్సంపద నమ్మి నందతనయోద్యోగంబునన్ వెఱ్ఱులై
మద్యాగంబు విసర్జనీయమనిరీ మర్త్యుల్ వడిన్ మీరు మీ
విద్యుద్వల్లులఁ గప్పి గర్జనములన్ వేధించి గోవుల్ జనుల్
సద్యోమృత్యువుఁ బొంద ఱాల్ గురియుఁడీ శౌర్యంబవార్యంబుగన్. 902

సంవర్తాదిమేఘములారా! మానవమాత్రులైన ఈ వెఱ్ఱిగొల్లలు తమకుగల గొప్ప సంపదలను నమ్ముకొని, శ్రీకృష్ణుని ప్రోత్సాహముచేత నా (ఇంద్ర) యాగమును ఆచరింపనవసరములేదని భావించిరి. కనుక మీరు వెంటనే మెఱుపుతీగెలతో కప్పివేసి, తీవ్రమైన ఉఱుములతో వారిని వేధింపుడు. మీ తిరుగులేని పరాక్రమముతో విజృంభించి, వడగండ్ల వానలతో గోపాలురను, గోవులను మృత్యువుపాలగునట్లు చేయుడు.

క. మీవెంట వత్తునేనై, రావణనాగంబు నెక్కి రయమొప్పంగా
దేవగణంబులతోడను, గోవిందునిమందలెల్లఁ గొందలపెట్టన్ 903

1. 'దేవేంద్రుడు పైపైన శ్రీకృష్ణుని నిందించుచున్నట్లు కన్పట్టుచున్నను వాస్తవముగా ఆ మాటలలో ప్రస్తుతులే గోచరించుచున్నవి. గురుదేవహీనుడు = ఆ ప్రభువే సర్వలోకములవారికిని గురువు. దేవాధిదేవుడు. బాలుడు = సర్వసమర్థుడు. గిరిభూజ ప్రముఖ వాసుడు= చరాచర ప్రపంచమునందు అంతటను వ్యాపించియుండెడివాడు, అనీశుడు = సర్వేశ్వరుడు, పరిణామశీలుడు లోకములను రక్షించుటకొఱకై పెక్కు రూపములతో అవతరించు (పరిణమించు) చుండువాడు. కులహీనుడు = (కులము = దేహము). మృణ్మయదేహములేనివాడు, దివ్యస్వరూపుడు. గుణహీనుడు = సత్త్వరజస్తమోగుణములకు అతీతుడు.

కృష్ణుని ఆవులమందలను చికాకుపఱచుటకై నేను ఐరావతమును (ఏనుగును) ఎక్కి, దేవతలతోగూడి వేగముగా మీ వెనువెంటనే వచ్చెదను".

వ. అని యిట్లు పలికి, జంభవైరి సంరంభంబున దంభోళి జళిపించి, బింకంబున శంకింపక కింకతోడ సంకిలియ యూడ్చిన, మహానిలప్రేరితంబులయి చని, నందునిమందమీఁద నమోఘంబులైన మేఘంబులు మహౌఘంబులై పన్ని, ప్రచండగతిం జండమరీచిమండలంబుఁ గప్పి, దివి నిండి, దిశలావరించి, రోదోంతరాళంబు నిరంతర నీరంధ్ర నిబిడాంధకార బంధురంబుగ నిరోధించి, బలిభంజనద్వితీయ పాదపల్లవభగ్నంబైన బ్రహ్మాండభాండంబుచిల్లుల జల్లించి, తొఱఁగు బహిస్సముద్ర సలిల నిర్ఝరంబుల వడుపున నెడతెగక తోరంబు లైన నీరధారలం గురియుచు, శిలల వర్షించుచుఁ, బిడుగుల ఱువ్వుచునుండ, మిట్టపల్లంబులు సమతలంబు లయి, యేకార్ణవంబురూపుసూపిన, నందుదుడుకడుచుచు నీఁదుచు విలయశిఖిశిఖా సంరంభ విజృంభమాణ విద్యుల్లతా విలోకనంబున రిమ్మలు గొని సొమ్మలు వోవుచున్న లేఁగలును, లేఁగలకు మూఁతులడ్డంబులిడి, ప్రళయ భైరవ భేరీ భాంకార భీషణంబులగు గర్జనఘోషణంబులఁ జెవుడువడి, చిందఱవందఱలైన డెందంబులం గంది, కుంది వ్రాలు ధేనువులును, ధేనువులవెనుక నిడుకొని దురంత కల్పాంతకాల కీలి కరాళ కాలకంఠకర విశాల గదాఘాత ప్రభూతంబులైన నిర్ఘాతపాతంబులకు భీతంబులై, హరికి మ్రొక్కి, రక్షరక్షేతి శబ్దంబులుసేయుచుకైవడి, విడువని జడిం బడి, సైరింపక, శిరంబులు వంచుకొని, గద్గదకంఠంబుల నంభారవంబులు సేయు వృషభంబులును, వృషభాది గోరక్షణంబు సేయుచు దుర్వార ఘోర శిలాసారంబుల సారంబులు సెడి, శరీరంబులు భారంబులైన మ్రానుపడు గోపకులును, గోపకులం బట్టుకొని దట్టంబయిన వానకొట్టునం బెట్టువడి, బడుగునడుములు నుసులువడ వడవడ వడంకుచు, గోవిందుని జీరు గోపికలును, గోపికాజన కఠిన కుచకలశ యుగళంబుల మఱుంగునం దలలు వెట్టుకొని, పరవశులైన శిశువులును గలిగి, మహా ఘోషంబుతోడ నష్టంబైన ఘోషంబుఁ జూచి, ప్రబుద్ధులైన గోపవృద్ధులు గొందఱు దుర్జన శిక్షకుండును, సజ్జన రక్షకుండును నైన పుండరీకాక్షునకు మ్రొక్కి యిట్లనిరి. **904**

ఇట్లు పలికిన పిమ్మట, దేవేంద్రుడు ఆటోపముతో వజ్రాయుధమును అటునిటు త్రిప్పి, పైకి బింకమును చూపుచు, ముందువెనుకలు ఆలోచింపక కినుకతో మేఘములను పంపివేసెను. అంతట ఆ ప్రళయకాల మేఘములు తీవ్రమైన గాలులతో కదలి, గుంపులు గుంపులుగా రూపొంది ప్రచండమైన రీతిలో తీక్ష్ణమైన సూర్యమండలమును కప్పివేసెను. ఆకాశమునుండి సకలదిశలను ఆవరించెను. అంతరిక్షమునందు అంతటను ఏమాత్రమూ సందు లేకుండునట్లుగా దట్టమైన చిమ్మచీకట్లు అలముకొనెను. వామనుని రెండవపాదము తాకిడికి పగిలి బద్దలైన బ్రహ్మాండమనెడి కుండయొక్క చిల్లులనుండి కారిన బహిస్సముద్ర జలప్రవాహములవలె, మేఘములు దట్టమైన (బలమైన) జలధారలను ఎడతెగక కురియసాగెను. ఇంకను అవి పిడుగులను ఱువ్వుచు వడగండ్లను వర్షింపదొడగెను. ఆ జడివానల ప్రభావముచే మిట్టపల్లములు అన్నియు నీటితో నిండి సమతలముగా మాఱి, ఒక సముద్రముగా రూపుదాల్చెను. అప్పుడు లేగలు (దూడలు) ఆ జలములలో నెమ్మదిగా ఈదుచు, ప్రళయాగ్ని జ్వాలలవలె విజృంభించుచున్న మెఱుపుతీగలధాటికి కన్నులు మిఱుమిట్లుగొల్పగా దిక్కుతోచని స్థితిలో సొమ్మసిల్లెను. అప్పుడు గోవులు తమలేగలను రక్షించుకొనుటకై వాటి మూతులకు తమమోరలను అడ్డముగా ఉంచెను. ప్రళయకాలమునవలె భీతిని గొల్పెడి నగారాలమ్రోతలరీతిగా చెవులు చిల్లులుపడజేయుచు మేఘములు భయంకరధ్వనులతో గర్జించుచుండెను. వాటిధాటికి తట్టుకొనలేక ధేనువులు గుండెపగిలి, దుఃఖముతో సోలిపోవుచుండెను. ఆ గోవులకు ముందుభాగమున ఎద్దులు సాగిపోవుచుండెను. అప్పుడు అవి ఎడతెఱపిలేని జడివానలకు తట్టుకొనలేక తలలు వంచుకొని గద్గదస్వరములతో 'అంభా'రవములు చేయుచుండెను. అప్పుడు అంతులేని

ప్రళయకాలాగ్నులవలె ప్రచండుడైన రుద్రుని చేతియందలి గదాప్రహారములను బోలిన పిడుగుపాటులకు భీతిల్లిన వృషభములు శ్రీకృష్ణునకు మ్రొక్కుచు 'రక్షింపుము - రక్షింపుము' అని మొరపెట్టుకొనుచున్నవా? అనునట్లు ఆ అంభారవములు ఒప్పుచుండెను. గోపాలురు, వృషభములు, గోవులు మొదలగువాటి రక్షణము జూచుకొనుచు వాటి వెంట నడచుచుండిరి. తట్టుకొనలేనంతగా పడుచున్న వడగండ్ల వాన ధాటికి వారు మిగుల దెబ్బతినిరి. ఆ స్థితిలో వారిశరీరములే వారికి బరువగుటచే కొయ్యబాఱిపోయిరి. గోపికలు ఆ గోపాలురను ఊతగాగొని ముందునకు సాగుచుండిరి. ఎడతెఱపిలేకుండ పడుచున్న జడివాన వడగండ్లబాదుడుకు వారిసన్నని నడుములు తాళలేకుండెను. వారు గడగడవణకిపోవుచు శ్రీకృష్ణునకు మొఱపెట్టుకొనుచుండిరి. ఆ గోపికల శిశువులు తల్లుల పయ్యెదల చాటున తమ తలలను దూర్చి హాయిగా నుండిరి. అప్పుడు తెలివిగల కొందఱు వృద్ధ గోపాలురు ఆ గందరగోళ పరిస్థితికి ఎంతయు దెబ్బతిని, నిస్సహాయస్థితిలోనున్న గొల్లపల్లెను జూచి, దుష్టులను శిక్షించి, సత్పురుషులను కాపాడునట్టి శ్రీకృష్ణునకు మ్రొక్కి ఇట్లు విన్నవించుకొనిరి.

ఉ. అక్కట! వానఁదోఁగి వ్రజమాకులమయ్యె గదయ్య! కృష్ణ!నీ
వెక్కడనుంటివింత తడవేల సహించితి నీ పదాబ్జముల్
దిక్కుగనున్న గోపకులు దీనతనొంద భయాపహారివై
గ్రక్కునఁ గావకిట్లునికి కారుణికోత్తమ! నీకుఁ బాడియే. 905

"కృష్ణా! నీవు కృపానిధివి గదా! విపరీతమైన ఈ జడివానకు తడిసి ముద్దైయున్న ఈ గొల్లపల్లె అంతయు వ్యాకులపాటునకు లోనైనది సుమా! ఇంతవఱకును నీవు ఎక్కడ ఉంటివి? ఏల మిన్నకుంటివి? నీ పాదములనే నమ్ముకొని (నీ అండనజేరి) యున్న ఈ గోపాలురు, గోపికలు అందఱును ప్రస్తుతము దైన్యస్థితికి లోనై యున్నారు. వారిభయములను, బాధలను పోగొట్టి, వారిని కాపాడకుండుట నీకు న్యాయముకాదు.

క. ఈ యుఱుములు నీ మెఱుములు, నీ యశనులఘోషణములు నీ జలధారల్
నీ యాన తొల్లి యెఱుఁగము, కూయాలింపంగదయ్య! గుణరత్ననిధీ! 906

సద్గుణనిధీ! కృష్ణా! ఈ ఉఱుములు, మెఱుపులు, భయంకరములైన పిడుగుల ధ్వనులు, ఈ జడివానలు ఇంతకుముందు మేము కని విని యెఱుగము. నీ పాదములసాక్షిగా చెప్పుచున్నాము. మా మొఱలు ఆలకించి మమ్ము కాపాడుము.

క. వారి బరువయ్యె మందల, వారికి నిదె పరులు లేరు వారింపంగా
వారిదపటలభయంబును, వారిరుహదళాక్ష! నేఁడు వారింపఁగదే. 907

ఈ గొల్లపల్లె వాసులు భరింపరాని ఈ వర్షములకు తాళలేకున్నారు. ఇప్పుడు వారిని ఇతరులు ఎవ్వరును రక్షింపజాలరు. మా అందఱకును నీవే దిక్కు. కమలదళాక్షా! ఈ ప్రళయకాల మేఘములభయమునుండి ఇక నీవే కాపాడవలెను".

వ. అనిన విని, సర్వజ్ఞుండైన కృష్ణుం డంతయు నెఱింగి. 908

ఉ. తన్నొకయింత గైకొనరు తప్పిరి యాగము సేసిరంచుఁ దా
మిన్ననుండి గోపకులమీఁద శిలల్ గురియించుచున్న వాఁ
డున్నత నిర్జరేంద్ర విభవోత్థిత గర్వనగాధిరూఢుఁడై
కన్నులఁగానడింద్రుఁడిటు గర్వపరుండొరుఁ గానవేర్చునే. 909

అంతట శ్రీకృష్ణుడు వారివిన్నపమును శ్రద్ధగా ఆలకించెను. సర్వజ్ఞుడైన ఆ ప్రభువు జరిగినదానిని అంతయును గ్రహించెను. "ఇంద్రుడు 'నేను సకల దేవతలకును ప్రభువును' అని కొండంత గర్వముతో మిడిసిపడుచున్నాడు. 'ఈ గొల్లలు నా యెడ గౌరవభావమును మాని (ఇంద్రయాగమును మాని) ఇతర యాగమును ఒనర్చిరి' అని తలపోయుచు ఆ గోపాలురపై ఆకాశమునుండి ఱాళ్లవాన కురిపించుచున్నాడు. ఈతడు కన్నుమిన్నుగానకున్నాడు. ఇంతటి మిడిసిపాటుగలవాడు ఇతరుల ఔన్నత్యమును గుర్తింపజాలడు.

క. దేవతలందఱు నన్నును, సేవింతురు రాజ్యమదముఁ జెందరు చెఱుపం
గా వలదు మానభంగము, గావింపఁగ వలయు శాంతి గలిగెడు కొఱకై. 910

దేవతలు నన్ను గూడ సేవింతురు. కాని వారికి రాజ్యగర్వములేదు. కావున వారికి చెఱుపు చేయరాదు. లోకములయందు శాంతి నెలకొనుటకై వారికి గర్వభంగమును గలిగించిన చాలును".

వ. అని చింతించి, శిలావర్షహతులై, శరణాగతులైన ఘోషజనుల రక్షించుట తగవని, సకల లోక రక్షకుండయిన విచక్షణుండు. 911

చ. కలఁగకుఁడీ వధూజనులు కంపము నొందకుఁడీ వ్రజేశ్వరుల్
తలఁగకుఁడీ కుమారకులు తక్కినవారలు ఱాలవానచే
నలఁగకుఁడీ పశువ్రజము నక్కడ నక్కడ నిల్వనీకుఁడీ
మెలపున మీకు నీశ్వరుఁడు మేలొసఁగుం గరుణార్ద్ర చిత్తుఁడై. 912

ఇట్లు ఆలోచించి, ధర్మాధర్మవిచక్షణగల ఆ సర్వలోకరక్షకుడు ఈ విధముగా పలికెను - 'గోపికలారా! గోపాలకులారా! గోపబాలకులారా! తక్కిన మిత్రులారా! ఈ వడగండ్లవానకు ఏమాత్రము కలత చెందకుడు, భయపడకుడు, చెదరిపోవలదు, ఆయాసపడవద్దు. పశువులను ఒకేచోట చేర్చుడు. ఆ పరమేశ్వరుడు దయామయుడు. ఆ స్వామి మీపై అనుగ్రహముచూపి, తప్పక మేలుచేయును.

## శ్రీకృష్ణుఁడు గోవర్ధనపర్వతమునెత్తుట

వ. అని పలికి. 913

క. కిరియై ధర యెత్తిన హరి, కరి సరసిజముకుళమెత్తుగతిఁ ద్రిభువన శం
కరకరుఁడై గోవర్ధన, గిరి యెత్తెం జక్కనొక్క కేలన్ లీలన్. 914

ఇట్లు పలికినవాడై - కృతయుగమున యజ్ఞవరాహమూర్తియై అవతరించి భూమిని ఉద్ధరించిన శ్రీహరి ముల్లోకములకును శుభములను గూర్చు సంకల్పముతో ఏనుగు తామరమొగ్గను పైకెత్తినరీతిగా గోవర్ధనగిరిని ఒక్క చేతితో అవలీలగా ఎత్తెను.

క. దండిని బ్రహ్మాండంబులు, చెండులక్రియఁ బట్టి యెగురఁ జిమ్మెడు హరికిన్
గొండఁ బెకలించి యెత్తుట, కొండొక పని గాక యొక్క కొండా తలఁపన్ 915

బ్రహ్మాండములనుసైతము బంతులనువలె పట్టుకొని ఎగురవేయగల శ్రీహరికి ఒక కొండను పెకలించి ఎత్తుట చాల చిన్నపని - అంతేగాని ఆయనకు అది ఒక ఘనకార్యముగాదు.

వ. ఇట్లు గిరి యెత్తి. 916

శా. బాలుండాడుచు నాతపత్రమని సంభావించి పూగుత్తి కెం
గేలన్ దాల్చినలీల లేనగవుతోఁ గృష్ణుండు దానమ్మహా
శైలంబున్ వలకేలఁ దాల్చి విపులచ్ఛత్రంబుగాఁ బట్టె నా
భీలాభ్రచ్యుత దుశ్శిలాచకిత గోపీగోప గోపంక్తికిన్. 917

ఇట్లు గోవర్ధనగిరిని ఎత్తిన పిమ్మట ఒక పసివాడు ఆడుకొనునప్పుడు గొడుగు అను భావముతో ఒక పూలగుత్తిని తన సుతిమెత్తని (ఎఱ్ఱని) చేతితో పట్టుకొనిన రీతిగా - బాలకృష్ణుడు దరహాసము ఒనర్చుచు ఆ మహాపర్వతమును కుడిచేతితో పట్టుకొని, మిగుల భయంకరముగా ఆకాశమునుండి కురిసిన వడగండ్లవానకు భీతిల్లిన గోపికలకును, గోపాలురకును, గోవులకును దానిని విశాలమైన ఒక ఛత్రముగా పట్టెను.

వ. ఇట్లు గోత్రంబు ఛత్రంబుగాఁ బట్టి గోపజనులకు గోపాలశేఖరుం డిట్లనియె. 918

క. రా తల్లి! రమ్మ తండ్రీ!, వ్రేతలు గోపకులు రండు వినుఁడీ గర్త
క్ష్మాతలమున నుండుఁడు గో, వ్రాతముతో మీరు మీకు వలసిన యెడలన్. 919

గోపాలురలో ప్రముఖుడైన శ్రీకృష్ణుడు ఆగిరిని గొడుగుగా పట్టుకొని గోపాలాదులతో ఇట్లనెను - "తల్లీ! రమ్మ, తండ్రీ విచ్చేయుము. గోపికలారా! గోపాలులారా! నా మాటపై విశ్వాసమునుంచి, గోవర్ధనగిరి పెకలింపగా ఏర్పడిన ఈ పల్లపు ప్రదేశమునకు మీరు గోవులతో గూడి రండు. ఇచట మీకు ఇష్టమువచ్చిన చోట నిలబడుడు.

శా. బాలుండీతఁడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపఁగాఁ
జాలండో యని దీనిక్రింద నిలువన్ శంకింపఁగాఁ బోలదీ
శైలాంభోనిధి జంతుసంయుతధరాచక్రంబు పైఁ బడ్డనా
కేలల్లాడదు బంధులార! నిలుఁడీ క్రిందం బ్రమోదంబునన్. 920

ఆత్మబంధువులారా! 'ఈ కృష్ణుడు మిగుల పసిబాలుడు ఈ కొండ ఎంతయు పెద్దది (బలమైనది) ఇంత భారమును ఇతడు మోయగలడో? లేడో? అని తలంచి, దీనిక్రిందికి వచ్చుటకు సందేహపడరాదు. కొండలతో, సముద్రములతో వివిధములగు ప్రాణులతో గూడిన ఈ భూమండలము అంతయును మీదబడినప్పటికిని నా చేయి కదలదు, మెదలదు. కనుక పూర్తి విశ్వాసముతో సంతోషముగా ఈ గిరి క్రిందికి వచ్చి నిలబడుడు".

వ. అని పలుకుచున్న హరి పలుకులు విని, నెమ్మనముల నమ్మి, కొండయడుగునం దమతమ యిమ్ములం బుత్రమిత్రకళత్రాదిసమేతులై, గోవులుం, దారును, గోపజనులు, జనార్దన కరుణా విలోకనామృత వర్షంబున నాఁకలినీరువట్టుల చొప్పెఱుంగక, కృష్ణకథావినోదంబులనుండిరివ్విధంబున, 921

ఇట్లు పలికిన శ్రీకృష్ణుని మాటలను గోపాలాదులు పూర్తిగా విశ్వసించిరి. పిమ్మట వారు భార్యాపుత్రులతో, మిత్రులతో, గోవులతో, గోవర్ధనగిరి క్రిందికి చేరి, తమకు అనువైనచోట్ల నిలిచిరి. శ్రీకృష్ణుని యొక్క చల్లని చూపులనెడి అమృతవర్షమును ఆస్వాదించుచు ఆ ఆనందపారవశ్యములలో వారు ఎల్లరును ఆకలిదప్పులను మఱచిరి. శ్రీకృష్ణకథలతో వినోదించుచుండిరి.

మ. హరిదోర్దండము కాము గుబ్బ శిఖరం బాలంబి ముక్తావళుల్
పరఁగన్ జాఱెడు తోయబిందువులు గోపాలాంగనాపాంగ హా
సరుచుల్ రత్నచయంబు గాఁగ నచలచ్ఛత్రంబు శోభిల్లెఁద
ద్గిరిభిద్దుర్మద భంజియై జలధరాక్లిన్నప్రజారంజియై. 922

గోవర్ధనగిరి గోపాలాదులపాలిట ఒక మహాఛత్రమై విరాజిల్లుచుండెను. ఆ ఛత్రమునకు శ్రీకృష్ణునిబలమైన బాహువు కఱ్ఱగాను, గిరిశిఖరము గొడుగుగుబ్బగాను, పైనుండి జారుచున్న జలబిందువులు అంచుచుట్టను వ్రేలాడుచున్న ముత్యములుగాను, గోపికలయొక్క చిఱునవ్వుల కాంతులు రత్నములుగాను, అలరారుచుండెను. ఆ కొండయనెడి గొడుగు ఇంద్రుని యొక్కదురహంకారముపై దెబ్బతీయుచు, మేఘజలములకు తడిసి ఇబ్బందులకు గుఱియైన ప్రజలను (గోపాలురు మున్నగువారిని) ఆనందింపజేయుచుండెను.

క. రాజీవాక్షునిచే నొక, రాజీవముభంగి శైలరాజము మెఱసెన్
రాజేంద్ర! మీఁద మధుకర, రాజిక్రియన్ మేఘరాజి రాజిల్లెఁగడున్. 923

పరీక్షిన్మహారాజా! కమలనయనుడైన శ్రీకృష్ణుని చేతిలో ఆ మహాపర్వతము ఒక పద్మమువలె భాసిల్లుచుండెను. మేఘములు అన్నియును ఆ పద్మముపై చేరియున్న తుమ్మెదల గుంపులవలె శోభిల్లుచుండెను.

క. వడిగొని బలరిపుపనుపున, నుడుగక జడి గురిసె నేడహోరాత్రముల
య్యెడఁ గోపజనులు బ్రదికిరి, జడిఁదడియక కొండగొడుగుచాటున నధిపా! 924

రాజా! ఇంద్రుని ఆజ్ఞను తలదాల్చి మేఘములు అతివేగముగా ఏడుదినములు ఎడతెఱపి లేకుండా జడివానలను కురిసెను. ఆ సమయమున గోపాలురు కొండగొడుగుక్రింద చేరియుండుటచే ఆ కుండపోత వర్షమునకు ఏమాత్రమును తడవక హాయిగా ఉండిరి.

వ. ఇట్లు హరి యేడహోరాత్రంబులు గిరి ధరియించిన, గిరిభేది విసిగి, వేసరి కృష్ణుచరితంబులు విని, వెఱఁ గుపడి, విఫలమనోరథుండై, మేఘంబుల మరలించుకొని చనియె. అంత నభోమండలంబు విద్యోతమాన ఖద్యోతమండలం బగుట విని, గోవర్ధనధరుండు గోపాలకుల కిట్లనియె. 925

ఈవిధముగా శ్రీకృష్ణుడు తన చేతితో గోవర్ధనగిరిని నిలిపి, వర్షబాధలనుండి గోపాలురను ఏడుదినములు కాపాడెను. తన ప్రయత్నము విఫలమగుటచే విసిగిపోయిన ఇంద్రుడు చేయునదిలేక మిన్నకుండెను. అతడు మహిమాన్వితములైన శ్రీకృష్ణునిచరితములను విని, ఆశ్చర్యపడి, భయముతో మేఘములను మళ్లించుకొని వెళ్లిపోయెను. అంతట ఆకాశమంతయును సూర్యమండలముయొక్క కాంతులచే వెలుగొందెను. పరిస్థితిని గమనించి గోవర్ధనధారి గోపాలకులతో ఇట్లు నుడివెను.

క. ఉడిగెను వానయు గాలియు వడి సెడె నదులెల్ల బొలిచెవఱద లిగిరెఁగొం
డడుగున నుండక వెడలుఁడు, కొడుకులుఁ గోడండ్రు సతులు గోవులు మీరున్ 926

"గోపాలులారా! వాన నిలిచిపోయినది, గాలివేగము తగ్గినది, వరదలు ఆగిపోయినవి. నదీప్రవాహముల ఉఱవడి తగ్గినది. ఇప్పుడు ఏబాధయు లేదు గావున మీరు సతీసమేతులై, కొడుకులతో, కోడండ్రతో, ఆవులతోగూడి ఈ కొండక్రిందినుండి బయటికి చేరుడు.

వ. అనిన విని,సకల గోపజనులు శకటాద్యుపకరణ సమేతులయి, గోవులుం, దారును గొండయడుగు విడిచి వచ్చి రచ్యుతుండును జెచ్చెరఁ దొల్లింటియట్లనిజస్థానంబున గిరి నిలిపె నంత వల్లవులెల్లం గృష్ణుం గౌఁగిలించుకొని, సముచిత ప్రకారంబున సంభావించి దీవించిరి. గోపికలు సేసలిడి, దధ్యన్నకబళంబులొసంగుచు, నాశీర్వదించిరి. నంద బలభద్ర రోహిణీ యశోద లాలింగనంబు సేసి, భద్రవాక్యంబులు పలికిరి. సిద్ధసాధ్య గంధర్వవరులు విరులు గురియించిరి.సురలు శంఖదుందుభులు మ్రోయించిరి. తుంబురు ప్రముఖులయిన గంధర్వులు పాడి రప్పుడు. 927

శ్రీకృష్ణునిసూచనలమేరకు గోపాలకులు అందఱును బండ్లు మొదలగు సాధనములతోగూడి, గోవులను వెంటబెట్టుకొని, కొండక్రిందినుండి బయటికి వచ్చిరి. అంతట బాలకృష్ణుడు వెంటనే ఆ గోవర్ధనగిరిని దానిస్థానమునందు ఎప్పటివలె నిలిపెను. అనంతరము గోపాలురు అందఱును శ్రీకృష్ణుని కౌగిలించుకొని, తగినరీతిగా గౌరవసత్కారములను నెఱపి, దీవించిరి. గోపికలు ఆ స్వామి శిరస్సుపై అక్షతలను ఉంచి, పెఱుగన్నపుముద్దలను తినిపించుచు, ఆశీర్వదించిరి. పిమ్మట నందయశోదలు, రోహిణీదేవి, బలరాముడు కృష్ణుని అక్కున జేర్చుకొని, శుభవచనములను పలికిరి. ప్రముఖులైన సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు పూలవానలను కురిసిరి. దేవతలు శంఖములను పూరించిరి, దుందుభులను మ్రోగించిరి. తుంబురుడు మొదలగు గంధర్వులు మధురగానములను ఆలపించిరి.

క. వల్లవకాంతలు తనకథ, లెల్లను బాడంగ నీరజేక్షణుఁ డంతన్
వల్లవబల సంయుతుఁడై, యుల్లన గోష్ఠంబు సేరె నుర్వీనాథా! 928

పరీక్షిన్మహారాజా! అంతట గోపికలు అందఱును తన కథలను కీర్తించుచుండగా ఆ కృష్ణుడు బలరామునితో, గోపాలురతో గూడి తిన్నగా గొల్లపల్లెకు చేరెను.

వ. అయ్యవసరంబునఁగృష్ణు చరిత్రంబులు దలంచి, వెఱఁగుపడి, గోపజనులు నందునకిట్లనిరి, 929

అంతట గోపాలురు శ్రీకృష్ణుని లీలలను స్మరించుచు, మిగుల ఆశ్చర్యమునకు లోనై నందునితో ఇట్లు నుడివిరి.

సీ. కన్నులు దెఱువని కడుఁజిన్ని పాపఁడై దానవిచనుఁబాలు ద్రాగి చంపె
మూఁడవ నెలనాఁడు ముద్దుల బాలుఁడై కోపించి శకటంబుఁ గూలఁదన్నె
నేఁడాది కుఱ్ఱఁడై యెగసి తృణావర్తు మెడఁబట్టుకొని కూల్చి మృతునిఁజేసెఁ
దల్లి వెన్నలకునై తను ఱోలఁగట్టినఁ గౌమరుఁడై మద్దులు కూల నీడ్చెఁ
తే. బసులఁ గ్రేపులఁ గాచుచు బకునిఁజీరె వెలఁగతో వత్సదైత్యుని వ్రేసి కెడపె
సబలుఁడై ఖరదైత్యుని సంహరించె నితఁడు కేవల మనుజుఁడే యెంచి చూడ 930

"మహాత్మా! శ్రీకృష్ణునిప్రభావములు మిగుల అద్భుతములు. ఇతడు కన్నులు తెఱచియు తెఱవని పసితనమునందే రాక్షసియగు పూతనయొక్క చనుబాలు త్రాగుచు దానిని చంపివేసెను. మూడు నెలల వయస్సులో ఉన్నప్పుడే ఈ ముద్దులబాలుడు శకటాసురునిపై కినుకబూని అతనిని నేలగూల్చెను. ఏడాది ఈడునందే ఈ కుఱ్ఱవాడు విజృంభించి, తృణావర్తుని మెడపట్టుకొని అతనిని మట్టి కఱపించెను. యశోదమాత వెన్నను తినిపించుట ప్రయత్నించినప్పుడు చిక్కకపోవుటచే ఆమె ఇతనిని ఱోటికి కట్టివేసెను. అంతట ఈ చిన్నారి మద్దిచెట్లను కూలగొట్టెను. గోవులను, దూడలను మేపుచున్నప్పుడు ఈతడు బకాసురుని హతమార్చెను. వెలగచెట్టుతో గొట్టి వత్సాసురుని వధించెను. బలశాలియై ఇతడు ఖరాసురుని తునుమాడెను. నిజముగా ఇట్టి మహిమలుగల ఈతడు మానవమాత్రుడు కాడు సుమా!

క. తెంపరియై రామునిచేఁ జంపించెఁ బ్రలంబు మ్రింగెఁ జటులదవాగ్నిన్
సొంపు సెడఁద్రొక్కి కాళియుఁ, ద్రుంపక కాళింది వెడలఁ దోలెన్ లీలన్. 931

అంతేగాక ఈ మహానుభావుడు తెగువచూపి, బలరామునిచే ప్రలంబాసురుని చంపించెను, చిటపటలతో తీవ్రముగా మండుచున్న దావాగ్నిని మ్రింగెను.కాళియునిపడగలపై జేరి, అతనిగర్వమును రూపుమాపెను. కాని అతనిని వధింపక కనికరించి, వేఱొకచోటికి పంపివేసెను. ఇట్టి ఇతనిలీలలు అన్నియును అద్భుతములుగదా!

క. ఏడేండ్ల బాలుఁ డెక్కడ, క్రీడం గరి తమ్మి యెత్తు క్రియ నందఱముం
జూడ గిరి యెత్తు టెక్కడ, వేడుక నొకచేత నేఁడు వెఱఁగౌఁగాదే. 932

క. ఓనంద! గోపవల్లభ! నీ నందనుఁ డాచరించు నేర్పరితనముల్
మానవులకు శక్యంబులె, మానవమాత్రుండె నీ కుమారుఁడు తండ్రీ! 933

వాస్తవముగా ఇతడు ఏడేండ్ల బాలుడే ఐనను, ఏనుగు తామరపువ్వును, ఎత్తినరీతిగా ఇతడు మనమందఱము చూచుచుండగనే ఇంతటి మహాపర్వతమును ఆడుచుపాడుచు అవలీలగా పైకెత్తెను. ఇది ఎంతయు ఆశ్చర్యకరము. గోపాలురకు ప్రభుడవైన ఓ నందరాజా! నీ కుమారుడు నేర్పుగా ఆచరించు పనులు అన్నియును సామాన్యమానవులకు అసాధ్యములు. తండ్రీ! ఈ సంఘటనలను అన్నింటినిబట్టి చూచినచో నీ సుతుడు నిజముగా మానవమాత్రుడు కాడు సుమా!"

వ. అనిన విని నందుండు వారలం జూచి, మున్ను తనకు గర్గమహాముని చెప్పిన సంకేతంబు దెలిపి, "శంక లేదు. కృష్ణుండు లోకరక్షకుఁడయిన పుండరీకాక్షుని నిజాంశంబయనుచు నంతరంగంబునం జింతింతు". నని పలికిన, వెఱఁగుపడి, గోపకులు కృష్ణుండనంతుండని పూజించి రంత, 934

అంతట నందుడు ఇంతకుముందు గర్గమహాముని తనతో చెప్పిన రహస్యమును గుర్తునకు తెచ్చుకొనెను. పిమ్మట అతడు వారితో 'ఔను ఇందు సందేహము ఏమియునులేదు. ఈ శ్రీకృష్ణుడు జగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువుయొక్క అంశయే' అని నేనును నా మనస్సులో అనుకొనుచున్నాను' అని పలికెను. ఆయనమాటలను విన్న పిదప గోపాలురు ఆశ్చర్యమునకు లోనై, 'శ్రీకృష్ణుడు నిజముగా శ్రీహరియొక్క అవతారమే' అని భావించి ఆ స్వామిని పూజించిరి.

మ. హరి కేలన్ గిరియెత్తి వర్షజలఖిన్నాభీర గోరాజికిన్
శరణంబైనఁద్రిలోకరాజ్య మదముం జాలించి నిర్గర్వుఁడై
సురభిం గూడి బలారి వచ్చి కనియెన్ సొంపేది దుష్ట ప్రజే
శ్వర దుర్మాన నిరాకరిష్ణుఁ గరుణా వర్ధిష్ణు శ్రీకృష్ణునిన్. 935

శ్రీకృష్ణుడు తన చేతితో గోవర్ధనపర్వతమును మీదికి ఎత్తి వర్షజలధారలకు కొట్టుమిట్టాడుచున్న గోపాలురను, గోసంతతిని రక్షించిన విషయమును ఎఱింగిన పిమ్మట ఇంద్రుడు పశ్చాత్తప్తుడు అయ్యెను. 'నేను త్రిలోకాధిపతిని' అను అహంకారము అతనిలో సమసిపోయెను. అనంతరము ఆ బలారి (ఇంద్రుడు) తన వైభవమును బయల్పఱచక, వినమ్రుడై, కామధేనువును వెంటనిడుకొని అమరావతినుండి విచ్చేసెను. దుష్టులైన రాజులదురహంకారమును రూపుమాపువాడును, కృపానిధియు ఐన శ్రీకృష్ణుని దర్శించెను.

క. కని యింద్రుఁడు పూజించెను, దినకరనిభనిజకిరీట దీధితిచేతన్
మునిహృదలంకరణములు, సునతోద్ధరణములు నందసుతుచరణంబుల్. 936

వ. ఇట్లు నమస్కరించి, కరకమలంబులు ముకుళించి, హరికి హరిహయుండిట్లనియె. 937

పిమ్మట ఆ సురపతి సూర్యకిరణములవలె విరాజిల్లుచున్న తనకిరీటకాంతులు శ్రీకృష్ణునిపాదములకు సోకునట్లు ప్రణమిల్లుచు ఆ స్వామిపాదములను సేవించెను. దివ్యములైన ఆ స్వామిచరణములు సర్వదా మునులహృదయములకు ఆభరణములై ఒప్పుచుండును (అనగా అవి మునుల హృదయములలో స్మరింపబడుచుండును.) అవి వినయముతో తమను ఆశ్రయించిన వారిని ఉద్ధరించుచుండును. ఇంద్రుడు శ్రీహరికి (కృష్ణునకు) నమస్కరించిన పిదప కమలములవంటి తన చేతులతో అంజలి ఘటించి, ఆ ప్రభువునకు ఇట్లు విన్నవించుకొనెను.

## ఇంద్రుఁడు శ్రీకృష్ణుని నుతించుట

సీ. పరమ! నీధామంబు భాసురసత్త్వంబు శాంతంబు హతరజస్తమము నిత్య
మధిక తపోమయమట్లు కావున మాయ నెగడెడి గుణములు నీకు లేవు
గుణహీనుఁడవు గాన గుణముల నయ్యెడి లోభాదికములు నీలోనఁ జేర
వైన దుర్జననిగ్రహము శిష్టరక్షయుఁదగిలి చేయఁగ దండధారివగుచు.
తే. జగముభర్తవు గురుఁడవు జనకుఁడవును జగదధీశుల మను మూఢజనులు దలఁక
నిచ్చ వుట్టిన రూపంబులీవు దాల్చి హితము సేయుదు గాదె లోకేశ్వరేశ! 938

"పరమపురుషా! నీ స్వరూపము శుద్ధసత్త్వమయము, శాంతమునకు నిధి, రజస్తమోగుణములు లేనట్టిది; శాశ్వతమైనది. అనంతమైన విజ్ఞానమునకు నిలయము. కావున మాయాగుణములు నిన్ను తాకజాలవు. నీవు త్రిగుణాతీతుడవు. కనుక త్రిగుణములకు సంబంధించిన లోభము మున్నగు లక్షణములు నీ దరికి రావు. ఐనను నీవు ధర్మదండమును చేబూని దుష్టులను శిక్షించుచు, శిష్టులను రక్షించుచుందువు. ఈ జగత్తునకు నీవే ఈశ్వరుడవు, గురుడవు. తండ్రివి. సర్వేశ్వరా! 'ఈ ముల్లోకములకును మేమే అధిపతులము' అని విఱ్ఱవీగెడి మూఢులను భీతిల్లజేయుచు, నీకు ఇష్టమైన రూపముతో అవతరించి లోకమునకు హితమొనర్చుచుందువు.

క. నావంటి వెఱ్ఱివారిని, శ్రీవల్లభ!నీవు శాస్తి సేసితివేనిం
గావరము మాని పెద్దల, త్రోవన్ జరుగుదురు బుద్ధితోడుతనీశా! 939

లక్ష్మీనాథా! సర్వేశ్వరా! నావంటి అజ్ఞానులకు శాస్తిచేయుట యుక్తమే. అట్లొనర్చుటవలన తక్కినవారు గర్వపడుట మాని, బుద్ధిగలిగి పెద్దలమార్గమున నడచుకొందురు.

క. ఒక్కొకలోకముఁగాచుచు, నెక్కుడు గర్వముననేమె యీశులమనుచుం
జొక్కి ననుబోఁటి వెఱ్ఱులు, నిక్కము నీ మహిమఁ దెలియనేరరనంతా. 940

దేవా! నీ శక్తి అనంతము. ఒక్కలోకమునకే అధిపతులై గర్వముతో మిడిసిపడుచుండువారు 'మేమే ఈ మూడు లోకములకును ప్రభువులము' అని నిక్కుచుందురు. నావలె గర్వితులైనట్టి వెఱ్ఱివారు నీ మహిమను ఏమాత్రమూ ఎఱుగజాలరు. ఇది ఎంతయు నిజము.

ఆ. వాసుదేవ! కృష్ణ! వరద! స్వతంత్ర! విజ్ఞానమయ!మహాత్మ!సర్వపుణ్య
పురుష!నిఖిలబీజ! భూతాత్మక! బ్రహ్మ! నీకు వందనంబు నిష్కలంక! 941

కృష్ణా! వాసుదేవా! శరణుజొచ్చినవారికి నీవు వరములను ప్రసాదించువాడవు, స్వతంత్రుడవు. విజ్ఞానస్వరూపుడవు, మహాత్ముడవు. అన్నివిధములుగా పవిత్రమూర్తివి. సకలప్రాణులకును కారకుడవు, ఆధారమైనవాడవు. పరబ్రహ్మవు, కళంకరహితా! నీకు వందనములు.[1]

1. వాసుదేవుడు = సకలలోకములయందును నిండియుండువాడు, సమస్తప్రాణులను తనలో నిలుపుకొనియుండెడివాడు. కృష్ణుడు = అజ్ఞానమనెడి బంధమును త్రుంచివేయువాడు. వరదుడు = సర్వోన్నతమైన విజ్ఞానమును ఇచ్చెడివాడు. స్వతంత్రుడు = ఏ విషయమునందును ఇతరులపై ఆధారపడనివాడు. విజ్ఞానమయుడు = తత్త్వజ్ఞాన స్వరూపుడు. సర్వపుణ్యుడు = సకల సుకృతములకు నిధానమైనవాడు. పురుషుడు = చరాచరజీవులదేహములయందు విరాజిల్లుచుండెడివాడు. భూతాత్మకుడు = సకలప్రాణుల స్వరూపములు తన రూపమైనవాడు. (విరాడ్రూపుడు) బ్రహ్మ = పరబ్రహ్మ, సర్వపరిపూర్ణుడు. నిష్కలంకుడు = కళంకరహితుడు.

శా. నీసామర్థ్య మెఱుంగ మేఘములచే నీ ఘోషమున్ భీషణో
గ్రాసారంబున ముంచితిన్ మఖము నాకై వల్లవుల్ సేయరం
చో సర్వేశ! భవన్మహత్త్వమున నా యుద్యోగమిట్లయ్యె నీ
దాసున్ నన్నుఁ గృతాపరాధుఁ గరుణన్ దర్శింపవే మాధవా! 942

సర్వేశ్వరా! మాధవా! (శ్రీకృష్ణా!) గోపాలురు నా (ఇంద్ర) యాగమును మానివేసినందులకు క్రుద్ధుడనైతిని. ఆ కోపావేశములో నీ శక్తిసామర్థ్యములను ఎఱుంగలేక మేఘములను పంపి, భయంకరమైన జడివానలతో మీ గొల్లపల్లెను ముంచివేసితిని. నీ ప్రభావముతో నా ప్రయత్నము అంతయును వమ్మైపోయెను. నేను అపరాధిని. నీ దాసుడనైన నన్ను కనికరింపుము.

మ. నిను బ్రహ్మాదులెఱుంగలేరు జడతానిష్ఠుండ లోకత్రయా
వన దుర్మానగరిష్ఠుఁడన్ విపుల దుర్వైదుష్య భూయిష్ఠుఁడన్
వినయత్యాగవరిష్ఠుఁడం గుజనగర్విశ్రేష్ఠుఁడన్ దేవ! నీ
ఘనలీలావిభవంబు పెంపుఁ దెలియంగా నెవ్వఁడన్ సర్వగా! 943

దేవా! నీవు సర్వాంతర్యామివి. నీ మహత్త్వమును బ్రహ్మాదిదేవతలు సైతము ఎఱుగజాలరు. నేను జడుడను, 'నేనే ముల్లోకములను రక్షించువాడను' అను దురహంకారముగలవారిలో మొదటివాడను, అంతులేని మిడిమిడి జ్ఞానముతో మిడిసిపడుచుండువాడను, వినయరహితులలో మేటిని. దుర్జనులలో, పొగరుబోతులలో అగ్రగణ్యుడను. అద్భుతమైన నీ లీలావైభవములను తెలిసికొనుటకు నేను ఎంతటివాడను? (నేను అశక్తుడను)".

వ. అనిన విని, నగుచు, జలధరగంభీరరవంబుల శక్రునకుం జక్రి యిట్లనియె. 944

ఇంద్రుని ప్రార్థనను ఆలకించినపిదప శ్రీకృష్ణుడు మేఘగర్జనవలె గంభీరమైన కంఠస్వరమున అతనితో ఇట్లనెను-

మ. అమరాధీశ్వర లక్ష్మితోఁ దగిలి యిట్లంధుండవై యున్న నీ
సమదోద్రేకము ద్రుంచివైచుటకు నీ జన్నంబు దప్పించితిం
బ్రమదశ్రీకులు దండధారినగు నన్ భావింపరెవ్వాని ని
క్కము శిక్షింపఁ దలంతు వానినధనుం గావింతు జంభాంతకా! 945

'జంభాసురుని వధించిన సురరాజా! సంపదల కారణముగా మత్తిల్లి, కన్నుమిన్ను గానక జ్ఞానహీనుడవైతివి. నీ గర్వాతిరేకమును రూపుమాపుటకై నీ యాగమును నేనే మాన్పించితిని. ఐశ్వర్యమదముతో నిక్కుచున్నవారు దండధారినగు నన్ను విస్మరింతురు. అట్టివారిని శిక్షింపదలచినపుడు, ముందుగా వారిని నిర్ధనులను గావింతును.

క. నా యాజ్ఞ సేయుచుండుము, నీ యధికారంబునందు నిలువు సురేంద్రా!
శ్రీయుతుఁడవై మదింపకు, శ్రేయంబులు గల్గుఁ బొమ్ము సితకరిగమనా! 946

ఐరావతవాహనా! సురపతీ! నీవు నా ఆజ్ఞలకు బద్ధుడవై యుండుము. నీ అధికారమును నిలుపుకొనుము. సంపదలు చేరగనే గర్వపడరాదు. ఇక నీకు శ్రేయస్సులు చేకూరగలవు. బుద్ధిగలిగి అమరావతికి వెళ్లుము".

వ. అని యిట్లు జిష్ణునిం బలుకుచున్న కృష్ణునికి మ్రొక్కి, గోగణసమేతమయిన కామధేనువు భక్తజనకామధేను వయిన యీశ్వరునకిట్లనియె. 947

శ్రీకృష్ణుడు ఇంద్రునితో ఇట్లు పలుకుచుండగా గోగణముతో గూడిన కామధేనువు భక్తులకోరికలను తీర్చెడి ఆ సర్వేశ్వరునకు ప్రణమిల్లి ఇట్లు నుడివెను.

క. విశ్వేశ! విశ్వభావన! విశ్వాకృతి! యోగివంద్య!విను నీచేతన్
శాశ్వతులమైతిమిప్పుడు, శాశ్వతముగఁ గంటిమధికసౌఖ్యంబు హరీ! 948

"విశ్వప్రభూ! లోకకల్యాణమూర్తీ! విరాడ్రూపా! నిరంతరము యోగీశ్వరులచే ఆరాధింపబడువాడా! నా మనవిని ఆలకింపుము. నీ అనుగ్రహమున మేము ఇప్పుడు స్థిర (శుభ) చిత్తులమైతిమి. శాశ్వతమైన అంతులేని సుఖములను పొందితిమి.

వ. దేవా! మాకుం బరమదైవతంబవింద్రుండవు. భూసురగోసుర సాధు సౌఖ్యంబులకొఱకు నిన్నింద్రునిం జేసి, పట్టంబు గట్టుమని, విరించి నియమించి పుత్తెంచె. నీవు భూతల భూరిభార నివారణంబు సేయ నవతరించిన హరి వని పలికి యంత. 949

దేవా! నీవే మాకు పరమదైవము, సర్వాధిపతివి. భూసురులకును, గోవులకును, దేవతలకును, సత్పురుషులకును ఉత్తమసుఖములను అనుగ్రహించుటకై నిన్ను ప్రభువునుగాజేసి, పట్టముగట్టుటకై బ్రహ్మదేవుడు నన్ను నియమించి పంపెను. నీవు సమస్త భూమండలముయొక్క భారమును నివారించుటకై అవతరించిన శ్రీహరివి".

మ. సురభిక్షీరములన్ సురద్విపమహాశుండాలతానీతని
ర్ఝర గంగాంబువులన్ నిలింపజననీ సన్మౌనిసంఘంబుతో
సురనాథుండభిషిక్తుఁ జేసి పలికెన్ సొంపార గోవిందుఁ డం
చు రణాక్రాంత విపక్షుఁ దోయజదళాక్షున్ సాధుసంరక్షణున్. 950

అంతట దేవమాతయైన అదితి, దివ్యమునులు మున్నగువారి సమక్షమున దేవేంద్రుడు కామధేనువుయొక్క పాలతోను, ఐరావతము తనతొండమున నింపుకొని వచ్చిన ఆకాశగంగాజలములతోడను శ్రీకృష్ణుని అభిషేకించెను. రణరంగమున శత్రువులను వధించి, సత్పురుషులను రక్షించిన ఆ కృష్ణప్రభువునకు 'గోవిందుడు' అని ప్రత్యేకముగా నామకరణము చేసెను.

సీ. తుంబురునారదాదులు సిద్ధ చారణ గంధర్వులును హరికథలు పాడి
రమరకాంతలు మింటనాడిరి వేల్పులు గురియించిరంచిత కుసుమవృష్టి
జగములు మూఁడును సంతోషమును బొందెఁ గుఱ్ఱుల చన్నులఁ గురిసెఁబాలు
నవజలంబులతోడ నదులెల్లఁ బ్రవహించె నిఖిలవృక్షములుఁ దేనియలు వడిసె
తే. సర్వలతికల ఫల పుష్పచయములమరెఁ బర్వతంబులు మణిగణప్రభల నొప్పెఁ
బ్రాణులకు నెల్లఁదమలోని పగలు మానె వాసుదేవుని యభిషేకవాసరమున. 951

శ్రీకృష్ణుడు అభిషిక్తుడైన ఆ శుభసమయమున తుంబురుడు, నారదుడు మున్నగువారును, సిద్ధులు, చారణులు, గంధర్వులును ఆ స్వామికథలను గానము చేసిరి. అప్సరసలు ఆకాశమున నృత్యములు గావించిరి. దేవతలు అందఱును ఆ దివ్యోత్సవమునకు అనువగు రీతిలో పూలవాన కురిపించిరి. పాడియావులపొదుగులనుండి పాలు స్రవించెను. క్రొత్తగా చేరిన జలములతో నదులు నిండుగా ప్రవహించెను. వృక్షములు అన్నియు పూదేనెలను అందించెను. తీగెలు (లతలు) చక్కని పూవులతో, పండ్లతో కలకలాడెను. సర్వపర్వతములును మణులకాంతులను విరజిమ్మెను. సహజవైరముతో ఒప్పెడి ప్రాణులనడుమ వైరములు తొలగిపోయెను. వేయేల ముల్లోకములును ఆనందసముద్రమున ఓలలాడెను.

వ. ఇట్లు గోప గోగణ పతిత్వంబునకు గోవిందునభిషిక్తుం జేసి, వీడ్కొని, పురందరుండు దేవగణంబులతో దివంబునకరిగె నంత. 952

ఈవిధముగా ఆ దేవేంద్రుడు గోవులకును, గోపాలురకును ప్రభువునుగా గోవిందుని (శ్రీకృష్ణుని) పట్టాభిషిక్తుని గావించి, ఆ స్వామినుండి సెలవుగైకొని, దేవతలతోగూడి సురపురికి చేరెను.

## శ్రీకృష్ణుడు వరుణనగరమునుండి నందుని కొనితెచ్చుట

సీ. నందుఁ డేకాదశినాఁ డుపవాసంబు సేసి శ్రీహరిపూజ సేసి దనుజ
వేళ యెఱుంగక వేగకముందర ద్వాదశీస్నానంబు తగవొనర్ప
యమునాజలము సొరనప్డు వరుణుదూత నందుని వరుణునినగరమునకుఁ
గొనిపోవఁ దక్కిన గోపకులందఱు నందగోపకునిఁ గానక కలంగి
తే. రామకృష్ణులఁ బేర్కొని రవము సేయఁ గృష్ణుఁ డీశుండు తమతండ్రిఁగికురు వెట్టి
వరుణ భృత్యుండు కొనిపోయి వరుణుఁజేర్చుటెఱిఁగి రయమున నచ్చోటికేఁగె నధిప! 953

రాజా! నందుడు ఏకాదశినాడు ఉపవాసము ఉండి శ్రీహరిని (శ్రీమన్నారాయణుని) పూజించెను. పిమ్మట అతడు వేకువజామునకు ముందే 'అది రాక్షసులు సంచరించెడివేళ' అని ఎఱుగక ద్వాదశి స్నానమునకై యమునానదీజలములలో అడుగిడెను. అప్పుడు వరుణదేవునిదూత ఆ నందుని వరుణునినగరమునకు తీసికొనిపోయెను. ఆయనవెంట నదికి వచ్చిన గోపాలురకు తమ ప్రభువు కనబడకపోవుటచే వారు కలవరపడి, దిక్కుతోచనివారై, 'బలరామా! శ్రీకృష్ణా!' అనుచు గగ్గోలుపెట్టసాగిరి. అంతట సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుడు వరుణునిదూత తనతండ్రిని మోసగించి, వరుణదేవునికడకు తీసికొని వెళ్లిన సంగతిని గ్రహించెను. వెంటనే ఆ స్వామి అచటికి వెళ్లెను.

వ. అప్పుడు. 954

క. వచ్చిన మాధవుఁగనుఁగొని, చెచ్చెర వరుణుండు పూజచేసి వినతుఁడై
యచ్చుగ నిట్లని పలికెను, విచ్చేసితి దేవ! నా నివేశంబునకున్ 955

ఉ. ఏ విభుపాదపద్మరతులెన్నఁడు నెవ్వరుఁ బొందలేని పెం
ద్రోవఁజరింతురట్టి బుధతోషక! నీవరుదెంచుటం బ్రమో
దావృతమయ్యెఁ జిత్తము కృతార్థత నొందె మనోరథంబు నీ
సేవఁ బవిత్రభావమును జెందె శరీరము నేఁడు మాధవా! 956

అప్పుడు వరుణుడు తనకడకు శ్రీకృష్ణుడు వచ్చినట్లు తెలిసికొనెను. వెంటనే అతడు ఆ ప్రభువునకు పూజలొనర్చి, వినమ్రుడై 'దేవా! నీవు నా నివాసమునకు విచ్చేసితివి. ఇది నా అదృష్టము. ప్రభూ! సర్వదా నిన్ను సేవించుటయందే నిరతులైనవారు ఎన్నడును, ఎవ్వరును పొందజాలని మోక్షమార్గమున సాగిపోవుదురు. అట్టి పుణ్యపురుషులను ఆనందింపజేసెడి మహాత్ముడవైన నీవు ఇచటికి ఏతెంచుటవలన నేను ఎనలేని సంతోషమును పొందితిని. నేను ధన్యుడనైతిని, నా కోరికలన్నియును ఈడేరెను. నిన్ను సేవించుటచే నా తనువు పవిత్రమైనది. (నేను పునీతుడను ఐతిని).

ఉ. ఏ పరమేశ్వరున్ జగములిన్నిటిఁ గప్పిన మాయ కప్పఁగా
నోపక పారతంత్ర్యమునుండు మహాత్మక యట్టి నీకు ను
ద్దీపితభద్రమూర్తికి సుధీజనరక్షణవర్తికిం దనూ
తాపము వాయ మ్రొక్కెద నుదారతపోధనచక్రవర్తికిన్. 957